ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
హైదరాబాద్ 31-8-2026 సోమవారం సిటీ సంపుటి 53. సంచిక 22
రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Delhi, Mumbai

నవశకానికి పారిశ్రామిక ప్రగతి!



- 'ఇండస్ట్రియల్ పాలసీ 2.0' శ్రీకారానికి అడుగులు
- వేగంగా రూపుదిద్దుకుంటున్న మరో 9 విధానాలు
- పెట్టుబడులు, తయారీ, సాంకేతికతకు పెద్దపీట
- ఐదేళ్లలో భారీగా ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయం
- 'ఇన్వెస్ట్ తెలంగాణ'కు ఊతమిచ్చేలా వ్యూహం

డిసెంబరు 7-9 తేదీల్లో కొత్త పాలసీలను ప్రకటించనున్న సీఎం

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణను ప్రపంచస్థాయి ఆర్థిక, పారిశ్రామిక శక్తిగా తీర్చిదిద్దే 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక విధానాల్లో కొత్త శకానికి శ్రీకారం చుడుతోంది. ప్రస్తుత పారిశ్రామిక విధానానికి దాదాపు పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో 'ఇండస్ట్రియల్ పాలసీ 2.0'కు రూపకల్పన చేస్తోంది. ఐదేళ్ల వ్యవధిలో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం, తయారీ రంగాన్ని విస్తరించడం, ఆధునిక సాంకేతికతలను రాష్ట్రంలోకి తీసుకురావడం, యువతకు లక్షల్లో ఉద్యోగాలు కల్పించడం, హైదరాబాద్‌తో పాటు జిల్లాలను పారిశ్రామిక వృద్ధి కేంద్రాలుగా మార్చడం లక్ష్యంగా.. 10 కీలక రంగాల్లో ప్రత్యేక పాలసీలను అమలుచేసే దిశగా వేగంగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే తెలంగాణకు బలమైన పునాదిగా ఉన్న ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల పురోభివృద్ధిలో భాగంగా దావోస్ వేదికగా 'లైఫ్ సైన్సెస్ పాలసీ 2.0'ని ప్రభుత్వం తీసుకొచ్చింది. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమిట్' వేదికపై మరో 9 కొత్త విధానాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించనున్నారు.

భారీ, మెగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు..

కొత్త పారిశ్రామిక విధానాల రూపకల్పనలో కేవలం పెట్టుబడి విలువను మాత్రమే కొలమానంగా తీసుకోకుండా.. ఉపాధి కల్పన, తయారీ సామర్థ్యం, స్థానిక విలువ జోడింపు, ఎగుమతులు, పారిశ్రామిక ఎకోసిస్టమ్, ప్రభుత్వ ఆదాయం వంటి అంశాలతోపాటు భారీ తయారీ పరిశ్రమలు, లైఫ్ సైన్సెస్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఫుట్‌వేర్-అప్పెరల్ వంటి ఉపాధి ఆధారిత రంగాలకు సర్కారు ప్రాధాన్యం ఇవ్వనుంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఇప్పటికే ప్రత్యేక విధానం ఉన్న నేపథ్యంలో.. 'ఇన్వెస్ట్ తెలంగాణ' నినాదానికి ఊతమిచ్చేలా.. పెద్ద, భారీ, మెగా పరిశ్రమలకు మరింత ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలను కొత్త విధానాల్లో పొందుపర్చనున్నారు. జిల్లాలు, టైర్-2, 3 నగరాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసే సంస్థలకు అదనపు ప్రోత్సాహకాలు కల్పించడం ద్వారా ప్రాంతీయ పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 'తెలంగాణ రైజింగ్ 2047'లోని 'పాలీసెంట్రిక్ ఇండస్ట్రియల్ గ్రోత్'కు ఈ విధానాలు కీలక పునాదిగా నిలవనున్నాయని ప్రభుత్వం స్పష్టంచేసింది.

ప్రపంచ టాప్-3లో చోటే లక్ష్యంగా..

తెలంగాణ పారిశ్రామిక వ్యూహంలో ఇప్పటికే బలమైన స్థానాన్ని సంపాదించిన ...మిగతా 3లో

2.0లో 10 పాలసీలివీ

1. లైఫ్ సైన్సెస్ పాలసీ 2.0 (ఇప్పటికే ప్రకటించారు)
2. లాజిస్టిక్స్ పాలసీ
3. ఐటీ పాలసీ
4. ఎలక్ట్రానిక్స్ పాలసీ
5. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ
6. ఫుట్‌వేర్-లెదర్ పాలసీ
7. అప్పెరల్-లైఫ్ స్టైల్ పాలసీ
8. జీసీసీ పాలసీ
9. డేటా సెంటర్స్ పాలసీ
10. ఆటోమొబైల్ పాలసీ

ఫ్యూచర్ సిటీలో భారీ స్టేడియం

- లక్షకుపైగా సీటింగ్ సామర్థ్యం ఉండేలా ఏర్పాట్లు
- వంద ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి క్రీడా మైదానం
- క్రికెట్ సహా బహుళ క్రీడా అవసరాలకు అనుగుణంగా నిర్మాణం
- సెప్టెంబరులో హెచ్‌సీఏతో ఒప్పందం.. డిసెంబరులో శంకుస్థాపన!

11లో

6, 7, 8 ఫారాల్లేవ్ సర్!

- ప్రింటింగ్ బాధ్యతలు ఈఆర్వోలకు.. పట్టించుకోని యంత్రాంగం
- మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్‌లో చేసుకోవాలంటూ సూచనలు
- పత్రాలు అందుబాటులో లేక ఓటర్ల ఇక్కట్లు

11లో

రేపు, ఎల్లుండి కీలక చర్చలు!

- దిల్లీలో జలశక్తి సమావేశానికి వెళుతున్న సీఎం
- 2న హస్తిన చేరుకోనున్న పీసీసీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం
- మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానంతో భేటీ?

13 లో



ప్రధాని మోదీని ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరిస్తున్న ఆ దేశ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్

ఉజ్బెకిస్థాన్‌తో ఐదింతల వాణిజ్యం

- వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి సంబంధాలు
- అధ్యక్షుడితో మోదీ చర్చలు.. ఒప్పందాలు 12లో

అత్యున్నత పౌర పురస్కారం స్వీకరణ

సమంగా సంక్షేమం, అభివృద్ధి


సామాజిక న్యాయానికి పెద్దపీట



- రైతులు, మహిళలు, యువతకు భరోసా
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- 1,000 రోజుల ప్రజాపాలనపై సర్కారు ప్రగతి నివేదిక

ఈనాడు, హైదరాబాద్: "1,000 రోజుల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యమిచ్చాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను పునర్నిర్మించడం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేయడం, రైతులు-మహిళలు-యువతకు భరోసా కల్పించడం, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడం, భవిష్యత్తు తెలంగాణకు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడంలో.. కొత్త అధ్యాయాన్ని నమోదు చేశాం" అని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో.. ప్రజా ప్రభుత్వం సెప్టెంబరు 1కి 1,000 రోజుల మైలురాయిని చేరుకుంటున్న నేపథ్యంలో.. 'ప్రగతి నివేదిక'ను ఆదివారం విడుదల చేసింది. ...మిగతా 3లో





నాగార్జున సర్కిల్ వద్ద పంజాగుట్ట వంతెనపై వందల మంది రన్నర్లు

వేల అడుగులు ఒక్కటై.. పరుగుల పండగై..

ఎన్‌ఎండీసీ 15వ మారథాన్‌లో రికార్డుస్థాయిలో 32 వేల మంది నమోదు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్-న్యూస్‌టుడే, ఖైరతాబాద్, మాదాపూర్: దేశంలోనే రెండో అతిపెద్ద మారథాన్‌గా గుర్తింపు ఉన్న హైదరాబాద్ ఎన్‌ఎండీసీ తమ 15వ ఎడిషన్‌ను నిర్వహించగా రికార్డుస్థాయిలో సుమారు 32 వేల మంది వివిధ విభాగాల్లో పాల్గొన్నారు. ఆదివారం ఫుల్, హాఫ్ మారథాన్, ఎలైట్ విభాగాల్లో సుమారు 11 వేల మంది పరుగుతీశారు. ...మిగతా 3లో

రాజ్యాంగం అనుమతించినా.. వారిని జడ్జీలుగా నియమించరేం?

- 76 ఏళ్లలో న్యాయ విద్యా నిపుణులు ఒక్కరికీ అవకాశం ఇవ్వలేదు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్



దిల్లీ: న్యాయశాస్త్రంలో విద్వత్తు కలిగిన నిపుణులను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించడం అత్యున్నత న్యాయస్థానాన్ని వైవిధ్య భరితం చేస్తుందని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం అలాంటి నియామకానికి వీలు కల్పిస్తున్నా 76 సంవత్సరాలుగా ఒక్క న్యాయవిద్య నిపుణుడినీ సుప్రీం న్యాయమూర్తిగా నియమించకపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆదివారం దిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల 13వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. "రాజ్యాంగంలోని 124 (3)(సీ) అధికరణం ప్రకారం ఇటువంటి నియామకాలకు వీలుంది. అయినా... గత 76 ఏళ్లలో హైకోర్టు న్యాయమూర్తులు లేదా ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులు తప్ప మరెవరూ సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమితులు కాకపోవడం విచారకరం. న్యాయవిద్య నిపుణుల్లో ...మిగతా 3లో

మా వాళ్లు ఎక్కడ..?

- నేపాల్‌లో ఆత్మీయుల కోసం వేలమంది వెతుకులాట
- మృతదేహాలైనా చూపించాలంటూ అధికారులకు వేడుకోలు
- ఇంకా ఆచూకీ దొరకనివారు 2,502 మంది
- వరద విలయంతో 788కి పెరిగిన మృతుల సంఖ్య

ముమ్మరంగా కొనసాగుతున్న సహాయక చర్యలు



వరదలతో అతలాకుతలమైన నేపాల్‌లోని ధాడింగ్ జిల్లా గల్ఛిలో ప్రభుత్వం అందించిన సహాయ సామగ్రిని తీసుకువెళ్తున్న బాధితులు

కాఠ్‌మాండూ: నేపాల్‌లో జల ప్రళయం సంభవించి ఇప్పటికే ఐదు రోజులవడంతో.. గల్లంతైనవారు సజీవంగా ఉండే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. తమ వారి ఆచూకీ కనిపెట్టాలంటూ అధికారులను వేల మంది వేడుకుంటున్నారు. గాయపడ్డవారిలో తమవారు ఉన్నారేమోనని ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. భద్రపరిచిన మృతదేహాల్లో తమవారూ ఉండొచ్చన్న ఆందోళనతో భయంభయంగా మార్చురీలకు వెళ్లి చూస్తున్నారు. పలు జిల్లాల్లో సహాయక చర్యలు కొనసాగేకొద్దీ మృతదేహాలు అధిక సంఖ్యలో బయటపడుతూనే ఉన్నాయి. దీంతో- ఈ నెల 26న నేపాల్‌ను కుదిపేసిన వరద విలయంలో ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య ఆదివారం నాటికి 788కి పెరిగింది. ఇంకా 2,502 మంది ఆచూకీ దొరకలేదు. వీరిలో 591 మంది విదేశీయులు ఉన్నారు. నేపాల్ వరదల్లో గల్లంతైన భారతీయుల సంఖ్యను 275గా భారత విదేశీ వ్యవహారాల శాఖ శనివారం పేర్కొంది. మరోవైపు- భోటే కోశి నదిలో నీటి స్థాయిలు ఆదివారం మళ్లీ పెరగడంతో.. దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలు, సహాయక చర్యలు ...మిగతా 3లో



గల్ఛిలో శ్రీ భాగేశ్వరి మాధ్యమిక పాఠశాలలోని ఓ తరగతి గదిలో పేరుకుపోయిన బురద

'చేయూత' పెన్షన్లకు దరఖాస్తుల వెల్లువ


- 4.34 లక్షల మంది పేర్ల నమోదు
- నేటితో ముగియనున్న గడువు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో చేయూత పథకం కింద కొత్త సామాజిక పెన్షన్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆదివారం వరకు మొత్తం 4.34 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకోగా.. ఇందులో అత్యధికంగా 2.64 లక్షల మంది వితంతువులు దరఖాస్తులు ఇచ్చారు. సోమవారంతో గడువు ముగియనుండగా.. మరో 50 వేల మందికి పైగా తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో 2.50 లక్షల మందికి కొత్త పెన్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ఈ నెల 9వ తేదీ నుంచి 5 కేటగిరిల్లో దరఖాస్తులను ఆహ్వానించింది.

మంగళవారం నుంచి వడబోత ప్రక్రియ..

మొత్తం 4,34,854 దరఖాస్తుల్లో.. 2,64,815 మంది వితంతువులు, 26,057 మంది ఒంటరి మహిళలున్నారు. 1,07,171 మంది ...మిగతా 3లో

మత్తు గుప్పిట విద్యార్థి..!



- స్నేహితుల ప్రోద్బలంతో తొలుత మాదకద్రవ్యాల రుచి
- రెండున్నరేళ్లలో 800 మంది వినియోగించినట్లు గుర్తింపు
- వారిలో 100 మందికి పైగా అమ్మాయిలు
- 'ఈగల్' అధ్యయనంలో విస్మయకర అంశాల వెల్లడి
- కౌన్సిలింగ్‌తో పాటు వ్యసన విముక్తి కేంద్రాల్లో చికిత్స

ఈనాడు, హైదరాబాద్: ఓ బీబీఎం విద్యార్థిని... బెంగళూరులోని ఖరీదైన బనశంకరి ప్రాంతంలోని బిలియనీర్ కుమార్తె. కళాశాలలో చదువుతున్న సమయంలో తోటి విద్యార్థితో ప్రేమలో పడింది. అప్పటికే మాదకద్రవ్యాలకు అలవాటుపడ్డ సదరు విద్యార్థి.. ఆమెకూ మత్తును పరిచయం చేశాడు. కొద్దిరోజుల్లోనే ఆమె మాదకద్రవ్యాలకు బానిసగా మారింది. ఇంట్లో డబ్బు దొంగిలించి కొనడం ఆరంభించింది. అదీ కుదరకపోయే సరికి గత్యంతరం లేక బాయ్‌ఫ్రెండ్ ఇచ్చే మాదకద్రవ్యాలను కస్టమర్లకు సరఫరా చేయడానికీ అంగీకరించింది. ఓసారి పోలీసులకు చిక్కింది. విషయం తెలిసి ఆమె తల్లిదండ్రులు షాకయ్యారు. ఈ ఉదంతం ఇప్పుడు తెలంగాణ 'ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్)' బృందం చేపడుతున్న అవగాహన కార్యక్రమంలో ఓ పాఠమై పోయింది. యువతతో పాటు తల్లిదండ్రులను అప్రమత్తం చేయడంపై ఈగల్ బృందం దృష్టి సారించింది. రాష్ట్రంలో గడిచిన మూడేళ్లలో ఏకంగా 800 మంది విద్యార్థులు మత్తు వినియోగదారులుగా మారినట్లు ఈగల్ అధ్యయనంలో గుర్తించారు. వీరిలో 100 మందికిపైగా అమ్మాయిలుండటం గమనార్హం. వీరందరికీ ఈగల్ బృందాలు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు వ్యసన విముక్తి (డీ అడిక్షన్) కేంద్రాలకు పంపించాయి. ముఖ్యంగా ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు పలు పేరొందిన ...మిగతా 2లో

మైనర్లకు సిగరెట్ల విక్రయాలపై 'జేజే యాక్ట్'


- కఠిన చట్టం ప్రయోగించడంపై 'ఈగల్ ఫోర్స్' దృష్టి

2లో

గొర్రెలకు మేతగా వరిపైరు!

వర్షాలు కురుస్తాయని, కాల్వలకు సకాలంలో నీరొస్తుందని ఆశించిన అన్నదాతలను ఎల్‌నినో నిండా ముంచింది. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కేతేపల్లి గ్రామానికి చెందిన రైతు అనిల్ నెల కిందట గొర్రు సాయంతో ఐదెకరాల్లో వరి సాగు చేశారు. వర్షాలు, భీమా కాల్వ నీటిపై ఆశలు పెట్టుకున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ముందు చూపుతో తనకున్న బోరు, సమీపంలోని కుంట నీటిని మోటారు సాయంతో మూడెకరాలకు అందిస్తున్నారు. మిగతా రెండు ఎకరాలను వదిలేశారు. వదిలేసిన వరి పొలం గొర్రెలకు మేతగా మారింది. రూ. 30వేలు నష్టపోయినట్లు రైతు తెలిపారు.

- న్యూస్‌టుడే, పాన్‌గల్



సెంచరీతో అదరగొట్టిన డీజీపీ సీవీ ఆనంద్

సికింద్రాబాద్ క్లబ్ విజయం



డీజీపీ సీవీ ఆనంద్ బ్యాట్‌తో అదరగొట్టారు. హెచ్‌సీఏ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఆదివారం హైదరాబాద్ జిల్లా జట్టుపై సికింద్రాబాద్ క్లబ్ తరఫున ఆడిన ఆయన 82 బంతుల్లో 21 ఫోర్లు, 5 సిక్సర్లతో అజేయంగా 126 పరుగులు చేశారు. ఆ జట్టు నిర్ణీత 39 ఓవర్లలో 7 వికెట్లకు 328 పరుగులు చేసింది. అనంతరం హైదరాబాద్ జిల్లా జట్టు 21.1 ఓవర్లలో 3 వికెట్లకు 72 పరుగులు చేయగా వాతావరణం అనుకూలించకపోవడంతో వీజేడీ పద్ధతిలో సికింద్రాబాద్ క్లబ్‌ను విజేతగా ప్రకటించారు.

–హైదరాబాద్, ఈనాడు డిజిటల్

మైనర్లకు సిగరెట్ల విక్రయాలపై 'జేజే యాక్ట్'

ఈనాడు, హైదరాబాద్: అది సికింద్రాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లిలోని లిమ్రా పాన్‌మహల్. ఆదివారం సాయంత్రం ఆ పాన్‌షాప్ సమీపంలో ఈగల్ బృందం నిఘా ఉంచింది. ఇద్దరు మైనర్లు సిగరెట్లు కొంటూ కనిపించడంతో పాన్‌షాప్ నిర్వాహకుడు యూసుఫుద్దీన్, షాప్‌లో పనిచేసే రెహన్ అలీలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం షాప్‌లో తనిఖీలు నిర్వహించి సుమారు రూ.60 వేల విలువైన సిగరెట్లను జప్తు చేశారు. సిగరెట్లతోపాటు నిందితులను బోయిన్‌పల్లి పోలీసులకు అప్పగించారు. మైనర్లకు సిగరెట్ల విక్రయాలపై ఈగల్ బృందం నిరంతర నిఘా ఉంచుతోంది. మాదక ద్రవ్యాల విక్రయాలకు సిగరెట్లు తొలిమెట్టుగా ఉంటుండటంతో మైనర్లు వీటి బారిన పడకుండా చూడాలనే ఉద్దేశంతో ఇలాంటి ఆపరేషన్లకు ఈగల్ బృందం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే నిందితులపై కఠిన చట్టాల కింద సెక్షన్లు నమోదు చేయించే పనిలో పడింది. ఓల్డ్‌బోయిన్‌పల్లి ఉదంతంలో నిందితులపై 'జస్టిస్ జువెనైల్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్ (జేజే యాక్ట్), 2015 చట్టంలోని సెక్షన్ 77తోపాటు 'సిగరెట్స్ అండ్ అదర్ టొబాకో ప్రొడక్ట్స్ యాక్ట్(కోప్టా), 2003 చట్టంలోని సెక్షన్ 6 ప్రయోగించింది. కోప్టా చట్టంలోని సెక్షన్ ప్రకారం మైనర్లకు పొగాకు ఉత్పత్తులను విక్రయించడం, విద్యాసంస్థలకు 100 గజాల దూరంలో విక్రయాలను చేపట్టడం నేరం. ఈ సెక్షన్ ప్రకారం నేరం రుజువైతే రూ.200 జరిమానా మాత్రమే విధించే అవకాశముంది. అందుకే కఠినంగా ఉన్న జేజే యాక్ట్‌ను ప్రయోగిస్తున్నారు. ఈ చట్టంలోని 77 సెక్షన్ కింద అభియోగం రుజువైతే రూ.లక్ష వరకు జరిమానా, ఏడేళ్ల దాకా జైలుశిక్ష పడే అవకాశం ఉండటం గమనార్హం. 18 ఏళ్లలోపు వారికి పొగాకు ఉత్పత్తులను విక్రయించడం ఈ చట్టం ప్రకారం క్రిమినల్ అపరాధం.

ఫిర్యాదుల స్వీకరణకు '1908'

మైనర్లకు పొగాకు ఉత్పత్తుల విక్రయంపై సమాచారముంటే టోల్‌ఫ్రీ నంబరు 1908కు ఫిర్యాదు చేయొచ్చని 'ఈగల్' డైరెక్టర్ సందీప్ శాండిల్య సూచిస్తున్నారు. అలాగే వాట్సప్ నంబరు 8712671111కు లేదా ఈ-మెయిల్ tsnabho-hyd@tspolice.gov.inకు (లేదా) వెబ్‌సైట్ https://eagleforce.tspolice.gov.inకు కానీ సమాచారం అందించొచ్చని చెబుతున్నారు.

దేశాన్ని మాదకద్రవ్య విముక్తం చేద్దాం

'మన్‌కీ బాత్'లో ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు



దిల్లీ: మాదక ద్రవ్యాల వ్యసనాన్ని నిర్మూలించేందుకు పౌరులందరూ సమైక్యం కావాలని, యువతకు మేలైన భవితవ్యాన్ని నిర్మించాలని ప్రధాని మోదీ ఆదివారం పిలుపునిచ్చారు. మత్తుపదార్థాల వ్యసనం ఒక వ్యక్తినే కాక యావత్ సమాజాన్ని నాశనం చేస్తుందని 'మన్‌కీ బాత్' రేడియో ప్రసంగంలో ఆయన పేర్కొన్నారు. 'అభివృద్ధి చెందిన భారత్ కోసం మాదక ద్రవ్య విముక్తమైన యువత' నినాదంతో తమ ప్రభుత్వం చేపట్టిన ప్రచారం దేశవ్యాప్తంగా ఊపందుకుందని తెలిపారు. 'భారత యువత ఆరోగ్యం, ఆనందం, ఉజ్వల భవితవ్యం కోసం ఇది మనందరి సమష్టి సంకల్పం. యువతను మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉంచేందుకు, వ్యసనాల నుంచి రక్షించేందుకు ఉద్దేశించిన ఈ సమున్నత క్రతువులో మనందరం సముచిత పాత్ర పోషిద్దాం' అని మోదీ పేర్కొన్నారు.

మత్తు గుప్పిట విద్యార్థి..!

(మొదటి పేజీ తరువాయి)

యూనివర్సిటీలే కాకుండా వసతిగృహాలు మత్తు మందులకు వేదికలవుతుండటం ఆందోళనను రెట్టింపు చేస్తోంది. ఇటీవలే ఓ ప్రముఖ యూనివర్సిటీలో తనిఖీలు చేయగా 17 మంది విద్యార్థులకు డ్రగ్ పరీక్షలో పాజిటివ్ వచ్చింది. మరో యూనివర్సిటీలో నలుగురిని డ్రగ్ పెడ్లర్లు (సంచార విక్రేతలు)గా గుర్తించి అరెస్ట్ చేయగా.. మరో 50 మంది విద్యార్థులు మత్తుమందులు వినియోగిస్తున్నట్లు తేలింది. అలాగే పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడినట్లు ఎప్పటికప్పుడు బహిర్గతమవుతూ ఉండటం గమనార్హం. ఇంకా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యాసంస్థల్లోనూ మత్తు వినియోగదారుల సంఖ్య భారీగా ఉన్నట్లు దర్యాప్తు బృందాలు చెబుతున్నాయి.

మత్తు రుచి ఎలా చూశారని కొద్దిరోజుల క్రితం దర్యాప్తు బృందం సుమారు 500 మంది విద్యార్థులను ప్రశ్నిస్తే వచ్చిన ఒకే ఒక సమాధానం 'ఫ్రెండ్'. బర్త్‌డే పార్టీలు ఇందుకు తొలి వేదికలవుతున్నాయి. పుట్టినరోజు పేరిట పబ్‌లు, పార్టీలు, ఫాంహౌస్‌లలో వేడుకలు నిర్వహిస్తుండటం సాధారణమైపోయింది. అక్కడ ఎవరో ఒకరు మాదకద్రవ్యాల్ని తీసుకురావడం.. స్నేహితుల ప్రోద్బలంతో ఒకరి వెంట ఒకరు వాటిని రుచి చూడటం షరామామూలైపోయింది. ఇంటికి దూరంగా వసతిగృహాల్లో ఉండటం.. తల్లిదండ్రుల నిఘా లేకపోవడంతో ఇలాంటివి అలవాటవుతున్నాయి.

'డ్రగ్ రాపిడ్ టెస్ట్ కిట్'తో తేటతెల్లం

ఈగల్ బృందం ఓవైపు అవగాహన సదస్సులు నిర్వహిస్తుండటంతో పాటు హాట్‌స్పాట్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈక్రమంలో విద్యాసంస్థల ప్రాంగణాల్లోనే చేపడుతున్న 'డ్రగ్ రాపిడ్ టెస్ట్ కిట్' పరీక్షలతో అక్కడికక్కడే ఫలితాలు వెల్లడవుతున్నాయి. ఈ కిట్లు మల్టీ-స్ట్రిప్ యూరిన్ స్క్రీనింగ్ సాధనాలుగా పనిచేస్తున్నాయి. ఈ కిట్లు అంఫెటమైన్‌లు, ఓపియాడ్‌లు, గంజాయి, బెంజోడియాజెపైన్.. తదితర 12 రకాలైన మాదకద్రవ్యాల్లో అనుమానితుడు ఏం తీసుకున్నాడనే అంశాన్ని విశ్లేషించి ఫలితాలను వెల్లడిస్తాయి. అనుమానితుల మూత్ర నమూనాల్ని ఈ కిట్‌లో పరీక్షించడం ద్వారా 15 నిమిషాల్లోనే ఫలితాలొస్తున్నాయి. తద్వారా పాజిటివ్‌గా వచ్చిన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లి మరోసారి రక్తనమూనాల్ని విశ్లేషించడం ద్వారా న్యాయస్థానంలో సమర్పించేందుకు అవసరమైన సాక్ష్యాధారాల్ని సేకరిస్తున్నారు. అనంతరం విద్యార్థులకు నోటీస్ జారీ చేసి పంపించేస్తున్నారు. వ్యసన విముక్తికేంద్రాల్లో చికిత్స పొంది ధ్రువీకరణపత్రం తీసుకొచ్చిన అనంతరం కేసు నుంచి తొలగిస్తున్నారు.

మత్తు బారిన విద్యార్థులు ఇలా..

సంవత్సరం	విద్యార్థులు
2024	212
2025	406
2026 (మే నాటికి)	182
మొత్తం	800

మత్తు దందాలో ప్రమేయం..

- వినియోగదారులు - 598 మంది
- సరఫరాదారులు - 68
- వినియోగదారులు, సరఫరాదారులు - 43
- రవాణాదారులు, సరఫరాదారులు - 32
- పెడ్లర్లు- 6
- పెడ్లర్లు, సరఫరాదారులు - 4
- రవాణాదారులు, పెడ్లర్లు, సరఫరాదారులు - 2
- ఇతరులు - 47

22ఏ భూముల వివరాలు సిద్ధం చేసుకోండి

కలెక్టర్లకు రెవెన్యూ శాఖ కార్యదర్శి సూచనలు!

ఈనాడు, హైదరాబాద్: నిషేధిత భూముల జాబితాకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్లను రెవెన్యూ శాఖ కార్యదర్శి, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్‌కుమార్ ఆదేశించినట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి ఆదివారం ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ఈ అంశంపై సమీక్షించారు. '22ఏ వ్యవహారం హైదరాబాద్ పరిసర జిల్లాలకే పరిమితం కాలేదు. మా జిల్లాలకు సంబంధం లేదని ఎవరూ అనుకోవద్దు. త్వరలో శాసనసభ సమావేశాలు ఉన్న నేపథ్యంలో ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. నిషేధిత జాబితా నవీకరించక ముందు మీ జిల్లాల్లో ఎంత విస్తీర్ణం 22ఏలో ఉంది, ఆ తరువాత ఎంత ఉంది, ఇప్పుడు ఏయే సమస్యలు జిల్లా వ్యాప్తంగా వెలుగులోకి వస్తున్నాయనేది నమోదు చేసుకోవాలి. సీసీఎల్‌ఏ నుంచి పంపించే ఒక ఫార్మెట్ ప్రకారం ఆ వివరాలను అందజేయాలి. ముందుగా అర్హులకు సంబంధించిన భూములు ఉంటే జాబితా నుంచి తొలగించాలి. సీసీఎల్‌ఏ పరిధిలో నిర్ణయం తీసుకోవాల్సిన వాటికి సంబంధించి ప్రతిపాదనలు పంపాలి' అని ఆదేశించినట్లు తెలిసింది.

1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

బోనకల్లు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం 1.06 కోట్ల పేద కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆదివారం ఆయన మధిర నియోజకవర్గంలోని బోనకల్లు, చింతకాని మండలాల్లో రూ.131 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 53 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు వివరించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి రూ.10 లక్షలకు పెంపు, నిరుపేదలకు 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు తొలి ఏడాదిలోనే 70 వేలకు పైగా నియామక పత్రాలు పంపిణీ చేసినట్లు వివరించారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.వేల కోట్ల బకాయిలను చెల్లించినట్లు పేర్కొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం: రాష్ట్రంలో విద్య, వైద్యం, రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు భట్టి వివరించారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో 100 ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల్ని మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఒక్కో పాఠశాలని 25 ఎకరాల్లో రూ.200 కోట్లతో నిర్మిస్తున్నట్లు వివరించారు. మరో 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల మంజూరు చేశామని, 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహార కార్యక్రమాన్ని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని విస్తరించినట్లు తెలిపారు. ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు అత్యాధునిక ఆసుపత్రుల్ని అందుబాటులోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో రహదారి నెట్‌వర్క్ బలోపేతానికి రూ.90 వేల కోట్లతో ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతంలో రహదారుల నిర్మాణానికి మరో రూ.30 వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట కలెక్టర్ దివాకర, సీపీ సునిల్‌దత్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.



నారాయణపురంలో గోదాము ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క. చిత్రంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు

గ్రహం అనుగ్రహం

31–8–2026 సోమవారం

శ్రీ పరాభవ నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్షరుతువు, శ్రావణ మాసం, బహుళ పక్షం

తదియ: ఉ. 8-34 తదుపరి చవితి; **రేవతి:** తె. 4-09 తదుపరి అశ్విని; **వర్జ్యం:** సా. 4-20 నుంచి 5-54 వరకు; **అమృత ఘడియలు:** రా.1-47 నుంచి 3-21 వరకు; **దుర్ముహూర్తం:** మ. 12-25 నుంచి 1-15 వరకు, తిరిగి 2-54 నుంచి 3-44 వరకు; **రాహుకాలం:** ఉ. 7-30 నుంచి 9-00 వరకు **సూర్యోదయం:** ఉ.5.48; **సూర్యాస్తమయం:** సా.6.13; పుబ్బ కార్తె

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	38.6	28.4
విజయవాడ	34.7	27.2
నరసాపురం	34.2	25.0
గుంటూరు	34.0	29.0
విశాఖపట్నం	34.0	28.4
తాడేపల్లిగూడెం	33.0	27.0
హనుమకొండ	31.6	21.5
నల్గొండ	31.0	24.0
భద్రాచలం	31.0	23.5
మెదక్	30.9	22.0
నిజామాబాద్	30.1	24.1
రామగుండం	30.0	24.6
ఖమ్మం	30.0	23.0
మహబూబ్‌నగర్	29.4	23.0
ఆదిలాబాద్	29.3	23.2
హైదరాబాద్	27.8	23.2

దేన్నీ అతిగా చూడొద్దు



ఇప్పుడున్న పరిస్థితుల్లో పిల్లాడు అన్నం తినాలన్నా.. హోంవర్క్ చేయాలన్నా.. అల్లరి చేయకుండా ఉండాలన్నా సెల్‌ఫోన్‌లో కిడ్స్ మోడ్ పెడితే చాలనుకుంటున్నారు తల్లిదండ్రులు. ఈ మోడ్‌లో అభ్యంతరకర వీడియోలు రాకపోయినా.. రోజూ చూసే కిడ్స్ కంటెంట్‌నే పిల్లలు విపరీతంగా చూస్తున్నాకూడా ప్రమాదకరమే. వారి మానసిక, ఆరోగ్య పరిస్థితిపై, ఎదుగుదలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. అందుకే అమెరికాలోని న్యూ మెక్సికో కోర్టు ఇటీవల ఇలాంటి కేసును విచారిస్తూ.. తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అశ్లీల, ప్రమాదకర వీడియోలే కాదు.. మిగతావి కూడా పిల్లలు, యువతను ప్రభావితం చేస్తున్నాయని వ్యాఖ్యానించింది. పిల్లలను, యువతను ఫోన్‌కు అతుక్కుపోయేలా చేయడంలో ప్రమాదకరమైన కంటెంట్ పాత్ర ఎంతో ఉందని పేర్కొంది. ఆ మేరకు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల మాతృ సంస్థ అయిన మెటాను రూ.5,400 కోట్ల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ మొత్తాన్ని సదరు వీడియోలు చూసి సమస్యలు ఎదుర్కొంటున్న వారి ఆరోగ్య సేవలకు వినియోగించాలని పేర్కొంది. మనదేశంలో చాలామంది తల్లిదండ్రులు ఈ విషయాలు గుర్తించలేకపోతున్నారు. తీరా పిల్లలకు సమస్యలు వచ్చాక వైద్యులను సంప్రదిస్తున్నారు.

అమెరికాలోని న్యూ మెక్సికో కోర్టు ఆందోళన వ్యక్తం చేసిన కొన్ని రకాల కంటెంట్లు.. వాటితో కలిగే దుష్ఫలితాలు..

నిరాశతో చేసేవి: కొంత మంది తమకు వచ్చిన కామెంట్లు తట్టుకోలేక, వ్యక్తిగత ఇబ్బందుల వల్ల తమను తాము దూషించుకొని, హాని తలపెట్టుకుంటారు. నిరాశ, నిస్పృహ, జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంటామని వీడియోలు పెడుతుంటారు. ఇలాంటివి యువత, పిల్లల్లో ఆశావహ దృక్పథాన్ని కోల్పోయేలా చేస్తాయి.

ఆహారం: తిండి విషయంలో చాలామంది పోషకాహార నిపుణుల్లాగే సోషల్ మీడియాలో సలహాలు ఇస్తుంటారు. ముఖ్యంగా బరువు తగ్గడానికి, కండలు పెంచుకోవడానికి వచ్చే వీడియోలు పిల్లలను తప్పుదారి పట్టించే ప్రమాదముంది. కండలు పెంచడం కోసం మెడికల్ షాపుల్లో దొరికే గుర్తింపులేని ప్రొటీన్ పౌడర్లను తీసుకొని సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు.

లఘు వీడియోలు: 15-60 సెకన్ల నిడివి వీడియోలు పిల్లల్లో డోపమైన్‌ను విడుదల చేస్తాయి. నిత్యం అలవాటైతే పిల్లలు ఏకాగ్రత కోల్పోతారు. ఏ విషయంపై ధ్యాస పెట్టరు. అలాంటి రీల్స్‌కు పిల్లల్ని దూరంగా ఉంచాలి.

వాస్తవికతకు దూరంగా: సోషల్ మీడియాలో వీడియోలు, ఫొటోలు ఫిల్టర్లతో హెచ్‌డీ క్లారిటీతో వాస్తవికతకు దూరంగా ఉంటున్నాయి. పిల్లలు వాటినే నిజం అనుకునే ప్రమాదముంది. యువత అచ్చం అలా తయారు కావాలని ఒత్తిడికి గురవుతూ, అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు.

ఎక్కువ సేపు చూసేలా: ఓ సారి చూసిన కంటెంట్‌ను వివిధ కోణాల్లో, గ్రాఫిక్స్‌లో అల్గారిథమ్ ఆధారంగా ఇంకా ఎక్కువ పోగేసి.. చూపించడం వల్ల పిల్లలు దాన్ని చూడటానికి ఎక్కువ ఇష్టపడతారు. సామాజిక మాధ్యమంలో ఎక్కువసేపు గడుపుతారు. దీనివల్ల విలువైన సమయం వృథా కావడమే కాక.. ఒకే విషయాన్ని ఎక్కువసార్లు చూడటంతో పిల్లలు అదే నిజమని నమ్మేస్తున్నారు.

- ఈనాడు, హైదరాబాద్

ఆ దేశాలు పరిమితులు..

పిల్లల్లో ఫోన్ చూసే సమయాన్నే తగ్గించడానికి వివిధ దేశాల్లో ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొన్ని దేశాల్లో పిల్లలు, యువత స్మార్ట్ ఫోన్‌ల వినియోగంపై పరిమితులు విధించాయి.

- ఆస్ట్రేలియా 16 ఏళ్ల లోపు వారికి సామాజిక మాధ్యమాలను నిషేధించింది.
- ఫ్రాన్స్ 15 ఏళ్ల వరకు విద్యార్థులు పాఠశాలల్లో స్మార్ట్ ఫోన్లు వాడొద్దని పేర్కొంది. మూడేళ్ల లోపు పిల్లలకు అసలు స్క్రీన్ చూపించొద్దని, ఆరేళ్ల వారికి పరిమితంగా చూపించొచ్చని ఆదేశించింది.
- చైనా ఏకంగా 'మైనర్ మోడ్'ను అందుబాటులోకి తెచ్చింది. 8 ఏళ్ల పిల్లలు రోజుకు గరిష్ఠంగా 40 నిమిషాలే సెల్ చూడొచ్చు. ముఖ్యంగా రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు మైనర్లు ఇంటర్‌నెట్ వాడకుండా చేసింది.

సమంగా సంక్షేమం, అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

'2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి వలయాలతో హైదరాబాద్ నుంచి గ్రామీణ తెలంగాణ వరకు సమగ్ర అభివృద్ధి దిశగా కార్యాచరణను అమలుచేస్తున్నాం' అని నివేదికలో స్పష్టంచేసింది. అంశాలవారీగా ప్రగతిని ప్రస్తావించింది.

ఆర్థిక ప్రగతి.. వ్యవసాయంలో నం.1

2025-26లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరింది. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే దాదాపు 91 శాతం అధికం. సంక్షేమాన్ని కొనసాగిస్తూనే పెట్టుబడులు, ఉపాధి, మౌలిక సదుపాయాలు, సాంకేతిక రంగాల విస్తరణతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వచ్చింది. రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ చేసి 25 లక్షలకుపైగా రైతు కుటుంబాలకు ఊరటనిచ్చాం. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకుపైగా పెట్టుబడి సాయం అందించాం. రైతు సంక్షేమానికి రూ.1.68 లక్షల కోట్ల వ్యయం చేశాం. వరి సాగు, ఉత్పత్తిలో దేశంలో నంబర్-1గా నిలిచింది తెలంగాణ. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర న్యాయమైన వాటా కోసం రాజీలేని పోరాటం చేస్తున్నాం.

'మహాలక్ష్మి'లకు భారీ ఆదా

మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత ప్రయాణాలతో మహిళలకు దాదాపు రూ.11 వేల కోట్ల ప్రయాణ వ్యయం ఆదా అయింది. గృహజ్యోతి కింద 53 లక్షలకుపైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, 4.54 లక్షల మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.60,487 కోట్ల రుణాలు, రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ అందించాం. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులిచ్చాం. నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నాం. కొత్తగా 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చాం. తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం. అర్హులకు ఇంటినిర్మాణానికి రూ.5 లక్షల సహాయం ఇస్తున్నాం.

సామాజిక న్యాయంలో చరిత్రాత్మక నిర్ణయాలు

రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించి కులాల వారీ సామాజిక స్థితిగతులు వెల్లడించాం. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం 59 ఎస్సీ ఉపకులాలను 3గ్రూపులుగా వర్గీకరించి, ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ ఘనత వహించింది. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణతో కోటి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం చేకూరింది. గిగ్ కార్మికుల కోసం ప్రత్యేక చట్టం తెచ్చాం.

ప్రభుత్వ బడులకు కొత్త రూపం

కేంద్రం ప్రకటించే పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి పురోగతి సాధించింది. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నాం. ఇప్పటికే 105 మంజూరుచేశాం. 22 లక్షలకుపైగా విద్యార్థులకు అల్పాహారం, పాలు, పోషకాహారం ఇస్తున్నాం.

యువతకు ఉద్యోగాలు-నైపుణ్యాలకు కొత్త వేదిక

72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టాం. యువతలో నైపుణ్యం పెంపొందించే లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని స్థాపించాం. 65 ప్రభుత్వ ఐటీఐలు, 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. గోషామహల్‌లో నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టాం. 2023 డిసెంబరు 7 నుంచి 2026 ఆగస్టు 12 వరకు ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా 5,18,186 మందికి రూ.2,526.12 కోట్ల సాయం అందించాం. సీఎంఆర్ఎఫ్ వైద్య రీయింబర్స్‌మెంట్ ద్వారా 4,78,789 మంది పేద రోగులకు రూ.1,635.34 కోట్లు.. 39,712 మందికి రూ.798.41 కోట్ల ఎల్‌ఓసీలు ఇచ్చి ఆదుకున్నాం.

కల్తీపై ఉక్కుపాదం

ఆహార కల్తీ, డ్రగ్స్ ముప్పును సమగ్రంగా ఎదుర్కొనేందుకు కొత్తగా టీజీ సేఫ్ సంస్థ ఏర్పాటుచేశాం. డ్రగ్స్‌పై ఈగల్ వ్యవస్థ ద్వారా ప్రత్యేక పోరాటం చేస్తున్నాం. భూ భారతి చట్టం, భూధార్, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలు అమలుచేస్తున్నాం. 3.76 లక్షల కొత్త పట్టాదార్ పాసుపుస్తకాలు జారీచేశాం. హైదరాబాద్ చుట్టూ దాదాపు 360 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్డు, రాష్ట్ర వ్యాప్తంగా 6,092 కిలోమీటర్ల హ్యామ్ రోడ్ల ప్రణాళిక, హైదరాబాద్ మెట్రో రెండో దశలో ఏడు కారిడార్లతో 122.9 కిలోమీటర్ల విస్తరణ, మామునూరు విమానాశ్రయం, ఆదిలాబాద్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధి, మూసీ పునరుజ్జీవంలో 55 కిలోమీటర్ల సమగ్ర అభివృద్ధి, 39 కొత్త ఎస్టీపీలు వంటి ప్రగతి ప్రణాళికలు రూపొందించాం. టీజీ-ఐపాస్ ద్వారా రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులు, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2025లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు చేసుకున్నాం. 2025-26లో తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లు. 12.14 లక్షల ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు. హైదరాబాద్‌లో 355కిపైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల ఏర్పాటుతో..డేటా సెంటర్లు, క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో దేశంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న గమ్యస్థానాల్లో తెలంగాణ ముందువరుసలో నిలిచింది.

మా వాళ్లు ఎక్కడ..?


(మొదటి పేజీ తరువాయి)

కొనసాగిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నేపాలీ అధికారులు హెచ్చరించారు.

కుళ్లిపోయి.. అవయవాలు తెగిపోయి..

చాలా మృతదేహాలు వరద నీటిలో నాని కుళ్లిపోయాయి. అవయవాలు తెగిపోయాయి. ఫలితంగా మృతదేహాల గుర్తింపు చాలా కష్టమవుతోంది. ఇప్పటివరకూ కేవలం 17 మృతదేహాలనే గుర్తించగలిగామని అధికారులు తెలిపారు. 96 మృతదేహాలను డీఎన్ఏ నమూనాలను సేకరించాక ఖననం చేశామన్నారు. భారత్ నుంచి వచ్చిన 18 మంది ఫోరెన్సిక్ నిపుణుల బృందం డీఎన్ఏ విశ్లేషణలో తమకు తోడ్పడుతున్నట్లు వెల్లడించారు. ఆసుపత్రుల వెలుపల అతికించిన మృతదేహాల ఫొటోల్లో తమవారు ఉన్నారేమోనన్న ఆందోళనతో వెతుకుతూ పలువురు కంటతడి పెడుతున్నారు. తమ ఆత్మీయుల జాడ కోసం అధికారులను అడిగినప్పుడు.. 'గల్లంతయ్యారు' అనే సమాధానమే ఎక్కువగా వస్తుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "మా వాళ్లు బతికే ఉన్నారన్న ఆశ మాకు కల్పించండి. లేకపోతే కనీసం మృతదేహాలనైనా చూపించండి" అని వేడుకుంటున్నారు.

- దాదాపు 20 వేల మంది భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని.. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ఇప్పటివరకు 9,435 మందిని రక్షించామని నేపాలీ అధికారులు తెలిపారు.
- అత్యధికంగా చితవాన్ జిల్లాలో 264 మంది మృతి చెందారు. తూర్పు నవాల్ పరసీలో 194, పశ్చిమ నవాల్ పరసీలో 100 మృతదేహాలను వెలికితీశారు.
- గల్లంతైనవారిలో వివిధ పాఠశాలలకు చెందిన 238 మంది విద్యార్థులు, 18 మంది ఉపాధ్యాయులు ఉన్నారని నేపాల్ విద్యా శాఖ తెలిపింది.
- రసువా, నువాకోట్ జిల్లాల్లోని 9 హైడ్రో పవర్ ప్రాజెక్టుల్లో 537 మంది కార్మికులు, ఉద్యోగుల ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. రసువాలోని అప్పర్ త్రిశూలి-1 హైడ్రో పవర్ ప్రాజెక్టు సొరంగంలో ఎక్కువ మంది చిక్కుకొని ఉన్నారన్న ఆందోళన వ్యక్తమవుతోంది.
- త్రిశూలీ నదికి ఆదివారం దాదాపు మూడు గంటలపాటు వరదలు వచ్చాయి. ఆ తీవ్రతకు.. 130 మీటర్ల పొడవైన ఘ్యాల్‌చౌక్-చరౌడీ సస్పెన్షన్ బ్రిడ్జి కొట్టుకుపోయింది.


నేపాల్‌లోని చిట్వాన్‌లో మృతదేహాలను సామూహిక ఖననానికి తీసుకువెళ్తున్న పోలీసు సిబ్బంది

భారత్ చేయూత

నేపాల్‌కు భారత్ చేయూత కొనసాగుతోంది. 11 టన్నుల సహాయక సామగ్రిని ఆదివారం దానికి అందజేసింది. దీంతో ఇప్పటివరకూ మొత్తం 68.5 టన్నుల సహాయక సామగ్రిని పంపినట్లయింది. అదనంగా సాంకేతిక బృందాలు, ఫోరెన్సిక్ నిపుణులను కూడా నేపాల్‌కు భారత్ పంపింది.

టిబెట్‌లో 546 మంది కోసం..

వరద ఉద్ధృతికి టిబెట్‌లో మరణించినవారి సంఖ్య ఆదివారం నాటికి 16కు పెరిగింది. ఇంకా 546 మంది ఆచూకీ దొరకలేదు. వీరిలో 23 దేశాలకు చెందిన 261 మంది ఉన్నారు. ఇందులో భారతీయుల సంఖ్య 49. గల్లంతైనవారికోసం సహాయకచర్యలు ముమ్మరంగాసాగుతున్నాయి.


నేపాల్‌లోని నువాకోట్ జిల్లా దేవీఘాట్ వద్ద లిఖు నది ఒడ్డున ఆకస్మిక వరదలతో దెబ్బతిన్న ఇళ్లు

1,643 మంది పిల్లలను కాపాడిన ప్రిన్సిపల్

నేపాల్‌ను వరదలు ముంచెత్తినప్పుడు ఓ పాఠశాల ప్రిన్సిపల్ సమయస్ఫూర్తితో వ్యవహరించి.. 1,643 మంది చిన్నారులను కాపాడిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. త్రిశూలి ప్రాంతంలోని త్రిభువన్ త్రిశూలి సెకండరీ స్కూల్ ప్రిన్సిపల్ రాజేంద్ర దవాడికి గత బుధవారం ఉదయం వరద హెచ్చరిక అందింది. తను వెంటనే అలారం మోగించి, ఉపాధ్యాయుల సహాయంతో పాఠశాలలోని 1,643 మంది విద్యార్థులను ఒక్క చోటికి చేర్చారు. స్కూల్ బస్సు డ్రైవర్లను అప్రమత్తం చేశారు. విద్యార్థులను బస్సుల్లో ఓ సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు ప్రయత్నించారు. అప్పటికే స్థానికంగా రోడ్లు, భవనాలు కొట్టుకుపోతుండడంతో.. పాఠశాల సమీపంలో ఎత్తయిన ప్రదేశంలో ఉన్న ఓ పెద్ద బోధి వృక్షం కిందకు వారిని తరలించారు. అనంతరం కొన్ని నిమిషాల వ్యవధిలోనే.. భారీ వరద ధాటికి మూడు అంతస్తుల పాఠశాల భవనం కొట్టుకుపోయింది. ఈ విపత్తులో ఇద్దరు పాఠశాల సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. సమయస్ఫూర్తితో వ్యవహరించిన దవాడిని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు అభినందిస్తున్నారు.

3 రోజుల తర్వాత మృత్యుంజయురాలిగా..

రసువా జిల్లాలోని టిమురే ప్రాంతంలో శిథిలాల కింద ఆరేళ్ల ఓ బాలిక సజీవంగా కనిపించింది. వరదలతో దెబ్బతిన్న ఆ ప్రాంతంలో మూడో రోజు (శుక్రవారం) భద్రతా సిబ్బంది సహాయక చర్యలు కొనసాగిస్తుండగా.. పాప ఏడుపు వినిపించింది. వెంటనే వారు అప్రమత్తమై శిథిలాల నుంచి జాగ్రత్తగా బయటకు తీశారు. పాప ఆరోగ్యం విషమంగా ఉండటంతో ఆసుపత్రికి తరలించారు.





నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలంగాణ వాసుల తరలింపునకు చర్యలు

ఈనాడు, దిల్లీ: నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలంగాణ వాసుల సురక్షిత తరలింపు కోసం తెలంగాణ భవన్ అధికారులు.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కాఠ్‌మాండూలోని భారత రాయబార కార్యాలయం, నేపాల్ పోలీసులతో నిరంతర సమన్వయం చేస్తున్నారు. వరదల్లో మరణించిన వారి ప్రాథమిక వివరాలను నేపాల్ ప్రభుత్వం అక్కడి పోలీసు విభాగానికి చెందిన 'డిజాస్టర్' పోర్టల్‌లో అందుబాటులో ఉంచింది. ఏదైనా సమాచారం కోసం తెలంగాణ భవన్, భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని తెలంగాణ భవన్ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

హైదరాబాద్ వాసి సురక్షితం..: భారీ వరదల్లో చిక్కుకున్న హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి సురక్షితంగా ఉన్నాడని నేపాల్ సర్కారు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది. కాగా రాష్ట్రానికి చెందిన మరో 21 మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు.

'చేయూత' పెన్షన్లకు దరఖాస్తుల వెల్లువ

(మొదటి పేజీ తరువాయి)

దివ్యాంగులు, 26,343 మంది గీత కార్మికులు, 10,468 మంది చేనేత కార్మికులున్నారు. హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 27,554 మంది, అత్యల్పంగా ములుగు నుంచి 3,620 మంది దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తులకు సోమవారం చివరి రోజు కాగా, అప్పటివరకు వచ్చిన వాటన్నింటినీ క్రోడీకరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం 2.50 లక్షల పెన్షన్లకే అనుమతించినందున.. వచ్చిన దరఖాస్తుల్లో దాదాపు సగం మందికే వాటిని మంజూరు చేసే అవకాశం ఉంది. దీని కోసం మంగళవారం నుంచి వడబోత ప్రక్రియ సాగనుంది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు.

రాజ్యాంగం అనుమతించినా.. వారిని జడ్జీలుగా నియమించరేం?

(మొదటి పేజీ తరువాయి)

వాస్తవ పరిస్థితుల్ని ఎదుర్కొన్న అనుభవం ఉండదన్న వాదన అర్థరహితం. పలు దేశాల్లో వీరిని రాజ్యాంగ న్యాయస్థానాల జడ్జీలుగా నియమించే పద్ధతి అమలులో ఉంది. మనదేశంలో మాత్రం హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి లేదా ప్రధాన న్యాయమూర్తిని సుప్రీంకోర్టు జడ్జీగా నియమించడం ఆనవాయితీగా వస్తోంది. కొన్ని సందర్భాల్లో బార్ అసోసియేషన్ నుంచి నేరుగా నియామకాలు జరిగాయి. ఈ రెండు వర్గాలకూ చెందని న్యాయకోవిదులు ఎవరూ సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమితులు కాలేదు. వారు కూడా చేరితే న్యాయ నిర్ణయ ప్రక్రియకు మరింత బలం చేకూరుతుంది" అని జస్టిస్ భూయాన్ అభిప్రాయపడ్డారు.

భిన్న దృష్టికోణాన్ని వ్యక్తీకరించడంతోపాటు ఇబ్బందికరమైన ప్రశ్నలు అడిగే విద్యార్థులకు కఠిన చర్యల బూచి చూపడం తగదని జస్టిస్ భూయాన్ పేర్కొన్నారు. అలా చేయడం రాజ్యాంగ విరుద్ధమని, అది అధికార దుర్వినియోగమేనని స్పష్టం చేశారు. ఇటీవల దిల్లీలోని జంతర్ మంతర్‌లో విద్యార్థులు నిర్వహించిన నిరసన ప్రదర్శనల నేపథ్యంలో జస్టిస్ భూయాన్ మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "విశ్వవిద్యాలయమనేది గూడుకట్టుకున్న భావనల్ని పరిశీలించి... ప్రశ్నించే ప్రదేశంగా ఉండాలి. విద్యార్థుల్లో స్వేచ్ఛగా ఆలోచించే అలవాటు పెంపొందించే ప్రదేశం కావాలి. ప్రశ్నించడం ఎదురు తిరగడంతో సమానం కాదు. సహనం లేని మనస్తత్వం భారత రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం" అని ఆయన అన్నారు.



విమర్శలు, నిందలను తట్టుకోగలిగితేనే..

జీవితంలో ఉన్నతంగా ఎదగాలని మీరు కోరుకుంటున్నట్లయితే.. విమర్శలు, నిందలను తట్టుకొని నిలబడగల దృఢమైన మనస్తత్వాన్ని అలవర్చుకోండి. వాటిని వ్యక్తిగతంగా తీసుకోకండి. మీతో విభేదించే స్వేచ్ఛను ఇతరులకు ఇవ్వండి. ప్రతి చిన్న విషయానికీ ఆవేదన చెందకుండా, మానసికంగా ప్రశాంతంగా ఉండండి.

–డాన్ గో, హై పర్ఫార్మెన్స్ కోచ్

నవశకానికి పారిశ్రామిక ప్రగతి!

(మొదటి పేజీ తరువాయి)

లైఫ్ సైన్సెస్ రంగానికి 'నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30' కీలకమైన మైలురాయిగా నిలిచింది. దావోస్‌లో ఆవిష్కరించిన ఈ విధానం ద్వారా 2030 నాటికి ప్రపంచంలోని టాప్-3 లైఫ్‌సైన్సెస్ క్లస్టర్లలో తెలంగాణను ఒకటిగా నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఐదేళ్లలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 5 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించడం పాలసీ ప్రధాన లక్ష్యాల్లో ఉన్నాయి. జీనోమ్‌వ్యాలీ విస్తరణ, మెడికల్ డివైసెస్ పార్క్, గ్రీన్‌ఫార్మా సిటీ, 10 ఫార్మా విలేజ్‌లు, బయో-ఇన్నోవేషన్ క్లస్టర్లు, సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ వంటి మౌలిక వసతుల ద్వారా లైఫ్‌సైన్సెస్‌ను 'వాల్యూమ్ నుంచి వాల్యూ' దిశగా తీసుకెళ్లే వ్యూహం అమలవుతోంది.

ఏఐతో కొత్త తరం ఆర్థిక వ్యవస్థ

హైదరాబాద్‌ను ప్రపంచ ఐటీ కేంద్రంగా నిలబెట్టిన ప్రస్తుత సామర్థ్యాన్ని మరింత విస్తరించేందుకు 'ఐటీ పాలసీ 2.0'ను తీసుకొస్తున్నారు. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డీప్‌టెక్, ఫిన్‌టెక్, డిజిటల్ ఇంజినీరింగ్' వంటి భవిష్యత్ సాంకేతిక రంగాలకు ఇందులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. 2047 నాటికి తెలంగాణను 'హై-వాల్యూ నాలెడ్జ్ ఎకానమీ'గా తీర్చిదిద్దడంలో ఐటీ, ఏఐ రంగాలు కీలక పాత్ర పోషించనున్నాయి.

చైనా ప్లస్ వన్'గా తెలంగాణ

ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీలు చైనాకు ప్రత్యామ్నాయ కేంద్రాలను అన్వేషిస్తున్న నేపథ్యంలో 'ఎలక్ట్రానిక్స్ పాలసీ 2.0' ద్వారా ఆ అవకాశాన్ని తెలంగాణకు మళ్లించాలని ప్రభుత్వం భావిస్తోంది. సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్, చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ వంటి రంగాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించనున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఇండియా సెమీకండక్టర్ మిషన్'తో అనుసంధానమై తెలంగాణను అధునాతన ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఉండనుంది.

స్పేస్ ఎకానమీకి రెక్కలు..

ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్‌టెక్ రంగాలను రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి కీలక ఇంజిన్లుగా మార్చేందుకు ప్రత్యేక పాలసీని రూపొందిస్తున్నారు. స్పేస్ స్టార్టప్‌లు, డిఫెన్స్ తయారీ సంస్థలు, ఏరోస్పేస్ కాంపోనెంట్ తయారీ, పరిశోధన సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించనున్నారు. కామన్ టెస్టింగ్ ఫెసిలిటీస్, క్లస్టర్లు, పరిశోధన-తయారీ మౌలిక వసతులు ఈ పాలసీలో కీలకంగా ఉండనున్నాయి.

ఉపాధి ఆధారిత తయారీ..

పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పించే సామర్థ్యమున్న ఫుట్‌వేర్-లెదర్, అప్పెరల్, లైఫ్ స్టైల్ ఉత్పత్తుల తయారీ రంగాలను ప్రోత్సహించే విధంగా వేర్వేరుగా కొత్త పాలసీలను తీసుకురానున్నారు. ఈ రంగాలను హైదరాబాద్ వెలుపల జిల్లాలకు తీసుకెళ్లడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను పెంచాలనేది సర్కారు లక్ష్యం. ముడిసరకు నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులు, తయారీ, ప్యాకేజింగ్, ఎగుమతుల వరకు పూర్తి సరఫరా గొలుసును తెలంగాణలోనే అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టనున్నారు.

ప్రపంచ కంపెనీలకు హైదరాబాద్ గ్లోబల్ హబ్

గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)కు హైదరాబాద్ ఇప్పటికే కీలక కేంద్రంగా ఎదిగింది. దాన్ని మరింత విస్తరించేందుకు ప్రత్యేక పాలసీ తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏఐ, ఇంజినీరింగ్, ఫైనాన్స్, క్లౌడ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ వంటి అధిక విలువ కలిగిన కార్యకలాపాలను ఆకర్షించడం ప్రధాన లక్ష్యంగా ఉండనుంది. 'ఇన్వెస్ట్ తెలంగాణ'లో సేవా రంగ పెట్టుబడులతో పాటు అధిక నైపుణ్య ఉద్యోగావకాశాలను పెంపొందించే కీలక స్తంభంగా జీసీసీ పాలసీ నిలవనుంది.

డిజిటల్ మౌలిక వసతులకు బలం

ఏఐ, క్లౌడ్, డిజిటల్ సేవల విస్తరణతో డేటా సంబంధిత మౌలిక వసతులకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో.. డేటా సెంటర్స్ పాలసీకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. డేటా సెంటర్లు ప్రత్యక్షంగా భారీ సంఖ్యలో ఉద్యోగాలను ఇవ్వకపోయినా..వాటి చుట్టూ క్లౌడ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి అనుబంధ రంగాలు విస్తరించే అవకాశం ఉంది.

తెలంగాణ నుంచి ప్రపంచ మార్కెట్లకు

పరిశ్రమలకు రవాణా వ్యయాన్ని తగ్గించడం, ఎగుమతులను సులభతరం చేయడంలో లాజిస్టిక్స్ పాలసీ కీలకంగా మారనుంది. దీని ద్వారా డ్రైపోర్టులు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ హబ్‌లు, గిడ్డంగులు, కోల్డ్‌చైన్లు, ఆధునిక రవాణా మౌలిక వసతులను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టనున్నారు. పరిశ్రమ స్థాపన నుంచి ఉత్పత్తులను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు చేరవేసే వరకు పూర్తి ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలనేది ధ్యేయం.

ఆటోమొబైల్ రంగాన్ని రప్పించేందుకు

ఏ ఆర్థిక వ్యవస్థకైనా ఆటోమొబైల్ పరిశ్రమ కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో ఆశించిన స్థాయిలో ఆటోమొబైల్ తయారీ రంగం అభివృద్ధి చెందకపోవడాన్ని ప్రభుత్వం సవాలుగా చూస్తోంది. కార్లు ఉత్పత్తిచేసే పెద్ద ఆటో మొబైల్ తయారీ సంస్థలతో పాటు ద్విచక్ర వాహనాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, ఆటో కాంపోనెంట్స్ వంటి అనుబంధ పరిశ్రమలను ఆకర్షించేలా ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే అంశాన్ని పరిశీలిస్తున్నారు.

వేల అడుగులు ఒక్కటై.. పరుగుల పండగై..

(మొదటి పేజీ తరువాయి)

10కే రన్‌లో దాదాపు 9 వేల మంది పాల్గొన్నారు. శనివారం నిర్వహించిన 5కే, ఇన్‌క్లూజివ్ రన్‌లలో 6,500 మంది పాల్గొన్నారు. తొలిసారి నిర్వహించిన ఇన్‌క్లూజివ్ రన్‌లో దాదాపు 300 మంది దివ్యాంగులు ఉండటం విశేషం. 15 మంది విదేశీ, 30 మంది భారతీయ ఎలైట్ రన్నర్లు పోటీపడ్డారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఎలైట్, ఫుల్ మారథాన్‌లను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేశ్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ జోనల్ హెడ్ ప్రశాంత్ షిండే, ఎన్ఎండీసీ డైరెక్టర్ శ్రీకృష్ణకుమార్ ఠాకూర్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. హాఫ్ మారథాన్‌కు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ శ్రీకారం చుట్టగా, మాదాపూర్ హైటెక్ సిటీ నుంచి 10కే రన్‌ను సైబరాబాద్ సీపీ ఎం.రమేశ్, అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఎండీ, సీఈవో వి.వైద్యనాథన్ ప్రారంభించారు.

ప్రత్యేక తరగతుల్లో స్నాక్స్

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మోడల్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సమయంలో స్నాక్స్ అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వార్షిక పరీక్షలకు ముందు 45 రోజుల పాటు సాయంత్రం పూట నిర్వహించే ప్రత్యేక తరగతుల సమయంలో స్నాక్స్ అందించేందుకు సమగ్ర శిక్షా అభియాన్ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.12.76 కోట్లు మంజూరు చేశారు.


ఈనాడు

సత్వర న్యాయానికి ప్రత్యామ్నాయ మార్గం

నానాటికీ పెరుగుతున్న పెండింగ్ కేసులు న్యాయ వ్యవస్థకు పెనుభారంగా పరిణమిస్తున్నాయి. ప్రస్తుతం దేశీయంగా అన్ని కోర్టుల్లో కలిపి అయిదున్నర కోట్లకు పైగా కేసులు అపరిష్కృతంగా పడి ఉన్నాయి. వాటిలో దాదాపు 89 శాతం కింది స్థాయి న్యాయస్థానాల్లోనే మోక్షం కోసం ఎదురుచూస్తున్నాయి. చాలా కేసుల్లో విచారణ ప్రక్రియ ముగిసి తీర్పులు వెలువడేసరికి తరాలు గడిచిపోతున్నాయి. దానివల్ల కక్షిదారుల విలువైన సమయం, డబ్బు వృథా అవుతున్నాయి. ఈ దురవస్థను తప్పించేందుకు 'మధ్యవర్తిత్వం' బాగా ఉపయోగపడుతుంది. ఆస్తి, కుటుంబ తగాదాలు, వాణిజ్య, రుణ, ఉద్యోగ వివాదాల్లో కాలహరణం కాకుండా ఇరుపక్షాలు మాట్లాడుకుని సంతృప్తికర పరిష్కారాన్ని వెతుక్కోవడానికి ఇందులో అవకాశం దక్కుతుంది. అనాదికాలం నుంచి ఇండియాలో విశేష గుర్తింపు పొందిన మధ్యవర్తిత్వం- బ్రిటిష్ వారి హయాములో ప్రాధాన్యాన్ని కోల్పోయింది. సత్వర న్యాయాన్ని సాకారం చేసే క్రమంలో మీడియేషన్ మార్గం మళ్ళీ ముందుకొచ్చింది. దీనికి శాసనబద్ధమైన దన్ను ఇచ్చేందుకు కేంద్రం 2023లో మధ్యవర్తిత్వ చట్టం తెచ్చింది. అందులో భాగంగా భారత మధ్యవర్తిత్వ మండలి(ఎంసీఐ)ని తాజాగా ఏర్పాటు చేసింది. ఇది హర్షణీయమే అయినా, ఈ పద్ధతిలో మేలిమి ఫలితాల సాధనకు పలు సవాళ్లను అధిగమించాల్సి ఉంది!

మధ్యవర్తిత్వంపై దేశవ్యాప్తంగా ఇప్పటిదాకా ఏకీకృత నియంత్రణ వ్యవస్థ లేదు. ఎంసీఐ ఆ లోటును పూడుస్తుంది. మధ్యవర్తుల నమోదు, శిక్షణ, అర్హతలూ ప్రమాణాల నిర్దేశం, సంబంధిత సంస్థల గుర్తింపు, పర్యవేక్షణ, ఆన్‌లైన్ మీడియేషన్ నిబంధనల రూపకల్పన తదితర విధులను ఎంసీఐ చూస్తుంది. వీటన్నింటినీ సమర్థంగా చక్కబెట్టాలంటే ముందుగా అందులో పూర్తిస్థాయిలో సభ్యులను నియమించాలి. ఇతర పాలనాపరమైన ఏర్పాట్లు చేయడంతోపాటు మధ్యవర్తుల నమోదు వ్యవస్థను బలపరచాలి. ముఖ్యంగా ప్రత్యామ్నాయ వివాద పరిష్కార ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. దేశీయంగా మధ్యవర్తిత్వానికి అనుకూలమైన 1.68 కోట్ల కేసులను కొలిక్కి తెచ్చేందుకు రెండున్నర లక్షల సుశిక్షిత మీడియేటర్లు అవసరమని, ప్రస్తుతం అందులో అయిదు శాతం మందే అందుబాటులో ఉన్నారని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నిరుడు వ్యాఖ్యానించారు. ఈ కొరతను తీర్చడంలో ఎంసీఐ నిబద్ధతపైనే న్యాయవితరణలో వేగాన్ని పెంచే మధ్యవర్తిత్వ విధానం విజయం ఆధారపడి ఉంటుంది.

కోర్టు మెట్లు ఎక్కడానికన్నా ముందే కొన్నిరకాల వివాదాలను పరిష్కరించే అవకాశాన్ని పరిశీలించాలని మధ్యవర్తిత్వ చట్టం నిర్దేశిస్తోంది. కానీ, విచారణల్లో కొన్నేళ్లు గడిచాక మీడియేషన్ వైపు మొగ్గుతుండటంతో కేసుల కొండలు పెరుగుతున్నాయి. వీటిని తగ్గించాలంటే- ఇటలీలో మాదిరిగా సివిల్, వ్యాపార సంబంధిత కేసుల్లో ముందస్తు మధ్యవర్తిత్వ ప్రయత్నాన్ని తప్పనిసరి చేయాలి. అదే సమయంలో ధన, అధికార బలసంపన్నులు బలహీనులను బలవంతంగా రాజీకి ఒప్పించకుండా జాగ్రత్త వహించాలి. కక్షిదారులు స్వచ్ఛందంగా అంగీకారానికి వచ్చేలా చేయూతనివ్వాలి. అలా కుదిరిన ఒప్పందానికి చట్టబద్ధమైన రక్షణ కల్పించడమూ కీలకమే! ఇలాంటి వాటన్నింటి విషయంలో సింగపూర్‌ను ఆదర్శంగా తీసుకుని ముందడుగు వేస్తూ, అంతర్జాతీయ స్థాయి వివాదాలకూ మన దగ్గర మంచి పరిష్కారాలు చూపించగలగాలి. నగరాల్లోనే కాకుండా జిల్లా స్థాయిలో మీడియేషన్ కేంద్రాలను నెలకొల్పాలి. హేయ నేరాలు, ప్రజా ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీసే కేసుల్లో రాజీ యత్నాలను పరిహరిస్తూ జనభద్రతకు భరోసానివ్వడమూ అత్యావశ్యకమే!




వేగంగా నడవాలనుకుంటే ఒంటరిగా నడవాలి. చాలా దూరం నడవాలనుకుంటే మాత్రం మరొకరితో కలిసి నడవాలి. జీవితం పదిమందితో కలిసి చేసే దూర ప్రయాణం. ఒంటరిగా సాధించే విజయాలకన్నా ఇతరులకు ఉపయోగపడినప్పుడే జీవితానికి సంతృప్తి, ప్రయోజనమూ.

– నావల్ హోర్ముస్‌జీ టాటా

శోధన దిశగా...

దైవానికి రూపాన్ని, నామాన్ని, గుణాలను ఆపాదించడమే 'సగుణ బ్రహ్మ' దృక్పథం. ఆకారం, పేరు, గుణాలతో కూడిన దైవస్వరూపం ఎవరికైనా సులభంగా అర్థమవుతుంది. అమూర్తమైన దైవ భావనను ఈశ్వరుడిగా, సర్వశక్తిమంతుడిగా, సర్వజ్ఞుడిగా, కరుణామయుడిగా కొలవడం వల్ల మనసుకు ఒక ఆలంబన లభిస్తుంది. ప్రార్థన ద్వారా మనసు ఏకాగ్రమయ్యే వీలుంది. భక్తి, శరణాగతి ద్వారా అహంకారం తగ్గుతుంది. క్రమశిక్షణ, ధార్మిక జీవనం అలవడే అవకాశం ఉంది. అయితే, ఇది ఆధ్యాత్మిక ప్రయాణంలో సన్నాహక దశే కానీ అంతిమ గమ్యం కాదు... అంటాయి కొన్ని తాత్విక దర్శనాలు. నామ రూపాలకన్నా వాటి వెనుక ఉన్న నిగూఢ దైవిక భావనను అన్వేషించడం మరింత ముఖ్యమని చెబుతాయి.



అంతర్యామి

భారతీయ చింతనలో చూస్తే.. ఉపనిషత్తులు మనల్ని లోతైన ఆత్మవిచారణ వైపు నడిపిస్తాయి. దేవుడు, భక్తుడు, పూజ లాంటి భావనలను దాటి, 'నేను ఎవరు?', 'అంతిమ సత్యం ఏమిటి?' అనే ప్రశ్నలను శోధించమని చెబుతాయి. 'నేతి, నేతి'(ఇది కాదు, ఇది కాదు) - అనేది మనం ఏర్పరచుకున్న ప్రతి పరిమిత భావననూ ప్రశ్నించమని సూచిస్తుంది. మన భావనలు, వాటిలోంచి ఆవిర్భవించే మానసిక నిర్మాణాలు ఎంత పవిత్రమైనవైనా, అవి సూచించే నిగూఢ సత్యానికి సమానం కాదని గుర్తు చేస్తుంది. అద్వైత వేదాంతం 'సగుణ బ్రహ్మ' భావనను ఒక అవసరమైన మెట్టుగా గుర్తిస్తుంది. భక్తిని, ఈశ్వరారాధనను గౌరవిస్తూనే ఆధ్యాత్మిక అన్వేషణ అక్కడే ఆగిపోకూడదని చెబుతుంది. అన్ని రకాల ద్వైత భావనలు, బాహ్య చిహ్నాలను అధిగమించి 'నిర్గుణ బ్రహ్మ' వైపు అడుగులు వేయమంటుంది. అపరిమిత ఆత్మతత్వాన్ని దర్శించమంటుంది. 'సగుణ బ్రహ్మ'తో ఆగిపోతే కలిగే ముఖ్య విపరిణామం ఏంటంటే - నామరూపాలతో అనుబంధం పెరగడం, క్రమంగా దైవం కన్నా దాన్ని సూచించే సంకేతాలపైనే దృష్టి కేంద్రీకృతం కావడం, అన్వేషణ ఆగిపోవడం!

భాష లాంటి సంకేతాల పరిమితులు, రూపం వెనకున్న అరూప చైతన్యాన్ని విస్మరించరాదనే సూచనలు ఇతర ప్రముఖ సంప్రదాయాల్లో కూడా కనిపిస్తాయి. 'చంద్రుడి వైపు చూపించే చూపుడు వేలు చంద్రుడు కాదు' అన్నది ఒక ప్రసిద్ధ జెన్ బౌద్ధ సామెత. ఒక పదం, ఆ పదం సూచించే విషయం ఒకటి కావని, వర్ణన అన్నది వర్ణితమయ్యే వస్తువు కాదని పదేపదే గుర్తు చేస్తారు జిడ్డు కృష్ణమూర్తి లాంటి తాత్వికులు.

అందువల్ల, 'దైవం' అన్న నిగూఢ భావనకు సంబంధించిన పేర్లు, చిహ్నాలను మనల్ని సత్యం వైపు నడిపించే ఉపకరణాలుగా చూడవచ్చు. అవి ఊతకర్రలూ, వంతెనలే గానీ అవే అంతిమ గమ్యం కావు. ఆ బాహ్య ప్రతీకల పాత్రనూ, సౌలభ్యాన్ని గుర్తిస్తూనే వాటిలో చిక్కుకోకుండా ఉండటం కీలకం. పదాలు, భావనలు, సిద్ధాంతాల పరిమితులు దాటి అంతర్ముఖం కావడమే అసలైన ఆధ్యాత్మిక పరిపక్వత!

– ఈదర రవికిరణ్

వేతన పరిమితి పెంపు...

వృద్ధాప్యంలో కనీస ఆసరా!

ఉద్యోగుల భవిష్యనిధి(ఈపీఎఫ్) పథకంలో వేతన పెంపు జరిగి పుష్కరకాలం గడిచింది. అలస్యంగానైనా, ఇన్నేళ్లకు మళ్ళీ కదలిక వచ్చింది. సంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు వర్తించే ఈపీఎఫ్ పథకంలో చేరడానికి నిర్దేశించిన గరిష్ఠ వేతన పరిమితిని రూ.15వేల నుంచి రూ.25వేలకు పెంచేందుకు కేంద్ర ఆర్థికశాఖ అనుమతి ఇచ్చిందనీ, త్వరలో అమలయ్యే అవకాశముందని తెలుస్తోంది. ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా, మొన్న జనవరిలో సర్వోన్నత న్యాయస్థానం దీన్ని త్వరగా పరిశీలించాలని ఆదేశాలివ్వడం గమనార్హం.

మన దేశంలో ఉద్యోగుల భవిష్యనిధి(ఈపీఎఫ్) పథకాన్ని పొదుపు, స్థిరత్వాన్ని పెంచే ఉద్దేశంతో రూపొందించారు. అనంతరం 1971లో కుటుంబ పింఛన్, 1976లో ఎంప్లాయీస్ డిపాజిట్ ఇన్సూరెన్స్, 1995లో పెన్షన్ స్కీమ్‌లు రావడంతో వాటికి ప్రాధాన్యం పెరిగింది. 1952లో ఉద్యోగుల పింఛన్ పథకం వేతన పరిమితి రూ.300, చందా 6.25శాతంగా ఉండేది. క్రమంగా ఈ వేతన పరిమితి రూ.15వేలకు, చందా 12శాతానికి పెరిగింది. నాడు ప్రభుత్వ ఉద్యోగులకు అమలులో ఉన్న కేంద్ర మొదటి వేతన కమిషన్ స్కేల్స్ ప్రకారం కనిష్ఠ వేతనం రూ.55. పీఎఫ్ వేతన పరిమితిని దీనికి దాదాపు అయిదున్నర రెట్లుగా నిర్ధారించారు. అంటే ప్రభుత్వంలో ఉన్నతస్థాయి ఉద్యోగులతో సమానంగా వేతనం పొందుతున్న ప్రైవేట్ ఉద్యోగులందరూ ఈ పరిమితిలోకి వచ్చేలా చూశారు. క్రమేపీ ఈ వ్యత్యాసం తగ్గిపోయింది. ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఏడో వేతన కమిషన్‌లో కనీస జీతం రూ.18వేలు. దీన్నిబట్టి చూస్తే గడచిన 74 ఏళ్లలో సామాజిక భద్రత పొందడానికి అర్హమైన వేతన పరిమితి అయిదున్నర రెట్ల నుంచి 0.82 శాతానికి తగ్గింది. దీనివల్ల సంఘటిత రంగంలోని ఎంతోమంది కార్మికులు ఈ పథకానికి బయటే ఉండిపోయారు. 2014 సెప్టెంబరులో పెంపు జరిగినప్పుడు రూ.15వేలకు మించి వేతనం పొందుతున్న వారిని పెన్షన్ పథకంలో చేరడానికి అనర్హులుగా ప్రకటించారు. దీనివల్ల చాలామంది చిరుద్యోగులు చేరలేకపోవడంతో వృద్ధాప్యంలో లభించే కనీస ఆసరాకు దూరమయ్యారు. ఉద్యోగుల పింఛన్ పథకంలో వేతన పరిమితి 30ఏళ్లలో రెండుసార్లే పెరిగింది. 2014 నుంచి రూ.15వేలుగా ఉంది. 2017 నుంచి ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ పథకం వేతన పరిమితి రూ.21వేలకు పెరిగింది.



దీర్ఘ కాలంలో ప్రయోజనం

గరిష్ఠ వేతన పరిమితి వల్ల పథకంలో చేరలేకపోయినవారు కొందరైతే, చేరినా ఆశించిన లబ్ధి పొందలేనివారు చాలామంది ఉంటారు. గరిష్ఠ పరిమితి రూ.15వేలుగా ఉన్నప్పుడు కూడా, లోగడి గణాంకాల ప్రకారం దాదాపు 6 కోట్ల మంది సభ్యులలో దాదాపు 3కోట్ల మంది కేవలం రూ.6వేల వేతనంపై చందా చెల్లించేవారు కావడం గమనార్హం. ఇందులో వాస్తవానికి చిరుద్యోగులకన్నా పీఎఫ్ పథకంలో ఉన్న వేతన నిర్వచనాన్ని వక్రీకరించి తక్కువ చందా చెల్లించే సంస్థలు ఎక్కువగా ఉండటం గమనించాల్సిన విషయం. అయితే ప్రస్తుతం అమల్లోకి వచ్చిన సామాజిక భద్రత కోడ్‌లో స్థూల వేతనంలో కనీసం యాభై శాతాన్ని చందా చెల్లించాల్సిన చట్టబద్ధమైన వేతన పరిమితిగా పేర్కొన్నారు. వేతన పరిమితిని పెంచడం వల్ల, చేతికందే జీతం తగ్గుతుందనే భావనలు ఉన్నప్పటికీ... తగ్గిన మొత్తంతో సమానంగా యాజమాన్యం చందా వాటా పొందడం వల్ల దీర్ఘకాలంలో పొదుపు, పింఛన్ మొత్తాలను అధికంగా దక్కించుకునే అవకాశముంది. అయితే యాజమాన్య చందా పెరగడం వల్ల సంస్థలపై ఆర్థిక భారమూ పెరగవచ్చు.

వేతన పరిమితి పెంపుదలలో మరొక వివాదాంశం ఉంది. 2014లో ఈ వేతన పరిమితిని రూ.6500 నుంచి రూ.15వేలకు పెంచినప్పుడు పెన్షన్ లెక్కింపులో దామాషా పద్ధతిని ప్రవేశపెట్టారు. పెన్షనబుల్ శాలరీ సరాసరిని 12-60 నెలలకు పెంచారు. దామాషా పద్ధతిలో పదవీ విరమణ వరకు ఉన్న సర్వీసును రెండు భాగాలుగా విభజిస్తారు. 1-9-2014కు ముందు పొందిన గరిష్ఠ వేతనం, పై సరాసరిలో ఏది తక్కువ అయితే దాన్ని 1-9-2014కు ముందు సర్వీసుకు పెన్షనబుల్ శాలరీగా నిర్ధారిస్తారు. 20 ఏళ్లకుపైగా సర్వీసు ఉంటే రెండేళ్ల వెయిటేజీని ఈ సర్వీసుకే కలుపుతారు. అదేవిధంగా 1-9-2014 తర్వాత పొందిన గరిష్ఠ వేతనం, పై సరాసరిలో ఏది తక్కువైతే దాన్ని ఆ సర్వీసుకు పెన్షనబుల్ శాలరీగా తీసుకుంటారు. ఇలా రెండు సర్వీసులకు వేర్వేరుగా గణించి మొత్తాన్ని కలిపి పెన్షన్ నిర్ణయిస్తారు. 1995కు ముందు ఏదైనా సర్వీసు ఉంటే ఆ లబ్ధి అదనం. గరిష్ఠ వేతన పరిమితికి లోబడి చందా చెల్లించే సభ్యులకు ఇది సమర్థనీయం. కానీ ఉద్యోగంలో చేరినప్పటి నుంచి వాస్తవ వేతనం లేదా పూర్తివేతనం మీద చందా చెల్లించి, ప్రస్తుతం సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి అధిక వేతనం మీద చందా చెల్లించేవారికి కూడా ఈ దామాషా పద్ధతిలో పెన్షన్ లెక్కించడం విమర్శలకు దారితీసింది. ఇటీవల పంజాబ్ చండీగఢ్ హైకోర్టు ఈ పద్ధతి వీరికి వర్తించదని తీర్పునిచ్చింది. పింఛన్ పథకంపై వచ్చే కేసులన్నింటినీ సుప్రీంకోర్టుకు తీసుకెళ్లే ఉద్దేశంలో ఈపీఎఫ్ సంస్థ ఉండటం వల్ల పూర్తి నిర్ణయం వెలువడలేదు.

సామాజిక భద్రతా లక్ష్యం

ఇప్పటికే చాలా రాష్ట్ర ప్రభుత్వాల్లో కనీస వేతనం రూ.15వేలు దాటి పోయింది. కేంద్ర ప్రభుత్వ కనీస వేతనం కూడా రూ.18వేలుగా ఉంది. సామాజిక భద్రతా పథకాల వేతన పరిమితి పెంపులో దీర్ఘకాల అంతరాల వల్ల అర్హులైన కార్మికులు, ఉద్యోగులు క్రమంగా దూరమైతే పథకాల స్ఫూర్తి నీరుగారిపోతుంది. అలాకాకుండా నిర్ణీత శాతం మేరకు వార్షిక పెరుగుదల ఉండేలా చట్టం చేస్తే ఇలాంటి సమస్యలను అధిగమించవచ్చు. అంతేకాకుండా, వేతన పరిమితి వరకు అందరూ తప్పనిసరిగా చందా చెల్లించాల్సిన విధంగా నిబంధనలను రూపొందిస్తేనే సార్వజనీన సామాజిక భద్రతా లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉంటుంది.



జె.శ్రీనివాస్

విశ్రాంత రీజినల్ పీఎఫ్ కమిషనర్–II

ఎంతసేపూ వాళ్లకు అది ఉంది, వీళ్లకు ఇది ఉంది... అని పోల్చుకోవడమేనా, మీకున్నవి ఏంటో గుర్తించే ఆలోచన చేస్తున్నారా? ఈరోజుల్లో ఇతరులను పట్టించుకున్నంతగా చాలామంది తమను తాము పట్టించుకోవడం లేదు. అందరూ ఇంజినీరింగ్ చదువుతున్నారు కాబట్టి మనమూ చదవాలి, అందరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు కాబట్టి మనమూ అదే చేయాలి, అందరూ ఇల్లు కొనుక్కుంటే మనమూ కొనుక్కోవాలి, కారు తీసుకుంటే మనమూ తీసుకోవాలి... ఇదే ధోరణి తప్ప నాకేం కావాలి, నా అవసరాలేంటి



మిమ్మల్ని మీరు ప్రేమిస్తున్నారా?

అని ఆలోచిస్తున్నవారే తక్కువ. ఇతరులతో పోల్చుకుంటూ ఉంటే పోటీ పడాల్సి వస్తుంది. అది ఒత్తిడి, ఆందోళనలను పెంచుతుంది. అదే మనకేం కావాలో నిర్ణయించుకుని దానికే పరిమితమైతే ప్రశాంతతా, ఆరోగ్యమూ మన సొంతమవుతాయి. అందుకు దోహదం చేసేదే 'సెల్ఫ్ లవ్'. ప్రపంచంలో ప్రతి వ్యక్తీ ప్రత్యేకమే. ఏ ఒక్కరూ మరొకరిలా ఉండరు. అటువంటప్పుడు పోలిక ఎందుకు?

ఆలోచనల్ని చుట్టూ ఉన్నవారి మీదినుంచి ముందు మన మీదికి మరల్చుకోవాలి. భౌతికంగా, మానసికంగా మన బలాలూ బలహీనతలూ ఏంటో తెలుసుకోవాలి. బలాల గురించి ఎవరికి వారు అభినందించుకోవాలి. బలహీనతలను కూడా బలాలుగా మార్చుకోవడం మీద దృష్టిపెట్టాలి. అందుకుగాను ముందు మనల్ని మనం ప్రేమించుకోవాలి, ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి. రోజూ కాసేపు మనకోసం కొంత సమయాన్ని కేటాయించుకుని నచ్చిన పని చేయాలి. ఎవరితోనూ పొంతన పెట్టుకోకుండా మనకంటూ కొన్ని మంచి అలవాట్లను చేసుకోవాలి. స్వీయ శక్తిసామర్థ్యాల మీద నమ్మకం ఉంచడం, మనసును మభ్యపెట్టుకోకుండా నిజాయతీగా ఉండటం, తమను తాము గౌరవించుకోవడం... ఇవన్నీ వ్యక్తుల్లో సెల్ఫ్ లవ్‌ను పెంచుతాయి.

సెల్ఫ్ లవ్ అంటే స్వార్థం కాదు. మన విలువను మనం తెలుసుకోవడం. చాలామంది తమను తాము నిత్యం విమర్శించుకుంటూ ఉంటారు. లేదా సమర్థించుకుంటారు. రెండూ తప్పే. విమర్శించుకోవడం వల్ల తమలోని మంచిని గుర్తించలేరు. సమర్థించుకునేవారు మరింత మెరుగుపర్చుకునే ప్రయత్నం చేయరు. పొరపాటు చేస్తే క్షమించుకుని, మరోసారి అలా చేయకుండా ఉండటం, మంచి పని చేసినప్పుడు అభినందించుకోవడం, ఓడిపోయినప్పుడు ధైర్యం చెప్పుకోవడం... ఇవన్నీ మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. అప్పుడు ఇతరుల మీద, వారి అభిప్రాయాల మీద ఆధారపడటం తగ్గుతుంది. తనను తాను ప్రేమించే మనిషి... ఇతరులను ప్రేమిస్తాడు, బంధాలను గౌరవిస్తాడు. ఈ సెల్ఫ్‌కేర్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి ప్రాచుర్యం కల్పించింది అమెరికాకు చెందిన డొరోతీ ఓరెం అనే నర్సు. తన వృత్తిలో అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రొఫెసర్‌గా, డీన్‌గా కీలక పదవులు నిర్వహించిన డొరోతీ పలు విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు పొందారు. 'ఆరోగ్యంగా, ఆనందంగా జీవితం గడపడానికి వ్యక్తులు తమ పట్ల తాము చూపే శ్రద్ధే సెల్ఫ్‌కేర్. ఎవరికి వారు దాన్ని సాధన చేస్తే సమాజం నేడు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను నివారించవచ్చు' అంటారామె.

– నరవ నవీన్

సాఫ్ట్‌వేర్ ఎగుమతులకు దన్నుగా...

సాఫ్ట్‌వేర్, ఐటీ సేవల ఎగుమతిని ప్రోత్సహించేందుకు కేంద్రం సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కుల (ఎస్‌టీపీల) పథకం తెచ్చింది. 2023-24లో 6.36 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్న ఎస్‌టీపీ యూనిట్ల ఎగుమతులు, 2025-26లో రూ.7.73 లక్షల కోట్లకు చేరాయి. 2025-26 నాటికి ఆయా రాష్ట్రాల్లో నమోదైన ఎస్‌టీపీ యూనిట్లు...

కర్ణాటక	391
తమిళనాడు	391
మహారాష్ట్ర	367
తెలంగాణ	280
ఒడిశా	132
ఉత్తర్ ప్రదేశ్	107
హరియాణా	87
కేరళ	69
పశ్చిమబెంగాల్	68
పంజాబ్	39
గుజరాత్	37
ఆంధ్రప్రదేశ్	31
మధ్యప్రదేశ్	24
రాజస్థాన్	23

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

బాకీల వసూలు ఇక సులభతరం

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి చట్టం-2006 ఎంఎస్‌ఎంఈల పురోగతికీ, తద్వారా దేశ ఆర్థిక ప్రగతికీ దోహదం చేసే ఎన్నో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సాధారణంగా వివాదాల పరిష్కారానికి, సివిల్ కోర్టులు, కమర్షియల్ కోర్టులను ఆశ్రయించాల్సి ఉంటుంది. కానీ, ఈ చట్టంలోని సెక్షన్20, వివాదాల పరిష్కారానికి కోర్టుల్లో పట్టే సమయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఒక ప్రత్యేక వ్యవస్థగా 'ఫెసిలిటేషన్ కౌన్సిల్'ను ఏర్పాటు చేసింది. కొనుగోలుదారులు చెల్లింపులు చేయకపోయినా, చెల్లింపుల్లో వివాదాలు తలెత్తినా బాగా సమయం పట్టే సివిల్ కోర్ట్ ప్రక్రియ కాకుండా, ఫెసిలిటేషన్ కౌన్సిల్‌లో వ్యాజ్యం దాఖలు చేయవచ్చు. ఒకవేళ మధ్యవర్తిత్వం ద్వారా వివాదం పరిష్కారం కాకపోతే, వ్యాజ్యాలను 90 రోజుల్లో పరిష్కరించాలని ఈ చట్టం నిర్దేశిస్తోంది. అయినా, దేశవ్యాప్తంగా తొంభై వేలకుపైగా వివాదాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 21 వేల కోట్ల రూపాయలు చిక్కుకోవడంతో చెల్లింపుల కోసం ఎంఎస్‌ఎంఈలు ఎదురుచూస్తున్నాయి. బకాయిల్లో దాదాపు 40 శాతానికిపైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వరంగ సంస్థల నుంచే రావాల్సి ఉంది.



సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్‌ఎంఈ) బకాయిలే భారంగా మారుతున్నాయి. పెట్టుబడులు, ఆదాయాలు అంతగా లేని ఈ పరిశ్రమల ఉనికికే ప్రమాదకరంగా మారిన బకాయిల భారాన్ని తగ్గించడానికి ప్రయత్నాలు జరిగినా ఫలితం ఉండటం లేదు. 'ఫెసిలిటేషన్ కౌన్సిల్' పేరిట ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటైనా ప్రయోజనం కొరవడింది. ఈ క్రమంలో ఎంఎస్‌ఎంఈలకు సంబంధించిన వివాదాల పరిష్కార ప్రక్రియ మరింత వేగంగా పూర్తయ్యేందుకు, సంబంధిత చట్టానికి ప్రభుత్వం ఇటీవల ముఖ్యమైన సవరణలు చేసింది.

మధ్యవర్తిత్వం ద్వారా ప్రయత్నం

దేశవ్యాప్తంగా 161 ఫెసిలిటేషన్ కౌన్సిళ్ల ఏర్పాటు జరిగింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు వీటిని ఏర్పరిచాయి. తెలంగాణలో ఆరు జిల్లా కేంద్రాల్లో (కరీంనగర్, రంగారెడ్డి, సంగారెడ్డి, హనుమకొండ, యాదాద్రి-భువనగిరి, మేడ్చల్-మల్కాజిగిరి), ఆంధ్రప్రదేశ్‌లో అయిదు (విశాఖపట్నం, విజయవాడ, కర్నూలు, తిరుపతి, మంగళగిరి) చోట్ల కౌన్సిళ్లు ఏర్పాటయ్యాయి. 'ఫెసిలిటేషన్ కౌన్సిల్'లో ముగ్గురికి తగ్గకుండా, అయిదుగురికి మించకుండా సభ్యులుంటారు. ఎంఎస్‌ఎంఈ శాఖను నిర్వహించే డైరెక్టర్ దీనికి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ఈ పరిశ్రమలకు రుణాలిచ్చే బ్యాంకుల నుంచి, న్యాయ, అకౌంటింగ్, ఆర్థిక రంగాల నిష్ణాతులు, పరిశ్రమల సంఘాల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. తాజా చట్ట సవరణతో ఛైర్‌పర్సన్ కాకుండా పరిశ్రమల సంఘాల ప్రతినిధులు, న్యాయనిపుణులను మాత్రమే నియమించవచ్చు. సెక్షన్-15 ప్రకారం, వస్తు కొనుగోలుదారులు, వినియోగదారులు ఎంఎస్‌ఎంఈలకు 45 రోజుల్లో చెల్లింపులు చేయాలి. లేకపోతే, బ్యాంకువడ్డీ శాతంగా రిజర్వ్ బ్యాంక్ నోటిఫై చేసిన రేటుకు మూడింతల చక్రవడ్డీతోపాటు చెల్లించాలి. వివాదాలుంటే, సెక్షన్-18 ప్రకారం ఎంఎస్‌ఎంఈలు 'ఫెసిలిటేషన్ కౌన్సిల్'లో పిటిషన్ దాఖలు చేయవచ్చు. మధ్యతరహా పరిశ్రమలు మాత్రం సివిల్, కమర్షియల్ కోర్టులను ఆశ్రయించాల్సిందే. పిటిషన్ దాఖలు చేసిన తర్వాత, ఫెసిలిటేషన్ కౌన్సిల్ మొదటగా వివాదాన్ని మధ్యవర్తిత్వ చట్టం-2023 ప్రకారం సామరస్య పరిష్కారానికి ప్రయత్నిస్తుంది. తాజా సవరణ ద్వారా మధ్యవర్తిత్వంతో సామరస్య పరిష్కారానికి ప్రభుత్వం 90 రోజుల గడువును నిర్దేశించింది. సామరస్య పరిష్కారం కుదరని సందర్భాల్లో, ఆర్బిట్రేషన్ కన్సిలియేషన్ చట్టం-1996 ప్రకారం వివాదాన్ని పరిష్కరిస్తారు. తీర్పుపై అప్పీల్ చేయడానికి కొనుగోలుదారులు అవార్డులో 75శాతం సొమ్మును జమచేయాల్సి ఉంటుంది.

కౌన్సిళ్లతో పరిష్కారం వేగవంతం

న్యాయసూత్రాల ప్రకారం, అవతలి పక్షం ఉన్న చోటే వ్యాజ్యాన్ని దాఖలు చేయాలి. ఆ పద్ధతిలో కోర్టు ఖర్చులు పెరిగిపోతాయి. అందుకని, ఎంఎస్‌ఎంఈలకు మినహాయింపునిచ్చారు. కొనుగోలుదారులు దేశంలో ఎక్కడున్నా, పరిశ్రమలు తమ కార్యాలయ పరిధిలో ఉన్న 'ఫెసిలిటేషన్ కౌన్సిల్'లోనే వ్యాజ్యం దాఖలు చేసుకునే వెలుసుబాటు కల్పించారు. ఫలితంగా బాకీల వసూలు ప్రక్రియ సులభతరమవుతుంది. మధ్యవర్తిత్వంతో సామరస్య పరిష్కారానికి గడువు పెంచిన నేపథ్యంలో, ఆన్‌లైన్‌లో తగిన వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థలు ట్రేడ్ రిసీవబుల్ డిస్కౌంటింగ్ పద్ధతి ద్వారా ఎలక్ట్రానిక్ చెల్లింపులను వెంటనే చేయాల్సి ఉంటుందనీ చట్ట సవరణలో పేర్కొన్నారు. తాజా పరిణామాలతో వివాదాలు త్వరగా పరిష్కారమై ఎంఎస్‌ఎంఈలు బలోపేతం అవుతాయనడంలో సందేహం లేదు. అయితే, మరిన్ని కౌన్సిళ్లను ఏర్పాటు చేసి, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. అప్పుడే ఎంఎస్‌ఎంఈలు వేగంగా పురోగతి సాధిస్తాయి.

– హరీశ్ కొలిచాల

న్యాయ నిపుణులు

ధైర్యం చెప్పొచ్చు...

స్కూల్ నుంచి వచ్చాక వీధిలోని పిల్లలంతా కలిసి ఆడుకుంటున్నారు. కానీ లోహిత్ మాత్రం ముభావంగా కూర్చున్నాడు. అది ఎవరూ పట్టించుకోవట్లేదు. అంతా ఆటలో మునిగిపోయారు. మర్నాడు ఉదయాన్నే స్కూల్ బస్ ఎక్కడానికి పిల్లలంతా నిలబడ్డారు. కానీ లోహిత్ రాలేదు. తను ఎందుకు రావట్లేదని డ్రైవర్ అడిగితే, తెలియదని చెప్పారు. ఎప్పటిలాగే ఆరోజూ స్కూల్ నుంచి వచ్చాక ఆడుకోవడానికి వెళ్లారు పిల్లలు. అక్కడే సెక్యూరిటీ గార్డు రామయ్య కూర్చుని, వాళ్లని అలాగే చూస్తున్నాడు. ఆయన్ని గమనించిన పిల్లలు దగ్గరికి వెళ్లి.. 'ఏంటి తాతయ్యా.. అలా చూస్తున్నావు?' అని అడిగారు. 'మరేం లేదు.. నిన్న మీలో ఎంతమంది తప్పు చేశారని లెక్కిస్తున్నాను' అన్నాడు రామయ్య. 'మేమేం చేశాం తాతయ్యా!' ఆశ్చర్యంగా అడిగారు పిల్లలు. 'నిన్న మీలో ఒక



అబ్బాయి బాధగా కూర్చున్నాడు. అయినా కూడా పట్టించుకోకుండా మీ ఆటలో మీరు మునిగిపోయారు. కనీసం పలకరించలేదు కూడా! అది తప్పే కదా' అన్నాడు రామయ్య. వెంటనే వరుణ్.. 'అవును నిన్న లోహిత్ ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా కూర్చున్నాడు. వాళ్ల నాన్నగారికి జ్వరం వచ్చిందట. ఇందాకే మా అమ్మ చెప్పింది' అన్నాడు. 'అయినా వాళ్ల నాన్నగారికి బాలేకపోతే మేం ఏం చేస్తాం తాతయ్యా!' అడిగాడో పిల్లాడు. 'ఇప్పుడు మీరు చిన్న పిల్లలు కాబట్టి డబ్బు సాయం చేయలేకపోవచ్చు. కానీ పక్కనే ఉండి మీ స్నేహితుడికి ధైర్యం చెప్పొచ్చు. బాధలో ఉన్న వాళ్లని మన మాటలతో బయటికి తీసుకురావచ్చు. దానివల్ల వాళ్లు కొంచెమైనా బాధను మర్చిపోతారు. ఎప్పుడూ మనతోనే ఉండే స్నేహితులు బాధలో ఉంటే అలా వదిలేయకూడదు.. అర్థమైందా పిల్లలూ!' అన్నాడు రామయ్య. 'అర్థమైంది తాతయ్యా! ఇక నుంచి ఎప్పుడూ అలా చేయం. ఇప్పుడే లోహిత్‌తో మాట్లాడతాం' అంటూ పరుగున వెళ్లారు పిల్లలు.

హాయ్! బుజ్జీ!!

– సింగంపల్లి శేష సాయికుమార్

ఆ ఒక్కటి ఏది?

కింద ఇచ్చిన వాటిలో వరసకు ఒక పదం మాత్రం భిన్నంగా ఉంటుంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి చూద్దాం.

1. న్యాయమూర్తి, ముఖ్యమంత్రి, న్యాయవాది, కోర్టు
2. సంక్రాంతి, దీపావళి, గణతంత్ర దినోత్సవం, దసరా
3. తేలు, ఈగ, దోమ, చీమ

జవాబులు: 1. ముఖ్యమంత్రి 2. గణతంత్ర దినోత్సవం 3. తేలు



కీసరలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, కుటుంబ సభ్యులు



సికింద్రాబాద్‌లోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ ప్రియాంక

నీట్ పీజీ ప్రశాంతం

ఈనాడు, హైదరాబాద్: ఆదివారం నీట్ పీజీ ప్రశాంతంగా ముగిసింది. హైదరాబాద్ జిల్లాలో 97.47 శాతం, రంగారెడ్డి- 97.26శాతం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోనూ 97.25శాతానికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక సికింద్రాబాద్‌లోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. మేడ్చల్ జిల్లాలోని ఉప్పల్, మేడిపల్లి మండలాల్లోని కేంద్రాలను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిగూడలో మద్యం తాగి కేంద్రానికి వచ్చిన విద్యార్థిని అనుమతించలేదు.

తీపి కబురెప్పుడో!

• రేషన్ చక్కెర.. పంపిణీకి దూరం

ఈనాడు, హైదరాబాద్: పౌరసరఫరాల శాఖ బియ్యం మినహా ఇతర నిత్యావసర సరకుల పంపిణీపై ఉదాసీనత చూపుతోంది. గ్రేటర్ పరిధిలో లక్షల మంది కార్డుదారులు చక్కెర పంపిణీకి ఎదురుచూస్తున్నారు. మార్చి నెల నుంచి చక్కెర సహా ఏ ఇతర నిత్యావసర సరకులను రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయడంలేదు. గతంలో పంచదారను సబ్సిడీపై కిలో రూ.13.50కు అందించేవారు. తాజాగా మార్కెట్‌లో ధరలు భారీగా పెరగడంతో కార్డుదారులు రేషన్ చక్కెర కోసం వాకబు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధర నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. పేదలకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నా చక్కెర కోటా విడుదల కావడంలేదని డీలర్లు చెబుతున్నారు. గ్రేటర్ పరిధిలో గతంలో నెలకు 50 టన్నుల చక్కెరను సబ్సిడీ ద్వారా అందజేసేవారు. బియ్యంతో పాటు కొన్ని సందర్భాల్లో పప్పులు, గోధుమలు, చక్కెర వంటి సరకులు అందేవి. నిత్యావసర సరకులను మార్కెట్‌లో కొనాల్సివస్తోంది. ఇటీవల చక్కెర ధర రూ.60 దాటింది.

చెత్త కొండలకు భూసేకరణం

• శివారు ప్రాంతాల్లో వ్యతిరేకిస్తున్న గ్రామస్థులు
• నిండిపోయిన జవహర్ నగర్ డంపింగ్ యార్డు

ఈనాడు, హైదరాబాద్

రాజధాని నగరం రోజురోజుకు విస్తరిస్తోంది. నగర శివారులోని కార్పొరేషన్లు, పురపాలక సంఘాలను విలీనం చేసిన ప్రభుత్వం ట్రై కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన ఈ మూడు కార్పొరేషన్లకు చెత్త నిలువ కేంద్రాల ఏర్పాటు సవాల్‌గా మారింది. చెత్త సేకరణ, రీసైక్లింగ్, వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ సమస్యగా మారింది. నగరం నుంచి వెలువడుతున్న చెత్త కొండల్లా పేరుకుపోతోంది. ప్రస్తుతం జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఒక్కటే ఉంది. ఇక్కడ ఒక వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంటు ఏర్పాటు అయ్యింది. రెండు విద్యుదుత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ఇవి 24 మెగావాట్ల సామర్థ్యంతో పనిచేయాల్సి ఉంది. రోజుకు 1500 టన్నుల చెత్తను మండించడం ద్వారా చెత్త నుంచి ఇంధనం (విద్యుత్తు) వస్తుంది. దుండిగల్ ప్రాంతంలో 15 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంటు ఉంది. ఇక్కడ 500 టన్నుల వరకు మండిస్తారు. ఇది మినహా నగరంలో ఎలాంటి నిలువ కేంద్రాలు లేవు.

మహా నగర విస్తీర్ణం
2000 చదరపు కిలోమీటర్లు
ప్రస్తుత జనాభా
1.23కోట్లు
రోజూ వెలువడుతున్న చెత్త
9,500టన్నులు
డంపింగ్ యార్డు
జవహర్‌నగర్ విస్తీర్ణం 390ఎకరాలు
ప్రతిపాదిత ప్రాంతాలు
పారానగర్ (సంగారెడ్డి జిల్లా), విస్తీర్ణం: 150ఎకరాలు
లక్దారం (సంగారెడ్డి జిల్లా) 150 ఎకరాలు
సిద్ధాపూర్ (కొత్తూరు సమీపంలో) 86 ఎకరాలు



జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో చెత్తకొండ

దశాబ్దాలుగా ఒక్కటే..

నగరంలో గతంలో రెండు ప్రాంతాలు గంధంగూడ, సరూర్‌నగర్‌లలో డంపింగ్ యార్డులు ఉండేవి. ఇవి పూర్తిగా నిండిపోవడంతో 2004లో జవహర్‌నగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. 390 ఎకరాల్లో చేసిన ఈప్రాంతం రెండు దశాబ్దాల్లోనే పూర్తిగా నిండిపోయింది. మొత్తం గుట్టలుగా తయారైంది. ఇక్కడ ఎప్పటికప్పుడు గుట్టలను క్యాపింగ్ చేస్తూ.. మొక్కలు పెంచాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో క్యాపింగ్ చేశారు. ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో నగర చెత్తను నిలువ చేయడంతో ఈ ప్రాంతంలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కలిన జలం, ఘాటైన వాసనలతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యార్డులో దాదాపు 1.50 లక్షల టన్నులు పేరుకుపోయింది. చెత్త నుంచి దుర్గంధం వెదజల్లుతోంది.

అక్కడ వ్యతిరేకత ఎందుకంటే..

• సిద్ధాపూర్ పరిసరాల్లో ఇప్పటికే కోళ్లఫారాలు ఉన్నాయి. వీటి వ్యర్థాలతో ఈగలు ముసురుతున్నాయని తండావాసులు ఆందోళన చెందుతున్నారు. అక్కడ పోరాట కమిటీ ఏర్పాటై డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఇక్కడ ఒక విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు కావాల్సి ఉంది.

• పారానగర్‌లోనూ భూకేటాయింపులు పూర్తయినా నిర్మాణ పనులను అడ్డుకున్నారు. అక్కడ ఇదే పరిస్థితి నెలకొంది. లక్దారంలోనూ నిరసన వ్యక్తమవుతోంది. • ప్రధానంగా భూముల విలువలు తగ్గిపోయి.. స్థిరాస్తి పడిపోతుందనే కారణం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఎవరైనా చెత్తను తమ ఇంట్లో పోసుకుంటారా.. అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నేటితో ముగియనున్న ఇందిరమ్మ ఇండ్ల లాటరీ

మూడో రోజు కొనసాగిన డ్రా ప్రక్రియ

ఈనాడు, హైదరాబాద్: క్యూర్ పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సోమవారంతో ముగియనుంది. వరుసగా మూడో రోజు కొనసాగిన లాటరీలో ఆదివారం నాలుగు నియోజకవర్గాలకు లబ్ధిదారులను డ్రా ద్వారా ఎంపిక చేశారు. శేరిలింగంపల్లి, మేడ్చల్, మలక్‌పేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో తొలి దశలో నిర్మించనున్న 1,920 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. క్యూర్ పరిధిలో పైలట్ ప్రాజెక్టు కింద 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నట్లు ప్రకటించి దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఇందులో 12 నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక ఇప్పటికే పూర్తయ్యింది.

లాటరీ నిర్వహించే నియోజకవర్గం- వేదికలు

• సనత్‌నగర్- హెవన్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్
• మహేశ్వరం- బడంగ్‌పేట ప్రజాభవన్
• మల్కాజిగిరి- అల్వాల్ వీబీఆర్ గార్డెన్స్
• కార్వాన్- కుల్సుంపుర ప్రాజెక్టు



మహా నగరన్

దేశంలోనే రెండో అతిపెద్దదైన ఎన్ఎండీసీ మారథాన్ నగరంలో ఆదివారం సందడిగా జరిగింది. ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్, 10కే, 5కే విభాగాల్లో సుమారు 32 వేల మంది పాల్గొన్నారు.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

7లో



ఇక చిటికెలో మూసీ దాటొచ్చు

అంబర్‌పేట-మూసారాంబాగ్ పైవంతెన రెడీ


పైవంతెన
నిర్మాణ వ్యయం రూ.52 కోట్లు
పొడవు 400 మీటర్లు
వెడల్పు 14.5 మీటర్లు
ఎత్తు 480 మీటర్లు (సముద్ర మట్టానికి)
పిల్లర్లు 6
స్లాబులు 5

న్యూస్‌టుడే, అంబర్‌పేట

నగరవాసులు చాలాకాలంగా ఎదురుచూస్తున్న అంబర్‌పేట-మూసారాంబాగ్ మూసీనది పై వంతెనను సోమవారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం అంబర్‌పేట మున్సిపల్(ఎంసీహెచ్) మైదానంలో సీఎం బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనేక అడ్డంకులను అధిగమించి ఎట్టకేలకు పనులు పూర్తి చేశారు. ఇది అందుబాటులోకి వస్తే చాదర్‌ఘాట్ వంతెనపై ట్రాఫిక్ భారం తగ్గి ఆ మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయి.

మూడేళ్ల సమయం


మూసీకి ఇరువైపులా ఇటు అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా, అటు మూసారాంబాగ్ వైపు బ్రిడ్జి నిర్మాణానికి వీలుగా కట్టడాలను తొలగించి రహదారిని విస్తరించాల్సి వచ్చింది. విస్తరణకు ప్రజలు ముందుకు రాకపోవడం, పరిహారం చెల్లింపు తదితర అంశాల కారణంగా పనుల్లో జాప్యం కారణంగా మూడేళ్ల సమయం పట్టింది.



గుట్టుగా.. గమ్మత్తుగా

“వారంరోజుల క్రితం జగద్గిరిగుట్ట పరిధిలో విద్యార్థులు, యువత లక్ష్యంగా గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ముఠాను పట్టుకున్నారు.”

“తాజాగా శామీర్‌పేట ఠాణా పరిధిలో ఏకంగా 24 కిలోల బరువున్న 5,298 గంజాయి చాక్లెట్లను పోలీసులు స్వాధీనంచేసుకున్నారు.”



• పాన్‌షాపుల్లో గంజాయి చాక్లెట్ల విక్రయం
• ఆకర్షితులవుతున్న విద్యార్థులు, యువత

ఈనాడు, హైదరాబాద్

రాజధానిలో కొన్నేళ్లుగా డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగం పెరుగుతోంది. పోలీసుల నిఘాతో స్మగ్లర్లు కొత్త మార్గాల్లో విక్రయిస్తున్నారు. తనిఖీల భయంతో మత్తు పదార్థాలను నేరుగా కాకుండా గంజాయిని చాక్లెట్ రూపంలోకి మార్చి ఆకర్షణీయ ప్యాకింగ్‌తో అమ్ముతున్నారు. ఈ కొత్త తరహా మత్తు పదార్థానికి యువత, విద్యార్థులు త్వరగా ఆకర్షితులవుతున్నారు. కొన్నిరోజులుగా గంజాయి చాక్లెట్లు వరుసగా పట్టుబడుతుండడమే అందుకు నిదర్శనం.

పాన్‌షాపులు కేంద్రంగా..

మత్తు పదార్థాల వినియోగం పెరుగుతుండడంతో తెలంగాణ ఈగల్, ఎస్‌వోటీ, హెచ్‌న్యూ, టాస్క్‌ఫోర్స్ విభాగాలు నిఘా పెంచాయి. వరుస తనిఖీలతో నిందితుల్ని అరెస్టు చేస్తున్నాయి. దీంతో స్మగ్లర్లు తనిఖీలకు చిక్కకుండా గంజాయి చాక్లెట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. శివారుప్రాంతాలు, ఇతర రాష్ట్రాల ప్రజలు, వలస కూలీలు అధికంగా ఉండే ప్రాంతాల్లోని పాన్‌షాపులు, టీస్టాల్స్ కేంద్రంగా విక్రయిస్తున్నారు. చాక్లెట్ల రూపంలో ఉండడం, తేలిగ్గా తీసుకోవడానికి వీలుగా ఉండడంతో యువత, విద్యార్థులు వినియోగదారులుగా మారుతున్నారు. ప్యాకింగ్ చిరుతిళ్ల తరహాలో ఉండడంతో తేలిగ్గా గుర్తించలేరు. పరిచయస్థులు, రోజువారీ వినియోగదారులకే విక్రయిస్తుండడంతో పట్టుకోవడం సంక్లిష్టంగా మారుతోంది. కొంతకాలం కిందట షాద్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల సమీపంలోని పాన్‌డబ్బాలో గంజాయి చాక్లెట్ల విక్రయం కలకలం రేపింది. బడి పక్కనే ఉండడంతో చిన్నారులు చాక్లెట్లు తిని తరగతికి హాజరయ్యారు. విద్యార్థులు మత్తుగా కనిపించడంతో ఉపాధ్యాయులు గుర్తించారు. నిందితుడు కొన్నినెలలుగా పిల్లలకు విక్రయించినా ఎవరూ కనిపెట్టలేకపోయారు.

అదో పెద్ద పరిశ్రమ

ఇతర రాష్ట్రాల వలస కూలీలు ఏజెంట్లుగా.. గంజాయి చాక్లెట్ల రవాణా, విక్రయం గుట్టుగా జరుగుతోంది. ముఖ్యంగా బిహార్, యూపీ, ఝార్ఖండ్ నుంచి ఎక్కువగా వస్తున్నట్లు దర్యాప్తులో బయటపడుతోంది. అక్కడ మారుమూల ప్రాంతాల్లోని మూతపడ్డ పరిశ్రమలు, ఇళ్లే కేంద్రంగా వీటిని తయారుచేస్తున్నారు. గంజాయిని పిప్పిగా మార్చి ద్రవరూపంలోని చాక్లెట్‌తో కలుపుతున్నారు. అవి గట్టి పడ్డాక చాక్లెట్ తరహాలో ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేస్తున్నారు. చాక్లెట్ తీసుకున్నాక జీర్ణం అయ్యేందుకు 2-3గంటల సమయం పడుతుంది.

చైతన్య పథం.. మహమ్మారి అంతం

ఎంఎన్‌జేకు త్వరలో మరో మొబైల్ ల్యాబ్

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి అయిన ఎంఎన్‌జే ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో మరింత పకడ్బందీగా పరీక్షల కార్యక్రమం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అదనంగా మరో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం అందుబాటులోకి రానుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఓ సంస్థ ఈ వాహనాన్ని సమకూర్చేందుకు ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఒక మొబైల్ వాహనం ఉన్నప్పటికీ ఎటూ సరిపోవడం లేదు. రెండు వాహనాలతో ఒకటి సుదూర ప్రాంతాలకు మరొకటి నగరం చుట్టూ ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మహిళల్లో ఏటా రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి క్యాన్సర్లు పెరుగుతున్నాయి.








రాయి పగిలింది.. శ్రమ మెరిసింది

గండిపేట - శంకర్‌పల్లి ప్రధాన మార్గంలో కోకాపేట నియోపొలిస్ వెళ్లే రోడ్డు మలుపు వద్ద భారీ రాళ్లను పగులగొడుతూ.. ఎత్తుతున్న కార్మికుల శ్రమైక సౌందర్యం ఉట్టిపడేలా కళాకృతులు ఏర్పాటు చేశారు. చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. - ఈనాడు, హైదరాబాద్

ఎస్టీపీలపై అధ్యయనానికి దక్షిణ కొరియాకు పయనం

ఈనాడు, హైదరాబాద్: మూసీ ప్రక్షాళన, పునరుజ్జీవంలో భాగంగా అత్యాధునిక మురుగు నీటి శుద్ధి ప్రాజెక్ట్(ఎస్టీపీ)లపై అధ్యయనం చేసేందుకు జలమండలి, మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్) అధికారుల బృందం ఆదివారం దక్షిణ కొరియాకు వెళ్లింది. జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి నేతృత్వంలోని సీనియర్ ఇంజినీర్ల బృందం వారం రోజుల పాటు సియోల్ సహా ఇతర నగరాలను సందర్శించి ఎస్టీపీల పనితీరుపై అధ్యయనం చేయనుంది. మూసీ ప్రక్షాళనలో భాగంగా కొత్తగా చేపట్టే ఎస్టీపీలను భూగర్భంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో వీటిని అధ్యయనం చేయనున్నారు. ఈ బృందంలో ఎంఆర్‌డీసీఎల్ టెక్నికల్ కన్సల్టెంట్ సత్యనారాయణ, ఎస్ఈ విద్యాసాగర్, వాటర్‌బోర్డు సీజీఎం పద్మజ సహా ఇతర ఇంజినీర్లు ఉన్నారు.



ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

నయనమనోహరంగా నృత్య విన్యాసం



రవీంద్రభారతి, న్యూస్‌టుడే: యువనర్తకి **పార్థవి రెడ్డి** రంగప్రవేశం ఆద్యంతం నయనమనోహరంగా సాగింది. ఆదివారం రవీంద్రభారతిలో నిశ్రింకల డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పార్థవి రెడ్డి ప్రదర్శించిన అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈమె నాట్య గురువులు సాయి వెంకట గంగాధర్, లక్ష్మి వెంపడప్పల మార్గదర్శకత్వంలో పదేళ్లుగా కూచిపూడి నృత్య శిక్షణ పొందారు. శ్రీదేవి నృత్యాలయ (చెన్నై) వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ షీలా ఉన్నికృష్ణన్ జ్యోతి వెలిగించి ప్రదర్శనను ప్రారంభించారు. శ్రీవిఘ్న రాజం భజే, రాగమాలిక రాగం, శివస్తుతి, బాలగోపాల తరంగం, దశావతారం వంటి అంశాలను అద్భుతంగా ప్రదర్శించి మెప్పించింది.

యువకుడి అవయవదానం.. ముగ్గురికి పునర్జన్మ



కన్నెబోయిన ప్రవీణ్

నిమ్స్, న్యూస్‌టుడే: జీవన్మృతుడైన ఓ యువకుడి అవయవదానం.. ముగ్గురికి పునర్జన్మనిచ్చేలా చేసింది. జనగాం జిల్లా గానుగుపహాడ్‌కు చెందిన కన్నెబోయిన ప్రవీణ్ (24) ఆర్ఎంపీ వైద్యుడు. ఈ నెల 27న తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అడవిపంది అడ్డు వచ్చి అదుపుతప్పి కిందపడిపోయారు. తీవ్రంగా గాయాలవడంతో కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు బ్రెయిన్‌డెడ్ అయినట్లు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఓటీటీఓ (రాష్ట్ర అవయవ, కణజాల మార్పిడి సంస్థ-జీవన్‌దాన్) వైద్య బృందం ఆయన తండ్రి అంజయ్య, కుటుంబీకులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. వారు అంగీకరించడంతో రెండు కిడ్నీలు, కాలేయం సేకరించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు శస్త్రచికిత్స ద్వారా అమర్చినట్లు నోడల్ అధికారి శ్రీభూషణ్‌రాజు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
యూసుఫ్‌గూడ	80085 73352
బంజారాహిల్స్	80085 73348
పంజాగుట్ట	8008573350
రహ్మత్‌నగర్	80085 73351
షేక్‌పేట	80085 73413

షేక్‌పేట, బంజారాహిల్స్, న్యూస్‌టుడే:

? వినాయకనగర్ కాలనీలోని తాగునీటి పైపులైన్లలో మురుగు చేరుతోంది. నల్లా విప్పితే నీరు రంగు మారి దుర్గంధంతో వస్తోంది. –కిషోర్, వినాయకనగర్

✓ మురుగు నీరు ఎలా చేరుతోందో పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. –వైష్ణవి, మేనేజర్, జలమండలి

? బంజారాహిల్స్ రోడ్డు నం.1లోని అంబేడ్కర్ విగ్రహం ఉన్న ప్రదేశం సమీపంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ కుంగిపోయింది. రాకపోకలు అధికంగా సాగే ఈ దారిలోని సమస్యను పరిష్కరించండి. – వీరాస్వామి

✓ సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – శరత్‌కుమార్‌రెడ్డి, జలమండలి డీజీఎం

? బంజారాహిల్స్‌లో పోలీస్‌స్టేషన్ ఉన్న వీధిలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతంలో చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంది. సమస్యను పరిష్కరించండి.– లక్ష్మీకాంత్, ప్రైవేటు ఉద్యోగి

✓ ఆ ప్రదేశంలో గతంలో సమస్య తలెత్తితే పరిష్కరించాం. సమస్య ఉత్పన్నమైనట్లు మా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – మోహన్‌రావు, జీహెచ్ఎంసీ ఏఈ

సమన్వయ లోపం.. సమస్యలే నిత్యం

షేక్‌పేట, న్యూస్‌టుడే

ప్రభుత్వ విభాగాల సమన్వయ లోపం వల్ల అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. షేక్‌పేట, ఓయూ కాలనీ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మురుగునీటి పైపులైన్లను పరిశీలించకుండానే వాటిని ధ్వంసం చేస్తూ తవ్వకాలు సాగించి రోడ్లు వేస్తున్నారు. ముందే పైపు లైన్లు, మ్యాన్‌హోల్స్ నిర్మించకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి.

● షేక్‌పేట మారుతీనగర్‌లో ఐదు నెలల కిందట సీసీ రోడ్డు నిర్మించారు. సిమెంట్ వేసేటప్పుడు మురుగునీటి మ్యాన్‌హోల్‌లోకి చేరకుండా కనీస జాగ్రత్తలు తీసుకోలేదు. హడావుడిగా రోడ్డుపై వేసి చదును చేశారు. కాంక్రీట్ మ్యాన్‌హోల్స్‌లోకి చేరి గడ్డ కట్టింది. దీంతో మురుగునీరు ముందుకు సాగక రోడ్లపైకి వస్తోంది. ఈ క్రమంలో వీధి నంబర్లు 13, 14లో నిత్యం మురుగు సమస్య తలెత్తుతోంది. రోడ్డు వేయక ముందు అక్కడ అసలు ఈ సమస్యే ఉత్పన్నమయ్యేది కాదు.

● తాజాగా ఓయూ కాలనీలో నెల రోజుల కిందట సీసీ రోడ్డు నిర్మించారు. అక్కడా మురుగునీటి వ్యవస్థ ధ్వంసమైంది. దాని ఫలితంగా మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయి. చేసేది లేక జలమండలి అధికారులు అక్కడ కొత్తగా వేసిన సీసీ రోడ్డును తవ్వి మ్యాన్‌హోల్స్‌ను పునరుద్ధరిస్తున్నారు. ● రాహుల్ కాలనీలో తవ్విన రోడ్డునే తవ్వుతూ వరదనీటి పైపులైన్ నిర్మాణం చేపడుతున్నారు.

● వినోబానగర్‌లో ఓ వీధిలో అవసరం లేకపోయినా అధికారులు మురుగునీటి పైపులైన్ నిర్మించి రోడ్డును ధ్వంసం చేశారు. పునరుద్ధరించినా అస్తవ్యస్త పనులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ అభివృద్ధి పనులు చేపడితేనే ప్రయోజనం ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.



ఓయూ కాలనీలో మ్యాన్‌హోల్ పునరుద్ధరణకు కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డును తవ్వారిలా..

ఇదీ పరిస్థితి.. షేక్‌పేట ఓయూ కాలనీ, మారుతీనగర్, ఆదిత్యానగర్, రాహుల్ కాలనీ, సూర్యానగర్ కాలనీల్లో రోడ్లు, మురుగునీటి మ్యాన్‌హోల్స్ పనులు చేపడుతున్నారు. ముందే మురుగునీటి వ్యవస్థ నెట్ వర్క్, మ్యాన్‌హోల్స్‌ను పరిశీలించి అవి దెబ్బ తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దీనికి జీహెచ్ఎంసీ అధికారులు జలమండలితో సంప్రదించాల్సి ఉండగా అలా జరగడం లేదు.

రేపటి నుంచి గోర్ ధర్మ జాగృతి మహా పాదయాత్ర



కరపత్రం ఆవిష్కరిస్తున్న భౌసింగ్ మహారాజ్ తదితరులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: గోర్ ధర్మ జాగృతి కోసం సెప్టెంబరు 1 నుంచి మహా పాదయాత్ర చేపడుతున్నట్లు సంత్ సేవాలాల్ మహారాజ్ మందిరం నిర్వాహకుడు భౌసింగ్ మహారాజ్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో దానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. పాదయాత్ర వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అజ్మీరా మంగ తాండాలోని సేవాలాల్ మందిరం వద్ద ప్రారంభమై నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల మీదుగా కొనసాగి మహారాష్ట్రలోని పహరాదేవి మందిరం వద్ద ముగుస్తుందన్నారు. దాదాపు 475 కి.మీ. 15 రోజులపాటు యాత్ర కొనసాగనుందని వివరించారు. లంబాడా సమాజం యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ హుస్సేన్ నాయక్, ప్రతినిధులు శ్రీనివాస్, లాలూప్రసాద్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ ఎంపవర్‌మెంట్ ఫెస్ట్‌ను విజయవంతం చేయండి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మహిమ, శంకర్, విజయానంద్, అర్జున్, విక్రమ్ సాగర్, రాజా, రమణ

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: యువతలో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు పసాలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 18న భువనగిరి జిల్లా మోత్కూర్‌లో ఉచిత 'యూత్ ఎంపవర్‌మెంట్ ఫెస్ట్' నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విక్రమ్ సాగర్ పసాలా, సహ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అర్జున్ మదాసు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో వారు కార్యక్రమం గోడపత్రికను ఆవిష్కరించారు. ఫెస్ట్‌లో విద్యార్థులు, యువత, విద్యావేత్తలు, నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ ప్రతినిధులను ఒకే వేదిక పైకి తీసుకొచ్చి విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత, నాయకత్వం, వ్యక్తిగత అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఫౌండేషన్ పిల్లలు, యువత, మహిళలు, రైతులు, వృద్ధులకు విద్య, సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, సామాజిక అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఫెస్ట్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఫౌండేషన్ సీఈవో గోకుల్ రమణ, ప్రోగ్రామ్ డైరెక్టర్ రాజా, రీజినల్ కోఆర్డినేటర్ పసాలా విజయానంద్, ప్రతినిధులు శంకర్, జి. మహిమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఇందిరమ్మ క్యాంటీన్



ఫుట్‌పాత్‌పై భోజనాల వడ్డన



క్యాబిన్ లోపల పందికొక్కులు తవ్విన మట్టి

నారాయణగూడ క్రైస్తవ సిమెట్రి ఫుట్‌పాత్‌పై ఉన్న ఇందిరమ్మ క్యాంటీన్ క్యాబిన్ శిథిలావస్థకు చేరుకుంది. రోజూ 250 మంది వరకు ఇక్కడ రూ.5ల భోజనం తింటారు. క్యాబిన్‌లో పందికొక్కులు చేరి మట్టిని తవ్వేసి అధ్వానంగా మార్చేశాయి. రోజూ ఉదయం వచ్చే సిబ్బంది మట్టిని బయట ఎత్తిపోస్తున్నా పరిస్థితిలో మార్పు ఉండటం లేదు. తెల్లవారి వచ్చేసరికి మళ్లీ మట్టి ఉంటోంది. ఇప్పటివరకు చిన్నపాటి ట్రాలీ కంటే ఎక్కువ మట్టే అక్కడి నుంచి తొలగించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అడుగు భాగమంతా దెబ్బతినటంతో క్యాబిన్ ఒకవైపు కుంగిపోయింది. లోపల భరించలేని దుర్వాసన కూడా వస్తోంది. అనారోగ్యకర వాతావరణంలో భోజనాలు వడ్డిస్తే ఎవరైనా తింటారా? అందుకే సిబ్బంది ఫుట్‌పాత్ పైనే భోజనాలు వడ్డిస్తున్నారు. అసలే వర్షాకాలం, ఎప్పుడు జల్లులు కురుస్తున్నాయో.. ఎప్పుడు ఎండ వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. సిబ్బంది చెట్టు కొమ్మల నీడలో నిలబడి భోజనం వడ్డించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ఏడాదిగా చెబుతున్నా క్యాబిన్‌ను మార్చటం లేదు. మూడు వారాలుగా రోడ్డుపైనే భోజనాల వడ్డన కొనసాగుతోంది. అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించాలని అక్కడికి భోజనం చేసేందుకు వస్తున్నవారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హిమాయత్‌నగర్

విగ్రహాల తరలింపునకు ఇబ్బందుల్లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జేటీసీ వెంకటరమణ

సోమాజిగూడ: ఉత్సవ విగ్రహాల తరలింపు విషయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తామని జేటీసీ వెంకటరమణ అన్నారు. గణేశ్ ఉత్సవాల విజయవంతానికి ఆదివారం ఆయన ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉత్సవ విగ్రహాల తరలింపునకు సంబంధించి వాహనాల కేటాయింపుపై చర్చించారు. సమావేశంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ సెక్రటరీ జనరల్ డా.ఆర్.శశిధర్ పాల్గొన్నారు.

కె.రాజిరెడ్డి మృతి జలమండలి కార్మికులకు తీరని లోటు

ఖైరతాబాద్ : జలమండలి సీనియర్ కార్మిక నేత కె.రాజిరెడ్డి మృతి కార్మికులకు తీరని లోటని జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం రాజిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయం వద్ద పూలమాల ఉంచి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. దీర్ఘకాలంగా జలమండలి ఉద్యోగులు, కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం రాజిరెడ్డి అలుపెరగని కృషి చేశారని పేర్కొన్నారు.

సాంస్కృతిక శాఖకు నిధుల కేటాయింపు పెంచాలి



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కోలేటి దామోదర్ గుప్తా, లలిత, కృష్ణారావు, బి.సత్యప్రసాద్ తదితరులు

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ఏ ప్రభుత్వంలో అయినా సాంస్కృతిక శాఖ నామమాత్రమే అన్నట్లుగా ఉంటుందని, దానికి తగిన నిధులు కేటాయిస్తేనే మన సంస్కృతి, కళలను కాపాడుకోవచ్చని రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 'జయహో భారత్'- 'శ్రావణ మాసం - సుస్వరనాదం' శీర్షికన ప్రత్యేక సాంస్కృతికోత్సవాన్ని నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అతిథులుగా కోలేటి దామోదర్ గుప్తా, నటుడు శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు కళాకారులకు ఆర్థికంగా ఆదుకోకపోయినా ఫర్వాలేదని, కళావేదికలను ఉచితంగా ఇస్తే చాలని పేర్కొన్నారు. అకాడమీ అధ్యక్షురాలు లలిత, సామాజికవేత్త కృష్ణారావు, బనారస్ యూనివర్సిటీ సంగీతం, ప్రదర్శన కళలశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.బి.సత్యవరప్రసాద్, సంగీత నాట్యగురువులు తదితరులున్నారు.

ఎంజేసీఈటీలో హ్యాకథాన్

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రాత్రి వరకు హ్యాకథాన్ పోటీలు జరిగాయి. త్వరలో జరగబోయే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్- 2026 పోటీలకు సన్నాహకంగా నిర్వహించిన కళాశాల అంతర్గత పోటీల్లో 612 మంది విద్యార్థులు 102 బృందాలుగా తలపడ్డారు. విద్య, వైద్యం, రవాణా, వ్యవసాయం తదితర అంశాలపై తమ ప్రతిభను ఉపయోగించి పలు ఆవిష్కరణలు, అప్లికేషన్లను రూపొందించారు. కార్యక్రమంలో ఎంజేసీఈటీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆచార్య షర్ఫతుల్లా హుస్సేని, డీన్ (అకడమిక్స్) ఆచార్య హమ్‌రాజ్, రిజిస్ట్రార్ నరసింహారావు, ఎస్ఐహెచ్ ఫ్యాకల్టీ సమన్వయకర్త మహమ్మద్ జైనుద్దీన్ పాల్గొని విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను పరిశీలించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట బురిడీ

సనత్‌నగర్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అధిక లాభాలొస్తాయని నమ్మించిన సైబర్ మోసగాళ్లు ఓ వ్యక్తి నుంచి రూ.45.67 లక్షలు కాజేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. సనత్‌నగర్‌కు చెందిన శ్రీనాథ్ చంద్రగిరి ఇటీవల ఫేస్‌బుక్‌లో ఆన్‌లైన్ షేర్ ట్రేడింగ్, పెట్టుబడులతో అధిక లాభాలొస్తాయనే ప్రకటన చూశాడు. లింక్‌పై క్లిక్ చేయగా ఓ వ్యక్తి శ్రీనాథ్‌ను వాట్సప్‌లో సంప్రదించి ఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాడు. సిద్ధి అగర్వాల్ పేరుతో ఉన్న ఓ నంబరుతో ఫోన్ చేయించి ఓ మహిళను శ్రీనాథ్‌కు పరిచయం చేశాడు. షేర్ ట్రేడింగ్‌లో తొలుత రూ.3.50 లక్షలు పెట్టుబడి పెట్టించి రూ.6.50 లక్షలు లాభం వచ్చినట్లు చూపారు. అందులో నుంచి రూ.84 వేలు విత్‌డ్రా చేసుకున్న శ్రీనాథ్ వారిని పూర్తిగా నమ్మాడు. అనంతరం ఎక్కువ లాభాల కోసం పలు విడతల్లో మొత్తం రూ.45.67 లక్షలను పెట్టుబడి పేరిట సైబర్ నేరగాళ్లు వసూలు చేశారు. చివరికి వారు స్పందించకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మోసం చేసి రూ.1.04 లక్షల కాజేత

బేగంపేట: సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని మోసం చేసి రూ.1.04 లక్షలు కాజేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బేగంపేట శ్యామ్‌లాల్ బిల్డింగ్స్‌కు చెందిన రాజ్‌కుమార్ ఇటీవల తన ఇంట్లోని మ్యాట్రెస్ విక్రయించేందుకు ఓఎల్ఎక్స్‌లో ప్రకటన ఇచ్చాడు. రోహన్ అనే వ్యక్తి ఫోన్‌చేసి తాను కొనుగోలు చేస్తానన్నాడు. రూ.5ను ఆయన ఖాతాకు పంపాడు. డబ్బు అందుకోవాలంటే తాను పంపిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి యూపీఐ పిన్ ఎంటర్ చేయాలని చెప్పాడు. నమ్మిన రాజ్‌కుమార్ స్కాన్‌చేసి పిన్ నమోదు చేశాడు. వెంటనే ఖాతా నుంచి రూ.1.04 లక్షలు డెబిట్ అయ్యాయి.

టెలిగ్రామ్ టాస్క్‌ల పేరిట విద్యార్థినికి టోకరా

బేగంపేట, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరిట టెలిగ్రామ్ గ్రూపులో చేర్చుకుని ఓ విద్యార్థినిని మోసం చేసిన ఘటన బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలంరాయికి చెందిన విద్యార్థిని హీనాను ఇటీవల మెగా అడ్వాన్స్ డెయిలీ టాస్క్ పేరుతో ఉన్న టెలిగ్రామ్ గ్రూపులోకి యూసుఫ్ శాంసన్ అనే వ్యక్తి చేర్చాడు. ప్రాపర్టీ ప్రమోషన్, గూగుల్ రివ్యూలు తదితర ఆన్‌లైన్ టాస్క్‌లు చేస్తే ఆదాయం వస్తుందని నమ్మించాడు. తొలుత కొన్ని సులభమైన టాస్క్‌లు చేయించి రూ.180 చెల్లించాడు. దీంతో బాధితురాలు ఆన్‌లైన్ టాస్క్‌లను నమ్మింది. విడతల వారీగా రూ.4.46 లక్షలు చెల్లించింది. డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా మరో రూ.1.5 లక్షలు చెల్లిస్తేనే గతంలో పెట్టుబడి పెట్టిన డబ్బు చెల్లిస్తామని స్పష్టం చేశారు. తాను మోసపోయినట్లు గ్రహించి బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వైద్యురాలి ఐప్యాడ్ చోరీ

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న ఓ వైద్యురాలి ఐప్యాడ్ చోరీకి గురైన ఘటన ఫిల్మ్‌నగర్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఫిల్మ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డా.ఎం.అశ్విని వైద్యురాలిగా పని చేస్తున్నారు. ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆమె తన యాపిల్ ఐప్యాడ్‌ను మొదటి అంతస్తులో ఉంచారు. సాయంత్రం 6 గంటలకు వచ్చి చూసుకునేసరికి అది కనిపించలేదు. చోరీకి గురైందని ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు నిండా చెత్తే



బోరబండ కల్యాణ్‌నగర్ ప్రధాన రహదారిపై రోడ్డు మధ్యన ఉన్న పార్కులో కంచె తొలగించి మరీ చెత్త వేస్తున్నారు. పచ్చదనం పెంచాలని, కాపాడుకోవాలని ఎంత చెబుతున్నా ఆ స్ఫూర్తి మాత్రం ప్రజల్లో కొరవడింది. అధికారులు స్పందించి మళ్లీ కంచె ఏర్పాటు చేసి పార్కు రక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

ముగిసిన క్రీడోత్సవాలు

నారాయణగూడ, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్) ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా 'ఖేలేగా భారత్- జీతేగా భారత్' నినాదంతో నిర్వహించిన క్రీడా, ఫిట్‌నెస్ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఆయన సేవలను స్మరించడంతో పాటు క్రీడా ప్రాధాన్యం, క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యకర జీవన విధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు సాట్స్ అధికారులు వివరించారు. 'ఏక్ ఘంటా ఖేల్‌కే మైదాన్‌మే' కార్యక్రమం పేరిట ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ తదితర పోటీలతో పాటు '29 ఛాలెంజ్', 'పాస్ ది బాల్ ఛాలెంజ్', 'మీట్ ది ఛాంపియన్స్' వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. మహిళలు, యువత, వయోధికులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. వేడుకల ముగింపు సందర్భంగా 'స్పెషల్ సండేస్ ఆన్ సైకిల్', రన్‌లు, వాకథాన్‌లు నిర్వహించినట్లు వివరించారు.

న్యాయవాదికి కత్తి చూపి బెదిరింపు

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: న్యాయవాదిని వెంబడించి కత్తితో బెదిరిస్తూ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన ఓ వ్యక్తిపై ఫిల్మ్‌నగర్ ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. బృందావన్‌కాలనీకి చెందిన న్యాయవాది జబర్ అహ్మద్‌ను శనివారం ఉదయం ఇద్దరు వ్యక్తులు వెంబడించారు. షేక్‌పేట ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో ఆయన్ను అడ్డుకున్నారు. హషీమ్ అనే వ్యక్తి కత్తి చూపి రూ.10 వేలు ఇవ్వాలని బెదిరించాడు. తన వద్ద డబ్బులు లేవని అనగా కనీసం రూ.5 వేలు అయినా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



త్రిశక్తి హనుమాన్ ఆలయం వద్ద మురుగు

మింట్ కాంపౌండ్‌లోని శ్రీత్రిశక్తి హనుమాన్ దేవస్థానం ముందు కొద్ది నెలలుగా పొంగుతున్న మురుగు భక్తులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. నడవ లేని పరిస్థితి నెలకొనటంతో పాటు తీవ్ర దుర్గంధం వస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఫిర్యాదు చేస్తే సిబ్బంది వచ్చి తాత్కాలికంగా శుభ్రం చేయడం తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపటం లేదన్నారు. పైపులైన్ వేస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉన్నా జలమండలి అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. సెలవు రోజులు, వారాంతపు రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, అధికారులు చొరవ తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సమస్యపై ఇటీవల హైడ్రా కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేశామని ఆలయం ఛైర్మన్ కొలిశెట్టి శివకుమార్ తెలిపారు. ఇకనైనా స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. – న్యూస్‌టుడే, ఖైరతాబాద్

పచ్చని వనం.. ప్రకృతి సోయగం



ఉద్యానంలో వాకర్లు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్కు పచ్చదనంతో కనువిందు చేస్తోంది. ప్రస్తుత వర్షాల కారణంగా ఉద్యాన సోయగాలు రెట్టింపయ్యాయి. ఒకప్పుడు యూసుఫ్‌గూడ గ్రామానికి నీరందించిన చెరువును ఉద్యానంగా తీర్చిదిద్ది కృష్ణకాంత్ పార్కుగా నామకరణం చేశారు. భారీ వృక్ష సంపద, ఔషధ మొక్కలు, పుష్పజాతులు, ముచ్చటగొలిపే గజిబోలు, పచ్చదనంతో నిండి చూపరులను కట్టిపడేస్తోంది. దీనిలో రెండు పెద్ద నీటి కుంటలున్నాయి. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు సమృద్ధిగా అందుతుంటాయి.

దూరప్రాంతాల నుంచి.. యూసుఫ్‌గూడ, జవహర్‌నగర్, కల్యాణ్‌నగర్, సిద్ధార్థనగర్, మధురానగర్ల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి తెల్లవారుజామున 5 గంటల నుంచే వాకర్లు ఇక్కడికి వస్తారు. నడకతోపాటు యోగ, కరాటే సాధన చేస్తుంటారు. రెండు ఓపెన్ జిమ్‌లు ఉన్నాయి. పిల్లలు ఆడుకునేందుకు రెండు చోట్ల ఆట స్థలాలున్నాయి. వర్షాలకు ముందు జీహెచ్ఎంసీ అధికారులు భారీ ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు.



కళకళలాడుతున్న పార్కు

డంపింగ్ యార్డుతో ఇబ్బందులు..

పార్కును ఆనుకుని జవహర్‌నగర్ వైపు చెత్త డంపింగ్ యార్డు ఉంది. దీంతో ఉద్యానానికి ఒక వైపు దుర్వాసన వస్తుంటుంది. దీన్ని తొలగించాలని స్థానికులు, వాకర్లు పలుమార్లు అధికారులను కోరారు.

భావ ప్రకటన స్వేచ్ఛ నియంత్రణ ఆందోళనకరం



చర్చా కార్యక్రమంలో పాల్గొన్న అంజలి లాల్ గుప్తా, నరేశ్ ఫెర్నాండెజ్, ప్రియాంశి శర్మ

బంజారాహిల్స్, న్యూస్‌టుడే : వర్తమాన సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్న డిజిటల్ సాంకేతికత.. పౌర, సామాజిక, ఆర్థిక, రాజకీయ భావప్రకటన తదితర అంశాలను నియంత్రిస్తున్న తీరు మాత్రం ఆందోళన కలిగిస్తోందని వక్తలు అభిప్రాయపడ్డారు. బంజారాహిల్స్‌లోని జర్మన్ సాంస్కృతిక, అధ్యయన సంస్థ గోథె జంత్రం ఆధ్వర్యంలో శనివారం జర్నలిజం, విద్యారంగం, వివిధ రంగాల ప్రముఖులతో రెండు చర్చా కార్యక్రమాలను నిర్వహించారు. టెక్ యుగంలో వార్తల సేకరణ, సత్యం, జవాబుదారీతనం, న్యాయాన్ని పరిరక్షించడం అంశాలపై జరిగిన మొదటి బృంద చర్చలో నరేశ్ ఫెర్నాండెజ్, ప్రియాంశి శర్మ, లెనా బొడేవిన్ పాల్గొన్నారు. అనుసంధానకర్తగా అంజలి లాల్ గుప్తా వ్యవహరించారు. వక్తలు మాట్లాడుతూ డిజిటల్ సాంకేతికత చిన్న తరహా వార్తా సంస్థలకు, పౌరులకు ఒకే రకమైన యాక్సెస్, భాగస్వామ్యం కల్పించటం స్వాగతించదగ్గ అంశమే అయినా.. ఇందులోని పెద్ద టెక్నాలజీ సంస్థలు మార్కెట్ గుత్తాధిపత్యాలను సృష్టించటం, నియంత్రించటం వంటి తీవ్రమైన సవాళ్లు కూడా ఎదురవుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ అంశాలను ఎదుర్కొనేందుకు చట్టపరమైన, నైతికపరమైన చర్యలు అత్యవసరమని పేర్కొన్నారు. టెక్ డిజైన్, పాలసీ, నిఘా, నైతికతను అర్థం చేసుకోవడం వంటి అంశాలపై రెండో బృంద చర్చ నిర్వహించగా వివిధ రంగాలకు చెందిన అపర్ గుప్తా, అనికేత్ అలం, రాకేశ్ తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఉషా రామన్ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో గోథె జంత్రం డైరెక్టర్ అమితా దేశాయ్, పెద్దసంఖ్యలో వీక్షకులు పాల్గొన్నారు.

ఘనంగా ఓయూ ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే

ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే-2026ను ఆదివారం ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించారు. 2026లో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ 31 బంగారు పతకాలు, 88 నగదు పురస్కారాలు, 27 ర్యాంకు ధ్రువపత్రాలను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఓయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి, రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన సాలిడ్ స్టేట్ ఫిజిక్స్ ల్యాబ్ (ఎస్ఎస్‌పీఎల్) డైరెక్టర్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ అనేష్ కుమార్ శర్మకు 'విశిష్ట పూర్వ విద్యార్థి పురస్కారం-2026' అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాల అభివృద్ధికి ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం, ప్రిన్సిపల్ ఆచార్య పి. చంద్రశేఖర్, అధ్యాపక బృందం చేస్తున్న కృషిని ప్రశంసించారు.



అనేష్ కుమార్ శర్మకు పురస్కారం అందజేస్తున్న వీసీ ఆచార్య కుమార్ మొలుగరం తదితరులు

చిరుజల్లుల్లో పర్యాటకుల పులకింత



చారిత్రక చార్మినార్ పరిసరాల్లో ఆదివారం చిరుజల్లులు కురిసినా పర్యాటకుల సందడి ఏమాత్రం తగ్గలేదు. వారాంతం కావటంతో గొడుగులు పట్టుకుని వచ్చి చార్మినార్‌ను వీక్షిస్తూ.. వేడివేడి ఇరానీ చాయ్ తాగుతూ ఉల్లాసంగా గడిపారు.

గొడవల నేపథ్యంలో.. బౌన్సర్ల పహారా

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో శనివారం ఇరువర్గాల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో ఆదివారం ప్రైవేటు బౌన్సర్లను రంగంలోకి దింపారు. శనివారం ఇరువర్గాల మధ్య తోపులాట, వాగ్వాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా వీరిని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ బౌన్సర్ల ఏర్పాటు విషయమై కొందరు సభ్యులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాసులు కొట్టేసి... పావులుగా మార్చి!

- బాధితులకు సైబర్ మాయగాళ్ల ఎర
- కమీషన్ ఆశచూపి ఏజెంట్లుగా తయారీ



సికింద్రాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి.. పార్ట్‌టైమ్ జాబ్‌తో అదనపు ఆదాయం వస్తుందనే ఆశతో వాట్సప్ లింక్‌ను క్లిక్ చేశాడు. టాస్క్‌లు పూర్తిచేస్తే డబ్బు రావటంతో నమ్మాడు. అదే కంపెనీలో పెట్టుబడితో జీతం, లాభం వస్తాయనే ఉద్దేశంతో విడతల వారీగా రూ.2.50లక్షలు పెట్టి నష్టపోయాడు. సొమ్ము రాబట్టుకునేందుకు కొత్త అవతారమెత్తాడు.

ఉప్పల్‌లో నివాసం ఉంటున్న స్థిరాస్తి వ్యాపారి.. ట్రేడింగ్ యాప్‌లో రూ.60 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. మొదట్లో లాభాలు రావటంతో బంధుమిత్రులకు ఆ లింక్‌లు పంపి వారు నష్టపోయేందుకు కారణమయ్యాడు. అట్నుంచి ఒత్తిడి రావటంతో బయటపడేందుకు మార్గాలు అన్వేషించాడు. టెలీగ్రామ్‌యాప్‌లో వచ్చిన సందేశానికి స్పందించాడు.

వీరిద్దరు కుటుంబ అవసరాలు.. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు మోసగాళ్ల బారిన పడ్డారు. పోయిన చోటనే రాబట్టుకోవాలనే ఉద్దేశంతో నేరస్థుల ఎరకు చిక్కారు. పోలీసుల రికార్డుల్లో నిందితులుగా మారి జైలు ఊచలు లెక్కిస్తున్నారు. నగరంలో సైబర్ మోసాలకు బలవుతోన్న బాధితులను కొందరు కేటుగాళ్లు ఏజెంట్లుగా మార్చుకుంటున్నారు. 10-20శాతం కమీషన్ ఆశచూపి వారితోనే నేరాలు చేయిస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో తెరవెనుక నడిపించిన సూత్రదారులు దర్జాగా తప్పించుకుంటున్నారు. గతంలో పదులసంఖ్యలో ఉండే వీరు ప్రస్తుతం వందలకు చేరినట్టు పోలీసు ఉన్నతాధికారి ఆందోళన వెలిబుచ్చారు. నేరస్థులకు సహకరించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మోసాలకు గురైన బాధితులు గంట వ్యవధిలో (గోల్డెన్ అవర్) పోలీసులకు ఫిర్యాదు చేస్తే నగదు రికవరీ చేసే అవకాశం ఉందని సూచించారు.

ఈనాడు, హైదరాబాద్

మస్కా కొడతారిలా..

విదేశాల నుంచి చక్రం తిప్పే సూత్రధారులు ఆనవాళ్లు తెలియకుండా పకడ్బందీ జాగ్రత్తలు తీసుకుంటారు. డిజిటల్ అరెస్ట్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, టాస్క్‌లు, బ్యాంకు ఓటీపీ, కస్టమర్ కేర్ తదితర మోసాలతో కొట్టేసిన సొమ్ము కోసం బ్యాంకు ఖాతాలు అవసరం. ఈ చీకటి కార్యకలాపాలకు బాధితులను ఏజెంట్లుగా మార్చుకునేందుకు నేరస్థులు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. బాధితుల వాట్సప్, ఫోన్లకు సందేశం పంపుతున్నారు. షెల్‌కంపెనీలు, మ్యూల్‌ఖాతాలు, సిమ్‌కార్డులు, ఆధార్, పాన్‌కార్డులు సరఫరా చేసేందుకు సహకరిస్తే భారీగా కమీషన్ ఇస్తామని ఆశ చూపుతున్నారు. పోలీసులు, బ్యాంకుల చుట్టూ తిరగకుండా పోయిన సొమ్మును తిరిగిస్తామని నమ్మకం కలిగిస్తున్నారు. తేలికగా డబ్బు వస్తుండటంతో బంధుమిత్రులు, కాలనీలోని పేద వర్గాల బ్యాంకు పుస్తకాలు, సిమ్‌కార్డులు సేకరించి విదేశాలకు సరఫరా చేస్తున్నారని పోలీసు అధికారి వివరించారు. బంధువు మాటలు నమ్మి ఖాతా ఇచ్చిన ఆటోడ్రైవర్ జైలుపాలయ్యాడు. అతడు బెయిల్ కోసం ఆటో విక్రయించాల్సి వచ్చిందని ఒక ఇన్‌స్పెక్టర్ చెప్పారు. మ్యూల్ ఖాతాలకు సహకరించిన ఒక యువకుడిపై కేసు నమోదు కావటంతో ఉద్యోగం, వివాహ విషయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడట.

భవనాలు అసంపూర్తిగా.. పఠనం అరకొరగా..

ఈనాడు, హైదరాబాద్

పాఠకులకు పాలకులు అరచేతిలోనే వైకుంఠం చూపిస్తున్నారు. పోటీ పరీక్షలకు అనుగుణంగా గ్రంథాలయాలను తీర్చిదిద్దుతున్నామని చెబుతున్నా.. ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదు. నగరంలో గ్రంథాలయ భవన నిర్మాణాలు ఏళ్లుగా సాగుతున్నాయి. 2023లోనే రూ.17కోట్లతో 12 కొత్త భవనాలు, మరో 33 గ్రంథాలయాల భవనాలు మరమ్మతులు చేయించి, ఆధునికంగా తీర్చిదిద్దాలని పనులు మొదలుపెట్టారు. మరమ్మతులు పూర్తి చేయగలిగినా... కొత్త భవనాలు మాత్రం ఇంకా సాగుతూనే ఉన్నాయి. ● బాకారం గ్రంథాలయ పనులతో అక్కడున్న పుస్తకాలను రాంనగర్ గ్రంథాలయానికి తరలించారు. దిన పత్రికల సెక్షన్‌ను మాత్రం స్థానిక గుడిలో పెట్టారు.

2023లో చేపట్టినా.. ఇంకా నిర్మాణంలోనే

● ఒక్కో ప్రధాన గ్రంథాలయంలో 35వేల మంది కంటే ఎక్కువే సభ్యత్వాలు ఉన్నాయి. పోటీ పరీక్షల కోసం వచ్చే అభ్యర్థుల సంఖ్య రోజూ వేలల్లో ఉంటోంది. గ్రంథాలయాలకు ఉన్న ఆదరణతోనే ప్రాంతానికో కమ్యూనిటీ గ్రంథాలయం ఉండగా.. ప్రైవేటుగానూ ఏర్పాటవుతున్నారు.

● ఆగాపుర గ్రంథాలయంలో ఎలక్ట్రికల్ పనులు చేపట్టారు. దూద్‌బౌళి లైబ్రరీలో ఇప్పుడే బండలు పరుస్తున్నారు. ఎల్‌ఐసీ కాలనీలో చివరి దశలో పనులున్నాయి. బాకారంలో 65శాతం పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

● 2023లో మొదలు పెట్టిన భవన నిర్మాణాలు ఇంకా కొనసాగుతున్నాయంటే పరిస్థితి అర్థంచేసుకోవచ్చు. కొన్ని 50% పనులు పూర్తి చేసుకుంటే మరికొన్ని 70 శాతమే అయ్యాయి.

నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో..

2015కి ముందు గ్రంథాలయ శాఖకే ప్రత్యేకంగా నిధులు ఉండేవి. ప్రజలు కట్టే ఆస్తి పన్నులో 8శాతం నిధులు ఈ శాఖ ఖాతాలో పడేవి.. 2015 నుంచి మాత్రం ఈ నిధులు నేరుగా రాష్ట్ర ఖజానాలో జమ కావడంతో ఆలస్యం అవుతోంది. గుత్తేదారు పనులు చేయాలి. చేసిన వరకు బిల్లు ఇస్తే అది గ్రంథాలయ శాఖ.. తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ప్రతిపాదిస్తోంది. ఆ అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి నిర్మాణాలు నిర్ధారించుకున్నాక జీహెచ్‌ఎంసీ నుంచి నిధులు విడుదల చేయాల్సి వస్తోంది. ● కొత్త భవనాలు కట్టేందుకు గ్రంథాలయ సంస్థకు నిధులు లేవు. ఉన్న వాటిని నిర్వహించేందుకు సరిపోను సిబ్బంది లేరు. ఉన్న కొద్ది మందికే అదనపు పనులు అప్పగిస్తున్నారు. 'గరిష్ఠంగా రూ.2లక్షల లోపు మరమ్మతులు ఏవైనా ఉంటే అవి మాత్రం చేయించగలుగుతున్నాం. గ్రంథాలయ సెస్సు నేరుగా సంస్థ ఖాతాలో పడితే వాటిని సద్వినియోగం చేసుకోగలం. అందుకే 2015కి పూర్వం నిధులు ఎలా ఇచ్చేవారో అలాంటి పద్ధతే ఉంటే బాగుంటుంది' అని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు ఛైర్మన్ రియాజ్ తెలిపారు.

ఉత్కంఠగా జూబ్లీహిల్స్ సొసైటీ ఎన్నిక





పోలింగ్ కేంద్రం వద్ద శీనయ్య, రవీంద్రనాథ్



ఓటర్ల సందడి

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నిక ఆదివారం ఉత్కంఠగా సాగింది. బొల్లినేని శీనయ్య, బొల్లినేని రవీంద్రనాథ్ ప్యానెళ్ల మధ్య నువ్వా.. నేనా అన్నట్లు పోరు సాగింది. జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 వరకు పోలింగ్ సాగింది. సభ్యులు పెద్ద సంఖ్యలో వచ్చి ఓటేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, మామ పద్మారెడ్డి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డితోపాటు చాలామంది ప్రముఖులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. రెండు ప్యానెళ్ల గెలుపుపై ధీమా వ్యక్తం చేయడంతో ఫలితంపై ఆసక్తి నెలకొంది.

గోప్యంగా ఫలితం.. మధ్యాహ్నం 3 గంటలకు పోలింగ్ ముగియగా 3.30 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఎవరు గెలుస్తారన్న ఉత్కంఠ తారస్థాయికి చేరింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఫలితాన్ని ప్రకటించవద్దని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి చంద్రమోహన్‌రెడ్డి ఫలితాన్ని గోప్యంగా ఉంచారు. సుప్రీంకోర్టు తుది ఉత్తర్వులు వచ్చాక వెల్లడిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా జూబ్లీహిల్స్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... బండ్లగూడజాగీర్ ఇందిరమ్మకాలనీలో ఓ వ్యక్తి భవనం నిర్మిస్తున్నాడు. బంజారాహిల్స్‌లో నివసించే ఏసు(40) టైల్స్ వేస్తున్నాడు. ఆదివారం ఉదయం భవనం మూడో అంతస్తులో పని చేస్తూ కింద పడిపోయి.. అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.





మారథాన్‌ను ప్రారంభిస్తున్న సైబరాబాద్ సీపీ రమేశ్, బల్దియా కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు

పరుగెత్తికొచ్చిన పట్నం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తెల్లవారక ముందే ఆ ప్రాంతమంతా వేలమందితో నిండిపోయింది.. కాసేపట్లోనే అంతా పరుగు పెడుతూ ముందుకు సాగారు. ఆదివారం తెల్లవారుజామున పీపుల్స్ ప్లాజా ఇందుకు వేదికైంది. ఎన్ఎండీసీ ఆధ్వర్యంలో '15వ ఎడిషన్ ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్-2026'లో ఆరేళ్ల చిన్నారి నుంచి అరవై ఏళ్ల వృద్ధుడి వరకు పాల్గొన్నారు. ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్, 10కే, 5కే విభాగాల్లో పరుగు గచ్చిబౌలి స్టేడియం వరకు సాగింది. ● మహిళల ఎలైట్ విభాగంలో ఇథియోపియాకు చెందిన ఎమానే సెయిపు విజేతగా నిలవగా, రెండో స్థానంలో ట్సిగా డెస్టా, మూడో స్థానంలో కెన్యాకు చెందిన టెరెసియా ఒమోసా నిలిచారు. మహిళల్లో నర్మిబెన్ ఠాకోర్, మీనాక్షి నేగి, మారిపల్లి ఉమ, భగవతి దాంగి ముందంజలో నిలిచారు. పురుషుల ఎలైట్ విభాగంలో ఇథియోపియాకు చెందిన సెబోకా నెగుస్సే టైటిల్ సాధించారు. రెండో స్థానంలో కెన్యాకు చెందిన ఫిలిక్స్ కిముటై, మూడో స్థానంలో ఫ్రాన్సిస్ చెరుయియోట్, భారతీయుల్లో గోపీ తోనకల్ నాలుగో స్థానంలో నిలిచారు. ● మారథాన్‌లో అత్యధిక మహిళా భాగస్వామ్యాన్ని నమోదు చేసిన సంస్థగా నోవార్టిస్ హెల్త్‌కేర్, అత్యధికంగా వెయ్యి రిజిస్ట్రేషన్లు చేసిన సంస్థగా డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ప్రతినిధులను సత్కరించారు.



రియల్ ఎస్టేట్ వ్యాపారి హత్య

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: స్థిరాస్తి వ్యాపారి దారుణ హత్యకు గురైన ఘటన ఫలక్‌నుమా పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ రాజేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వట్టేపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మహబూబ్ అలీ (50) ఆదివారం రాత్రి తన ఇంటికి సమీపంలో ఉన్న అల్మాస్ హోటల్ ముందు కూర్చుని ఉన్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై దాడిచేసి కత్తులతో పొడిచి పరారయ్యారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మహబూబ్ అలీని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు

'హైడ్రా చర్యలు అభినందనీయం'



మణికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

మణికొండ, న్యూస్‌టుడే: ప్రజా ఆస్తుల పరిరక్షణకు హైడ్రా చేస్తున్న చర్యలు అభినందనీయమని టీపీసీసీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ వాసిరెడ్డి నరేష్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం మణికొండలో 'వాక్ విత్ హైడ్రా' ర్యాలీ నిర్వహించారు. మణికొండ మర్రిచెట్టు వద్ద ప్రారంభమైన ర్యాలీ హుడా కాలనీ వరకు కొనసాగింది. వివిధ కాలనీల రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కు స్థలాలను కాపాడేందుకు హైడ్రా చేపడుతున్న చర్యలు బాగున్నాయని కొనియాడారు. తిప్పరాజు రమేష్‌బాబు, సీతారాందాస్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లను మోసం చేస్తే సహించేది లేదు



ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ నేతలను సన్మానిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ఆటో డ్రైవర్ల సంఘాలతో గత వారం జరిపిన చర్చల్లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీ మేరకు అన్ని సమస్యలు పరిష్కరించాలని, ఆటో డ్రైవర్లను మళ్లీ మోసం చేయాలని చూస్తే సహించేది లేదని తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం పేర్కొన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో బి.వెంకటేశం, ఇతర నాయకులను వివిధ ఆటో సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. వెంకటేశం మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలన్నీ త్వరితగతిన అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని, అసెంబ్లీ, సచివాలయం, ముఖ్యమంత్రి నివాసం ముందు ఆటోలు, క్యాబ్‌లతో దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. నేతలు భిక్షపతి యాదవ్, మన్నూరు కృష్ణ, సీహెచ్ జంగయ్య, ఎస్.అశోక్, భాస్కర్, ఎండీ ఖాజా, ఎం.నరసింహ, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు దారి చూపిన జెన్‌జీ పోరాటం



మాట్లాడుతున్న ప్రొ.నాగేశ్వర్. చిత్రంలో మమత, కిరణ్, నాగరాజు, ఐషీ ఘోష్, రజనీకాంత్, అశోక్‌రెడ్డి

నల్లకుంట, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్య పరిరక్షణకు దారి చూపిన పోరాటం జెన్‌జీ పోరాటం అని ప్రొ.నాగేశ్వర్ అన్నారు. ఇటీవల దిల్లీ జంతర్‌మంతర్ వద్ద పోరాటం ఉద్యమకారులకు స్ఫూర్తిదాయకం, చారిత్రాత్మకమన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రలో జరిగిన 'జెన్ జీ పోరాటం-ఒక పరిశీలన' అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే పేపరు లీకేజీలు, పరీక్షల నిర్వహణలో అవకతవకలు, నిరుద్యోగం వంటి సమస్యలపై ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్ మాట్లాడుతూ.. . దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు కేవలం వ్యక్తిగత సమస్యలు కావని, ప్రభుత్వ విధానాలతో ముడిపడి ఉన్నాయని చెప్పారు. విద్య కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ వైపు నడిపించే విధానాలను వ్యతిరేకిస్తూ మరిన్ని ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మమత, కిరణ్, అశోక్‌రెడ్డి, శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు సుమ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కింద మంటలు.. పైఅంతస్తుల్లో జనం

- 6 కార్లు, 3 ద్విచక్రవాహనాలు దగ్ధం
- 15 మందిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



తగలబడుతున్న వాహనాలు



పూర్తిగా దగ్ధమైన కార్లు



నివాసితులను బయటకు తీసుకొస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: అర్ధరాత్రి వేళ అందరూ భవనం పైఅంతస్తుల్లో నిద్రపోగా కింద మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగ 5 అంతస్తులను కమ్మేసింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరి భవనంలోని వాళ్లందరినీ సురక్షితంగా బయటకు తీసుకురావడంతో పెను ముప్పు తప్పింది. జూబ్లీహిల్స్ హుడా ఎన్‌క్లేవ్‌లోని శంశీరామ్స్ జ్యోతి డ్వెల్లింగ్ అపార్ట్‌మెంట్‌లో శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. భవనం స్టిల్ట్ ఫ్లోర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే 6 కార్లు, 3 ద్విచక్రవాహనాలు బుగ్గయ్యాయి. మంటలు ఎగిసిపడటం, పొగ భవనాన్ని కమ్మేయడంతో నివాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందగానే ఫిల్మ్‌నగర్ అగ్నిమాపక శాఖ అధికారి పి.రమేష్, అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.భానుప్రతాప్ అగ్నిమాపక బృందాలతో అక్కడికి చేరుకున్నారు. మంటలను ఆర్పుతూనే భవనంలో ఉన్న 15 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్లు తెలిపారు.

ట్రేడింగ్‌లో లాభాల పేరిట రూ.2.20 కోట్ల బురిడీ

ఈనాడు- హైదరాబాద్: టెలిగ్రామ్‌లో పరిచయమై ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడిపెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించిన సైబర్‌నేరగాళ్లు ఓ ప్రైవేటు ఉద్యోగి నుంచి రూ.2.20 కోట్లు కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో మల్కాజిగిరి సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. కేసు వివరాలివీ.. నగరంలోని కాప్రాకు చెందిన ప్రైవేటు ఉద్యోగి మల్లికార్జునరావు ఫోన్ నంబరును గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల టెలిగ్రామ్ గ్రూపులో యాడ్ చేశారు. అనిత అనే పేరుతో పరిచయం చేసుకున్న మహిళ వర్ష క్యాపిటల్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మించారు. నిజమని భావించిన ఉద్యోగి జూన్ 16వ తేదీన యాప్ డౌన్‌లోడ్ చేసుకుని రూ.10 వేలు బదిలీ చేయగా లాభం వచ్చింది. అనంతరం రూ.లక్ష పంపారు. దీనికీ లాభాలు రావడంతో దశలవారీగా ఆగస్టు 27వ తేదీ వరకు మొత్తం రూ.2.20 కోట్లు బదిలీ చేశారు. ఇందుకు రూ.22 కోట్ల లాభం వచ్చినట్లు యాప్‌లో చూపించారు. విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా అదనంగా రూ.1.5 కోట్లు పంపించాలని మెలిక పెట్టారు. ఎన్నిసార్లు అడిగినా వేర్వేరు కారణాలు చెప్పడంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

నకిలీ పత్రాలు, ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్టు



కుత్బుల్లాపూర్: యజమానుల సంతకాలు ఫోర్జరీ చేసి, నకిలీ పత్రాలతో రూ.4.2 కోట్ల విలువచేసే రెండు ప్లాట్లు విక్రయించిన మోసగాడిని సూరారం పోలీసులు అరెస్టుచేశారు. సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన బాలకృష్ణమూర్తి, మహాలక్ష్మిలకు బౌరంపేటలోని సతీష్‌సొసైటీలో రెండు ప్లాట్లు(600 చదరపు గజాలు) ఉన్నాయి. వాటిని ఇటీవల చింతల్‌కు చెందిన బేతి శ్రీనాథ్‌కు విక్రయించారు. రిజిస్ట్రేషన్ కోసం కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించుకోగా అప్పటికే ఆ స్థలం మరో వ్యక్తి పేరున రిజిస్ట్రేషన్ అయి ఉండటంతో పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై కృష్ణ కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కూకట్‌పల్లిలోని వివేకనందానగర్‌కు చెందిన **కన్నెకంటి శ్రీనివాసరావు** సంబంధిత ప్లాట్లకు మూడు నెలల క్రితం ఫోర్జరీ సంతకాలు, నకిలీ స్టాంపులతో వ్యాలిడేషన్ పత్రాలు సృష్టించి తనకు పరిచయం ఉన్న వసుంధ అనే మహిళ పేరున రిజిస్ట్రేషన్ చేశాడు. ఆ తరువాత శ్రీనివాస్‌బాబు అనే మరో వ్యక్తి సహాయంతో నెల రోజుల క్రితం ప్లాట్లను అజయ్ అనే వ్యక్తికి విక్రయించాడు. గతంలో కూడా ఇతనిపై చేవెళ్ల, దుండిగల్, నార్సింగ్ ఠాణాల్లో కేసులున్నట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు.

కిడ్నీ ఆరోగ్యంపై లూపస్ దాడి!

- చాపకింద నీరులా లూపస్ నెఫ్రైటిస్
- 90 శాతం బాధితులు మహిళలే



ఈనాడు, హైదరాబాద్: మహిళల్లో లూపస్ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. అవగాహన లేకపోవడంతో కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు అధ్యయనంలో తేలింది. ఈ వ్యాధి ముదిరి చివరికి లూపస్ నెఫ్రైటిస్‌కు దారి తీస్తోంది. చాలామంది మహిళలు ఈ సమస్య ఉన్నట్లు గుర్తించలేరు. చివరికి కిడ్నీల వైఫల్యంతో వైద్యులను సంప్రదిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ తన సొంత కణజాలాలపై దాడి చేసే ఆటో ఇమ్యూన్ రుగ్మతనే లూపస్. ఇది ఆర్థరైటీస్‌లో ఒక రకం తీవ్రమైన అనారోగ్య సమస్య. రాజధానిలోని ప్రధాన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నిర్వహించిన అధ్యయనాలు లూపస్ తీవ్రతను చాటుతున్నాయి. బాధితుల్లో 80-90 శాతం మహిళలే. ఈ వ్యాధి కారణంగా ఎలాంటి ముందస్తు లక్షణాలు, హెచ్చరిక లేకుండానే కిడ్నీలను దెబ్బతీసే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. గతంలో ఉస్మానియా ఆసుపత్రి ఆధ్వర్యంలో 144 మంది లూపస్ నెఫ్రైటిస్ రోగులపై పరిశీలన చేయగా.. 45.8 శాతం మంది రోగులు కిడ్నీల సమస్యతో బాధపడుతున్నట్లు తేలింది. వీరిలో కిడ్నీ లూపస్ నాలుగో దశలో ఉన్నట్లు బయాప్సీలో వెల్లడైంది. మరో 29.1 శాతం మందిలో కిడ్నీ పనితీరు అత్యంత వేగంగా క్షీణిస్తున్నట్లు వైద్యులు గుర్తించారు. లూపస్ వ్యాధి వల్ల ఆటో యాంటీబాడీలు తయారై రక్తంలో కలుస్తాయి. ఇవి కిడ్నీల్లోని రక్తాన్ని శుద్ధి చేసే అతిసన్నని నాళాలను దెబ్బతీస్తాయి. దీంతో అక్కడ తీవ్రమైన వాపు, ప్రోటీనూరియా మూత్రం ద్వారా బయటకు పోయి క్రమంగా కిడ్నీలు పనిచేయడం మానేస్తాయి.


ఈ సంకేతాలు ఉంటే..



ముక్కు, చెంపలు, ముఖంపై సీతాకోక చిలుక ఆకారంలో ఎర్రటి దద్దుర్లు రావడం, మూత్రంలో నురుగు, చీలమండలు, పాదాల్లో వాపు, తరచూ అలసట, దీర్ఘకాలిక కీళ్ల నొప్పులు, జుట్టు విపరీతంగా రాలడం, నోట్లో పుండ్లు ఏర్పడతాయి. ఈ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. ఒక్కసారి లూపస్ వ్యాధికి చికిత్సలు ప్రారంభిస్తే.. మళ్లీ వైద్యుల సూచనలు లేకుండా మందులను సొంతంగా ఆపేయకూడదు.

తొలి దశలోనే గుర్తిస్తే ముప్పు నివారించవచ్చు

– డాక్టర్ సీరపాణి గోపాలుని, సీనియర్ నెఫ్రాలజిస్టు, అపోలో



లూపస్‌ను గుర్తించేందుకు సాధారణ రక్త, మూత్ర పరీక్షలు సరిపోతాయి. స్టెరాయిడ్లు, మైకోఫెనోటేల్, సైక్లోఫాస్ఫమైడ్ వంటి మందులను తొలిదశలో వాడటం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. ముందుజాగ్రత్తగా సంవత్సరానికి ఒకటి లేదా రెండుసార్లు మూత్రంలో ప్రోటీన్ లీకేజీ పరీక్షలు, రక్తంలో క్రియాటిన్ పరీక్షలు చేయించుకోవాలి. ఎండ తీవ్రత వల్ల లూపస్ తీవ్రత పెరుగుతుంది. రోజూ 30 నిమిషాలు వ్యాయామం, సమతుల ఆహారం, నిద్ర, తగినన్ని నీళ్లు తాగాలి.

ఏమైపోయారో..!

బీడీసీఆర్ విశ్రాంత ఏఎస్ఎం కుటుంబంలో అనిశ్చితి

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) రైల్వే అసిస్టెంట్ స్టేషన్ మేనేజర్‌గా పని చేసిన కనకస్వామి కుటుంబంలోనూ నేపాల్ విషాదం చోటుచేసుకుంది. అతను ఇక్కడ విధులు నిర్వర్తించినప్పుడు మేదరబస్తీలో ఉన్నా.. కొంతకాలంగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వేర్వేరు ఘటనల్లో ఇద్దరు కుమారులను కోల్పోయిన అతనికి మిగిలింది కూతురు మాత్రమే. ఇటీవల నేపాల్‌లో సంభవించిన అనుకోని ఉపద్రవం ఆ కాస్త ఆసరాను తుడిచిపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న నేపాల్ ఘటనలో కనకస్వామి కూతురు దీప్తి, అల్లుడు శ్రీధర్, మనువడు అభినవ్ ఆచూకీ తెలియడం లేదనే ప్రచారంపై స్పష్టత కొరవడింది. కొన్ని రోజులుగా వారి సెల్‌ఫోన్ల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో వారు ఏమైపోయారో అనే ఆవేదన ఆ కుటుంబాన్ని విషాదంలో నింపింది. బీడీసీఆర్‌లో పని చేసిన నేపథ్యంలో ఆ వార్త దావానంలా వ్యాపించడంతో రైల్వే ఉద్యోగుల్లో సానుభూతి వ్యక్తం అవుతోంది. ముగ్గురు సంతానం కలిగిన కనకస్వామి ఇద్దరు వారసులను కోల్పోయి అల్లుడు శ్రీధర్‌ని కొడుకులా భావించి విశ్రాంత జీవితాన్ని హైదరాబాద్‌లో సాగిస్తున్న క్రమంలో మానస సరోవర్ యాత్రకు వెళ్లిన వారి ఆచూకీపై ఎలాంటి స్పష్టమైన సమాచారం అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

ముందే వాట్సప్‌లో స్నేహితులకు సమాచారం



అంబర్‌పేట, న్యూస్‌టుడే: ప్రేమ వైఫల్యంలో ఉరేసుకుని ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. తాను చనిపోతున్నట్లు స్నేహితులకు వాట్సప్‌లో సమాచారం పంపించారు. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం... నగరంలోని పెట్లబుర్జులో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న **నిభాష్** (25) తిరుమలనగర్‌లో నివాసం ఉంటున్నారు. అతను ఒక యువతిని ప్రేమించారు. ఆమె కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించారు. శనివారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వాట్సప్ సమాచారంతో ఆందోళనకు గురైన అతని స్నేహితులు పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం ఉదయం ఘటనా ప్రాంతానికి చేరుకోగా అతను అప్పటికే చనిపోయారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ఆందోళన కాదు.. కూలి కోసం నిరీక్షణ

ఈ చిత్రాన్ని చూసి ఏదైనా డిమాండ్‌తో రోడ్డుపై ధర్నా చేస్తున్నారనుకుంటే పొరపాటు పడ్డట్టే. వీరంతా ఇతర రాష్ట్రాలకు చెందిన భవన నిర్మాణ కూలీలు. నిత్యం ఉదయం టోలీచౌకి చౌరస్తాకు చేరుకుని కూలి పనుల కోసం ఎదురు చూస్తుంటారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు కూడా ఇంకా పనికోసం ఎవరైనా తీసుకెళ్తారేమో అని నిరీక్షిస్తున్నారిలా.

–ఈనాడు, హైదరాబాద్

చికెన్ ధరలు			
ఫాంరేటు	117–00	డ్రెస్డ్	223–00
రిటైల్	144–00	స్కిన్‌లెస్	252–00

నేడు 'భారత్‌కో జానో' రాతపరీక్ష

తెలంగాణలో లక్ష మంది విద్యార్థుల భాగస్వామ్యం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: దేశ చరిత్ర, సంస్కృతి, విశిష్టతలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక 'భారత్‌కో జానో' జనరల్ నాలెడ్జ్ రాతపరీక్ష నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా సుమారు కోటి మంది ఈ పరీక్ష రాయనున్నారు. తెలంగాణలోని తమ 21 శాఖల పరిధిలో దాదాపు లక్ష మంది విద్యార్థులతో ఈ పరీక్షను ఒకేరోజు, ఒకే సమయంలో (ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు) నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్ర కృష్ణ పసుపులేటి, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ తెలిపారు. ఈ పరీక్షను జూనియర్ (6, 7, 8 తరగతులు), సీనియర్ (9, 10, ఇంటర్) విభాగాలుగా విభజించి నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో చిన్నతనం నుంచే దేశభక్తి, జాతీయ చైతన్యం, భారతీయ సంస్కృతి పట్ల గౌరవభావాన్ని పెంపొందించి బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ పరీక్షను విజయవంతం చేయడంలో పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

46 కి.మీ. రోడ్డులో 30 మలుపులా? : కిషన్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి

చేవెళ్ల, న్యూస్‌టుడే: 46 కి.మీ. రోడ్డులో 30 మలుపులా.. ఈ తరహా జాతీయ రహదారి నిర్మాణం మరెక్కడా లేదంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్ వద్ద బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు అలైన్‌మెంట్ సరిగ్గాలేదని వాఖ్యానించారు. జాతీయ రహదారిని ఇన్ని మలుపులతో నిర్మిస్తే ప్రమాదాలు జరగవా. . వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని రోడ్డు నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సూచించారు. ఎన్‌జీటీ కేసు వల్ల రోడ్డు నిర్మాణం మూడేళ్లు ఆలస్యమైందన్నారు. కొత్తగా నిర్మిస్తున్న రోడ్డును పది అడుగుల ఎత్తుగా నిర్మిస్తుండటం, సర్వీసు రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని భాజపా పట్టణ అధ్యక్షుడు అనంతరెడ్డి కేంద్రమంత్రి దృష్టికి తెచ్చారు. రోడ్డు విస్తరణకు భూములిచ్చిన రైతులకు వారి పొలాల్లోకి వెళ్లడానికి దారిలేకుండా పోయిందన్నారు. సర్వీసు రోడ్డు నిర్మాణానికి అదనంగా మరో 10 మీటర్ల భూ సేకరణ చేయాల్సి ఉంటుందని అధికారులు సమాధానమిచ్చారు. సమస్య లేకుండా చూడాలంటూ కిషన్‌రెడ్డి ఆదేశించారు. బీజాపూర్ రహదారి పనులపై త్వరలో సంబంధితశాఖల అధికారులతో సమీక్షిస్తానని తెలిపారు.

భారతీయ చరిత్రకు సరికొత్త కోణం 'హరప్పా'



పుస్తక పరిచయం చేస్తున్న చినవీరభద్రుడు ◌ చర్చలో మాట్లాడుతున్న రచయిత సాయి పాపినేని. చిత్రంలో ప్రసాద్ సూరి, ఆదిత్య అన్నా వజ్ఝల

ఈనాడు, హైదరాబాద్: ఛాందసవాదుల నమ్మకాలు, పాశ్చాత్య చరిత్రను నమ్మే ఉదారవాదుల సిద్ధాంతాలను కాదని రచయిత సాయి పాపినేని 'హరప్పా నాగరిత'ను కళ్లుగా చేసుకుని భారతీయ చరిత్రను కొత్త కోణంలో చూపించారని రచయిత వాడ్రేవు చినవీరభద్రుడు అన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయి పాపినేని రచించిన 'హరప్పా(మన పురాణాలలో హరప్పా చరిత్ర)' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా వాడ్రేవు చినవీరభద్రుడు పుస్తకాన్ని పరిచయం చేస్తూ..'మన పురాణాలు, చరిత్ర.. పర్యావరణ, భూగోళ, జన్యు, భాషా శాస్త్రాలను తాజా అధ్యయనాలతో పోల్చి, అందులో నుంచి చారిత్రక వాస్తవాలను వెలికి తీయడానికి చేసిన ప్రయత్నమే ఈ పుస్తకం. రామాయణం, మహాభారతం ఏయే కాలాల్లో జరిగి ఉంటాయో నిర్ధారించేందుకు రచయిత ఎంతో పరిశోధన చేశారు. పురాణాల్లోని ప్రతి ఘట్టం తాలూకు కాలాన్ని శాస్త్రీయ ఆధారాలతో నిర్దేశించే ప్రయత్నం ఇందులో కనిపించింది' అని వివరించారు. అంతకుమునుపు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత ప్రసాద్ సూరి, తెలుగు కలెక్టివ్ కోఫౌండర్ ఆదిత్య అన్నా వజ్ఝల, రచయిత సాయి పాపినేని పుస్తకంపై చర్చించారు. అనంతరం హరప్పా మొదటి, మధ్య, తుది దశలపై ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు.

ముగిసిన అత్యాపత్య రాష్ట్ర స్థాయి పోటీలు



రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలురలో విజేత హైదరాబాద్ జిల్లా జట్టుకు అందజేస్తున్న ట్రోఫీ..



ద్వితీయ స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టుకు అందజేస్తున్న ట్రోఫీ..

నిర్మల్ అర్బన్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అత్యాపత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవగా, బాలికల్లో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాలురలో రంగారెడ్డి(ద్వితీయ), తృతీయ స్థానంలో నాగర్‌కర్నూల్, సంగారెడ్డి జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో నిర్మల్(ద్వితీయ), తృతీయ స్థానంలో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు నిలవగా. . క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. అతిథులుగా శేఖర్, లక్ష్మణ్, పోశెట్టి, బ్రహ్మయ్య, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి భూమన్న, సంజీవ్ హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరులో జమ్మూకశ్మీర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో హాజరుకానున్నారని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.

తేదీ మరచి.. పరుగున వచ్చి..






మేడ్చల్ జిల్లా కీసర సమీపంలోని ఓ పరీక్ష కేంద్రంలో ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సిన నీట్ పీజీ పరీక్ష సందర్భంగా హాల్‌లోకి అనుమతించే చివరి సమయం 8.30 కావడంతో సిబ్బంది గేటు వేసేశారు. తాళం వేస్తుండగా హాల్‌టికెట్, ఆధార్ కార్డుతో ఓ యువకుడు పరుగున వచ్చాడు. బయట వేచి ఉన్న వారంతా అయ్యో.. ఈ యువకుడు పరీక్ష రాసే అవకాశం కోల్పోతాడేమో.. అని ఆందోళన చెందారు. ఇంతలో సిబ్బంది గేటు తీసి అతన్ని లోపలికి అనుమతించటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కానీ 5 నిమిషాల్లోనే ఆ యువకుడిని సిబ్బంది బయటకు గెంటేయడంతో అక్కడున్న వారంతా ఏమైందని ప్రశ్నించగా 'నా పరీక్ష రేపు ఉంది.. తేదీ చూసుకోలేదు.. అంటు నవ్వుతూ వెళ్లిపోయాడు.

- ఈనాడు, హైదరాబాద్

ఆలయాల్లో వ్యర్థాలు.. సంపదకు మార్గాలు

పట్టించుకోని దేవాదాయశాఖ

ఈనాడు, హైదరాబాద్



ప్రసాదాల కవర్లు, అరటి తొక్కల వ్యర్థాలు

నగరంలోని ప్రధాన ఆలయాల్లో భక్తులు శ్రద్ధ, పవిత్ర భావంతో సమర్పించే పూలు, ప్రసాదాలు, నివేదనలు ఆలయ ప్రాంగణాల్లో ఆధ్యాత్మిక శోభను నింపుతున్నాయి. ప్రత్యేక మాసాల్లో వచ్చే టన్నులకొద్దీ పూలు, ఇతర వస్తువుల వ్యర్థాలు సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. వీటితో సంపదను సృష్టించుకునే అవకాశం ఉన్నా దేవాదాయశాఖ పట్టించుకోవడం లేదు.

• బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో సాధారణ రోజుల్లో 15వేల నుంచి 20వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. పండగ రోజుల్లో ఈ సంఖ్య లక్షకుపైనే ఉంటుంది. సగటున రోజూ ఒక టన్ను వ్యర్థాలు పోగవుతుంటాయి. పండగ రోజుల్లో ఇది 5 టన్నులకు చేరుకుంటుంది.

• జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయంలో సాధారణ రోజుల్లో సగటున 15 వేల మంది.. పండగ రోజుల్లో లక్ష మంది అమ్మవారిని దర్శించుకుంటారు. ఇక్కడ రోజూ 400 కిలోల నుంచి 800 కిలోల దాకా పూలు, కొబ్బరి వ్యర్థాలు ఉంటాయి. కొబ్బరి పీచు, ప్లాస్టిక్ ప్యాకేజింగ్ సంచులు ఇక్కడ ప్రధాన పొడి వ్యర్థాలుగా మారుతున్నాయి.

• సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో నిత్యం 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. రోజూ 600 కిలోల నుంచి 1.2 టన్నుల వ్యర్థాలు తయారవుతాయి.

ఏం చేయాలి..: ఆలయాల వద్దే వర్మి కంపోస్ట్ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా రోజువారీ పూల వ్యర్థాలను అక్కడికక్కడే ఎరువుగా మార్చొచ్చు. దీంతో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డులపై భారం తగ్గుతుంది.

• కొన్ని అంకుర సంస్థలు ఆలయాల నుంచి పూలను సేకరించి అగర్‌బత్తీలు, ధూప్‌స్టిక్స్ తయారు చేస్తున్నాయి. వీటి సహాయంతో రీసైక్లింగ్ సులభమవుతుంది. • ఆలయాల వద్ద ఉన్న కౌంటర్లు, పూల దుకాణాల వద్ద బయోడీగ్రేడబుల్ కవర్లను తప్పనిసరి చేయాలి.

ఇతర ఆలయాల్లో ఇలా..

• మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ మహాకాళేశ్వర్ ఆలయంలో నిత్యం టన్నుల కొద్దీ పోగయ్యే బిల్వపత్రాలు, పూలమాలలను ప్రాసెస్ చేయడానికి ఆలయ పరిధిలోనే భారీ కంపోస్టింగ్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా తయారయ్యే సేంద్రియ ఎరువును ప్యాక్ చేసి రైతులు, భక్తుల ఇంటి తోటల కోసం తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. • ముంబయి సిద్ధి వినాయక ఆలయంలో సమర్పించే బంతిపూల నుంచి దుస్తుల పరిశ్రమకు ఉపయోగపడే సహజ రంగులు తయారు చేస్తున్నారు.

• తిరుమలలో శ్రీవారికి, పద్మావతి అమ్మవారికి సమర్పించే టన్నులకొద్దీ పూలమాలలను రీసైక్లింగ్ చేసి అగర్‌బత్తీలుగా మార్చి భక్తులకు విక్రయిస్తున్నారు. • విజయవాడ దుర్గమ్మ గుడిలో కూడా 8 రకాల అగర్‌బత్తీలు, ధూప్‌స్టిక్స్ తయారు చేస్తున్నారు. దీంతో ఆలయానికి అదనపు ఆదాయం రావడంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతోంది.

కార్యరూపం దాల్చలేదు

రోజూ పోగయ్యే పూలను భక్తులకే పంచి పెడుతున్నాం. మిగిలిన వ్యర్థాలు సాధారణ చెత్తతో పాటే పంపుతున్నాం. రీసైక్లింగ్‌కు సంబంధించి గతంతో కొన్ని అంకుర సంస్థలు సంప్రదించాయి. కానీ అది కార్యరూపం దాల్చలేదు. – శ్రీనివాసరాజు, ఈవో, పెద్దమ్మ ఆలయం, జూబ్లీహిల్స్.

పుణ్యక్షేత్రాలకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైలు

విజయవాడ, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రాలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం భారత్ గౌరవ్ టూరిస్ట్ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ప్రాంతీయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్య, కాశీ, బైద్యనాథ్ ధామ్ పేరుతో మొత్తం 10 పగళ్లు, 9 రాత్రులతో గల ఈ ప్యాకేజీలో రైలు అక్టోబరు 24న సికింద్రాబాద్ నుంచి బయల్దేరుతుంది. విజయవాడ, గుడివాడ, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని మీదగా పూరీ జగన్నాథ ఆలయం, కోణార్క్ సూర్య దేవాలయం, బైద్యనాథ్ ఆలయం, వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయం, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణ ఆలయాలు, సాయంత్రం గంగా హారతి, అయోధ్యలో రామజన్మభూమి, హనుమాన్ ఆలయం, సరయూ నది హారతి, ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించి రైలు నవంబరు 2వ తేదీ తిరుగు ప్రయాణం అవుతుంది. టీ, టిఫిన్, భోజనం, రవాణా, హోటల్ గదులు, ఇన్సూరెన్స్‌తో కలిపి టికెట్ ధర ఒక్కొక్కరికీ స్లీపర్ తరగతిలో రూ.17వేలు, థర్డ్ ఏసీలో రూ.26,400, సెకెండ్ ఏసీలో రూ.34,400 ఉంటుంది. టికెట్ల బుకింగ్ ఇతర వివరాల కోసం ఫోన్ నంబరు 92810 30714లో సంప్రదించాలని కోరారు.



ఆది దేవుడి ఆగమనం.. అదిరిందయ్యా

వినాయక చవితి రోజున ప్రతిష్ఠించడానికి తీసుకొస్తున్న లంబోదరుడిని ఆహ్వానిస్తూ సీతాఫల్‌మండిలో శనివారం అర్ధరాత్రి తర్వాత నిర్వహించిన వినాయక 'ఆగమనం' శోభాయాత్ర వైభవంగా సాగింది. రంగురంగుల విద్యుత్ దీపాలు, బాణసంచా కాంతులు, డప్పు వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కనులవిందుగా సాగింది. సీతాఫల్‌మండి నుంచి వారాసిగూడ ప్రధాన రహదారి మీదుగా సాగిన ఈ యాత్రకు భక్తులు భారీగా తరలివచ్చారు. జై గణేశా అంటూ నామస్మరణ చేస్తూ తమతమ సెల్‌ఫోన్లలో యాత్రను బంధించారు. –ఈనాడు, హైదరాబాద్

రాజేంద్రనగర్ ఎంఐఎం ఇన్‌ఛార్జిగా ఎమ్మెల్యే ముబీన్



అబిడ్స్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎంఐఎం పార్టీ ఇన్‌ఛార్జిగా బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌ను నియమిస్తూ ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పార్టీ అధికార ప్రతినిధి అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రెహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరించిన నేపథ్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ముబీన్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. మీర్జా రెహ్మత్ బేగ్ బహిష్కరణ అనంతరం రాజేంద్రనగర్ పార్టీ వ్యవహారాలకు కొత్త ఇన్‌ఛార్జిని నియమించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

ట్రాఫిక్ చిక్కుల్లో విద్యార్థి.. పరీక్ష కేంద్రానికి చేర్చిన పోలీసులు



ప్యాట్రోలింగ్ వాహనంలో వికాస్‌ను కేంద్రానికి తీసుకెళ్తున్న పోలీసులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: నీట్ పీజీ పరీక్ష రాసేందుకు బయలుదేరి ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఓ విద్యార్థిని రాయదుర్గం పోలీసులు తమ వాహనంలో పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. కొంపల్లికి చెందిన వికాస్ ఆదివారం ఉదయం నీట్ పీజీ పరీక్ష రాసేందుకు తండ్రి ప్రవీణ్‌తో కలిసి షేక్‌పేట జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలోని కేంద్రానికి కారులో ఓఆర్ఆర్ మీదుగా బయలుదేరారు. గచ్చిబౌలి ఫ్లైవంతెన సమీపంలో మారథాన్ నేపథ్యంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. దీంతో వారు స్థానిక పోలీసుల సాయం కోరారు. స్పందించిన రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ భూపతి, ట్రాఫిక్ రాణా ఆర్ఐ హన్మిరెడ్డిలు ప్యాట్రోలింగ్ వాహనం ఏర్పాటు చేశారు. సకాలంలో కేంద్రానికి తీసుకెళ్లి, పరీక్ష రాసేలా చూశారు.

ఎన్‌హెచ్-65పై వాహనాల రద్దీ



అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద హైదరాబాద్ వైపు వాహనాల వరుస

అబ్దుల్లాపూర్‌మెట్: రాఖీ పండగతో పాటు వారాంతపు సెలవులు కలిసి రావడంతో శుక్రవారం స్వగ్రామాలకు వెళ్లిన నగరవాసులు.. ఆదివారం మధ్యాహ్నం నుంచి తిరుగు ప్రయాణం కావడంతో ఎన్‌హెచ్ 65పై నగరం వైపు మార్గం రద్దీగా మారింది. పండగలు, వరుస సెలవుల ప్రారంభం రోజు హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 65)పై సొంతూళ్లకు వెళ్లే వారితో విజయవాడ మార్గం.. సెలవులు ముగిసే రోజు హైదరాబాద్ వైపు మార్గంలో వేల కార్లు, ఇతర వాహనాల వరుస కట్టి ప్రయాణిస్తుండటంతో రద్దీగా మారుతోంది. దీనికి తోడు ఎన్‌హెచ్ 65 విస్తరణ పనులు హైదరాబాద్ శివారు కొత్తగూడెం నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వరకు మాత్రమే జరిగి.. ప్రధాన కూడలి ప్రాంతంలో అసంపూర్తిగా ఉండటం, అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి నగరం దిశగా రెండు వైపులా సర్వీస్ రోడ్లను పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో ఈ ప్రాంతం నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది.

సుపరిపాలనతోనే గ్రామాభివృద్ధి: సీతక్క



గోడపత్రిక ఆవిష్కరణలో మంత్రి సీతక్క, బ్రహ్మకుమారి ప్రతినిధులు

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: సమాజ అభివృద్ధికి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కీలకమని, విలువలతో కూడిన సుపరిపాలన ద్వారానే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని మంత్రి సీతక్క అన్నారు. సర్పంచులు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి విభాగం అధికారుల కోసం బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ శిక్షణకు సంబంధించిన గోడ పత్రికను ఆదివారం గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'సు-శాసనం ద్వారా గ్రామ స్వరాజ్యం వైపు' అనే థీమ్‌తో రూపొందించిన శిక్షణ కార్యక్రమం ద్వారా గ్రామీణ పాలనను మరింత బలోపేతం అవుతుందన్నారు. సర్పంచుల్లో, అధికారుల్లో నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి శిక్షణ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శాంతి సరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్, ప్రతినిధులు అంజలి, అరుంధతి, వంశీధర్ పాల్గొన్నారు.

గిడుగు పురస్కారాల ప్రదానం



ప్రశంసాపత్రం ఇస్తున్న టీడీ.జనార్దన్, బిక్కి కృష్ణ

నల్లకుంట, న్యూస్‌టుడే: గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్, శంకర్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో గిడుగు జాతీయ పురస్కారాలు అందజేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో భాషా, సేవా, కళారంగాల్లో కృషి చేసిన సుమారు 75 మందికి పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా తెదేపా జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ టీడీ.జనార్దన్ పాల్గొని ప్రతిభావంతులకు శాలువా కప్పి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎలమంచి ధనలక్ష్మి, జీవన్‌లాల్, జల్లి విద్యాధర, సీతాలక్ష్మి, డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ ఎలిపి రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆగాఖాన్ ట్రస్టుకు కుతుబ్‌షాహీ టూంబ్స్

పునరుద్ధరణ పనులతో పాటు నిర్వహణ బాధ్యతల అప్పగింత

గోల్కొండ, న్యూస్‌టుడే



కొత్తగా ఏర్పాటు చేసిన టికెట్ కౌంటర్

చారిత్రక కుతుబ్‌షాహీ టూంబ్స్ (కుతుబ్‌షాహీ హెరిటేజ్ పార్క్) నిర్మాణాల పునరుద్ధరణ పనులతో పాటు నిర్వహణ బాధ్యతలను ఇకపై ఆగాఖాన్ ట్రస్టు చేపట్టనుంది. దీనికి సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ, ఆగాఖాన్ ట్రస్ట్, కులీకుతుబ్‌షా అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీలు పది సంవత్సరాల కాలపరిమితికి ఎంఓయూ కుదుర్చుకున్నట్లు సమాచారం. ఆగస్టు 1 నుంచి హెరిటేజ్ పార్కు బాధ్యతలను ఆగాఖాన్ ట్రస్టు చేపట్టాల్సి ఉన్నా.. పేపర్‌వర్క్ పెండింగ్‌లో ఉండటంతో కొంత ఆలస్యమైనట్లు సమాచారం.

106 ఎకరాలు.. 100కు పైగా నిర్మాణాలు

చారిత్రక కుతుబ్‌షాహీ టూంబ్స్ 106 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇక్కడ ఏడు కుతుబ్‌షాహీ రాజుల టూంబ్స్‌లతో పాటు ఇతర నిర్మాణాలు 100కు పైగా ఉన్నాయి. ఇక్కడి నిర్మాణాల కన్జర్వేషన్, రిస్టోరేషన్ పనుల కోసం 2013లో ఆగాఖాన్ ట్రస్టు, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య పది సంవత్సరాల కోసం ఒప్పందం కుదిరింది. ఈ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. టూంబ్స్‌ను ఆనుకుని దక్కన్ పార్కు ఉంది. ప్రస్తుతం ఇందులో కేంద్ర నిధులతో ఎంటర్‌ప్రిటేషన్ సెంటర్ పనులు జరుగుతున్నాయి.

చురుగ్గా సాగుతున్న పనులు

కుతుబ్‌షాహీ హెరిటేజ్ పార్కుతో పాటు దక్కన్ పార్కును ప్రభుత్వం ఆగాఖాన్‌ట్రస్టుకు కట్టబెడుతుండటంతో ఆగాఖాన్ ట్రస్టు దీనికి సంబంధించిన పనుల్లో నిమగ్నమైంది. ఇప్పటి వరకు టూంబ్స్, దక్కన్ పార్కుల్లోకి ప్రవేశించేందుకు రెండు చోట్ల టికెట్ తీసుకుంటున్నారు. ఇకమీదట రెంటికి కలిపి ఒకే టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయనున్నారు. దక్కన్ పార్కు ప్రవేశ ద్వారం వద్ద ఇప్పటికే టికెట్ కౌంటర్‌ను సిద్ధం చేశారు. ఇక్కడ కుతుబ్‌షాహీ హెరిటేజ్ పార్కు బోర్డును ఏర్పాటు చేస్తున్నారు. టూంబ్స్ నిర్వహణ బాధ్యతలను హెరిటేజ్ తెలంగాణ ఉద్యోగులు చూస్తుండగా.. దక్కన్ పార్కు నిర్వహణ బాధ్యతలను కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సిబ్బంది చూస్తున్నారు. టూంబ్స్‌లో శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లోని సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది మొత్తం 31 ఉన్నారు.



కుతుబ్‌షాహీ టూంబ్

కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలి



సాంబశివరావుకు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

హిమాయత్‌నగర్: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని, ఈ పద్ధతుల్లో పని చేస్తున్న వారి కోసం వెంటనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చాలీచాలని జీతాలిస్తూ శ్రమదోపిడీ చేస్తున్నారన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నరసింహ, రామ రాజేశ్ ఖన్నా మాట్లాడుతూ.. కనీస వేతనాల కోసం 1195, 1190, 1187 జీవోలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈమేరకు సంఘం నాయకులు కూనంనేనికి వినతిపత్రాన్ని అందజేశారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ముషీరాబాద్: స్వాంతన ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కోర్సులను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ ప్రతినిధి శిరీష కోరారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పేద, మధ్యతరగతి యువత, నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. డేటా అనలిటిక్స్, ఏఐ టూల్స్, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, పవర్‌పాయింట్, ఏఐటూల్స్, బేసిక్ పైథాన్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్నెట్ పరిజ్ఞానం, ఇంగ్లీషు టైపింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 3 నెలలు కొనసాగే శిక్షణకు త్వరలో బ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయన్నారు. 18-27 ఏళ్ల యువత అర్హులన్నారు. వివరాలకు 8688914603లో కానీ, గంగపుత్ర కాలనీలోని ట్రస్టు కంప్యూటర్ శిక్షణకేంద్రంలో సంప్రదించాలని కోరారు.

వసుంధర

vasundhara@eenadu.in



అన్నింటికీ అమ్మే ఆది గురువు. ఆహారపు అలవాట్ల నుంచి ఆర్థిక పాఠాల వరకూ అన్నీ తనని చూసే నేర్చుకుంటారు. తను చెబితేనే అనుసరిస్తారు. అయితే వాటిని పాఠాలుగా కాకుండా రోజువారీ పనుల్లో భాగం చేసి నేర్పించాలి. అప్పుడే... ఎప్పటికీ గుర్తుండిపోతాయంటారు నిపుణులు. అయితే పిల్లల వయసును బట్టి పొదుపు పాఠాలు నేర్పే పద్ధతి కూడా మారాలి అంటున్నారు. అదెలాగంటే...

అమ్మ నేర్పే పొదుపు పాఠాలు!

రెండు జార్ల పద్ధతిలో...



6- 12 ఏళ్ల పిల్లలకు రెండు గాజు జార్లను కొనివ్వండి. ఒకదానిపై పొదుపు, మరో దానిపై ఖర్చు అని రాయాలి. పుట్టినరోజుకీ, అప్పుడప్పుడు మీరు దాచుకోమని ఇచ్చిన డబ్బుని రెండు భాగాలు చేసి అందులో వేయమని చెప్పాలి. ఒకదానిలో వేసే మొత్తాన్ని సొంత ఖర్చులు, అవసరమైన వస్తువులు కొనుక్కోవడానికి ఉపయోగించమని చెప్పాలి. మరొకటి పొదుపు కోసం. నచ్చిన వీడియోగేమ్, వస్తువులు... ఇలా కాస్త ఖరీదైనవి ఏవో ఒకటి వాళ్లకీ కావాలనిపిస్తాయి. అలాంటివి కావాలంటే పొదుపు చేసుకోవాల్సిందే అని చెప్పండి. తగినంత డబ్బులు సమకూరిన తరవాత దగ్గరుండి వాళ్లతోనే కొనిపించాలి. దాంతో దాచుకోవడమే కాదు... కావాల్సింది పొందాలంటే ఎంత కష్టపడాలో కూడా పిల్లలకు తెలుస్తుంది.

మద్దతు ఇస్తూనే...



12- 18 ఏళ్లున్న పిల్లలను ఇంటి ఆర్థిక నిర్ణయాల్లో పాలుపంచుకోనివ్వాలి. ఒకసారే డబ్బులు లెక్కలు అంటే వాళ్లకు అర్థం అవ్వడం కష్టమే కదా! అందుకే ఒక వస్తువుని రెండు వేర్వేరు బ్రాండ్స్‌లో వెతకమనండి. ఏది తక్కువ ధరకు వస్తుందో గమనించమని చెప్పాలి. ఉదాహరణకు రోజూ మనం కొనే పాలు, గుడ్లు, పప్పు, ఉప్పులతోనూ ఈ నైపుణ్యాలు అలవాటు అవుతాయి. ఒక వస్తువుని తెమ్మనండి. 2-3 షాపుల్లో ధర కనుక్కొని ఎక్కడ తక్కువకు వస్తోందో గమనించమనండి. ఆ తరవాతే కొనమంటే సరి. రూ.100 ఇచ్చి మార్కెట్‌కి పంపండి. కొనాల్సిన జాబితా ఇచ్చి, మిగిలిన డబ్బులు తనకే అనండి. ఆచితూచి కొంటారు. మిగుల్చుకోవడానికి ప్రయత్నిస్తారు. అయితే నాణ్యతనీ గమనించమనాలి. ఇవన్నీ నేర్చుకోవడంలో భాగమే. అలాగే గారాబం పక్కనపెట్టి... ఆర్థిక వనరులు, ఇంటి పరిస్థితి గురించీ స్పష్టంగా చెప్పాలి. ఈ వయసులోనే విద్యా రుణాలు, స్కాలర్‌షిప్‌లు వంటి వాటి గురించి చెప్పాలి. వాళ్లనే స్వయంగా వాటిని సంపాదించుకునేలా ప్రోత్సహించాలి. భవిష్యత్తులో క్రెడిట్, డెబిట్ కార్డుల సరైన వినియోగానికి పునాది పడేదీ ఈ వయసులోనే మరి.

జీవితం... లెక్కలు



18-21 ఏళ్లంటే కెరియర్‌పై చాలావరకూ అవగాహన ఏర్పడుతుంది. చిన్నప్పటి నుంచి నేర్చుకున్న ఆర్థిక పాఠాలన్నీ ఆచరణలో పెట్టాల్సిన సమయమూ ఇదే. ఉద్యోగం చేయాలా.. సొంతంగా వ్యాపారం ప్రారంభించాలా... అనే నిర్ణయం వాళ్లకే వదిలేయాలి. కాకపోతే బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డుల వినియోగం గురించి తప్పక జాగ్రత్తలు చెప్పాలి. అంతేకాదు, డిజిటల్ పెట్టుబడుల పైనా అవగాహన కల్పించాలి. అవసరమయితే... సిప్, మ్యూచువల్ ఫండ్స్‌లో నెలకు కనీస మొత్తాన్ని పొదుపు చేయించాలి. దాంతో చిన్న వయసులోనే పొదుపు, మదుపు వల్ల కలిగే ప్రయోజనాలు తెలుస్తాయి. ముఖ్యంగా ఉన్నతచదువు, పెళ్లి... ఇలా భవిష్యత్ అవసరాల గురించి చెప్పండి. వాటిని వాళ్లకు నచ్చినట్టుగా తీర్చిదిద్దుకోవాలంటే ఆర్థిక ప్రణాళిక ఎంత ముఖ్యమో వివరించండి. అప్పుడు తమకేం కావాలో ఆలోచిస్తారు. దానికి అనుగుణంగా నడుస్తారు. ఇది దీర్ఘకాలంలో వాళ్లకి చాలా సాయపడుతుంది.

మాకు పెళ్లయ్యి ఐదేళ్లు. నేను నిర్ణయాలు తీసుకోవడంలో కటువుగా ఉంటా. తేలికగా ఎవరినీ నమ్మలేను. నమ్మిన వాళ్లు మోసం చేస్తే మళ్లీ వాళ్లతో కలవలేను. వీలైనంత దూరంగా ఉండేందుకే ప్రయత్నిస్తా. అలా అని వాళ్లని ద్వేషించను. కాస్త దూరం పాటిస్తా అంతే. అదే మావారికి సమస్యట. ఎవరేం చేసినా మరచిపోయి నవ్వుతూ పలకరించాలి, కలిసిపోవాలంటారు. నాకేమో అలా నటించడం రాదు. తప్పు వాళ్లదే అని తెలిసినా సమర్థిస్తున్నారు. నా వ్యక్తిత్వాన్నే తప్పుపడుతున్నారు. ఇవన్నీ ఆలోచిస్తుంటే రాత్రుళ్లు నిద్ర రావడం లేదు. పని మీద ధ్యాస ఉండటం లేదు. నిజంగా తప్పు నాలోనే ఉందా! – ఓ సోదరి

వాళ్లేం చేసినా మరచిపోవాలటట..

మీ సమస్యకు కారణం కుటుంబ సభ్యులా, బయటి వ్యక్తులా, స్నేహితులా అన్నది చెప్పలేదు. ఏ ఒక్కరి వ్యక్తిత్వం ఇంకొకరిలా ఉండదు. పెరిగిన వాతావరణం, కుటుంబ పరిస్థితులు, పెంపకం... వంటి కారణాల వల్ల ప్రవర్తనలో మార్పులు ఉండటం సహజం. ఇక్కడ ప్రశ్న తప్పొప్పులది కాదు. ప్రవర్తనకు సంబంధించినది. మీరు చెప్పినదాన్నిబట్టి చూస్తే... మంచీ చెడులను ఆలోచిస్తూ, చెడుని సహించని వ్యక్తిత్వం కలవారని అర్థమవుతుంది. అలానే సున్నిత మనస్కులు కూడా. అందుకే విషయాల్ని మనసుకు తీసుకుంటూ తప్పు చేసిన వాళ్లకి దూరంగా ఉంటున్నారు. మీ భర్త దీనికి భిన్నంగా ఉన్నారు. ఓ రకంగా ఆయన చెప్పేదీ మీ మంచి కోసమే. సమాజంలో ఉండాలంటే కొన్నింటిని చూసీ చూడనట్లు వదిలేయాలి. మోసం, చెడు అనుభవాలు ఎదురైనప్పుడు వాటిని అవతలి వాళ్ల నడవడికను అంచనా వేసేందుకు వచ్చిన అవకాశంగానే భావించాలి. కొన్ని హద్దులు పెట్టుకుంటూ, కొనసాగించాలి. అలాకాకుండా ముఖం ముడుచుకోవడమో, పూర్తిగా దూరం పెట్టడమో చేయడం మంచిది కాదు. కుటుంబ సభ్యుల విషయంలో అయితే బంధాలు బీటలు వారే ప్రమాదం ఉంటుంది. మిమ్మల్ని తప్పు బట్టే ఆస్కారమూ ఉంది. కాబట్టి, అందరితోపాటే వాళ్లూ అనుకుని పలకరించేస్తే సరి. ఏ ఒక్కరూ అందరికీ మంచివాళ్లు కాదు, అలా అని చెడ్డవాళ్లూ కాదని మరచిపోకండి.


డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

జీడి మామిడితో బెల్లం

జీడిపప్పుకి ఉన్న విలువ వాటి పండ్లకు ఉండదు. ఎన్నో పోషకాలుండే వాటిని వ్యవసాయ వ్యర్థంగా భావించి పడేస్తుంటారు రైతులు. అలా వృథా అనుకున్న పండ్లతోనే ద్రవరూప బెల్లాన్ని తయారుచేస్తున్నారు **డాక్టర్ జ్యోతి నిషాద్**. దీనికి పేటెంట్ హక్కులీ సొంతం చేసుకున్నారు.



రైతులు పండించే జీడిపండ్లలో కేవలం పది శాతం పండ్లను బెల్లంగా మార్చినా వాళ్ల ఆదాయం లక్షల్లో పెరుగుతుంది. మధుమేహం ఉన్నవాళ్లకి మేలు జరుగుతుంది అంటారు దిల్లీకి చెందిన జ్యోతి నిషాద్. కర్ణాటకలో ఐకార్- డైరెక్టరేట్ ఆఫ్ కాష్యూ రిసర్చ్‌లో... ఫుడ్ టెక్నాలజీ విభాగంలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. ఇటీవల బెంగళూరులో జరిగిన ఇండియన్ హార్టికల్చర్ కాంగ్రెస్ ప్రదర్శనలో ఈ జీడి పండుతో చేసిన లిక్విడ్ బెల్లం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫుడ్ టెక్నాలజీపై ఉన్న ఇష్టంతో ఇండియన్ అగ్రికల్చర్ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పోస్ట్- హార్వెస్ట్ టెక్నాలజీలో పీహెచ్‌డీ చేశారీమె.

వృథాతోనే ఆదాయం..

'భారతదేశంలో దాదాపు 80శాతానికి పైగా జీడిమామిడి పండ్లు వృథాగానే పోతున్నాయి. వాటి నుంచి పప్పుని వేరుచేశాక కొద్దిమొత్తంలో స్థానిక పానీయాలకు వాడినా ఇంకా వేల టన్నుల పండ్లు తోటలోనే కుళ్లిపోతాయి. రైతులు పండించే పంటలో కేవలం పదిశాతం పండ్లను బెల్లంగా మార్చినా... వాళ్ల ఆదాయం లక్షల్లో పెరుగుతుంది. అందుకే తక్కువ వ్యయంతో పొలంలోనే జీడిమామిడి పండ్లతో బెల్లం తయారుచేసే విధానం కనుగొన్నా. హర్డిల్ కాన్సెప్ట్ టెక్నాలజీని ఉపయోగించి జీడిపండ్లలో ఉండే వగరు, చేదును వేరుచేస్తే తియ్యటి రసంతో గుజ్జు మాత్రమే మిగులుతుంది. దాంతో లిక్విడ్ బెల్లం తయారవుతుంది. ఇది ఏడాది నిల్వ ఉంటుంది. అలాగే గుజ్జుని ఫ్రీజ్ చేసుకుంటే ఏడాదిలో ఎప్పుడంటే అప్పుడు బెల్లం చేసుకోవచ్చు. దీంట్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ ఉంటుంది. చెరకుతో చేసిన బెల్లంలో జీఐ విలువ 84 ఉంటే, దీంట్లో జీఐ 59 మాత్రమే ఉంటుంది. అందుకే మధుమేహం ఉన్న వాళ్లు కూడా దీన్ని తినొచ్చు. విటమిన్ సితోపాటు పొటాషియం, ఐరన్, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి బేకరీ ఉత్పత్తుల్లో వాడే ఆర్టిఫిషియల్ సిరప్‌లకు బదులుగానూ దీన్ని వాడొచ్చ'ంటారు జ్యోతి.

మహిళల ఉపాధి కోసం..

ఆమె కనిపెట్టిన ఈ టెక్నాలజీ ల్యాబ్‌కే పరిమితం కావాలనుకోలేదు. అందుకే స్వయం సహాయక సంఘాలకు, గ్రామీణ మహిళలకు, నూతన స్టార్టప్‌లకు ఉపయోగపడేలా ఐకార్ ద్వారా సాయం చేస్తున్నారు. దీంతో రైతులతో పాటు గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు పెరిగాయి. అంతేకాదు, కంప్యూటర్ విజన్, డిజిటల్ ఇమేజింగ్ సాయంతో పండ్లను చెట్టు నుంచి కోయకుండానే వాటి లోపల నాణ్యతను కెమెరా ద్వారా గుర్తించే దిశగా పరిశోధనలు కూడా చేస్తున్నారు. వ్యర్థం అనుకుని పారేసే పండ్లతో రైతులకు ఆదాయం, మహిళలకు ఉపాధి, అందరికీ ఆరోగ్యానిచ్చే ఈ శాస్త్రవేత్త ఆలోచన మెచ్చుకోదగ్గదే కదూ!

మీ బీరువా ఎలా సర్దుతున్నారు?



చీరలు, కుర్తీలు, లెగ్గింగ్‌లు, జీన్స్, చున్నీలు... ఇలా ఎన్నెన్ని రకాలు ఉంటాయో కదా మన వార్డ్‌రోబ్‌లో. అయితే, వాటిల్లో మనకు కావాల్సింది అవసరానికి దొరకాలన్నా, సమయం ఆదా కావాలన్నా ఎప్పటికప్పుడు ఓ పద్ధతిలో సర్దుకోగలిగితే సరి. అందుకోసమే ఈ చిట్కాలు...

- మొదట మీ అల్మారాలో ఉన్న దుస్తులన్నింటినీ బయటకు తీసి, వాటిని రకాలుగా వేరు చేయండి. డైలీ వేర్ కుర్తీలు, నైటీలు ఒక వైపు, ఆఫీస్‌కీ లేదా బయటికి వెళ్లే డ్రెస్సులు మరో వైపు ఉంచాలి. పెళ్లిళ్లు, పండుగలకు కట్టుకునే పట్టు చీరలు, హెవీ డ్రెస్సులను అల్మారాలో పై భాగంలో పెడితే సరి.
- బీరువాని పదిహేను రోజులకోసారైనా సర్దడం అవసరం. అప్పుడే ఏవి వెనక్కి వెళ్లాయి. మడతలు పోయాయా? ఇంకా ఏమున్నాయి వంటివన్నీ గమనించుకోవచ్చు.
- భారతీయుల వార్డ్‌రోబ్‌లో చీరలకే ఎక్కువ స్థలం పడుతుంది. పారదర్శకమైన ఆర్గనైజర్లు, కవర్లను వాడడం వల్ల ఏ చీర ఎక్కడ ఉందో సులభంగా కనిపిస్తుంది. ఖరీదైన పట్టు వాటి మధ్యలో కాటన్ వస్త్రం లేదా తెల్లటి కాగితం ఉంచితే పాడవకుండా ఉంటాయి. రోజూ వాడే కాటన్ చీరలను ఒకే వరుసలో మడత పెట్టి పెట్టాలి.
- కుర్తీలను హ్యాంగర్లకు తగిలించండి. దీనివల్ల ఇస్త్రీ నలగదు, త్వరగా తీసుకోవచ్చు. ఒకవేళ అవి లేకపోతే స్థలాన్ని ఆదా చేయడానికి డ్రాల్లో సర్దొచ్చు. లెగ్గింగ్‌లు, జెగ్గింగ్‌లు, చున్నీలను చిన్న బాక్సులు లేదా డ్రా డివైడర్లలో రంగుల వారీగా మడిచి పెట్టుకుంటే త్వరగా మ్యాచ్ చేసుకోవచ్చు.
- సాధారణంగా దుస్తులను ఒకదానిపై ఒకటి పేర్చడం వల్ల కింద ఉన్నవి తీసేటప్పుడు అన్నీ చిందరవందర అవుతాయి. ఈ సమస్యను నివారించడానికి నిలువు మడత పెట్టండి. కోన్‌మారి పద్ధతిలో దుస్తులను నిలువుగా మడిచి బాక్సుల్లో లేదా అరల్లో సర్దితే ఎక్కువ స్థలం మిగులుతుంది. వెతికేటప్పుడు అన్నీ స్పష్టంగా కంటికి కనిపిస్తాయి.
- అల్మారాలో చిన్న బాక్సులు, హుక్స్, మల్టీ-టైర్ హ్యాంగర్లను ఉపయోగించడం ద్వారా ఖాళీ స్థలాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవచ్చు. దుస్తుల మధ్యలో నాఫ్తలీన్ బాల్స్, లావెండర్ పౌచ్‌లు ఉంచితే మంచి వాసనతో ఉంటాయి.

ఆమె డాక్టర్! కాబట్టే, యువత నాడి పట్టారు విదేశాల్లో స్థిరపడే అవకాశాన్ని వదులుకుని కెఫెని ప్రారంభించారు. అయితే ఇది కొంచెం స్పెషల్. **డాక్టర్ ఆరవపల్లి రమ్య సాయి**... ఆమె కాఫీకి ప్రశాంతతనీ జోడిస్తున్నారు.

డాక్టర్.. కెఫే!



రమ్యసాయిది విజయవాడలోని పెనమలూరు. నాన్న కృష్ణకిషోర్ ఆమెకు నాలుగేళ్లున్నప్పుడే చనిపోయారు. దీంతో అమ్మ రూపావాణి టీచర్‌గా చేస్తూ... కుటుంబ బాధ్యతను తీసుకున్నారు. తాతయ్య వెంకటేశ్వరరావు అండ సరేసరి. వాళ్ల ఆశలు నెరవేర్చాలనే లక్ష్యంగా చిన్నప్పట్నుంచీ కష్టపడి చదివేవారు రమ్య. ఫార్మ్‌డి చేశాక లండన్‌లో గ్లోబల్ హెల్త్ పబ్లిక్‌పై మాస్టర్స్ పూర్తి చేశారు. ఆపై అక్కడ స్థిరపడే అవకాశం వచ్చిందామెకు. అయినా కన్నతల్లి, భారత్‌పై ఉన్న ప్రేమ, మమకారం తిరిగి వెనక్కి రప్పించాయి. అలా వచ్చిన ఆమె 2024లో 'ఫ్రోత్ అండ్ ఫ్రెండ్స్' పేరుతో కెఫెని ప్రారంభించారు.

'ఫార్మసీ చదివే రోజుల్లోనే సొంతంగా ఏదైనా వ్యాపారం చేయాలనుండేది. కొన్నాళ్లు ఉద్యోగం చేశా. ఆ సమయంలో ఒత్తిడి నుంచి తప్పించుకోవడానికి స్నేహితులతో కలిసి తరచూ కెఫెలకు వెళ్లేదాన్ని. అప్పుడు వేరేవాళ్లకు డబ్బులివ్వడమెందుకు? మనమే ఒక కెఫె పెడితే సరి అనుకుని సరదాగా నవ్వుకునేవాళ్లం. అలా సరదాగా దొర్లిన మాట. ఇలా నిజమైంది' అంటారు రమ్య. పొగలు కక్కే కాఫీ, రుచికరమైన ఆహారానికే పరిమితమవ్వలేదామె. వినియోగదారులకు రోజువారీ ఉరుకులు పరుగులు, ఒత్తిడికి దూరంగా ప్రశాంతతను అందించాలనుకున్నారు. అందుకే గేమింగ్ జోన్, స్నేహితులతో కబుర్లు చెప్పుకొనేలా, కుటుంబ సభ్యులతో గడిపేలా, చిన్నపాటి వేడుకలు జరుపుకొనేలా ఏర్పాట్లు చేశారు. ఇంటీరియర్ దగ్గర్నుంచి, డిజైనింగ్ వరకూ అన్నీ రమ్యనే దగ్గరుండి చూసుకున్నారు. 'తొలిరోజుల్లో మా కెఫె పరిచయం కావడానికి సమయం పట్టింది. తరవాత నోటిమాట ద్వారా ప్రచారం దొరికింది. ఇప్పుడు వారాంతాల్లో కళకళలాడిపోతుంది. నెలకు రూ.6లక్షల ఆదాయాన్నీ పొందుతున్నాం' అనే రమ్య వినియోగదారుల ఆరోగ్యంపైనా దృష్టిపెడుతున్నారు. కాబట్టే, ఈ కెఫెలో దొరికే వంటకాల్లో టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్స్ లేకుండా చూసుకుంటున్నారు. 'విశ్రాంతి భావన కలగాలని ఒక ఇంటినే కెఫెగా మలిచా. చాలామంది సన్నిహితులు, కుటుంబంతో వస్తుంటారు. ఇక్కడి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తూ, సెల్ఫీల్లో ఆ మధుర జ్ఞాపకాలను బంధిస్తూ ఆనందంగా గడుపుతున్నారు. వృత్తి ఏదైనా.. మనసు పెట్టి పనిచేస్తే విజయం ఖాయం' అంటారు డాక్టర్ రమ్య.

– బొర్రా సత్యవేణి, విజయవాడ

ఇరవైల నుంచే మొదలు..



ప్రస్తుతం అమ్మాయిలు ఎదుర్కొంటోన్న అనారోగ్య సమస్యల్లో హార్మోన్ల అసమతౌల్యత ఒకటి. ఇదివరకు మధ్యవయస్కులైన మహిళల్నే ఇది ప్రభావితం చేసేది. కానీ ఇప్పుడో 20-25 సంవత్సరాల అమ్మాయిలూ దీని బారినపడుతున్నారట. ఇదంతా ఆధునిక జీవనశైలి ప్రభావమే అంటున్నారు నిపుణులు. పైగా, జీవనశైలి సంబంధిత వ్యాధులు యువతలోనే ఎక్కువగా పెరుగుతున్నాయని చెబుతున్నాయి చాలా అధ్యయనాలు. పీఎంఓఎస్ కూడా అందులో భాగమే. 'పీఎంఓఎస్ సొసైటీ ఆఫ్ ఇండియా' అధ్యయనాల ప్రకారం ప్రతి ఐదుగురు భారతీయ మహిళల్లో ఒకరు ఈ సమస్యతో బాధపడుతున్నారు. భోజన వేళలు పాటించకపోవడం. ప్రొటీన్ల లోపం, దీర్ఘకాలిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం, నిద్ర లేమి... వంటివి దీనికి కారణాలు. ఇవన్నీ చాలవన్నట్లు సామాజిక మాధ్యమాల ప్రభావమూ దీనికి తోడవుతోంది. ఇప్పటికైనా మించి పోయింది లేదు. పిల్లల ఆహారం, నిద్ర, జీవనశైలి అలవాట్లమీద కాస్త దృష్టి సారించమని హెచ్చరిస్తున్నారు నిపుణులు. పాటిస్తారుగా మరి!



"సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల్ని నడుపుతున్న వాళ్లలో 20 శాతం మంది స్త్రీలే ఉన్నారు. అసంఘటిత రంగంలో 70 శాతం వ్యాపారాలనూ వాళ్లే నడిపిస్తున్నారు. తమ కుటుంబాలను పేదరికం నుంచి బయటపడేయాలనీ, పిల్లలకు మంచి అవకాశాలు కల్పించాలనీ ముందడుగు వేస్తున్నారు. అలాగే కార్పొరేట్ రంగంలోని మహిళలూ కెరియర్‌లో రాణించేందుకు ఒక కారణాన్ని ఎంచుకోవాలి. మా పాప పుట్టిన ఏడాదే, భర్తతో కలిసి 'ఆఫ్ బిజినెస్' సంస్థను స్థాపించా. పాపనీ, కంపెనీనీ కవల పిల్లలుగా భావించి పనిచేస్తూ వచ్చాం. యూనికార్న్ స్థాయిని అందుకున్నాం.

- **రుచి కల్రా**, సహ వ్యవస్థాపకురాలు, ఆఫ్ బిజినెస్, ఆక్సిజో

స్వీట్ హోమ్





అభిరుచికి అద్దం పట్టేలా..





ఇంట్లో గోడలంటే రంగులు వేసి ఫొటో ఫ్రేమ్‌లు తగిలించే చోటు మాత్రమే కాదు. మన అభిరుచిని చెప్పే కాన్వాస్‌లు కూడా. అందుకే ఇప్పుడు చాలామంది వాటిని సాదాసీదాగా కనిపించే వాల్‌షెల్ఫ్‌లతో సరిపెట్టుకోవట్లేదు. ప్రకృతి అందాలు, పక్షులు, జంతువుల ఆకారంలో ఆర్టిస్టిక్ వాల్ షెల్ఫ్‌లు ఇంట్లో భాగం చేసుకుంటున్నారు. లివింగ్ రూమ్‌లో నేచురల్ వుడ్ ఫినిషింగ్‌తో ఉండే జింక... పడకగదిలో పేస్టల్ కలర్‌లో వికసించిన పువ్వు... ఇంకాస్త గ్రాండ్‌గా కనిపించడానికి మెటాలిక్ టచ్‌తో డిజైన్ చేసిన నెమలితో చేసిన షెల్ఫ్‌లు అమర్చి ఇంటికి క్లాసిక్ లుక్ ఇచ్చేస్తున్నారు. ఇంకా చిన్నారుల గది లేదా స్టడీ రూమ్ కోసం హాట్ ఎయిర్ బెలూన్ ఆకారంలో ఉండే షెల్ఫ్‌లను ఏర్పాటుచేస్తున్నారు. వీటి కింద బుల్లి బాస్కెట్‌లో వాళ్ల చిన్నచిన్న వస్తువులు దాచుకునేందుకు వీలుగా సొరుగుల్ని కూడా తయారు చేస్తున్నారు. ప్రకృతిని ఇష్టపడేవారి కోసం కిటికీ పక్కన ఆకుల ఆకారాల్లో ఉండే కబోర్డులను అమర్చుకుని, వాటి అరల్లో ఇండోర్ మొక్కల్ని పెంచుకుంటున్నారు. ఇక ఇంట్లో ఉండే మూలల్ని పక్షి ఆకారంలో ఉండే షెల్ఫ్‌లతో అందంగా మార్చేసుకుంటున్నారు. 'కబోర్డులు అంటే కేవలం వస్తువులు దాచుకోవడానికే కాదు. ఇంటి అందాన్ని రెట్టింపు చేసేవిగా ఉండాలి. అందుకే ఈ మోడ్రన్ షెల్ఫ్‌లు. ఇవి ఉపయోగంతోపాటు ఇంటికి ప్రత్యేక అలంకరణల పని లేకుండా చేస్తాయి' అంటూ మురిసిపోతున్నారు ఇంటీరియర్ ప్రేమికులు.



రింగుల జుట్టా?



ఈ హడావుడి జీవనశైలిలో అమ్మాయిల జుట్టు కష్టాలు మామూలుగా ఉండవు. ఇక రింగుల జుట్టు వాళ్ల పరిస్థితి వేరే చెప్పాలా? కాస్త వాతావరణం మారితే చాలు జుట్టు గడ్డిలా మారుతుంది. వచ్చీ పోయే వర్షాలతో నిర్వహణా కష్టమే. మృదువుగా కనిపించాలా... ఇలా చేస్తే సరి.

పొడిగా, ఎండిపోయినట్లుగా కనిపిస్తోందని అస్తమానూ షాంపూ చేయొద్దు. అతిగా తలస్నానం చేసినా కురులలోని సహజ నూనెలు పోయి సమస్య మరింత పెరుగుతుంది. కావాలంటే నీటితో కానీ, కర్ల్ రిఫ్రెషర్‌ని కానీ స్ప్రే చేయండి. ఇవి కురులను తాజాగా కనిపించేలా చేస్తాయి. రింగుల జుట్టు సహజంగానే త్వరగా తేమని కోల్పోతుంది. కాబట్టే, పొడిబారి కనిపించడం, చిట్లడం వగైరా! అరకప్పు కలబంద గుజ్జులో పావుకప్పు కొబ్బరినూనె కలిపి కాసేపు వదిలేయండి. ఆ మిశ్రమాన్ని తరవాత మాడు నుంచి చివర్ల వరకూ పట్టించండి. అరగంటయ్యాక గాఢతలేని షాంపూతో తలస్నానం చేస్తే సరి. పావుకప్పు పెరుగులో మూడు స్పూన్ల తేనె కలిపి పట్టించినా మంచిదే. మిగలపండిన అరటి పండు, కలబంద గుజ్జు... సమపాళ్లలో తీసుకునీ బాగా మెత్తగా మెదిపి తలకు పట్టించొచ్చు. ఇవి కురులకు తేమను అందిస్తాయి. వారానికోసారి వీటిల్లో నచ్చింది ప్రయత్నిస్తే సరి.

తల త్వరగా ఆరదు. అందుకని మరీ రుద్దేయొద్దు. మృదువుగా నీళ్లన్నీ పిండేయండి. ఆపై కాటన్ టీషర్టుతోనో మెత్తని టవల్‌తోనే అద్దితే తడి త్వరగా పోతుంది. ఇంటి చిట్కాల పేరుతో నిమ్మ, బేకింగ్‌సోడా, యాపిల్ సిడార్ వినెగర్ వంటివి మీరు వాడొద్దు. పొడిబారే సమస్య మరింత పెరుగుతుంది. జుట్టు త్వరగా లేస్తుందని గట్టిగా అల్లడం చేయొద్దు. కండిషనర్‌నీ తప్పనిసరి చేసుకోండి. నిర్దిష్ట హెయిర్ కేర్ రొటీన్‌ని పాటిస్తూ వెళ్లండి. మృదువైన మీ రింగులు మిమ్మల్నే కాదు... చూపరులనూ ఆకర్షించడం ఖాయం.

మహిళల టీ20 ఆసియాకప్‌లో భారత్ ఘనంగా బోణీ కొట్టింది. బంతితో విజృంభించిన ఆ జట్టు.. పసికూన థాయ్‌లాండ్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. అయితే బ్యాటుతో భారత్ మెరవలేకపోయింది. షెఫాలి వర్మ మెరుపులతో ఓ మోస్తరు స్కోరు మాత్రమే చేయగలిగిన హర్మన్‌ప్రీత్ బృందం.. స్పిన్నర్ల జోరుతో థాయ్‌లాండ్‌ను కుప్పకూల్చింది.

కూనను చుట్టేశారు

విజృంభించిన బౌలర్లు

- ఆసియాకప్‌లో భారత్ శుభారంభం
- థాయ్‌లాండ్‌పై ఘనవిజయం


షెఫాలి 64

దుబాయ్

మహిళల ఆసియాకప్‌లో భారత్‌కు అదిరే ఆరంభం. ఆదివారం అత్యంత ఏకపక్షంగా సాగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 94 పరుగుల తేడాతో థాయ్‌లాండ్‌పై ఘన విజయం సాధించింది. షెఫాలి వర్మ (64; 36 బంతుల్లో 8×4, 3×6) మెరుపులతో మొదట భారత్ 9 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. మిగతా బ్యాటర్ల వైఫల్యం కారణంగా భారత్ తక్కువ స్కోరుతో సరిపెట్టుకుంది. థాయ్ స్పిన్నర్లు లవోమి (3/26), సునిద (2/31) రాణించారు. లక్ష్య ఛేదనలో థాయ్‌లాండ్ తేలిపోయింది. దీప్తి 1.1 ఓవర్లలో ఒక్క పరుగూ ఇవ్వకుండా 3 వికెట్లు తీయగా.. నందని (3/18), శ్రీచరణి (2/10) కూడా విజృంభించడంతో థాయ్ జట్టు 16.1 ఓవర్లలో 65 పరుగులకే కుప్పకూలింది. ననపత్ (41; 48 బంతుల్లో 5×4) టాప్ స్కోరర్. ఆమె తప్ప ఇంకెవరూ రెండంకెల స్కోరు చేయకపోవడం గమనార్హం. ఈ మ్యాచ్‌తో ప్రతీక రావల్ టీ20 అరంగేట్రం చేసింది. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో సెప్టెంబరు 3న హాంకాంగ్‌తో తలపడుతుంది.


శ్రీచరణి 2/10


దీప్తి 3/0

షెఫాలి మెరిసినా..: పసికూనపై భారత్ పరుగుల వరద పారిస్తుందని అంతా అనుకున్నారు. కానీ ఆ జట్టు అనూహ్యంగా 159 పరుగులే చేసింది. బ్యాటుతో ఘోరంగా విఫలమైనప్పటికీ బంతితో భారత్‌ను కట్టడి చేయడం థాయ్‌లాండ్‌కు సంతోషాన్నిచ్చే విషయమే. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. షెఫాలి మెరుపులతో ఇన్నింగ్స్‌కు బలమైన పునాదిని వేసుకుంది. చకచకా బౌండరీలు బాదిన షెఫాలి.. స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. 26 బంతుల్లోనే అర్ధసెంచరీ చేసింది. టీ20 కెరీర్‌లో ఆమెకు ఇది 19వ అర్ధశతకం. అలవోకగా షాట్లు ఆడిన షెఫాలి.. స్మృతి మంధాన (19; 10 బంతుల్లో 4×4)తో తొలి వికెట్‌కు 38, ప్రతీక రావల్ (22; 18 బంతుల్లో 2×4, 1×6) రెండో వికెట్‌కు 53 పరుగులు జోడించింది. స్మృతి (19; 10 బంతుల్లో 4×4) ధాటిగానే ఆరంభించినప్పటికీ ఎక్కువ సేపు నిలవలేకపోయింది. ప్రతీక రావల్ (22; 18 బంతుల్లో 2×4, 1×6) కూడా తన ఆరంభాన్ని పెద్ద స్కోరుగా మలచలేకపోయింది. అయినా షెఫాలి జోరుతో 10 ఓవర్లలో 101/2తో నిలిచిన భారత్.. అలవోకగా 200 చేసేలా కనిపించింది. కానీ అనూహ్యంగా తడబడింది. నాలుగు పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయింది. హర్మన్‌ప్రీత్ (5), షెఫాలి, రిచా (0) ఔటయ్యారు. హర్మన్‌ప్రీత్‌ను పుతవాంగ్ వెనక్కి పంపగా.. షెఫాలి, రిచాలను లవోమి వరుస బంతుల్లో ఔట్ చేసింది. ఆ తర్వాత కూడా క్రమం తప్పకుండా వికెట్లు పడ్డాయి. దీప్తి శర్మ (5) కూడా విఫలమైంది. ఆఖర్లో క్రాంతి గౌడ్ (15 నాటౌట్; 8 బంతుల్లో 1×4, 1×6) బ్యాట్ ఝుళిపించడంతో స్కోరు 150 దాటింది. భారత జట్టు ఆఖరి 9 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 52 పరుగులు మాత్రమే చేసింది. థాయ్ స్పిన్నర్లు లవోమి (3/26), సునిద (2/31) భారత్‌ను దెబ్బతీశారు.

చేతులెత్తేసిన థాయ్‌లాండ్: ఛేదనలో థాయ్‌లాండ్ చేతులెత్తేసింది. భారత బౌలర్ల ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన ఆ జట్టు.. ఏ దశలోనూ పోటీలో లేదు. నతకన్ (4)ను ఔట్ చేయడం ద్వారా థాయ్‌ని తొలి ఓవర్లోనే క్రాంతి దెబ్బతీసింది. ఆ తర్వాత నందని, శ్రీచరణి, దీప్తి శర్మ, నందని శర్మ చకచకా వికెట్లు పడగొట్టి త్వరగా మ్యాచ్‌ను ముగించారు. ఓ వైపు వికెట్లు పోతున్నా, ననపత్ పోరాడింది. ఆమె వల్లే థాయ్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. ననపత్ చివరి వికెట్ రూపంలో నిష్క్రమించింది.

భారత్ ఇన్నింగ్స్: స్మృతి రనౌట్ 19; షెఫాలి (సి) అండ్ (బి) లవోమి 64; ప్రతీక (బి) లవోమి 22; హర్మన్‌ప్రీత్ (సి) మాయ (బి) పుతవాంగ్ 5; పుల్మాలి (సి) అపిసర (బి) సునిద 13; రిచా ఘోష్ (సి) పుతవాంగ్ (బి) లవోమి 0; దీప్తి శర్మ రనౌట్ 5; ప్రేమ రావత్ (స్టంప్డ్) ననపత్ (సి) సునిద 6; నందని శర్మ (బి) చనిద 1; శ్రీచరణి నాటౌట్ 6; క్రాంతి గౌడ్ నాటౌట్ 15; ఎక్స్‌ట్రాలు 3 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **159; వికెట్ల పతనం:** 1-38, 2-91, 3-108, 4-112, 5-112, 6-127, 7-136, 8-137, 9-137; **బౌలింగ్:** మాయ 3-0-31-0; పుతవాంగ్ 4-0-37-1; సునిద 3-0-31-2; ఒనిచ 3-0-19-0; లవోమి 4-0-26-3; చనిద 3-0-14-1

థాయ్‌లాండ్ ఇన్నింగ్స్: నతకన్ (బి) క్రాంతి 4; మాయ (సి) ప్రతీక (బి) నందని 6; ననపత్ (సి) రిచా (బి) దీప్తి 41; అపిసర ఎల్బీ (బి) శ్రీచరణి 1; చనిద (సి) స్మృతి (బి) శ్రీచరణి 5; నవోమి ఎల్బీ (బి) దీప్తి 1; చైహాన్ (సి) నందని (బి) దీప్తి 0; లవోమి (సి) షెఫాలి (బి) నందని 6; సునిద (సి) రిచా (బి) నందని 0; ఒనిచ రనౌట్ 0; పుతవాంగ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 1 **మొత్తం:** (16.1 ఓవర్లలో ఆలౌట్) 65; **వికెట్ల పతనం:** 1-4, 2-16, 3-35, 4-43, 5-44, 6-44, 7-60, 8-60, 9-60; **బౌలింగ్:** క్రాంతి గౌడ్ 4-0-26-1; నందని 4-0-18-3; శ్రీచరణి 3-0-10-2; ప్రేమ రాత్ 4-1-11-0; దీప్తి శర్మ 1.1-1-0-3

జర్మనీ నాలుగోసారి

- హాకీ ప్రపంచకప్ కైవసం
- ఫైనల్లో స్పెయిన్‌పై విజయం



వావ్రే (బెల్జియం): పురుషుల హాకీ ప్రపంచకప్‌ను జర్మనీ నిలబెట్టుకుంది. ఆదివారం ఉత్కంఠభరిత ఫైనల్లో ఆ జట్టు 1-0తో స్పెయిన్‌పై విజయాన్నందుకుంది. ఈ గెలుపుతో అత్యధిక టైటిళ్లు (4) సాధించిన దేశంగా పాకిస్థాన్‌తో సమంగా నిలిచింది. తుదిపోరులో రెండు జట్లూ నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. ముఖ్యంగా ఇరు దేశాల రక్షణశ్రేణి ఆకట్టుకుంది. తొలి పది నిమిషాల్లోనే జర్మనీ, స్పెయిన్‌లకు పెనాల్టీ కార్నర్లు దక్కినప్పటికీ సద్వినియోగం చేసుకోలేకపోయాయి. దీంతో మ్యాచ్ సగం అయ్యేసరికి ఏ జట్టూ గోల్స్ ఖాతా తెరవలేకపోయింది. మూడో క్వార్టర్‌లో స్పెయిన్ దాదాపు పది సార్లు జర్మనీ గోల్‌పోస్టుపై దాడులు జరిపినప్పటికీ ఫలించలేదు. 44వ నిమిషంలో మైకెల్ స్ట్రూతాఫ్ బంతిని నెట్‌లోకి పంపించి జర్మనీని ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. తర్వాత కూడా స్కోరు సమం చేసేందుకు స్పెయిన్ దూకుడు పెంచింది. కానీ జర్మనీ డిఫెన్స్ ముందు ఆ జట్టు ప్రయత్నాలు సఫలం కాలేదు. అంతకుముందు రసవత్తరంగా సాగిన మూడో స్థానం మ్యాచ్‌లో అర్జెంటీనా 2-1తో ఆతిథ్య నెదర్లాండ్స్‌ను ఓడించింది. మొదట డోమీన్ (41) అర్జెంటీనా ఖాతా తెరవగా.. ఫ్లోరిస్ (49) స్కోరు సమం చేశాడు. ఆరో ప్రపంచకప్ ఆడుతున్న మతియాస్ రే (59వ) గోల్ కొట్టి అర్జెంటీనాకు విజయాన్నందించాడు.

ఛాంపియన్స్

వైభవ్ కెప్టెన్‌గానూ..

దులీప్ ట్రోఫీ

బెంగళూరు

ఐపీఎల్‌లో మెరుపులతో 15 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్లో అరంగేట్రం చేసి సంచలనం సృష్టించిన వైభవ్ సూర్యవంశీ.. అదే వయసులో ఫస్ట్ క్లాస్ క్రికెట్లో కెప్టెన్ అయిపోయాడు. దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో ఈస్ట్ జోన్‌కు ఆడుతున్న అతడు.. ఆదివారం తొలి రోజు ఆటలో అనుకోకుండా కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. రెగ్యులర్ కెప్టెన్ ఇషాన్ కిషన్ వేలికి గాయమై, 19వ ఓవర్లో మైదానాన్ని వీడటంతో.. వైభవ్ తాత్కాలిక సారథి అయ్యాడు. అతను డీఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేయడం ద్వారా కెప్టెన్‌గా తన ముద్రను చూపించాడు. సెంట్రల్ జోన్ ఇన్నింగ్స్‌లో ఆర్యన్ జుయల్ (46) స్ట్రైకింగ్‌లో ఉండగా.. బంతి అతడి బ్యాట్‌కు దగ్గరగా వెళ్లింది. అప్పీల్ చేయగా అంపైర్ ఔట్ ఇవ్వలేదు. వైభవ్ సమీక్ష కోరగా.. బంతి బ్యాట్‌ను తాకినట్లు డీఆర్‌ఎస్‌లో చూపించడంతో సూర్యవంశీ సంబరాలు చేసుకున్నాడు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఈస్ట్.. సెంట్రల్ జోన్‌ను 80.1 ఓవర్లలో 266 పరుగులకే ఆలౌట్ చేసింది. ముకేశ్ కుమార్ (3/56), అభిజిత్ సర్కార్ (3/38) ధాటికి సెంట్రల్ 100 లోపే నాలుగు వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. కెప్టెన్ రజత్ పాటీదార్ (12) తక్కువకే పెవిలియన్ చేరాడు. ఈ దశలో వైస్‌కెప్టెన్ రింకు సింగ్ (60) జట్టును ఆదుకున్నాడు. ఆఖర్లో యశ్ ఠాకూర్ (30 నాటౌట్) బ్యాట్ ఝుళిపించడంతో సెంట్రల్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. మహ్మద్ షమి, మహ్మద్ ఖురేషి చెరో రెండు వికెట్లు తీశారు. ఈస్ట్ రెండో రోజు బ్యాటింగ్‌కు రానుంది.


కావేరప్ప 4/66


వైభవ్

సౌత్ 40/2.. క్రీజులో తిలక్: మరో సెమీస్‌లో తిలక్ వర్మ నేతృత్వంలోని సౌత్ జోన్ సత్తా చాటింది. విద్వత్ కావేరప్ప (4/66) విజృంభించడంతో తొలి ఇన్నింగ్స్‌లో నార్త్ జోన్‌ను 195 పరుగులకే కుప్పకూల్చింది. నార్త్ ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్ (76) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. అతడు కాకుండా కన్హయ్య వధవాన్ (35) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు. ఒక దశలో 161/4తో ఉన్న నార్త్.. కనీసం 250 దాటుతుందనిపించింది. కానీ సౌత్ బౌలర్లు చెలరేగిపోయారు. 34 పరుగుల వ్యవధిలో చివరి 6 వికెట్లు తీసి, నార్త్‌ను 200లోపే చుట్టేశారు. హైదరాబాద్ స్పిన్ ఆల్‌రౌండర్ తనయ్ త్యాగరాజన్ (2/31) కీలక వికెట్లు పడగొట్టగా.. ఆంధ్ర బౌలర్ కావురి సాయితేజ ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ తొలి రోజు ఆట ముగిసేసరికి 40/2తో నిలిచింది. తిలక్ (1), నారాయణ్ జగదీశన్ (34) క్రీజులో ఉన్నారు. ఆంధ్ర ఆటగాళ్లు రికీ భుయ్ (5), షేక్ రషీద్ (0) నిరాశపరిచారు. అన్షుల్ కంబోజ్, గుర్నూర్ బ్రార్ చెరో వికెట్ తీశారు.

హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు.. రోజర్ కన్నీళ్లు


భార్య మిర్కాతో ఫెదరర్

న్యూపోర్ట్ (అమెరికా): టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌కు అరుదైన గౌరవం దక్కింది. కెరీర్‌లో ఎన్నో గొప్ప ఘనతలు అందుకున్న ఈ స్విస్ స్టార్.. అంతర్జాతీయ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్నాడు. న్యూపోర్ట్‌లో జరిగిన కార్యక్రమంలో ఫెదరర్ హాల్ ఆఫ్ ఫేమ్ ట్రోఫీని అందుకున్నాడు. ఈ సందర్భంగా ఈ స్విస్ స్టార్ భావోద్వేగానికి గురయ్యాడు. "ఇప్పుడు కన్నీళ్లను దాయడానికి సన్‌గ్లాసెస్ కావాలి. నేను చేసిన ప్రయాణం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఇలాంటి వేదికపై మిమ్మల్ని మీరు చూసుకోవడం గొప్పగా అనిపిస్తుంది. టెన్నిసే నా ప్రపంచం. ఈ ఆట చరిత్రలో భాగం కావడం పెద్ద గౌరవంగా భావిస్తున్నా" అని ఫెదరర్ చెప్పాడు. కెరీర్‌లో తనకెంతో మద్దతుగా నిలిచిన జీవిత భాగస్వామి మిర్కా, కోచ్ సెవెరిన్‌తో పాటు తన ఆరాధ్య ఆటగాడు స్టెఫాన్ ఎడ్‌బర్గ్‌ను తలుచుకుని ఫెదరర్ కన్నీటి పర్యంతమయ్యాడు. కెరీర్‌లో 20 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు గెలిచిన ఫెదరర్.. ఒక దశలో వరుసగా 237 వారాలు ప్రపంచ నంబర్‌వన్‌గా కొనసాగాడు. ప్రతి టెన్నిస్ ప్లేయర్ కలగనే వింబుల్డన్ టైటిల్‌ను.. అతడు ఏకంగా ఎనిమిదిసార్లు కైవసం చేసుకుని 'కింగ్ ఆఫ్ గ్రాస్'గా పేరు పొందాడు. 6 ఆస్ట్రేలియన్ ఓపెన్, 5 యుఎస్ ఓపెన్ టైటిళ్లు గెలిచిన రోజర్.. ఒకసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఛాంపియన్ అయ్యాడు. 45 ఏళ్ల ఫెదరర్.. 2022లో ఆటకు వీడ్కోలు పలికాడు. ఫెదరర్‌తో పాటు అమెరికా మాజీ క్రీడాకారిణి మేరీ కారిలో కూడా 'హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు దక్కించుకుంది.


మేరీ కారిలోతో

క్రెజికోవాకు షాక్


క్రెజికోవా

- తొలి రౌండ్లోనే ఇంటిముఖం
- పావోలిని ముందంజ
- యుఎస్ ఓపెన్

న్యూయార్క్

యుఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ సంచలనంతో మొదలైంది. రెండుసార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్ బార్బరా క్రెజికోవా (చెకియా) తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టింది. ఆదివారం మహిళల సింగిల్స్‌లో 27వ సీడ్ క్రెజికోవా 4-6 (4-7), 2-6తో కమిలా రకిమోవా (ఉజ్బెకిస్థాన్) చేతిలో కంగుతింది. ఈ పోరు ఆరంభంలో రకిమోవా నుంచి క్రెజికోవాకు గట్టిపోటీ ఎదురైంది. ఇద్దరికీ బ్రేక్ అవకాశాలు వచ్చినా.. సద్వినియోగం చేసుకోలేకపోయారు. సర్వీసులు నిలబెట్టుకుంటూ వెళ్లడంతో సెట్ టైబ్రేకర్‌కు మళ్లింది. టైబ్రేకర్‌లో సత్తా చాటిన రకిమోవా సెట్ గెలిచి ఆధిక్యంలో నిలిచింది. రెండో సెట్లో రకిమోవా జోరు ముందు క్రెజికోవా నిలవలేకపోయింది. ఆరో గేమ్‌లో సర్వీస్ కోల్పోయిన క్రెజికోవా.. ఆపై సెట్‌తో పాటు మ్యాచ్‌ను చేజార్చుకుంది. ఈ పోరులో 8 డబుల్‌ఫాల్ట్స్, 41 అనవసర తప్పిదాలు చేసిన క్రెజికోవా ఓటమిని కొనితెచ్చుకుంది. రకిమోవా ఒక ఏస్, 8 విన్నర్లు కొట్టింది. ఇటలీ అమ్మాయి జేస్మిన్ పావోలిని కష్టంగా రెండో రౌండ్ దాటింది. తొలి రౌండ్లో 19వ సీడ్ పావోలిని 6-3, 3-6, 6-4తో వెరోనికా ఎరావిక్ (స్లొవేనియా)పై గెలిచింది. తొలి సెట్‌ను సులభంగా నెగ్గిన పావోలినికి రెండో సెట్ నుంచి సవాల్ ఎదురైంది. నాలుగో గేమ్‌లో పావోలిని సర్వీస్ బ్రేక్ చేసిన వెరోనికా 3-1తో నిలిచింది. అదే ఊపులో సెట్ గెలిచి స్కోరు సమం చేసింది. మూడో సెట్ ఆరంభంలోనూ ప్రత్యర్థి నుంచి పోటీ ఎదురైనా.. పావోలిని తగ్గలేదు. నాలుగో గేమ్‌లో వెరోనికా సర్వీస్ బ్రేక్ చేసిన పావోలిని.. దూకుడు కొనసాగించి సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలుచుకుంది. మూడో సీడ్ జెసికా పెగులా (అమెరికా) శుభారంభం చేసింది. తొలి రౌండ్లో ఆమె 6-3, 6-2తో ఎలీనా రూస్ (రొమేనియా)పై గెలిచింది. వికిచ్ కూడా ముందంజ వేసింది. వికిచ్ 6-2, 4-6, 6-3తో తాలియా గిబ్సన్ (ఆస్ట్రేలియా)ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో మెరిడా (స్పెయిన్), కమిల్ (పోలెండ్) తొలి రౌండ్‌ను అధిగమించారు. మెరిడా 6-4, 6-4, 6-2తో మార్టాన్ (హంగేరీ)పై, కమిల్ 6-3, 6-3, 6-3తో మెదెదోవిచ్ (సెర్బియా)పై విజయం సాధించారు. యిబింగ్ వూ (చైనా) 6-2, 4-6, 6-3తో వాల్టన్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు.


పావోలిని

ఆ ఓటమి మంచే చేసింది: జకోవిచ్

న్యూయార్క్: ఈ నెలలో జరిగిన సిన్సినాటి ఓపెన్‌లో నొవాక్ జకోవిచ్ తొలి రౌండ్లోనే ఓడిపోయాడు. అయితే ఆ ఓటమి తనకు మంచే చేసిందని అంటున్నాడు ఈ మాజీ నంబర్‌వన్. "తొలి రౌండ్లోనే ఓడిపోవడం వల్ల యుఎస్ ఓపెన్‌కు సన్నద్ధం కావడానికి నాకు తగినంత సమయం లభించింది. సాధన, శరీరాన్ని సిద్ధం చేయడానికి, మానసికంగా సంసిద్ధం కావడానికి నాకు రెండు వారాల సమయం దొరికింది" అని జకోవిచ్ (సెర్బియా) అన్నాడు. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో రికార్డు సృష్టించాలనుకుంటున్న అతడు.. యుఎస్ ఓపెన్‌లో నాలుగో సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. జకోవిచ్ ఈ ఏడాది 16 టోర్నమెంట్లు మాత్రమే ఆడాడు. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో టాప్-95లో ఉన్న వారిలో అతి తక్కువ టోర్నీలు ఆడిన ఆటగాడు అతడే. జకోవిచ్ వింబుల్డన్ సెమీస్‌లో సినర్ చేతిలో పరాజయంపాలయ్యాడు.

పాక్‌కు మళ్లీ పరాభవం

టెస్టు సిరీస్ ఇంగ్లాండ్ సొంతం


సౌద్ షకీల్ 97

లార్డ్స్: ఇంగ్లాండ్ పర్యటనలో పాకిస్థాన్‌కు మరో పరాభవం తప్పలేదు. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఘనవిజయం సాధించిన ఇంగ్లిష్ జట్టు మూడు టెస్టుల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే చేజిక్కించుకుంది. తొలి టెస్టులో ఇన్నింగ్స్ ఓటమి చవిచూసిన పాక్.. రెండో మ్యాచ్‌లో 194 పరుగుల తేడాతో చిత్తయింది. 389 పరుగుల భారీ లక్ష్యంతో నాలుగో రోజు బరిలోకి దిగిన పాకిస్థాన్.. ఓలీ రాబిన్సన్ (4/24), జోష్ టంగ్ (3/46), జోఫ్రా ఆర్చర్ (2/73)ల ధాటికి 50.5 ఓవర్లలో 194 పరుగులకే ఆలౌటైంది. సౌద్ షకీల్ (97; 122 బంతుల్లో 13×4, 2×6) పోరాడకుంటే ఇంకా ఘోరంగా ఓడేది. అంతకుముందు 177/7తో ఆదివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లాండ్.. 208 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 290 పరుగులు చేయగా.. పాక్ 110కే కుప్పకూలింది. గాయంతో తొలి టెస్టుకు దూరమైన కెప్టెన్ బాబర్ అజామ్.. ఈ మ్యాచ్‌లో ఆడినా, జట్టుకు ఓటమిని తప్పించలేకపోయాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా అతను 8, 6 పరుగులే చేశాడు. మూడో టెస్టు సెప్టెంబరు 9న బర్మింగ్‌హామ్‌లో మొదలవుతుంది.

ఆ విషయంపై మాట్లాడొద్దు

కరాచి: పాకిస్థాన్ మాజీ ప్రధాని, ఆ దేశ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ ఖైదు గురించి మాట్లాడొద్దని ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఆడుతున్న తమ ఆటగాళ్లకు పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సూచించింది. ఇమ్రాన్ కారాగార జీవితం గురించి పాక్ ఆటగాళ్ల అభిప్రాయాలు తీసుకోవడానికి బ్రిటిష్ మీడియా ప్రయత్నించిన నేపథ్యంలో పీసీబీ స్పందించింది. పాక్, ఇంగ్లాండ్ రెండో టెస్టు లంచ్ విరామం సందర్భంగా ఇమ్రాన్ కుమారుల ఇంటర్వ్యూను స్కైస్పోర్ట్స్ ప్రసారం చేసిన నేపథ్యంలో అతడి జైలు జీవితం చర్చనీయాంశంగా మారింది. పాక్ ఆటగాళ్లు ఆ ఇంటర్వ్యూను చూశారా అన్న విలేకరుల ప్రశ్నకు.. తమకేమీ తెలియదని, అప్పుడు తాము భోజనం చేస్తున్నామని ఆ జట్టు కోచ్ సర్ఫరాజ్ చెప్పాడు. ఇంటర్వ్యూకు నిరసనగా లంచ్ తర్వాత తమ జట్టును మైదానంలోకి పంపమని పీసీబీ బెదిరించినట్లు వార్తలొచ్చాయి. ఇమ్రాన్ ఆరోగ్యం గురించిన వార్తలు అంతర్జాతీయ మీడియాలో ఒక్కసారిగా పెరిగాయి. 73 ఏళ్ల ఇమ్రాన్.. 2023లో జైలుపాలయ్యాడు. అవినీతి కేసుల్లో అతడు దోషిగా తేలాడు.

సర్రే జట్టులో నబి

ముంబయి: భారత పేస్ బౌలర్ ఆకిబ్ నబి ఇంగ్లాండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ఆడబోతుండడం నిజమేనని తేలింది. అతడు సర్రే జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. కౌంటీ డివిజన్-1 ఛాంపియన్‌షిప్‌లో నబి.. సర్రే తరఫున మూడు మ్యాచ్‌లు ఆడనున్నాడు. బుధవారం ఓవల్‌లో ఆరంభమయ్యే సర్రే-యార్క్‌షైర్ మ్యాచ్‌తో ఈ జమ్ము కశ్మీర్ పేసర్.. కౌంటీ అరంగేట్రం చేయబోతున్నాడు. అతడు స్వదేశానికి వచ్చాక ఆస్ట్రేలియా-ఎతో సెప్టెంబర్ 22న మొదలయ్యే నాలుగు రోజుల మ్యాచ్‌లో భారత్-ఎకు ఆడనున్నాడు. ఈ నెల శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో బుమ్రా స్థానంలో నబి భారత జట్టుకు ఎంపికయ్యాడు. కానీ తుది జట్టులోకి ఇద్దరు సీమర్లనే (సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ) ఎంచుకోవడంతో నబికి చోటు దక్కలేదు. న్యూజిలాండ్‌తో వారి సొంతగడ్డపై నవంబర్‌లో భారత్ రెండు టెస్టులు ఆడనుంది. ఇంగ్లాండ్‌లో కౌంటీల్లో ఆడబోతుండడం కివీస్‌తో సిరీస్ ముంగిట నబికి ఉపయోగపడనుంది. సర్రే తరఫున భారత ఆటగాళ్లు ఆడడం కొత్తేం కాదు. 2023, 2024లో సాయి సుదర్శన్ ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. లెగ్‌స్పిన్నర్ రాహుల్ చాహర్, రాజస్థాన్ బ్యాటర్ మహిపాల్ లొమ్రోర్ కూడా సర్రే జట్టుకు ఆడారు.


ఆకిబ్ నబి

ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్యం నుంచి లంక ఔట్

కొలంబో: మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఆరంభ టోర్నీ ఆతిథ్య హక్కుల్ని శ్రీలంక కోల్పోయింది. శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్ఎల్‌సీ) పరిపాలన వ్యవహారాల్లో ఆ దేశ ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందన్న కారణంగా ఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని సమాచారం. షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ టోర్నీ జరగాల్సి ఉంది. అక్టోబరులో జరగనున్న ఐసీసీ బోర్డు మీటింగ్‌లో కొత్త వేదికను వెల్లడిస్తారు. ఛాంపియన్స్ ట్రోఫీలో లంక పాల్గొనడం కూడా అనుమానంగా మారింది. మామూలుగా ఈ టోర్నీకి టాప్-5 జట్లు, ఆతిథ్య దేశ టీమ్ ఎంపికవుతాయి. కానీ లంక ఆరో స్థానంలో ఉంది. ఆ దేశంలో ఛాంపియన్స్ ట్రోఫీ జరిగితే ఆతిథ్యం దేశం హోదాలో నేరుగా ఎంపికయ్యేది. ప్రస్తుతానికి ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ వరుసగా అయిదు ర్యాంకింగ్స్‌లో ఉన్నాయి. ఒకవేళ లంక కంటే కింది స్థానాల్లో ఉన్న దేశం ఆతిథ్య హక్కుల్ని దక్కించుకుంటే.. ఈ ద్వీప దేశం ఛాంపియన్స్ ట్రోఫీ ఆశలకు తెరపడుతుంది.

నీళ్ల ట్యాంకులకు డ్రై డే పాటిస్తున్నారా..!

వంటగదిలో పాత్రల్ని కడిగేస్తుంటాం. బాత్రూంలో స్నానాలు చేసేస్తుంటాం. కానీ పైపుల ద్వారా ఆ నీరు వచ్చే ట్యాంకుల శుభ్రతను చాలామంది పట్టించుకోరు. నెలల తరబడి శుభ్రంచేయరు. వాడుకోవడానికే కదా.. ఏమవుతుందిలే అని తేలిగ్గా తీసుకుంటున్నారు. ఈ-కోలి బ్యాక్టీరియా నివారణకు నీళ్ల ట్యాంకులను కనీసం మూడునెలలకు ఒకసారైనా ఖాళీచేసి ఆరబెట్టే(డ్రై డే) విధానం పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. లేకుంటే రోగాల బారిన పడక తప్పదంటున్నారు.



డ్రై డే పాటించకుంటే సమస్యలివీ..

- ▼ నీళ్ల ట్యాంకుల నిర్వహణ సక్రమంగా లేకుంటే దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిపోతాయి. నీరు నిల్వ ఉండడం వల్ల డెంగీ, మలేరియా, గన్యా జ్వరాలకు కారణమయ్యే దోమలు పెరుగుతాయి.
- ▼ ట్యాంకు అడుగున పేరుకుపోయే బురదలో ఈ-కోలి, సాల్మొనెల్లా, లెజియోనెల్లా వంటి బ్యాక్టీరియా చేరి నీటిని కలుషితం చేస్తాయి. నాచు పేరుకుపోయి నీటి నుంచి దుర్వాసన వస్తుంది.
- ▼ ట్యాంకులపై మూతలు సక్రమంగా అమర్చకుంటే రోడ్లపై దుమ్ము, ధూళి అంతా నీళ్ల ట్యాంకుల్లో కలిసిపోతుంది. పక్షులు రెట్టలు వేసే ప్రమాదం ఉంది.

ఆరోగ్యంపై ప్రభావం ఇలా..

- నిల్వనీటిని తాగడం, వంటకు వాడటం వల్ల విరేచనాలు వాంతులు, టైఫాయిడ్, హెపటైటిస్-ఎ వంటి వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది.
- కలుషిత నీటితో స్నానం చేయడం వల్ల చర్మంపై దద్దుర్లు, దురదలు, ఎలర్జీలు, ఎగ్జిమా వంటి సమస్యలు వస్తాయి. జుట్టు రాలిపోతుంటుంది.
- ముఖం కడుక్కునేటప్పుడు ఈ నీళ్లు కళ్లలోకి వెళ్తే కండ్లకలక వంటి సమస్యలొస్తాయి.


ఇలా శుభ్రం చేసుకోవాలి..



- నీళ్ల ట్యాంకులను మూడు నెలలకు ఒకసారైనా పూర్తిగా ఖాళీ చేయాలి. లోపల పేరుకుపోయిన నాచును వదిలించడానికి బేకింగ్ సోడా, వెనిగర్ మిశ్రమం ఉపయోగిస్తే మంచిది.



- డిటర్జెంట్ పౌడర్‌లో నీళ్లు కలిపి వాటితో ట్యాంకులను శుభ్రం చేయొచ్చు. పొడవాటి కర్ర బ్రష్‌తో ట్యాంకు గోడలను, అడుగు భాగాన్ని బాగా రుద్దాలి. దీనివల్ల గోడలకు పట్టిన జిగురు, నాచు పోతాయి.



- ట్యాంకు పూర్తిగా కడిగిన తర్వాత లీటర్ నీటికి 50 గ్రాముల చొప్పున బ్లీచింగ్ పౌడర్ కలిపి, ట్యాంకు గోడలకు రాసి ఒకటి రెండు గంటల పాటు అలాగే వదిలేయాలి. ఇది నీటిలోని బ్యాక్టీరియా, వైరస్‌లను పూర్తిగా నియంత్రిస్తుంది. ఆ తర్వాత బ్లీచింగ్ వాసన పూర్తిగా పోయేలా ట్యాంకును మంచినీటితో కడగాలి.



- ట్యాంకు లోపలి భాగాన్ని కనీసం 2–3 గంటల పాటు ఎండ తగిలేలా ఆరబెట్టాలి. ఇలా చేయడం వల్ల దోమల గుడ్లు, లార్వాలు పూర్తిగా నశిస్తాయి.

ప్రత్యామ్నాయం చూసుకోవాలి..

- ఇళ్లల్లో నీళ్ల ట్యాంకులను శుభ్రం చేసుకునే ఒక రోజు ముందు డ్రమ్ములు, ఇతర పాత్రల్లో నీటిని నిల్వ చేసుకోవాలి.
- అపార్ట్‌మెంట్లలో ఒకటి కంటే ఎక్కువ ఓవర్ హెడ్ ట్యాంకులుంటాయి. లేకుంటే ఒకే పెద్ద ట్యాంకు మధ్యలో విభజన ఉంటుంది. ఒక ట్యాంక్‌ను క్లీన్ చేసేటప్పుడు రెండో ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేయాలి.
- క్లీనింగ్‌కు హై ప్రెజర్ వాషర్స్‌ను వినియోగించాలి. జెట్ మెషీన్లు, వ్యాక్యూమ్ పంపులను వాడటం వల్ల తక్కువ సమయంలో శుభ్రం చేయడానికి వీలవుతుంది.

నీరు ఏదైనా శుభ్రంగానే ఉండాలి..

మన వాడుక నీరు కూడా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. కలుషిత నీటివల్ల ఆరోగ్య సమస్యలే కాదు.. ఆర్థికంగానూ ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గ్రామాలకు నీటిని సరఫరా చేసే ట్యాంకులను 15 నుంచి 20 రోజులకు ఒకసారి శుభ్రం చేస్తుంటారు. ఇళ్లల్లో, అపార్ట్‌మెంట్లలో కనీసం మూడు నెలలకు ఒకసారైనా డ్రై డే పాటించాలి. నీటి ట్యాంకును శుభ్రం చేసుకోవడానికి కొద్దిపాటి బ్లీచింగ్ పౌడర్ చాలు.

–అబ్దుల్ మతిన్, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కాకినాడ

- ఈనాడు, కాకినాడ



రూబీ.. మొదటి కాన్పుకే 10 పిల్లల మమ్మీ

ఈ దృశ్యం చూడగానే ఇవి తెలుపు రంగులో ఉన్న కుక్క పిల్లలే కదా.. ఏముంది ఇందులో విశేషం అనిపిస్తుంది కదూ! మరేం లేదండీ తొలి కాన్పులో పది పిల్లలు పుట్టాయనేదే ఇక్కడ విశేషం. సాధారణంగా లాబ్రడార్ రిట్రీవర్ జాతికి చెందిన శునకం 5 నుంచి 10 దాకా పిల్లలను ఈనుతుంది. కానీ, రాజమహేంద్రవరం దివాన్‌చెరువు ప్రాంతానికి చెందిన సాల్మన్ దేవానంద్, అనుపమ దంపతుల ఇంట్లోని లాబ్రడార్ రిట్రీవర్ పెంపుడు కుక్కకు(రూబీ) తొలి కాన్పులోనే 10 పిల్లలు పుట్టాయి. వాటిలో నాలుగు మగ, ఆరు ఆడవి ఉన్నాయి. అన్నీ ఆరోగ్యంగానే ఉన్నాయని దేవానంద్ తెలిపారు. దీనిపై జిల్లా పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ జాతి శునకానికి మొదటి కాన్పులోనే ఇన్ని పిల్లలు పుట్టడం అరుదని తెలిపారు. –న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం

నోరూరించే తాటి రేకులు తింటారా?



రంగు వేరైనా పెద్ద సైజు పూత రేకుల్లా కనిపిస్తున్న ఇవి తాటి రేకులు. పూర్వం తాటి చాప అని పిలిచే తినుబండారాన్ని ఇప్పుడు పూత రేకు మాదిరిగా తయారుచేసి అమ్ముతున్నారు. మార్కెట్లో కొత్తగా కనిపిస్తున్న వీటిని చూసి కొనడానికి వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. సాధారణంగా పూతరేకు ధరయితే సైజును బట్టి రూ.10 నుంచి అందుబాటులో ఉన్నాయి. తాటి రేకు ఒక్కోదాని ధర రూ.50-70 వరకూ పలుకుతోంది. పీచు పోషకాలు అధికంగా ఉండే తాటితో తయారుచేసిన ఆహార పదార్థాలకు మార్కెట్లో మంచి గిరాకీయే ఉంది. ప్రస్తుతం తాటిరేకుతో పాటు తాటి గారెలు కూడా కొన్నిచోట్ల లభిస్తున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఓ వ్యక్తి వీటిని విక్రయిస్తున్నారు. – న్యూస్‌టుడే, పాలకొల్లు



వేప రూపు.. తింటే పులుపు

వీటిని చూస్తుంటే వేపకాయల గుత్తుల్లా అనిపిస్తున్నాయా? కానీ, ఇవి అంబరెల్లా(స్పాండియాస్ డల్సిస్) చెట్టుకు కాసే అంబాడకాయలు. తీపి-పులుపు-వగరు రుచుల కలయికతో ఉంటాయి. సాధారణంగా పెద్దపెద్ద చెట్లకు కాసే ఈ కాయలు, ఇప్పుడు హైబ్రిడ్ రకాలతో చిన్న కుండీలు, ప్లాస్టిక్ కవర్లలోనే గుత్తులు గుత్తులుగా కాస్తున్నాయి. విటమిన్-సి పుష్కలంగా ఉండే ఈ అంబాడ కాయలు రోగనిరోధక శక్తిని పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి తోడ్పడతాయి. వీటితో పెట్టే పచ్చళ్లకూ అపారమైన అభిమానులు ఉన్నారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన నర్సరీ మేళాలో అంబరెల్లా మొక్కలు ప్రకృతి ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. – ఈనాడు, హైదరాబాద్

మీ కిలకిల నవ్వే.. నా కుహుకుహు కూత

ఇక్కడ కనిపిస్తున్న పక్షి పేరు లాఫింగ్ డోవ్. శాస్త్రీయ నామం స్పిలోపెలియా సెనెగాలెన్సిస్. ఈ జాతి పక్షులు ఆఫ్రికా, మధ్య, దక్షిణాసియా దేశాల్లో ఎక్కువగా ఉంటాయి. దీని జీవనశైలి, గాత్రం మాత్రం ఆసక్తికరంగా ఉంటాయి. మనుషులు నవ్వినప్పుడు ఎలాంటి ధ్వని వస్తుందో.. ఈ పక్షి కూత సరిగ్గా అలాగే వినిపిస్తుంది. అందుకే దీనికి ప్రపంచవ్యాప్తంగా 'నవ్వుల గువ్వ' అనే పేరు వచ్చింది. దీని మెడ ముందు భాగంలో నలుపు, రాగి రంగు చుక్కలతో ఒక హారం లాంటి నమూనా ఉంటుంది. గులాబీ-గోధుమ రంగు ఈకలు, నీలి రంగు రెక్కల అంచులు దీనికి ప్రత్యేకమైన రూపాన్ని ఇస్తాయి. చాలా పక్షులు మనుషులకు భయపడి దూరంగా ఉంటాయి. నవ్వుల గువ్వ మాత్రం మనకు దగ్గరగా ఉండటానికే ఇష్టపడుతుంది. ఇళ్ల బాల్కనీల్లో, మేడపైన ఆడ, మగ పక్షులు కలిసి ఒకే గూడు కట్టుకుంటాయి. ప్రశాంతంగా జీవిస్తూ.. మన చుట్టూ ఉన్న వాతావరణాన్ని తన 'నవ్వు'లతో నింపేస్తుంది. మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ ప్రాంతంలో కనిపించిన ఈ పక్షిని అటవీ డివిజనల్ అధికారి ఎం.రామ్‌మోహన్ తన కెమెరాలో బంధించారు.



– న్యూస్‌టుడే, జన్నారం



వయసు పైబడినా.. సంస్కృతంపై మనసుపడి

రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారాల నుంచి విశ్రాంతి తీసుకొని మనవళ్లు, మనవరాళ్లతో ఆడుకునే వారు ఖమ్మం నగరానికి ఎక్కడెక్కడి నుంచో వచ్చి పరీక్ష కేంద్రం ఎక్కడా అంటూ ఆరా తీస్తూ కనిపించారు. ఈ వయసులో మీకేం పరీక్షలని అడగ్గా.. శ్రీరామకృష్ణ విద్యాలయంలో సంస్కృతం పరీక్షలు రాసేందుకు వచ్చామని చెప్పుకొచ్చారు. చదువుకోవడానికి వయసుతో పనేంటి అన్న వారిలో.. పరీక్షలను విజయవంతంగా పూర్తి చేస్తామన్న ఆత్మవిశ్వాసం కనిపించింది. సంస్కృత భారతి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో సంస్కృతం నేర్పుతున్నారు. ప్రవేశ, పరిచయ, శిక్ష, కోవిద అంటూ నాలుగు స్థాయుల్లో ఉండే తరగతులకు రాష్ట్రంలోని అనేకమంది హాజరవుతున్నారు. ఆదివారం హైదరాబాద్‌తోపాటు ఖమ్మం, భద్రాచలంలో కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి పరీక్షలు నిర్వహించారు. ఖమ్మంలోని కేంద్రానికి మొత్తం 8 మందిని కేటాయించగా ఆరుగురు హాజరయ్యారు. వీరిలో నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉండగా.. ఒకరు మినహా అందరూ 60 ఏళ్లు పైబడ్డ వారే ఉండటం గమనార్హం. నిత్యం విష్ణు సహస్రనామాలు, భగవద్గీత వంటివి చదువుతుంటామని, శ్లోకాల భావం పూర్తిస్థాయిలో తెలుసుకొని పిల్లలకు చెప్పేందుకు సంస్కృతం నేర్చుకుంటున్నామని పలువురు చెప్పుకొచ్చారు. – న్యూస్‌టుడే, ఖమ్మం అర్బన్

నూనె శ్రీధర్, అమరేందర్‌రెడ్డి సస్పెన్షన్ల పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో సస్పెండ్ అయిన నీటిపారుదలశాఖ ఈఈ (కరీంనగర్ యూనిట్) నూనె శ్రీధర్ సస్పెన్షన్‌ను ప్రభుత్వం పొడిగించింది. 2025 జూన్‌లో అనిశా నిర్వహించిన తనిఖీల్లో ఆదాయానికి మించిన ఆస్తులతో ఆయన పట్టుబడ్డారు. అనంతరం అరెస్టు కావడంతో నీటిపారుదలశాఖ ఆయనను విధుల నుంచి తప్పించింది. ఏసీబీ కేసులపై నిర్వహించిన సమీక్షలో ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేతకు ప్రభుత్వం అంగీకరించలేదు. 2025 మే నెలలో అనిశా తనిఖీలతో వేటుపడిన సిరిసిల్ల ఈఈ అర్రంరెడ్డి అమరేందర్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందంటూ నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

సస్పెన్షన్‌లోనే రిటైరైన హరిరాం

కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ, గజ్వేల్ ఈఎన్సీగా పనిచేస్తూ ఆదాయానికి మించిన ఆస్తులతో 2025 ఏప్రిల్లో అనిశాకు పట్టుబడిన భూక్యా హరిరాం సస్పెన్షన్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జులైలోనే ఆయన పదవీ విరమణ పొందారు.

18% అధిక ధరలకు టెండర్లు

- చేప పిల్లల పంపిణీతో అధిక లాభాలకు గుత్తేదారుల ప్రయత్నాలు
- వాటి ఖరారుకు అధికారులపై ఒత్తిడి

ఈనాడు,హైదరాబాద్: రాష్ట్రంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికిగాను చేపపిల్లల పంపిణీ పథకానికి మత్స్యశాఖ నిర్వహించిన టెండర్లలో ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే గుత్తేదార్లు అధిక ధరలకు టెండర్లు వేశారు. వాటి ఆమోదానికి ప్రయత్నిస్తున్నారు. రూ.116 కోట్ల వ్యయంతో 100 కోట్ల చేపపిల్లల పంపిణీ చేయాలనేది లక్ష్యం. ఈ నెల 6 నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. జగిత్యాల మినహా 31 జిల్లాలకు సంబంధించి 108 టెండర్లు దాఖలయ్యాయి. సుమారు 40 బిడ్లలో గుత్తేదారులు 15 నుంచి 18 శాతం వరకు అధిక ధరలకు కోట్ చేసినట్లు గుర్తించారు. ఇప్పటికే మత్స్యశాఖ ఈ ఏడాది అంచనా ధరలను గతం కంటే 10% పెంచింది. దీనివల్ల రూ.16 కోట్ల మేరకు అదనపు భారం పడుతోంది. 18% అధిక ధరలను ఆమోదించే పక్షంలో మరో రూ.18 కోట్ల మేరకు భారం పడే అవకాశం ఉంది.



మాటలు కాదు.. అడ్డుగోడలివి

'ఈ పనిని నేను రేపు మొదలుపెడతాను', 'నేనింకా సిద్ధంగా లేను', 'నేను మారను.. ఇలాగే ఉంటా'.. ఇవన్నీ కేవలం మాటలు కాదు! మీ పురోగతికి అడ్డుగోడలు. వాటి మధ్య బందీగా ఉండిపోకండి.

– ఫెడాన్, లైఫ్ కోచ్

6, 7, 8 ఫారాల్లేవ్ సర్!

- ప్రింటింగ్ బాధ్యతలు ఈఆర్వోలకు.. పట్టించుకోని యంత్రాంగం

ఈనాడు, హైదరాబాద్: ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో నోటీసులు, అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పునకు కావాల్సిన ఫారాలు 6, 7, 8 అందుబాటులో లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రతి పోలింగ్ బూత్ అధికారి (బీఎల్‌వో) వద్ద ఈ పత్రాలను ఉంచాలని ఎన్నికల సంఘం అధికారులు ఆదేశాలు జారీ చేసినా. . ఎక్కడా ఇది అమలు కావడం లేదు. నోటీసులతో పాటు ఇతర ఫారాల ప్రింటింగ్ బాధ్యతలను జిల్లాల వారీగా జిల్లా ఎన్నికల అధికారులకు (డీఈవోలకు) రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ కార్యాలయం అధికారులు అప్పగించారు. నియోజకవర్గాలవారీగా వీటిని ముద్రించుకోవాలని, ఈ బాధ్యతలను ఎన్నికల నమోదు అధికారులకు(ఈఆర్వోలకు) అప్పగించారు. ఈఆర్వోలు కేవలం నోటీసుల ముద్రణకే పరిమితమయ్యారు. ఓటర్లకు కావాల్సిన పత్రాలను ఏదో విధంగా సర్దుబాటు చేయాలని ఏఈఆర్వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లకు ఈఆర్వోలు ఆదేశాలు ఇస్తున్నారు. ఇది ఖర్చుతో కూడిన వ్యవహారం కావడంతో వీరు కూడా పట్టించుకోవడం లేదు. ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన గ్రామ/వార్డు సభల్లో ఫారాలు లేవని, మీసేవా లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అక్కడి అధికారులు పేర్కొన్నారు. దీనిపై రాజకీయ పార్టీలు సైతం అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఇటీవల ఓ జిల్లా పరిధిలో ఫారాలు-6, 7, 8 ప్రత్యేకంగా ముద్రించడం లేదని, ఇంటర్నెట్, జిరాక్స్ కేంద్రాల్లో తీసుకోవాలని ఓటర్లకు చెప్పాలని స్థానిక తహసీల్దార్లకు అనధికారిక ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం. దీంతో ఆ జిల్లా పరిధిలో ఎక్కడా పత్రాలను అందించడం లేదు. 'సర్'లో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, సర్వే సమయంలో తమ జిల్లా పరిధిలో అక్కడక్కడ మాత్రమే 10 నుంచి 20 మధ్య ఫారం-6ను అందించారని, అవి ఏమాత్రం సరిపోవని ఓ బీఎల్‌వో 'ఈనాడు'కు వివరించారు. ఫారం-6, 7తో పాటు డిక్లరేషన్ పత్రాలు కూడా అవసరం ఉంటాయని, అవి కూడా అందుబాటులో లేవని ఆ బీఎల్‌వో తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వీటి అవసరం ఎక్కువగా ఉంది.

కొత్తగా నమోదు చేసుకోవాలన్నా..

ఈ ఏడాది అక్టోబరు 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఇటీవల విడుదల చేసిన ముసాయిదా జాబితాలో 73.39 లక్షల మంది ఏఎస్‌డీడీ (చిరునామాలో లేకపోవడం, వలస వెళ్లడం, మృతి చెందడం, డూప్లికేట్) ఓటర్లను తొలగించినట్లు ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. ఎక్కడైనా ఈ ఓటర్లను పొరపాటున తొలగిస్తే మళ్లీ ఫారం-6 ద్వారా కొత్తగా నమోదు చేసుకోవాలని ఎన్నికల అధికారులు సూచించారు. చాలాచోట్ల ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేయకుండానే ఆ ఓటర్లను ఏఎస్‌డీడీ జాబితాలో చేర్చారు. కనీసం మళ్లీ కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం-6తో డిక్లరేషన్ పత్రాలు అందుబాటులో లేకపోతే ఎలా? అని జనం ప్రశ్నిస్తున్నారు. పలువురు ఓటర్లకు గతంలో నివాసం ఉన్నచోటనే ఎన్యూమరేషన్ పత్రాలు అందించడంతో అక్కడే పత్రాలను నింపి ఇచ్చారు. వారు ప్రస్తుతం నివాసం ఉంటున్న చిరునామాకు మార్చుకోవాలంటే ఫారం-8 అవసరం. అలాగే పేర్లలో అక్షర దోషాలను సరిచేసుకోవాలన్నా ఇదే పత్రం అవసరం. ప్రస్తుతం ఈ పత్రాలు కూడా ఎక్కడా అందుబాటులో లేవు. ముసాయిదా జాబితాలో అనుమానం ఉన్న ఓటర్లను తొలగించాలన్నా, ఫిర్యాదులు చేయాలన్న ఫారం-7 ఉండాలి.

గొంతు నులిమి.. అఘాయిత్యం

- రంగారెడ్డి జిల్లాలో నర్సుపై హత్యాచారం
- పోలీసుల అదుపులో నిందితుడు!

ఈనాడు, హైదరాబాద్ - పహాడీషరీఫ్, ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: తన ఇంటికి సమీపంలో ఉంటున్న యువతిపై కన్నేశాడు. ఆమె కదలికలను గమనిస్తూ వచ్చాడు. ఒంటరిగా ఉండటాన్ని అవకాశంగా చేసుకొని అత్యాచారం చేయబోయాడు. ఆమె ప్రతిఘటించడంతో గొంతు నులిమి ఊపిరాడకుండా చేశాడు. అపస్మారక స్థితికి చేరిన ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టాడు. రంగారెడ్డి జిల్లా పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సు(21) హత్య ఘటన కలకలం రేపింది. అశ్లీల వీడియోలకు అలవాటుపడిన బిహార్‌కు చెందిన సనా ఉల్లాఖాన్(40) ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు నిర్ధారించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కొత్తగూడెం జిల్లాకు చెందిన యువతి ఏడు నెలలుగా రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఆసుపత్రి సమీపంలో వీరి కోసం నిర్మించిన గదిలో నివాసం ఉంటోంది. బిహార్‌కు చెందిన సనా ఉల్లాఖాన్ ఉపాధి కోసం నగరానికి వచ్చాడు. ఉప్పల్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేశాడు. అనంతరం బిహార్ వెళ్లి 2 నెలల క్రితం మళ్లీ వచ్చాడు. బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ తుక్కుగూడలోని ఒక గదిలో అద్దెకు ఉంటున్నాడు. ఇతడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఎక్కువ సమయం పోర్న్ వీడియోలు చూస్తూ గడిపేవాడు. సమీపంలో నివాసం ఉంటున్న నర్సుపై ఇతడి కన్నుపడింది. పలుమార్లు ఆమె గదిలోకి వెళ్లేందుకు యత్నించాడు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకున్న యువతి తన గదికి చేరుకుంది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సనా ఉల్లాఖాన్ ఆమె ఒంటరిగా ఉన్నట్టు గుర్తించాడు.



నిందితుడు సనా ఉల్లాఖాన్

అర్ధరాత్రి దాటాక గది వద్దకు చేరుకున్నాడు. తలుపులు మూసి ఉండటంతో కిటికీలో నుంచి లోపలికి దూరాడు. నిద్రలో ఉన్న యువతి.. అలికిడి కావడంతో మేల్కొంది. సనా ఉల్లాఖాన్‌ను చూసి కేకలు వేసింది. ఆమె నోరు మూసి అతడు అత్యాచారానికి యత్నించాడు. ప్రతిఘటించడంతో గొంతు నులిమాడు. ఊపిరాడక అపస్మారక స్థితికి చేరిన యువతిపై అఘాయిత్యానికి తెగబడ్డాడు. ఆమె మరణించినట్టు గుర్తించి పారిపోయాడు.

ఫోన్ చేసినా స్పందన రాకపోవడంతో..

శనివారం ఉదయం 9 గంటలకు విధులకు రావాల్సిన నర్సు గైర్హాజరు కావడంతో ఆసుపత్రి సిబ్బంది ఫోన్ చేశారు. పక్క గదిలో ఉన్నవారు పిలిచినా స్పందించకపోవడంతో మహేశ్వరంలో ఉన్న యువతి పిన్నికి సమాచారమిచ్చారు. పిన్ని కుమారుడు ఆమె ఫోన్‌కు పలుమార్లు కాల్ చేసినా స్పందన రాకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. చివరకు ఆసుపత్రి సిబ్బంది మధ్యాహ్నం ఆమె గది వద్దకు వెళ్లి పరిశీలించారు. తలుపులు మూసి ఉండటంతో కిటికీలో నుంచి లోపలకు వెళ్లారు. అక్కడ నిర్జీవంగా పడి ఉన్న నర్సును చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. శంషాబాద్ డీసీపీ రాజేశ్, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, క్లూస్ బృందం సభ్యులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పారిపోయేందుకు సిద్ధమైన నిందితుడు సనా ఉల్లాఖాన్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ఆదివారం సాయంత్రం మృతురాలి కుటుంబీకులు, భాజపా నాయకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. నిందితుడిని ఉరితీయాలని భాజపా మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అందెల శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. బందోబస్తు మధ్య నర్సు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పహాడీషరీఫ్ పోలీసులు మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

మంత్రి సీతక్క దిగ్భ్రాంతి

నర్సుగా పనిచేస్తున్న యువతి హత్య ఘటనపై మంత్రి సీతక్క ఆదివారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ఘటన వివరాలపై స్థానిక పోలీసు అధికారులను ఆరా తీశారు. డీజీపీ సీవీ ఆనంద్‌కు ఫోన్ చేసి. . సమగ్ర దర్యాప్తు జరపాలని సూచించారు. బాధిత కుటుంబానికి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

ఫ్యూచర్ సిటీలో భారీ స్టేడియం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌కు ఆతిథ్యమిస్తున్నది ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఒకటే. దీని సీటింగ్ సామర్థ్యం సుమారు 35-40 వేలు. గతంలో క్రికెట్ మైదానంగా వెలుగొందిన ఎల్బీ స్టేడియంలో ఇప్పుడు ఎక్కువగా బహిరంగ సభలు, ఇతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. లక్షకుపైగా సీటింగ్ సామర్థ్యంతో క్రికెట్, ఫుట్‌బాల్ సహా ఏ అంతర్జాతీయ మ్యాచ్ నిర్వహించాలన్నా. . ఏదైనా మ్యూజికల్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేయాలన్నా ప్రస్తుతం రాష్ట్రంలో ఆ స్థాయి మైదానం లేదు. ఆ కొరత తీరుస్తూ.. ఫ్యూచర్ సిటీలో అధునాతన హంగులతో నిర్మించనున్నారు. వంద ఎకరాల విస్తీర్ణంలో ప్రముఖ స్టేడియాల సరసన నిలిచేలా దీన్ని తీర్చిదిద్దనున్నారు. తెలంగాణలో నూతన స్టేడియం నిర్మాణానికి ఇప్పటికే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ముందుకొచ్చింది. దీనికి బీసీసీఐ కూడా అంగీకరించినట్లు తెలుస్తోంది. కొత్త స్టేడియం నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా పచ్చజెండా ఊపడంతో.. కార్యాచరణ వేగవంతమైంది. త్వరలోనే టీజీఐఐసీతో హెచ్‌సీఏ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబరులో ఈ ఎంఓయూ ప్రక్రియ పూర్తిచేసి..డిసెంబరులో నూతన స్టేడియం నిర్మాణానికి భూమిపూజ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

భవిష్యత్ దృష్ట్యా అక్కడే..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు.. ఈ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లు మాత్రమే కాకుండా ఫుట్‌బాల్, హాకీ సహా ఇతర క్రీడలకు తగ్గట్టు మలుచుకునే విధంగా డిజైన్ చేస్తున్నారు. అలాగే భారీ కాన్సర్ట్‌లను సైతం ఏర్పాటు చేసేట్లు వెసులుబాటు కల్పిస్తున్నారు. దీని నిర్మాణ వ్యయం, నిర్వహణ ఖర్చులు బీసీసీఐ భరించనుండగా..రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించనుంది. కాగా ఔటర్ రింగ్ రోడ్, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీకి మెట్రో విస్తరణ ప్రతిపాదన, శంషాబాద్ విమానాశ్రయంకు సమీపంలో ఉండడంతో.. స్టేడియంకు ప్రేక్షకుల రాకపోకలకు అనుకూలించనున్నాయి. ఫ్యూచర్ సిటీలో నిర్మిస్తున్న స్పోర్ట్స్ సిటీ, టూరిజం, నెట్‌జీరో సిటీ కాన్సెప్ట్‌లో భాగంగా ఈ క్రీడా ప్రాంగణం కీలక భాగం కానుంది.

నీట్-పీజీకి రెండు కేంద్రాల్లో తీవ్ర అంతరాయం

- ఆ అభ్యర్థులకు జైపుర్‌లో 5న మళ్లీ పరీక్ష
- రాష్ట్రంలో 97.26% మంది హాజరు

ఈనాడు, దిల్లీ–హైదరాబాద్: కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య దేశవ్యాప్తంగా నీట్-పీజీ (2026)ని విజయవంతంగా నిర్వహించినట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఎంఎస్) వెల్లడించింది. 339 నగరాల్లోని 1,111 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఈ పరీక్షకు 2.63 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపింది. అయితే, జైపుర్‌లోని సీతాపురాలో రెండు ఐడీజడ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల 2,445 మంది అభ్యర్థులు పరీక్షను పూర్తి చేయలేకపోరు. వీరికి సెప్టెంబరు 5న జైపుర్‌లో మళ్లీ పరీక్ష నిర్వహిస్తామన్నారు. కాగా, రాష్ట్రంలో 'నీట్ పీజీ-2026' ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 14 జిల్లాల్లోని 56 పరీక్ష కేంద్రాల్లో 17,143 (97.26%) మంది అభ్యర్థులు హాజరుకాగా, 483 మంది గైర్హాజరయ్యారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని టీసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రీజనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, శాఖ కార్యదర్శి క్రిస్టినా పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.



పరీక్ష నిర్వహణ తీరును పరిశీలిస్తున్న మంత్రి దామోదర్, కార్యదర్శి క్రిస్టినా

మధ్యస్తం నుంచి కఠినంగా..

ఆదివారం నిర్వహించిన నీట్‌పీజీ-2026 పరీక్ష ప్రశ్నాపత్రం గతేడాదితో పోలిస్తే మధ్యస్తం నుంచి కఠినంగానే ఉందని విద్యార్థులు, నిపుణులు అభిప్రాయపడ్డారు. క్లినికల్ ఆధారితంగా సుదీర్ఘమైన ప్రశ్నలు వచ్చాయని, దాంతో పాటు చిత్ర ఆధారితమైనవి (ఇమేజ్ బేస్డ్) అడిగినట్లు వెల్లడించారు. జనరల్ మెడిసిన్, అబ్‌స్టెట్రిక్స్-గైనకాలజీ (ఓబీజీ), ఫార్మకాలజీ, పాథాలజీ సబ్జెక్టులకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు.



మీ శక్తిని వారు హరిస్తారు

ప్రతికూల ఆలోచనలను కలిగి ఉండే వ్యక్తుల మధ్య ఉండకండి. వారు మీ శక్తిని హరించేస్తారు. ఇతరుల ఆలోచనా ధోరణిని మీరు మార్చలేరు! కానీ మీ చుట్టూ ఎలాంటి వ్యక్తులు ఉండాలో మాత్రం మీరు ఎంచుకోగలరన్న సంగతి మరువకండి.

– జైనా, వెల్‌నెస్ కోచ్

ఈయూలో చేరికకు ఐస్‌ల్యాండ్ నో

రేక్జావిక్: ఐస్‌ల్యాండ్ జాతీయుల్లో మెజారిటీ ప్రజలు యూరోపియన్ యూనియన్ (ఈయూ)లో చేరేందుకు నిరాకరించారు. ఈయూలో చేరికపై నిర్వహించిన రెఫరెండంలో 52.8% మంది వ్యతిరేకంగా, 47.2% మంది అనుకూలంగా ఓటేశారు. దీంతో ఐస్‌ల్యాండ్ దేశం ఈయూలో చేరే ప్రతిపాదన 2028 వరకూ వాయిదా పడింది. ఈ రెఫరెండం ఫలితాన్ని అమలు చేసి తీరాలన్న నియమమేదీ లేకున్నా తాను ప్రజా తీర్పును గౌరవిస్తానని ప్రధానమంత్రి క్రిస్టున్ ఫ్రోస్టాడోట్టిర్ అన్నారు. 2009లో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్న ఐస్‌ల్యాండ్ ఆ సందర్భంగా ఈయూలో చేరేందుకు దరఖాస్తు చేసుకుంది. చేరికకు సంబంధించిన చర్చలు 2013లో నిలిపేశారు. ప్రస్తుత ప్రధాని ఈయూలో చేరికపై చర్చలు పునరుద్ధరించాలని కోరుకుంటున్నారు. ఐస్‌ల్యాండ్ యూరప్‌లో ధనికదేశాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది.

ఉజ్బెకిస్థాన్‌తో ఐదింతల వాణిజ్యం

- అధ్యక్షుడితో మోదీ చర్చలు.. ఒప్పందాలు

తాష్కెంట్: ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 500 కోట్ల డాలర్లకు (సుమారు రూ.47,690 కోట్లు) పెంచుకోవాలని భారత్-ఉజ్బెకిస్థాన్ నిర్ణయించుకున్నాయి. ప్రస్తుతం ఇది 100 కోట్ల డాలర్లుగా ఉంది. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్‌తో భారత ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం తాష్కెంట్‌లో జరిపిన ద్వైపాక్షిక చర్చల్లో ఈ మేరకు అవగాహన ఒప్పందం కుదిరింది. సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకువెళ్లాలని ఇరువురు నేతలు నిర్ణయానికి వచ్చారు. వాణిజ్యం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, అరుదైన ఖనిజాలు, గనుల తవ్వకం, రక్షణ, భద్రత, వ్యవసాయం, ఔషధాలు, ఆరోగ్యం, సమాచార సాంకేతికత, యూపీఐ సహా డిజిటల్ వ్యవస్థలు, విద్య.. ఈ రంగాల్లో సహకారంపై చర్చలు ప్రధానంగా కేంద్రీకృతమయ్యాయి. 11 ఒప్పందాలకు సంబంధించిన అవగాహన పత్రాలను ఇరు దేశాల బృందాలు పరస్పరం మార్చుకున్నాయి. ఇరు దేశాల మధ్య భాగస్వామ్యంతో మధ్య ఆసియా ప్రాంతంలో శాంతి, పురోగతి, సుసంపన్నతలకు బలం లభిస్తుందని మోదీ పేర్కొన్నారు. ఆయుధ ఉత్పత్తిలో రెండుదేశాల రక్షణరంగ పరిశ్రమలు పరస్పరం సహకరించుకుని సంయుక్త భాగస్వామ్యంతో పనిచేసేందుకు వీలుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. యురేనియం సరఫరాకు దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకుంటామని చెప్పారు. విదేశీ నేతలకు ఇచ్చే అత్యున్నత పౌర పురస్కారం (ఒలియ్ దరలి దోస్ట్లిక్)ను మోదీకి ప్రదానం చేశారు. దీనిని ఆయన ఇరు దేశాల సంబంధాలకు, 140 కోట్ల మంది భారతీయులకు అంకితం చేశారు. ప్రవాస భారతీయులతో మోదీ భేటీ అయ్యారు.



కిర్గిస్థాన్ చేరుకున్న మోదీకి స్వాగతం పలుకుతున్న ఆ దేశ ప్రధాన మంత్రి అదిల్‌బెక్ కాసిమలివ్

భారతీయులకు వీసా-ఫ్రీ

భారత పౌరుల కోసం ఉజ్బెకిస్థాన్ 30 రోజుల వీసా రహిత (వీసా-ఫ్రీ) విధానాన్ని ప్రకటించింది. మిర్జియోయెవ్ ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. సోమ, మంగళవారాల్లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనేందుకు మోదీ ఆదివారం రాత్రి కిర్గిస్థాన్ చేరుకున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, కిర్గిస్థాన్ అధ్యక్షుడు ఝపరోవ్‌లతో ఆయన చర్చలు జరపనున్నారు. ఈ సదస్సుకు హాజరయ్యేందుకు చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ కూడా అక్కడకు చేరారు.

పోలీసుల దాష్టీకాన్ని నిలదీస్తూ పట్నాలో ఆరేళ్ల బుడతడి ధర్నా


ప్రధాని వచ్చేదాకా విరమించేది లేదన్న ఆదిత్య



పట్నా: బిహార్‌లో నిరుద్యోగులతో కలిసి ఇటీవల నిరసన ప్రదర్శనలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనర్గళ ప్రసంగంతో అదరగొట్టిన ఆరేళ్ల బుడతడు ఆదిత్య కుమార్ మరోసారి రోడ్డెక్కాడు. తన తల్లిదండ్రులను పోలీసులు కొట్టారని ఆరోపిస్తూ పట్నాలోని గర్దనిబాగ్ ప్రాంతంలో ఆదివారం ధర్నాకు దిగాడు. ప్రధాని మోదీ జోక్యంచేసుకోవాలని డిమాండ్ చేశాడు. "నన్ను తల్లిదండ్రులకు దూరంగా 8 గంటలపాటు కస్టడీలో ఉంచి పోలీసులు వారిని కొట్టారు. నా తల్లిదండ్రులు నేరస్థులు కాదు. వారినెందుకు పోలీసులు కొట్టారు?" అంటూ ఆదిత్య కుమార్ ప్రశ్నించాడు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు తన నిరసనకు మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశాడు. ప్రధాని మోదీ వచ్చి తన సమస్యను పరిష్కరించే వరకూ ధర్నా విరమించబోనని స్పష్టం చేశాడు. తన తల్లిదండ్రులను కొట్టిన పోలీసులపై దర్యాప్తు జరిపించాలని కోరుతూ శనివారం రాష్ట్ర డీజీపీ వినయ్‌కుమార్‌కు లేఖ ఇచ్చినట్లు ఆదిత్య వెల్లడించాడు. ఆగస్టు 25నాటి నిరుద్యోగుల ధర్నాలో పాల్గొన్న ఆదిత్య కుమార్‌ను కొద్ది సమయంపాటు స్టేషన్‌లో ఉంచి దినసరి కూలీలైన అతని తల్లిదండ్రులకు అప్పగించినట్లు గత వారం పోలీసులు తెలిపారు.

భిన్నత్వంలో ఏకత్వం మన డీఎన్‌ఏయే

మోహన్ భాగవత్ ఉద్ఘాటన



న్యూయార్క్: భిన్నత్వంలో ఏకత్వం.. భారతదేశ డీఎన్‌ఏలోనే ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ చెప్పారు. దీనిని గౌరవించి, ఆమోదించి, పండగ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్ వద్ద ఇండో-అమెరికన్ల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన దాదాపు గంటసేపు ప్రసంగించారు. అమెరికా అనగానే బహుళత్వం గుర్తుకు వచ్చినట్లే భారత్ అనగానే భిన్నత్వంలో ఏకత్వం స్ఫురిస్తుందని భాగవత్ చెప్పగానే సభా ప్రాంగణం చప్పట్లతో మార్మోగింది. "వివేకానందుడు ప్రవచించినట్లు ప్రతి దేశానికి పూర్తిచేయాల్సిన మిషన్, చేరుకోవాల్సిన గమ్యం ఉంటాయి. భారత్ వరకు చూస్తే భిన్నత్వంలో ఏకత్వమే మా ప్రత్యేకత. ప్రపంచం నుంచి ఎంతోకొంత తీసుకుంటున్నట్లే సమాజానికి, ప్రపంచానికి తిరిగి ఇవ్వాల్సిన అవసరం ఉంది. మనం ఎంత సంపాదిస్తున్నాం అనేదానికంటే ఎంత పంచుతున్నామనేది ముఖ్యం. ప్రవాస భారతీయులంతా తమ కర్మభూమికీ విధేయులై ఉండాలి. అమెరికాలో జీవిస్తూ, ఇక్కడ సంపాదిస్తున్నవారంతా ఈ దేశం విషయంలో నిజాయతీగా ఉండాలి. జన్మభూమితో పాటు కర్మభూమిలోనూ విద్యుక్త ధర్మం నెరవేర్చాలి" అని భాగవత్ సూచించారు. 39 రాష్ట్రాలు, 853 నగరాలకు చెందిన ప్రతినిధులు, వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు, అమెరికాలో 250 సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

భాజపా భాగవత్ మాట వినాలి: దీప్కే



దిల్లీ, అబిడ్స్-న్యూస్‌టుడే: భాజపా భాగవత్ మాటల్ని ఆలకించాలని కాక్రోచ్ జనతాపార్టీ నేత అభిజీత్ దీప్కే సూచించారు. భాగవత్ మాటల్ని ప్రధాని మోదీ పెడచెవిన పెడుతున్నారని, అందుకే మేధో నక్సల్స్ వంటి పదప్రయోగం చేస్తున్నారని విమర్శించారు. ఆరెస్సెస్ కంటే పెద్దవాళ్లమని భాజపా అనుకుంటూ ఉంటుందని ఆయన ఎద్దేవా చేశారు. ఆరెస్సెస్ అధినేత భాగవత్ అమెరికాలో చేసిన ప్రసంగం ఆయన ద్వంద్వవైఖరిని చాటుతోందని విపక్షం ఆక్షేపించింది. విద్వేషం, మతతత్వం ఆరెస్సెస్ డీఎన్‌ఏలో ఉన్నాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి షామా మహమ్మద్ ఆరోపించారు. న్యూయార్క్‌లో మాట్లాడింది భాగవత్‌యేనా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీయా అనే సందేహం కలిగిందని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ వ్యంగ్యంగా అన్నారు. భాగవత్ వ్యాఖ్యలు బయట ప్రపంచానికి ఒకలా, ఆర్‌ఎస్‌ఎస్ అంతర్గతానికి మరోలా ఉంటాయని, ఆయనది ద్వంద్వవైఖరి అని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ 'ఎక్స్' వేదికగా విమర్శించారు. భారతీయ ముస్లింలను, క్రైస్తవుల్ని అంతర్గత ముప్పుగా ఆరెస్సెస్ భావిస్తుంటుందని ఆరోపించారు.

ముస్లిం దేశాల ఐక్యతకు ఇరాన్ అధినేత పిలుపు



మొజ్తబా ఖమేనీ

టెహ్రాన్: ముస్లిం దేశాలు, ముఖ్యంగా గల్ఫ్ దేశాలు తమ నిజమైన శత్రువుకు వ్యతిరేకంగా ఒకటి కావాలని ఇరాన్ సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ పిలుపునిచ్చారు. గల్ఫ్ దేశాల మధ్య సమైక్యత లేని కారణంగా పాలస్తీనీయులు అంతులేని వ్యథకు గురికావడంతో పాటు పశ్చిమాసియాలో నిరంతర ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం దేశాల మధ్య అనైక్యత వాటి శత్రువులకు ప్రయోజనం కలిగిస్తోందని ఖమేనీ అన్నారు. మొహమ్మద్ ప్రవక్త జయంతి వారోత్సవం సందర్భంగా ఆయన ఈమేరకు తన టెలిగ్రామ్ అకౌంట్ నుంచి ఒక సందేశాన్ని విడుదల చేశారు. ముస్లింల మధ్య ఐక్యత, వివిధ రంగాల్లో వారి మధ్య సహకారం పెంపొందాలని పిలుపునిచ్చారు. "ముస్లింలు ఐక్యంగా ఉంటే పాలస్తీనా ప్రజల్ని అలా నిస్సహాయ స్థితిలో వదిలేసేవారా? గల్ఫ్ ప్రాంత ప్రజలూ, ప్రభుత్వాలూ ఇస్లాం జెండా నీడలో ఏకతాటిపై నిలుచుంటే దుర్మార్గులు వారి భూభాగాలపై కన్నేసేవారా? ఇస్లామిక్ దేశాలను ముఖ్యంగా పశ్చిమాసియా, గల్ఫ్ దేశాలను నేను కోరేది ఒక్కటే. మీ నిజమైన శత్రువు ఎవరో గుర్తించండి. ఆ శత్రువు ప్రణాళికల్ని అర్థం చేసుకొని వాటికి ఎదురు నిలవండి" అని మొజ్తబా ఖమేనీ అన్నారు.

భారత్‌కు మరో 5 ఎస్-400 క్షిపణి వ్యవస్థలు



దిల్లీ: భారత గగనతల రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. మరో ఐదు ఎస్-400 'సుదర్శన్' లాంగ్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ స్క్వాడ్రన్ల కొనుగోలుకు భారత్ జారీ చేసిన టెండర్‌కు రష్యా స్పందించింది. తాజాగా రష్యా ప్రభుత్వం తమ పూర్తి స్థాయి ప్రతిపాదనను భారత రక్షణ మంత్రిత్వ శాఖకు సమర్పించింది. సుమారు రూ.50 వేల కోట్లకు పైగా విలువైన ప్రతిపాదనను ప్రస్తుతం భారత రక్షణ వర్గాలు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే రష్యా నుంచి ఐదు ఎస్-400 స్క్వాడ్రన్ల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకోగా నాలుగు స్క్వాడ్రన్లు భారత్‌కు అందాయి. ఐదో స్క్వాడ్రన్‌ను ఈ ఏడాది నవంబరుకు సరఫరా చేసే అవకాశం ఉందని రక్షణ వర్గాలు తెలిపాయి. కొత్త ఒప్పందం కుదిరితే డెలివరీలు ప్రారంభం కావడానికి మూడేళ్ల సమయం పట్టే అవకాశం ఉంది. వీటిని భారతదేశంలోని తూర్పు, పశ్చిమ సరిహద్దుల్లో మోహరించే అవకాశం ఉంది. దీంతో దేశ గగనతల రక్షణ సామర్థ్యం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఎస్-400 వ్యవస్థలు కీలక పాత్ర పోషించినట్లు రక్షణ వర్గాలు పేర్కొన్నాయి.

ఇక అత్యంత వేగంగా విశ్వ రహస్యాల ఛేదన



- అంతరిక్షంలోకి భారీ టెలిస్కోప్ 'రోమన్'ను ప్రయోగించిన నాసా

కేప్‌కెనావెరల్: ఖగోళంలో మన సౌరమండలానికి వెలుపల ఆవాసయోగ్య గ్రహాలేవైనా ఉన్నాయా? విశ్వం నిరంతరం వ్యాప్తి చెందడానికి చోదకశక్తిని అందిస్తున్న డార్క్ ఎనర్జీ రహస్యం ఏమిటి? వంటి అనేక చిక్కు ప్రశ్నలకు సమాధానాలను వేగంగా కనుగొనేందుకు ఉద్దేశించిన అత్యాధునిక న్యాన్సీ గ్రేస్ రోమన్ స్పేస్ టెలిస్కోప్‌ను అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రయోగించింది. 430 కోట్ల డాలర్ల వ్యయంతో రూపొందించిన భారీ టెలిస్కోప్‌ను ఆదివారం తెల్లవారుజామున కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ హెవీ రాకెట్ ఆకాశంలోకి మోసుకెళ్లింది. దాదాపు 16 లక్షల కిలోమీటర్ల ఆవల ఉన్న 'అబ్జర్వేషన్ పాయింట్' (పరిశీలన ప్రదేశం) దిశగా ఇది సాగిపోయింది. నాసా తొలి ముఖ్య వ్యోమగామి 'న్యాన్సీ గ్రేస్ రోమన్'కు గుర్తుగా ఈ టెలిస్కోప్‌నకు ఆ పేరు పెట్టారు. గమ్యస్థానం చేరుకోవడానికి మూడు నెలలకు పైగా సమయం పడుతుంది. ఒక బస్సు సైజు ఉన్న ఈ టెలిస్కోప్ తన గమ్యాన్ని చేరాక అంతరిక్షంపై అంతకు ముందు ఎన్నడూ లేనంత విస్తృత స్థాయిలో దృష్టి సారిస్తుంది. 'వేల నక్షత్రాల జననాలను, పతనాలను, ఖగోళంలో తేలియాడుతున్న గ్రహాలు, అసంఖ్యాక నక్షత్ర మండలాలను కనుగొనబోతోంది' అని నాసా సైన్స్ మిషన్ డైరెక్టర్ నిక్కీ ఫాక్స్ తెలిపారు.

నాసాకు చెందిన హబుల్ టెలిస్కోప్ కన్నా దీని వీక్షణ పరిధి 100 రెట్లు ఎక్కువ. పరారుణ కిరణాలతో అంతరిక్షాన్ని తేరిపారజూస్తున్న వెబ్ స్పేస్ టెలిస్కోప్ కూడా దీని ముందు దిగదుడుపే. రోమన్, హబుల్, వెబ్ టెలిస్కోప్‌లు సమన్వయంతో పనిచేసి ఖగోళ రహస్యాలను ఛేదిస్తాయని నాసా వర్గాలు తెలిపాయి. రోమన్ టెలిస్కోప్ మన పాలపుంత నక్షత్ర మండలంలో ఒక నెలపాటు గమనించే విషయాలను చూడటానికి హబుల్ టెలిస్కోప్‌నకు ఒక శతాబ్దం పడుతుందని నాసా సీనియర్ ప్రాజెక్ట్ సైంటిస్ట్ జూలీ మెక్‌ఎనెరీ తెలిపారు.

పార్టీని విమర్శించండి దేశాన్ని నిందించకండి



రిజిజు

దిల్లీ: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధిపతి మోహన్ భాగవత్ న్యూయార్క్‌లో పాల్గొన్న కార్యక్రమ వేదిక బయట భారత జాతీయ పతాకాన్ని నిరసనకారులు అపవిత్రం చేయడంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దానికి సంబంధించిన వీడియోను 'ఎక్స్'లో పంచుకున్నారు. "ఆరెస్సెస్‌ను, భాజపాను, ప్రభుత్వాన్ని విమర్శించేందుకు మీకు స్వేచ్ఛ ఉంది. మా దేశాన్ని నిందించడానికి మాత్రం వీల్లేదు. జాగ్రత్తగా వినండి.. మా పతాకాన్ని, మా దేశాన్ని కించపరిస్తే దానికి మూల్యం తప్పదు" అని హెచ్చరించారు. మాడిసన్ స్క్వేర్ గార్డెన్ వద్ద ఖలిస్థాన్‌కు అనుకూలంగా కొందరు నినాదాలు చేస్తుండగా భారత జాతీయ పతాకాన్ని కొందరు అపవిత్రం చేస్తున్నట్లు వీడియోలో ఉంది.

యూపీ ఐఏఎస్ అధికారిణి

ఆకస్మిక రాజీనామా

- ప్రజల రుణం తీర్చుకుంటా: దివ్యా మిత్తల్



దేవరియా: ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన 2013 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి దివ్యా మిత్తల్ తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. స్వచ్ఛందంగానే వైదొలగుతున్నానంటూ కారణాలను మాత్రం ఆమె వెల్లడించలేదు. ప్రతి ప్రభుత్వ దస్త్రం వెనుక ఒక వ్యక్తి జీవితం ఉంటుందని తన రాజీనామా సందేశంలో దివ్యా మిత్తల్ తెలిపారు. "సమాజానికి నేనేదో ఇవ్వడానికి ఐఏఎస్‌గా వచ్చానని అనుకున్నా. అలా అనుకోవడం నా అవివేకం. ఎందుకంటే... నిజానికి నేనే అత్యధికంగా వారి నుంచి నేర్చుకున్నాను. ఆ రుణం ఎంతగానో పెరిగిపోయింద'ని సామాజిక మాధ్యమం పోస్టులో దివ్యా మిత్తల్ పేర్కొన్నారు. "నా కోసం కన్న కలలు సాకారమయ్యాయి. ఇప్పుడు ప్రజల కోసం కంటున్న కలలు సాకారం చేయాల్సిన సమయం ఆసన్నమైంద'ని పేర్కొనడంతో ఆమె ఏమి చేయబోతున్నారన్నది చర్చనీయాంశంగా మారింది.

లండన్‌లో ఉన్నత ఉద్యోగాన్ని వీడి...

ఐఐటీ దిల్లీ, ఐఐఎం బెంగళూరులలో ఉన్నత విద్యను అభ్యసించిన దివ్యా మిత్తల్ లండన్‌లో ఆర్థిక నిపుణురాలుగా చేస్తోన్న ఉద్యోగాన్ని వీడి స్వదేశానికి వచ్చారు. సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. గత 13 ఏళ్ల సర్వీసు కాలంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని దేవరియా, సంత్‌కబీర్ నగర్, మిర్జాపుర్‌లలో జిల్లా కలెక్టర్‌గా దివ్యా మిత్తల్ విశేష సేవలందించారు. మిర్జాపుర్ కలెక్టర్‌గా 2022 సెప్టెంబరు నుంచి 2023 సెప్టెంబరు వరకు ఏడాది పాటు మాత్రమే ఉన్నప్పటికీ స్థానిక ప్రజల మనసుల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారు. మారుమూల కొండ ప్రాంతంలోని పల్లెకూ పైప్‌లైన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ..'అసాధ్యమనేది వాస్తవం కాదు. అది ఒక అభిప్రాయం మాత్రమేనని మిర్జాపుర్ నాకు నేర్పించింద'ని ఆమె పేర్కొన్నారు. దివ్యా మిత్తల్‌ను ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేయడంతో స్థానికులు భారీ నిరసనలకు దిగారు. ఐదు నెలలపాటు ఆమెకు ఏ పోస్టూ కేటాయించలేదు. ఆ తర్వాత ఉత్తర్‌ప్రదేశ్ గ్రామీణ రహదారుల సంస్థ సీఈవోగా నియమితులయ్యారు. రాజీనామా ప్రకటించే సమయానికి రాష్ట్ర రెవిన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి పదవిలో ఉన్నారు. భవిష్యత్తు కార్యాచరణ ఏమిటో ఆమె స్పష్టం చేయలేదు. కుటుంబానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. పుస్తక రచనతో పాటు విద్యా రంగాన్ని ఎంచుకునే అవకాశం ఉందని దివ్యా మిత్తల్ సన్నిహితులు తెలిపారు.

ఐరోపాలో ఎత్తైన పర్వతాన్ని అధిరోహించిన భారత మహిళ




లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని సీతాపుర్ జిల్లాకు చెందిన 43 ఏళ్ల శివానీ మెహ్రోత్రా- ఐరోపాలోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎల్బ్రస్‌ను అధిరోహించారు. ఈ నెల 8న ఆమె ముంబయి నుంచి దుబాయ్ మీదుగా రష్యా చేరుకున్నారు. 15న నాలుగు గంటలపాటు ట్రెక్కింగ్ చేసి, ఎల్బ్రస్ శిఖరాన్ని చేరుకున్నారు. భారత్‌కు తిరిగి వచ్చిన ఆమె తన అనుభవాలను ఓ వార్తాసంస్థతో పంచుకున్నారు. వృత్తిరీత్యా యోగా టీచర్ అయిన శివానీ ఫుల్-హాఫ్ మారథాన్‌లతో పాటు 50 కిలోమీటర్ల పరుగును కూడా పూర్తి చేసి అల్ట్రా-రన్నర్‌గా పేరుపొందారు. 'పర్వతాలను అధిరోహించాలని కాలేజీ రోజుల్లో కలలుకనేదాన్ని. కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో వాటిని నిజం చేసుకోగలుగుతున్నా. హిమాలయాల్లోని పలు ప్రాంతాలతో పాటు కశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్‌లలోని పలు పర్వతాలను అధిరోహించాను. కిలిమంజారోనూ అధిరోహించాను. ... చేరుకోవడం నా ఆశయం' అని శివానీ తెలిపారు.



నేపాల్‌లోని నువాకోట్ జిల్లా దేవీఘాట్ వద్ద లిఖు నది సమీపంలో ఇటీవల ఆకస్మిక వరదలతో దెబ్బతిన్న ఇళ్లు, ఆ ప్రాంతంలో పేరుకున్న బురద





నువాకోట్‌లోని అప్పర్ త్రిశూలి 3 జలవిద్యుత్ కేంద్రం సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్న సైనిక సిబ్బంది ✦ ధాడింగ్ జిల్లా గల్ఛిలో శ్రీ భాగేశ్వరి మాధ్యమిక పాఠశాలలో మట్టికొట్టుకుపోయిన విద్యార్థుల బ్యాగులు

నష్ట తీవ్రతను దాచిపెడుతున్న చైనా!

దిల్లీ: టిబెట్‌లో ఈ నెల 26 నాటి మెరుపు వరదలకు సంబంధించి చైనా వ్యవహరిస్తున్న తీరు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. వరదలతో చోటుచేసుకున్న నష్టాన్ని తెలియజేసేలా అక్కడి టిబెటన్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్న వీడియోలను డ్రాగన్ ప్రభుత్వం తొలగిస్తోంది. మౌలిక వసతులు దెబ్బతిన్న తీరును కళ్లకు కట్టే ఫొటోలనూ తొలగింప చేయిస్తోంది. టిబెట్‌లో కొనసాగుతున్న సహాయక చర్యల సంబంధిత చిత్రాలు, వీడియోలు మాత్రమే సామాజిక మాధ్యమాల్లో, వార్తల్లో ఉండేలా జాగ్రత్త పడుతోంది. ఈ వైఖరి కారణంగా పారదర్శకత దెబ్బతింటుందని, సహాయక చర్యలకూ విఘాతం కలిగే ముప్పుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొవిడ్ మహమ్మారి విజృంభించినప్పుడూ చైనా తమ దేశంలో నష్ట తీవ్రత ప్రపంచానికి స్పష్టంగా తెలియకుండా వ్యవహరించిన సంగతి గమనార్హం.

'జాతీయ పురుష కమిషన్ ఏర్పాటుపై చర్చ జరగాలి'

చండీగఢ్: జాతీయ పురుషుల కమిషన్ ఏర్పాటుపై దేశ స్థాయిలో నిజమైన చర్చ జరగాల్సిన అవసరం ఉందని రాజ్యసభ సభ్యుడు అశోక్ కుమార్ మిత్తల్ సూచించారు. పరిశోధకులు, సామాజిక కార్యకర్తలు, విధాన నిర్ణేతలు ఈ అంశంపై పద్ధతి ప్రకారం అధ్యయనం జరపాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. "భార్యచేతిలో భర్త హత్య, పురుషుడి ఆత్మహత్య... 2024, 2025 సంవత్సరాల్లో వెలువడిన మీడియా వార్తలపై పరిశోధన, విశ్లేషణ" అనే శీర్షికతో న్యాయ ఫౌండేషన్ వెలువరించిన నివేదికను విడుదల చేసిన అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. పురుషులకు, స్త్రీలకు మధ్య పోటీని సృష్టించడం తన అభిమతం కాదని, ప్రతి పౌరుడి నిజమైన ఆందోళనలకు పరిష్కారం చూపాలన్నదే తన ఉద్దేశమని ఆయన అన్నారు. "కొందరి వాదనను వినకుండా వదిలేస్తే న్యాయం జరిగినట్టవుతుందా?" అని ప్రశ్నించారు.

మతాచారానికి కులం రంగు పులుముతున్న రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయండి

- ఉత్తరాఖండ్ పోలీసులకు ఓ వ్యక్తి ఫిర్యాదు

హల్ద్వానీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న స్థలంలో నిర్వహించిన మతపరమైన ఆచారానికి కులం రంగు పులిమేందుకు విపక్ష నేత రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని వాల్మీకి సమాజానికి చెందిన జవహర్‌నగర్ వాసి అమిత్ కుమార్ ఉత్తరాఖండ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. ఆగస్టు 8, 11 తేదీలలో శ్రీరామ సేన ధర్మార్థ సేవా న్యాస్ నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీలు సహా సమాజంలోని వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారని అమిత్‌కుమార్ తెలిపారు. అది ఏ ఒక్క కులానికీ చెందిన కార్యక్రమం కాదన్నారు. ఈ ఫిర్యాదుపై ఇంకా ఎలాంటి కేసు నమోదు చేయలేదని స్టేషన్‌హౌస్ అధికారి విజయ్ మెహతా తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు హాజరైన సభా వేదికకు శుద్ధి చేపట్టిన వ్యక్తులపై అంటరానితనం నిషేధ చట్టం కింద చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తోన్న విషయం తెలిసిందే.

18,600 అడుగుల ఎత్తులో సైన్యం అద్భుత ఆపరేషన్

ఇంటర్నెట్ డెస్క్: అసలే మంచుపర్వత వాలు ప్రాంతం. ఓ వైపు బలమైన గాలులు వీస్తున్నాయి. సైనిక హెలికాప్టర్‌ను ల్యాండ్ చేయడానికి అనువైన పరిస్థితులు అక్కడ లేనేలేవు. పైగా ఇంధనం పరిమితంగా ఉంది. ఇన్ని సవాళ్ల మధ్య 18,600 అడుగుల ఎత్తులో భారత సైన్యం వీరోచితమైన సహాయక ఆపరేషన్ నిర్వహించింది. దీని ఫలితంగా లద్దాఖ్‌లోని నన్ కున్ పర్వత కూటమి సమీపంలో ఓ రోగిని కాపాడి పైలట్లు సురక్షిత ప్రదేశానికి తరలించగలిగారు. ముందుగా హెలికాప్టర్ బరువు తగ్గించడం కోసం అనవసరమైన పరికరాలను తొలగించారు. తక్కువ ఎత్తులో హెలికాప్టర్‌ను గాల్లోనే ఉంచి ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. దీనికి సంబంధించిన వీడియోను భారత సైన్యం 'ఎక్స్'లో పంచుకుంది.

మక్కా ఒప్పందంలో చేరడంలో ముప్పులేదు: బంగ్లాదేశ్

ఢాకా: సౌదీ అరేబియా, తుర్కియే, పాకిస్థాన్ ఇటీవల కుదుర్చుకున్న 'మక్కా సంయుక్త రక్షణ ఒప్పందం'లో చేరడంలో ఎలాంటి ముప్పు లేదని బంగ్లాదేశ్ పేర్కొంది. దీనివల్ల ఇతర భాగస్వాములతో సంబంధాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపింది. తమ మూడు దేశాల్లో దేనిపై సైనిక దాడి జరిగినా అది ముగ్గురిపైనా జరిగినట్లుగా భావించాలని మక్కా ఒప్పందంలో ఉన్న విషయం తెలిసిందే. ఆహ్వానిస్తే తాము కూడా దీనిలో చేరుతామని విదేశాంగ మంత్రి ఖలీలుర్ రహ్మాన్ ఇటీవల బంగ్లాదేశ్ పార్లమెంటులో చేసిన ప్రకటనకు కొనసాగింపుగా ఆ శాఖ సహాయమంత్రి హుమయూన్ కొబిర్ ఆదివారం విలేకరుల సమావేశంలో ఈ వ్యాఖ్య చేశారు. ఇది కొత్త అవకాశాలు సృష్టించే వినూత్న ఒప్పందమని అన్నారు.

...మందులు వికటించాయా?



అందరికీ అన్ని ఔషధాలు పడవు. కొన్ని వికటిస్తాయి. దీనికి కారణాలనేకం. ఎవరిలో రియాక్షన్స్ వచ్చే అవకాశం ఉంటుంది? అది వస్తే ఏం చేయాలి? ఎవర్ని సంప్రదించాలి? కొందరు నీళ్లతో కాకుండా టీ, కాఫీ, మజ్జిగ, పాలు, పండ్ల రసాలతోనూ వేసుకుంటారు. అలా వేసుకున్నా రియాక్షన్స్ వస్తాయి. మందులు వేటితో వేసుకోవాలి? తెలుసుకుందామా!

■ వైద్యులు మందులు రాసేటప్పుడు గతంలో ఏమైనా మందులు వాడారా? అప్పుడు అవి పడ్డాయా? ఏమైనా ఇబ్బంది పెట్టాయా అని అడిగి రాస్తారు. పేషెంట్ ఏమైనా మందులు పడలేదంటే దాని వరకు టెస్ట్ డోస్ ఇచ్చి పరిశీలన అనంతరం రాస్తారు. మందులు పడకపోతే మన శరీరంలో తేడాలొస్తాయి. చర్మంపై దద్దుర్లు, దురదలు వస్తాయి. మచ్చలు ఏర్పడతాయి. ఆయాసం, ముఖం ఉబ్బడం, కాళ్లవాపులు ఉంటాయి. ఈ లక్షణాలు ఉంటే మందులు పడలేదని అర్థం. వెంటనే వాటిని ఆపేయాలి.

■ రియాక్షన్స్ రాగానే రోగి తొలుత డాక్టర్‌ను సంప్రదించాలి. ఏ మందులు వాడారో ప్రిస్క్రిప్షన్ తీసుకెళ్లి చూపించాలి. సాధారణంగా రోగులు తనకున్న జబ్బును బట్టి నివారణకు ఏ మందులు వేసుకోవాలి? అదీ ఎంత పరిమాణంలో వాడాలి? ఎన్ని రోజులు వాడాలో తెలియజేస్తారు. వారు సూచించిన, సిఫారసు చేసిన ప్రకారమే వాడుకోవాలి. యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్‌ను అతిగా వాడితే కిడ్నీ, కాలేయం దెబ్బతింటాయి.

■ కొందరు మందులను పండ్ల రసం, పాలు, కాఫీ, మజ్జిగతో వేసుకుంటారు. అయితే ఇది సరైన పద్ధతి కాదని వైద్యులు చెబుతున్నారు. మంచి నీళ్లతోనే వేసుకోవాలని సూచిస్తున్నారు. ద్రాక్ష, బత్తాయి, యాపిల్ జ్యూస్‌లతో ఔషధాలు తీసుకుంటే రక్తపోటులో హెచ్చు, తగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉంది. కడుపులో నొప్పి రావడం, వాంతులు కావడం, చెమట పట్టడం, తలనొప్పి, హృదయ స్పందన పెరగడం వంటి సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి.

నివారణ ఇలా...

రియాక్షన్స్ నివారణకు మందులిచ్చి తొలుత నియంత్రణలోకి తీసుకొస్తారు. ఆ తర్వాతే వేరే మందులు రాసి వాడిస్తారు. వాడిన మందు వల్లే రియాక్షన్ వస్తే ఏ కంపెనీ తయారుచేసిందో తెలుసుకుని... ఆబ్యాచ్ నంబరు కలిగిన మందులను మార్కెట్లోకి రాకుండా చర్యలు తీసుకుంటారు.

వీరిపై ఎక్కువ ప్రభావం...

■ రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవారిలో మందుల వల్ల దుష్ప్రభావాలు ఎక్కువ ఉంటాయి.

■ మద్యం, పొగతాగే అలవాటు ఉన్నవారిలో కొన్ని రకాల మందుల ప్రభావం తట్టుకునే సామర్థ్యం ఉండదు.

■ క్యాన్సర్ వాధిగ్రస్థులు, సొరియాసిస్, కీళ్లవాతం సమస్యలతో బాధపడేవారూ జాగ్రత్తలు తీసుకోవాలి.

■ రక్తహీనతతో బాధపడే గర్భిణులు, బాలింతలు, తక్కువ బరువు కలిగిన పిల్లల్లోనూ సైడ్‌ఎఫెక్ట్స్ వస్తాయి.

■ హెచ్‌ఐవీ, క్షయ వాధిగ్రస్థులకు కొన్నిమందులు చాలా ప్రమాదకరం.

■ కొందరు రోగులకు రక్తం ఎక్కిస్తుంటే జ్వరం వస్తుంది. వాంతులవుతాయి. పొట్టనొప్పి వస్తుంది. వీటిని హీమో విజిలెన్స్ అంటారు.

■ బీసీజీ, పోలియో తదితర వ్యాక్సిన్లు వేసుకునే పిల్లలకు రియాక్షన్స్ వస్తాయి. వాటిని యాడ్‌వర్స్ ఎన్‌ఫాలోయింగ్ ఇమ్యూనైజేషన్(ఏఈఎఫ్ఐ) అంటారు.

ఫిర్యాదు ఎలా...



రియాక్షన్స్ ఎవర్నికైతే వచ్చాయో ఆ పేషెంట్ మొదలుకుని వారికి చికిత్సలు అందించిన వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు, వైద్య విద్యార్థులు వీరిలో ఎవరైనా యాంటీ డ్రగ్ రియాక్షన్ విభాగానికి వచ్చి ఫిర్యాదు చేయొచ్చు. ఆ విభాగ సిబ్బంది వాడిన మందులు అతనికి ఆ సమయంలో బయటపడిన లక్షణాలు సమగ్ర వివరాలు నిర్దేశిత నమూనాలో రాసుకుని దిల్లీలోని ప్రధాన కేంద్రానికి పంపుతారు. ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ఔషధ దుష్ప్రభావాల పర్యవేక్షణ కార్యాలయం ఉంటుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ విభాగానికి వచ్చి ఫిర్యాదు చేయొచ్చు.

ఎడాపెడా వాడినా ఇబ్బందే

■ ఏమందు అయినా సరే వైద్యులు ఎన్ని రోజులు వాడాలని చెబుతారో ఆమేరకే వాడి ఆపేయాలి. ఎడాపెడా వాడకూడదు. అతిగా వాడితే కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

■ మల్టీ విటమిన్స్, సప్లిమెంట్స్, సిరప్స్ రోగి అడిగితే ఇవ్వచ్చు... కానీ యాంటీ బయాటిక్స్‌కు కచ్చితంగా వైద్యుల ప్రిస్క్రిప్షన్ అవసరం. అది కూడా వైద్యులు ఎన్ని రోజులకు రాస్తే అన్ని రోజులకే ఇవ్వాలి.

- ఈనాడు, ఏలూరు



విశ్రాంతిని బలహీనతగా చూడొద్దు

అలసిన మనసు, శరీరంతో మీరు దేన్నీ సాధించలేరు. విశ్రాంతిని ఎప్పుడూ బలహీనతగా చూడకండి. జీవితంలో మీ లక్ష్యాలను సుసాధ్యం చేసుకునేందుకు విశ్రాంతి కూడా ఎంతో ముఖ్యం.
– డేవిడ్ మెస్జరోస్, కంటెంట్ క్రియేటర్

సీడీవో, ఇంటర్‌స్టేట్ విభాగాల్లో పనిచేస్తే ఫీల్డ్ సర్వీస్ ఉన్నట్లే!

ఈనాడు, హైదరాబాద్: నీటిపారుదలశాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో)- ఓ అండ్ ఎం, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగాల్లో (ఇంటర్‌స్టేట్) పనిచేస్తే ఆ ఇంజినీర్లకు ఫీల్డ్ సర్వీస్ అనుభవం ఉన్నట్లుగానే పరిగణించాలని నీటిపారుదలశాఖ నిర్ణయించినట్లు తెలిసింది. ఈఈ లేదా ఆ పైన కేడర్‌కు పదోన్నతి పొందాలంటే దిగువ కేడర్‌లో తప్పనిసరిగా రెండేళ్లపాటు క్షేత్రస్థాయిలో పనిచేసి ఉండాలన్న నిబంధన అమల్లో ఉంది. ఈ మేరకే ఇటీవల చాలామందిని కార్యాలయాల నుంచి క్షేత్రస్థాయికి బదిలీ కూడా చేశారు. ఇదిలా ఉంటే సీడీవో, ఇంటర్‌స్టేట్ విభాగాల్లో పనిచేస్తే క్షేత్రస్థాయిలో పనిచేసినట్లుగా పరిగణించాలంటూ నిబంధనల్లో సవరణ తీసుకురావాలని దస్త్రం సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ రెండు విభాగాల్లో పనిచేసిన వారికి ఫీల్డ్ సర్వీస్ నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వడం వరకు బాగానే ఉంది. ఇక్కడ పనిచేస్తే ఫీల్డ్ సర్వీస్ ఉన్నట్లుగా పరిగణించాలనే విధంగా నిబంధనలకు సవరణ తీసుకొస్తుండటంపై ప్రస్తుతం నీటిపారుదలవర్గాల్లో చర్చ జరుగుతోంది.

రేపు, ఎల్లుండి కీలక చర్చలు!

- దిల్లీలో జలశక్తి సమావేశానికి వెళుతున్న ముఖ్యమంత్రి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై మంగళ, బుధవారాల్లో దిల్లీలో కీలక చర్చలు జరిగే అవకాశాలున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపు అంశంపై మంగళవారం జలశక్తి శాఖ నిర్వహించనున్న సమావేశంలో పాల్గొనేందుకు సోమవారం లేదా మంగళవారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ వెళ్తారని సమాచారం. ఒకటో తేదీన అక్కడే ఉండి.. 2వ తేదీన దిల్లీలో జరిగే వై.ఎస్. అవార్డు ప్రదానోత్సవంలోనూ సీఎం పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా హాజరుకానున్నారు. ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం రాత్రికల్లా దిల్లీకు చేరుకుంటారని తెలుస్తోంది. ఆయన వచ్చిన తర్వాత మంగళ, బుధవారాల్లో పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీలతో ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, భట్టి విక్రమార్క రాష్ట్ర రాజకీయాలపై చర్చిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. మంత్రివర్గ విస్తరణపై స్పష్టత కోసమే అధిష్ఠానంతో రాష్ట్ర ముఖ్యనేతల భేటీ జరగబోతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి పదవులు ఆశిస్తున్న పలువురు నేతలు కూడా తమకు అవకాశం కల్పించాలని అగ్రనేతలను కోరేందుకు 1, 2 తేదీల్లో దిల్లీకి వెళ్లేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. వచ్చే నెల ఏడో తేదీన అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. దానికి ముందు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కూడా జరిగే సూచనలున్నాయి. ఈ లోగా మంత్రివర్గంలో మార్పులు జరిగే అవకాశాలు లేకపోలేదని సీనియర్ నేతలు అంచనా వేస్తున్నారు.

కేసీ రాగానే మారనున్న పరిణామాలు!

కేసీ వేణుగోపాల్ దిల్లీకి వచ్చిన తర్వాత రాష్ట్ర నేతలతో జరిపే చర్చలతో పరిణామాలు మారతాయని నాయకుల అంచనా. మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యవహార శైలిపై క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ(డీఏసీ) విచారణ జరిపి.. కఠిన చర్యలు తీసుకోవాలని ఇటీవల పీసీసీకి నివేదిక ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నివేదికను పీసీసీ మీనాక్షికి అందజేసింది. ఆమె దాన్ని ఏఐసీసీకి పంపారు. ఈ నివేదిక ఇచ్చిన తర్వాత భట్టి విక్రమార్క బెంగళూరు వెళ్లి ఖర్గేను ప్రత్యేకంగా కలసి చర్చించారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలపై భట్టి ఆయనకు వివరించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కమిటీ సిఫార్సులపై కేసీ వేణుగోపాల్, ఖర్గేలు రాష్ట్ర నేతలతో మంగళ, బుధవారాల్లో చర్చించే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఒకవేళ కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని ఏఐసీసీ నిర్ణయిస్తే ఆమె స్థానంలో బీసీ వర్గాలకే చెందిన మరొకరికి చోటు కల్పించాల్సి ఉంటుందని, ఎవరిని తీసుకోవాలనే అంశంపైనా చర్చలు జరగనున్నట్లు తెలుస్తోంది. పలువురు బీసీ నేతల పేర్లు పార్టీ పరిశీలనలో ఉన్నాయి. మంత్రివర్గ విస్తరణ జరిగితే ఒకరికేనా.. లేక ఇద్దరు, ముగ్గురికి చోటు కల్పించడానికి అవకాశాలున్నాయా అనే అంశంపైనా చర్చలుంటాయని తెలుస్తోంది. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున నగరానికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని కొందరు నేతలు కోరుతున్నట్లు సమాచారం. "మంత్రివర్గ విస్తరణ ఉంటుందనేది నిజం. కానీ, ఎప్పుడు ఉంటుందనే కచ్చితమైన తేదీ మాత్రం ఏఐసీసీ నిర్ణయం తర్వాతే తెలుస్తుంది" అని సీనియర్ నేత ఒకరు వివరించారు.

వనమహోత్సవం సెప్టెంబరు 15 వరకు..

ఈనాడు, హైదరాబాద్: వర్షాకాలం సీజన్‌లో చేపట్టిన వనమహోత్సవాన్ని వచ్చే నెల 15 వరకు పొడిగించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయించింది. అన్ని జిల్లాల్లోనూ వందశాతం లక్ష్యం చేరుకోవాలని ఆదివారం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. జీరాంజీ పథకం అనుసంధానంతో వర్షాకాలంలో 6.18 కోట్ల మొక్కలు నాటేందుకు పంచాయతీరాజ్‌శాఖ కార్యాచరణ రూపొందించింది. దీనికి అనుగుణంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో పది కోట్ల మొక్కలు పెంచారు. గ్రామాల్లో కూలీల ద్వారా గుంతలు తీయించి ఉపాధి కల్పించడంతో పాటు మొక్కలు నాటాలని ఆ శాఖ నిర్దేశించింది. దీనికి అనుగుణంగా గత నెల నుంచి ఇప్పటివరకు 5.80 కోట్ల గుంతలను తీశారు. వాటిల్లో ఇప్పటి వరకు 5.61 కోట్లకు పైగా మొక్కలు (91%) నాటారు. హనుమకొండ, రాజన్న సిరిసిల్ల, నాగర్‌కర్నూల్, కామారెడ్డి జిల్లాల్లో వందశాతం పూర్తికాగా మిగిలిన జిల్లాలు లక్ష్యం చేరలేదు. ఈ నేపథ్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగించాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది.

ఇంటింటికీ మొక్కల పంపిణీ: సీతక్క

వందశాతం లక్ష్య సాధనకు ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేయాలని మంత్రి సీతక్క ఆదివారం అధికారులను ఆదేశించారు. వనమహోత్సవం కార్యక్రమ పురోగతిపై ఆమె ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ దివ్య దేవరాజన్, ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లాలో 83% మొక్కలే నాటిన నేపథ్యంలో అక్కడ పురోగతి సాధించేందుకు వీలుగా సోమవారం ఆ జిల్లాలో పర్యటించాలని మంత్రి సీతక్క నిర్ణయించారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి ఆమె వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటుతారు.

కుటుంబ పాలన నుంచి ప్రజా పాలన వైపు..

- కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన ఓ మైలురాయి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఈనాడు, హైదరాబాద్: గత భారాస పాలనలో అధికారం ఒక వ్యక్తి, ఒక కుటుంబం చేతుల్లో కేంద్రీకృతమై ప్రజాస్వామ్య వ్యవస్థలు బలహీనపడ్డాయనీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాపాలనను పునరుద్ధరించామని భారీ నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్లలో మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్షాలు, సామాన్య ప్రజల గొంతుకకు విలువ లేకుండా పోయిందనీ.. సచివాలయాన్ని ప్రజలకు అందుబాటులో లేకుండా చేశారని, ప్రశ్నించే వారిని శత్రువులుగా చూశారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.42 కోట్ల మందికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు. అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు.

సంక్షేమానికి ప్రాధాన్యం: 'మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు వంటి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తున్నాం. రూ.2 లక్షల వరకు పంటరుణాల్ని మాఫీ చేసి దాదాపు 25 లక్షల మంది రైతులను రుణవిముక్తులను చేశాం. రైతు భరోసాను ఎకరానికి రూ.12 వేలకు పెంచాం. భారీగా ధాన్యం కొనుగోళ్లతోపాటు సన్నవడ్లకు బోనస్ అందించాం. దాదాపు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. గత ప్రభుత్వం మిగిల్చిన భారీ అప్పులు, బడ్జెట్ వెలుపలి రుణాలు, పెండింగ్ బకాయిలు, అసంపూర్తి ప్రాజెక్టులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోంది' అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలను మూసివేయొద్దు

సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య లేఖ

కాచిగూడ, న్యూస్‌టుడే: సాంకేతిక రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ కళాశాలలను మూసివేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య కోరారు. జీవో 97ను రద్దు చేసి శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను విడుదల చేశారు. జీవోను రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు నిరసన చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించి పాలిటెక్నిక్ కాలేజీలను బలోపేతం చేయాలని సూచించారు. పారిశ్రామిక అవసరాలు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సిలబస్‌ను మార్చాలని.. కొత్త కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచి ఉపాధి అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి పాలిటెక్నిక్ విద్య ఎంతో అవసరమన్నారు.

'శ్రీశైలం'లోకి 5,075 క్యూసెక్కుల ప్రవాహం

అమ్రాబాద్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయానికి ఎగువన జూరాల ప్రాజెక్టు నుంచి 5,075 క్యూసెక్కుల ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం సాయంత్రం 6 గంటలకు జలాశయంలో నీటిమట్టం 872.10 అడుగులు, నీటి నిల్వ 150.8076 టీఎంసీలుగా నమోదైంది. సగటున ఎస్ఎల్‌బీహెచ్‌ఈఎస్‌కు 17,320, హంద్రీనీవా సుజల స్రవంతికి 2,372, ఎంజీకేఎల్ఐకి 2,400, పోతిరెడ్డిపాడుకు 8,000 క్యూసెక్కుల ప్రవాహాన్ని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో శనివారం రాత్రి వరకు 8.675 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

క్రీడా దినోత్సవ కార్యక్రమాలు విజయవంతం: శాట్స్

ఈనాడు, హైదరాబాద్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించిన క్రీడా, ఫిట్‌నెస్ కార్యక్రమాలు విజయవంతం అయ్యాయని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన "ఖేలేగా భారత్-జీతేగా భారత్" నినాదానికి అనుగుణంగా ఈ కార్యక్రమాలను నిర్వహించామని ఆ సంస్థ వెల్లడించింది.

నేడు నిజామాబాద్‌లో పాంచజన్య సంకల్ప సభ

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిజామాబాద్‌లో పాంచజన్య సంకల్ప సభ నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో జరిగే సభకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాజరుకానున్నారు. పార్టీ స్థాపించిన తర్వాత కవిత తొలిసారి జిల్లాకు వస్తుండటంతో ఘన స్వాగతం పలికేందుకు పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏడు ప్రశ్నలతో.. ఎవరికి వారే హెచ్‌ఐవీ పరీక్ష

- అనుమానితుల కోసం క్యూఆర్ కోడ్ విధానం
- వినూత్న మార్గాల్లో అవగాహనకు టీసాక్స్ అడుగులు



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో హెచ్‌ఐవీ బాధితులు లక్షన్నర మంది వరకు ఉంటారని ప్రభుత్వ అంచనా. వీరిలో కేంద్రాలకు వచ్చి చికిత్స తీసుకుంటున్నవారు దాదాపు 1,30,000 మంది. మరో 20 వేల మంది చికిత్స తీసుకుంటున్నారా లేదా అనేది తెలియదు. ఈ నేపథ్యంలో మిగతా వారిని గుర్తించి చికిత్స అందించేందుకు రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (టీఎస్ఏసీఎస్-టీసాక్స్) వినూత్న విధానానికి శ్రీకారం చుట్టింది. సాధారణంగా హెచ్‌ఐవీ అనుమానితులు వైద్యుల వద్దకు వచ్చి నిర్ధారణ చేసుకునేందుకు వెనకాడతారు. సెక్స్ వర్కర్లతో పాటు కొన్ని హైరిస్క్ గ్రూప్‌ల్లోనే ఎక్కువ మంది ఈ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంటుంది. వీరిలోనూ యువత ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంది. ఇలాంటి వారి కోసం టీసాక్స్ 'క్యూఆర్' కోడ్ విధానం తీసుకొచ్చింది. రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాలు, ఆన్‌లైన్ వేదికల్లో క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చింది.

వ్యక్తిగత వివరాలేవీ అడగరు..

క్యూఆర్ కోడ్ స్కాన్ చేశాక.. అందులోని ఏడు రకాల ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో మొబైల్ నంబరు తప్ప పేరు సహా ఏ ఇతర వ్యక్తిగత వివరాలు అడగరు. ఈ ప్రశ్నలన్నింటికీ నిజాయతీగా ఔను, కాదు అని సమాధానం ఇస్తే సదరు వ్యక్తికి హెచ్‌ఐవీ రిస్క్ ఉందా లేదా అనేది తెలుస్తుంది. రిస్క్ ఉన్నట్లు తేలినప్పటికీ.. వ్యాధి నిర్ధారణ అయినట్టు కాదు. మళ్లీ తదుపరి మరో రెండు పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం దగ్గర్లోని 'యాంటీ రిట్రోవైరల్ థెరపీ (ఆర్ట్) సెంటర్లకు వెళ్లాల్సి ఉంటుంది. ఆ వివరాలను కూడా అక్కడే తెలుసుకోవచ్చు. 'రాష్ట్రంలో వచ్చే రెండు నెలల పాటు హెచ్‌ఐవీ, ఇతర సుఖ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు అనేక రకాల కార్యక్రమాలను 'టీసాక్స్' చేపట్టింది. ఆగస్టు 12 నుంచి క్యూఆర్ కోడ్ విధానం తీసుకురాగా ఇప్పటికే 30 వేల మంది దాన్ని వినియోగించుకున్నారు. 2 వేల మంది అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు' అని టీసాక్స్ పీడీ విద్యాసాగర్ తెలిపారు.

రూ.500 కోట్ల విలువైన స్థలాన్ని రూ.87 కోట్లకే కట్టబెడతారా?

- ఆ భూమి ఆయిల్‌ఫెడ్‌కే దక్కేలా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాలి
- 'అజామాబాద్' అంశంపై సీఎం రేవంత్‌కి హరీశ్‌రావు బహిరంగ లేఖ



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సమీపంలోని అజామాబాద్‌లో సుమారు రూ.500 కోట్ల విలువైన తెలంగాణ ఆయిల్‌ఫెడ్ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కేవలం రూ.87 కోట్లకే రాష్ట్ర ప్రభుతం కట్టబెడుతోందని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ఆరోపించారు. తక్షణమే ఈ అక్రమ కేటాయింపును రద్దు చేసి ఆ భూమిని ఆయిల్‌ఫెడ్‌కే దక్కేలా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సొంత ప్రభుత్వ సంస్థ తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ఒక ప్రైవేటు వ్యక్తికి ధారాదత్తం చేయడం వెనక ఉన్న కుంభకోణం ఏమిటని ప్రశ్నించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత విలువైన భూములను కారుచౌకగా ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తోంది. అజామాబాద్ పారిశ్రామికవాడలో ఉన్న 17,261 గజాల భూమి(3 ఎకరాల 23 గుంటలు) ఏడు దశాబ్దాల నాటిది. 1954లో ఆయిల్ మిల్లు నడపడం కోసం ఈ స్థలాన్ని ప్రైవేటు సంస్థకు లీజుకు ఇచ్చారు. వారు నిబంధనలను తుంగలో తొక్కడంతో 1974లో అప్పటి ప్రభుత్వం లీజును రద్దు చేసింది. తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్లిన ఆ ప్రైవేటు సంస్థకు 1,277 గజాల భూమి మాత్రమే దక్కింది. మిగిలిన 15,984 గజాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని 1991లో జీవో నంబరు 93 ద్వారా ఆయిల్‌ఫెడ్ సంస్థకు అప్పగించింది. దశాబ్దాలుగా న్యాయపోరాటం చేసి దక్కించుకున్న ప్రభుత్వ ఆస్తిని రాత్రికి రాత్రే ప్రైవేటు వ్యక్తుల పరం చేయడానికి ప్రభుత్వానికి ఉన్న ఆసక్తి ఏమిటో బయటపెట్టాలి. ఇదే భూమిని ఫ్రీహోల్డ్ హక్కుల కోసం రూ.87 కోట్లను ప్రభుత్వానికి చెల్లించడానికి ఆయిల్‌ఫెడ్ సంస్థ ఎప్పుడో సిద్ధపడింది" అని హరీశ్‌రావు లేఖలో పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఐషీ ఘోష్

జెన్‌జీ ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకుంటోంది

- ఎస్ఎఫ్ఐ అఖిల భారత సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్

పాలమూరు, న్యూస్‌టుడే: ఇక నుంచి జెన్‌జీ నిశ్శబ్దంగా ఉండబోదని, ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకుంటోందని ఎస్ఎఫ్ఐ అఖిల భారత సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని అంబేడ్కర్ సమావేశ మందిరంలో ఆదివారం 'జెన్‌జీ ఇక నుంచి నిశ్శబ్దంగా ఉండదు' అంశంపై ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆమె మాట్లాడారు. దేశ భవిష్యత్తును నిర్మించాల్సిన విద్యార్థులు సామాజిక, విద్యా, ఆర్థిక పరిణామాలను అర్థం చేసుకోవడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 'జెన్‌జీ ఇక నిశ్శబ్ద విప్లవం' అనే నినాదం కేవలం ఒక కార్యక్రమానికి సంబంధించిన అంశం కాదన్నారు. విద్యార్థులు తమ హక్కుల కోసం గొంతెత్తి మాట్లాడాల్సిన అవసరాన్ని తెలిపే ఉద్యమమని అభివర్ణించారు. ప్రభుత్వ విద్యా రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ సమస్యలను సమాజ సమస్యలుగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనాథ్, భరత్, నాయకులు నందు, జ్ఞాపిక, తారాసింగ్, పవన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ సాగువైపు మళ్లాలి..

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



నైపుణ్యాభివృద్ధి కేంద్ర భవనం ప్రారంభించిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, చిత్రంలో ధారాసింగ్, బుయ్యని మనోహర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బాగయ్య తదితరులు

తాండూరు, తాండూరు గ్రామీణ – న్యూస్‌టుడే: ఏటా రూ.3-4 లక్షల కోట్లు ఎరువులకు ఖర్చుచేసి విషం పండించి తింటున్నామని.. రైతులు ఆలోచించి సేంద్రియ సాగువైపు మళ్లాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తాండూరు మండలం జినగుర్తిలోని ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన నైపుణ్యాభివృద్ధి కేంద్రం, మురుగుశుద్ధి ప్లాంటు, టాటా భూసార పరీక్షల ప్రయోగశాల, గోశాల తదితర భవనాలను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.మహేందర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకారిణి సదస్య వి.బాగయ్య, డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్ తదితరులు పాల్గొన్నారు. సేంద్రియ సాగులో రాణించిన మహిళలకు బహుమతులు అందించారు.

అలంపూర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం..

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని, అప్పుడే ఇక్కడ ఉపాధి పెరుగుతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ ఆలయాల వద్ద మల్టీమీడియా, సౌండ్ లైట్స్ షోను ఎంపీలు మల్లు రవి, డీకే అరుణ, స్థానిక ఎమ్మెల్యే విజయుడుతో కలిసి కేంద్ర మంత్రి ప్రారంభించారు. పుణేకి చెందిన వెంకీ ప్రైవేటు సంస్థ అలంపూర్ ఆలయాల అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులతో ముందుకు వచ్చినట్లు వెల్లడించారు.

కుమార్తెను నడుముకు కట్టుకొని బావిలోకి దూకిన తల్లి

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎంత కష్టం వచ్చిందో.. కుమార్తెను నడుముకు కట్టుకొని ఓ తల్లి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. . గ్రామానికి చెందిన గొట్ల రజిత(26)కు జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం వేనుగుమట్లకు చెందిన మెరుగు అంజయ్యతో ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి కుమార్తె అక్షిత(6), కుమారుడు మహేందర్(18 నెలలు) ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా కొన్నాళ్లుగా రజిత తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. అంజయ్య అప్పుడప్పుడు వచ్చి పిల్లలను చూసుకొని వెళుతుంటారు. ఆదివారం ఉదయం రజిత అమ్మానాన్నలు పనికి వెళ్లారు. భర్త అంజయ్య ఎప్పటిలాగే వచ్చి, పిల్లలను చూసుకొని వెళ్లారు. అతను వెళ్లిన తర్వాత కొద్దిసేపటికే రజిత కుమారుణ్ని పడుకోబెట్టి, కుమార్తెను తీసుకుని గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. అనంతరం కుమార్తెను నడుముకు కట్టుకొని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. అటుగా వెళ్తున్న వారికి బావిలో తేలియాడుతున్న మృతదేహాలు కనిపించడంతో కుటుంబీకులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై ఎస్ఐ రాజ్‌వర్ధన్‌ను వివరణ కోరగా.. ఇంకా ఫిర్యాదు అందలేదని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



రజిత అక్షిత

దోపిడీ పాలన పోయి.. కమీషన్ల సర్కారు వచ్చింది!

తాండూరు, తాండూరు గ్రామీణ – న్యూస్‌టుడే: 'రాష్ట్రంలో భారాస దోపిడీ పాలన పోయిందనుకుంటే కమీషన్ల కాంగ్రెస్ సర్కారు వచ్చింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలంతా అక్రమాలకు పాల్పడుతున్నారు' అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. వికారాబాద్ జిల్లా భాజపా అధ్యక్షుడిగా యు.రమేశ్‌కుమార్ ప్రమాణ స్వీకారోత్సవం తాండూరులో ఆదివారం జరిగింది. కేంద్ర మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. "2014లో మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రం ప్రస్తుతం సుమారు రూ.13 లక్షల కోట్ల అప్పులకు చేరింది. భారాస, కాంగ్రెస్ ఒకే తాను ముక్కలు. అధికారాన్ని దుర్వినియోగం చేశాయి. సుపరిపాలన భాజపాతోనే సాధ్యం. భారాస, కాంగ్రెస్‌ల పాలనలు చూశాం.. ఒకసారి భాజపాకు అవకాశం ఇవ్వాలి" అని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ అంటున్నారని.. మోదీ బీసీ కావడంతో కంటగింపా.. అని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, కేఎస్ రత్నం, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.గౌతమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బుల్లెట్ రైలు వస్తే.. తెలంగాణకు అగ్రస్థానం

వికారాబాద్, న్యూస్‌టుడే: బుల్లెట్ రైలు తెలంగాణకు వస్తే దేశంలోనే రాష్ట్రం అగ్ర స్థానంలో నిలుస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్ రైల్వేస్టేషన్‌లో రూ.27 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న ఆధునికీకరణ పనులను ఆయన పరిశీలించారు. గడువులోపు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కాజీపేటలో రైల్ తయారీ యూనిట్ పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తికాగానే ప్రధాని మోదీతో ప్రారంభోత్సవం చేయిస్తామన్నారు. వికారాబాద్‌తోపాటు రాష్ట్రంలోని 42 రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులు ఏకకాలంలో కొనసాగుతున్నాయన్నారు. బుల్లెట్ రైలుతో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయన్నారు.



ఐక్యత చాటుతున్న ఓబీసీ నేతలు

ప్రతి కులానికి 'యూనిక్ కోడ్' కేటాయించాలి

ఓబీసీ నేతల డిమాండ్

ఈనాడు, దిల్లీ, పాలమూరు, న్యూస్‌టుడే: జనగణనలో కులగణనను తప్పనిసరి చేస్తూ.. ప్రతి కులానికి ప్రత్యేకంగా 'యూనిక్ కోడ్'ను కేటాయించాలని ఓబీసీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం దిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఓబీసీ జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం ఛైర్మన్ టి.చిరంజీవులు, ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. శాస్త్రీయ పద్ధతిలో జనగణన చేపట్టకపోతే రూ.వేల కోట్ల ప్రజాధనం వృథా అవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రతి కులాన్ని నమోదు చేసేలా పారదర్శక విధానంలో లెక్కింపు జరగాలని డిమాండ్ చేశారు. సదస్సులో ఎంపీ విల్సన్, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ఏఐసీసీ ఓబీసీ విభాగం ఛైర్మన్ అనిల్ జైహింద్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేస్తే ప్రధాన మంత్రి మోదీ చరిత్రలో నిలిచిపోతారని భారాస నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దేశంలో మెజారిటీ వర్గాలకు ఇప్పటి వరకు న్యాయం జరగలేదన్నారు. రాజకీయంగా విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అణచివేతకు గురయ్యారన్నారు. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఇవ్వాలని చెప్పిన రాహుల్ గాంధీ, ఇప్పుడు మాత్రం నోరు మెదపడం లేదని విమర్శించారు.

ఎమ్మెల్యేకు రూ.1,500 జరిమానా


స్కూటర్‌పై మణికందన్

యానాం, న్యూస్‌టుడే: చట్టాలు అందరికీ సమానంగా వర్తింపజేసినప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. అలాంటి ఉదంతమే పుదుచ్చేరిలో చోటు చేసుకుంది. అధికార ఎన్నార్ కాంగ్రెస్ ముత్యాల్‌పేట ఎమ్మెల్యే వయ్యాపురి మణికందన్ శనివారం ద్విచక్ర వాహనంపై అసెంబ్లీకి వెళ్తున్నారు. ఆయన హెల్మెట్ ధరించకుండా, నంబరు ప్లేటు లేని ద్విచక్ర వాహనంపై వెళ్తున్నట్లు గుర్తించిన పుదుచ్చేరి తూర్పు విభాగం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటాచలపతి రూ.1500 జరిమానా వేశారు. దీనిపై మణికందన్ స్పందిస్తూ, 'సీఎం కార్యాలయ అధికారులు ఎమ్మెల్యేలకు మూడు నెలల క్రితం కార్లు ఇచ్చారు. కానీ డ్రైవర్లను ఏర్పాటు చేయలేదు. కార్లకు డ్రైవర్లను నియమించి ఉంటే ఈ సమస్యే వచ్చేది కాదు' అని పేర్కొన్నారు.

సీఐడీ అదుపులో ఐఏఎస్ అధికారి జ్ఞానేంద్రకుమార్



కర్ణాటకలో పశువైద్యుల నియామకాల్లో అవినీతి ఆరోపణలు

బెంగళూరు, న్యూస్‌టుడే: కన్నడనాట అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఓ మంత్రి రాజీనామా చేసిన వెంటనే.. అలాంటిదే మరో కేసులో ఓ ఐఏఎస్ అధికారిని సీఐడీ అధికారులు శనివారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ (కేపీఎస్‌సీ) ఆధ్వర్యంలో పశువైద్యుల నియామకాలకు సంబంధించి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఏఎస్ అధికారి జ్ఞానేంద్రకుమార్ గతవారం ప్రారంభంలో కొన్నిరోజులు అదృశ్యమయ్యారు. పశు వైద్యాధికారుల నియామకాల్లో అభ్యర్థుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని పోస్టులు కేటాయించినట్లు ఆయనపై ఆరోపణలున్నాయి. 'ఈ వ్యవహారంలో శుక్రవారం నుంచి జ్ఞానేంద్రకుమార్ విచారణకు హాజరవుతున్నారు. లోతుగా విచారించడానికి ఆయన్ను అదుపులోకి తీసుకున్నాం' అని సీఐడీ అధికారులు తెలిపారు.

బాహ్య మూల్యాంకనం ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

- విద్యా సంఘాల డిమాండ్

ఈనాడు, హైదరాబాద్: ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు సమ్మేటివ్ జవాబు పత్రాలను మండల వనరుల కేంద్రాల్లో బాహ్య మూల్యాంకనం చేయించాలన్న ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదని, ఇది విద్యార్థులపై ఒత్తిడి పెంచే నిర్ణయమని ఈ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదివారం వివిధ విద్యా సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. డీటీఎఫ్, టీఎస్పీటీఏ, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘాలు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశాయి. నిరంతర సమగ్ర మూల్యాంకన (సీసీఈ) విధానం ఉనికికే ఇప్పుడు ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశాయి.

'ఏడు'పిస్తోన్న ధరల సెగ

- తెలంగాణలో జనవరి నుంచి కొనసాగుతున్న అత్యధిక ద్రవ్యోల్బణం
- జులైలో అన్ని రాష్ట్రాలకన్నా ధరల సూచిక అధికం



ఈనాడు, హైదరాబాద్: దేశంలోనే అత్యధికంగా.. తెలంగాణలో సామాన్యుడిపై ధరల భారం ఉంది. ఈ ఏడాది జులైలో రిటైల్ ద్రవ్యోల్బణం 6.32 శాతంగా నమోదైంది. ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే ఇదే అధికం. రాష్ట్రంలో ఆదాయం అదే స్థాయిలో పెరగని కుటుంబాలకు వాస్తవ కొనుగోలు శక్తి తగ్గే అవకాశం ఉంది. జనవరి నుంచి జులై వరకు వరుసగా ఏడు నెలలుగా తెలంగాణ అత్యధిక ద్రవ్యోల్బణం నమోదైన రాష్ట్రంగా నిలిచింది. జనవరిలో 4.92%, ఫిబ్రవరిలో 5.02%, మార్చిలో 5.83%, ఏప్రిల్‌లో 5.81%, మేలో 6.15%, జూన్‌లో 6.36%, జులైలో 6.32% శాతంతో అన్ని రాష్ట్రాలకన్నా ముందుంది. జూన్‌తో పోలిస్తే జులైలో స్వల్పంగా తగ్గినా.. 6 శాతానికి పైగా ఉండటంతో దేశంలో అత్యధికంగా ఉన్న రాష్ట్రంగా తొలి స్థానంలో నిలిచింది.

గ్రామీణ ప్రాంతాల్లో మరింత మంట

ధరల పెరుగుదల ప్రభావం తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో మరింత ఎక్కువగా ఉంది. జులైలో గ్రామీణ ద్రవ్యోల్బణం 6.86%, పట్టణాల్లో 5.92% నమోదైంది. గ్రామీణ ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో ఉండటంతో వ్యవసాయ కుటుంబాలు, కూలీలు, తక్కువ ఆదాయ వర్గాలపై ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది.

- ✦ తెలంగాణ తర్వాత అత్యధిక ద్రవ్యోల్బణం నమోదైన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ 5.72%, తమిళనాడు 5.44%, మధ్యప్రదేశ్ 4.91%, కర్ణాటక 4.89 శాతంతో వరుసగా తర్వాతి ఐదు స్థానాల్లో ఉన్నాయి.
- ✦ జులైలో దేశవ్యాప్తంగా వినియోగదారుల ధరల సూచిక(కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్- సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 4.45% కాగా ఆహార, పానీయాల విభాగంలో 5.24 శాతంగా ఉంది. రెస్టారెంట్లు, వసతి సేవల్లో 7.72%, వ్యక్తిగత సంరక్షణ తదితర విభాగాల్లో 14.77% నమోదైంది.

ఎందుకు పెరుగుతోందంటే...

తెలంగాణలో ధరల పెరుగుదలకు అనేక కారణాలున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా ప్రజలు నిత్యం వినియోగించే పాలు, పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు సహా పలు వస్తువులు, ఆహారపదార్థాలు ఇతర రాష్ట్రాల నుంచి రావాల్సిందే. వాటి రవాణా వ్యయం కూడా కలిపితే ధరల పెరుగుదల అధికంగా కనిపిస్తోంది. ఉదాహరణకు మహారాష్ట్రలో కిలో ఉల్లిగడ్డ రూ.10 ఉంటే ఇక్కడ రూ.30కి, ఉత్తర్‌ప్రదేశ్‌లో కిలో ఆలుగడ్డ రూ.5 ఉంటే ఇక్కడ రూ.30కి అమ్ముతున్నారు. ఇలాగే అనేక రకాల వస్తువులు సుదూర రాష్ట్రాల నుంచి వస్తున్నందున నిత్యావసరాల ధరలు అధికమై ద్రవ్యోల్బణం పెరుగుతోంది.

- ✦ సీపీఐ నమోదుకు కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త విధానం కూడా ఈ మార్పునకు ఒక కారణంగా నిపుణులు పేర్కొంటున్నారు. కొత్త శ్రేణిలో ఆహారానికి ఉన్న విలువ తగ్గి, గృహ, రవాణా, వ్యక్తిగత సంరక్షణ, సేవల వంటి విభాగాల ధరలకు ప్రాధాన్యం పెరిగింది.
- ✦ తెలంగాణలో సీపీఐ విలువ జులైలో 110.06 పాయింట్లుగా నమోదై మిగతా రాష్ట్రాల కంటే ఎక్కువగా ఉంది. అత్యల్పంగా త్రిపురలో 104.59, ఛత్తీస్‌గఢ్‌లో 105.59 పాయింట్లుగా ఉంది. జాతీయ సగటు 107.94 పాయింట్లు.
- ✦ 2025లో కొన్ని నెలలు ప్రతికూల ద్రవ్యోల్బణం నమోదైన తెలంగాణలో 2026లో పరిస్థితి పూర్తిగా మారిపోవడం గమనార్హం.

వెలిగొండ పండగ నేడే

- ప్రాజెక్టు ఫేజ్-1ను ప్రారంభించనున్న ఏపీ సీఎం చంద్రబాబు



మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవానిపల్లి సమీపంలో వెలిగొండ ప్రాజెక్టు క్రాస్ రెగ్యులేటర్

ఈనాడు, అమరావతి, ఒంగోలు-పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన పూల సుబ్బయ్య వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం ప్రారంభించి నీటిని విడుదల చేయనున్నారు. ఈ ప్రాజెక్టుతో మార్కాపురం ప్రాంతంతో పాటు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు ప్రభావిత ప్రాంతాలకు కొత్త జీవం రానుంది. తొలి దశ ప్రారంభం ద్వారా 10.70 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు విడుదల చేయనున్నారు. మొదటి విడతలో సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల జనాభాకు తాగునీరు అందించనున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా కృష్ణా జలాలను తరలించి నల్లమలసాగర్‌లో నిల్వచేసి ప్రధాన కాలువల ద్వారా సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు.

30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసింది చంద్రబాబే

30 ఏళ్ల క్రితం 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. మూడు దశాబ్దాల తర్వాత మళ్లీ ఆయన హయాంలోనే తొలిదశను పూర్తి చేసి నీటిని విడుదల చేస్తుండడం విశేషం. ఈ 30 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో సాంకేతిక, ఆర్థిక, నిర్మాణపరమైన సవాళ్లు ఎదురయ్యాయి. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పనులను వేగవంతం చేసింది. టన్నెల్ పనులు, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, ఇతర అనుబంధ నిర్మాణాలతో పాటు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం, పరిహారం చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించింది.

✦ వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్‌రన్ ఆదివారం విజయవంతంగా సాగింది. ఇందులో భాగంగా మధ్యాహ్నం 2.54కు కృష్ణా జలాలు సొరంగం నుంచి బయటకు వచ్చాయి. ఆ సమయంలో సైరన్ మోగించడంతో అక్కడ వేచి ఉన్న జనం ఒక్కసారిగా ఈలలు, కేకలు, చప్పట్ల మోత మోగించారు. కృష్ణమ్మకు పూజలు చేశారు.


బాలుడు కడుపులో నుంచి వైద్యులు వెలికితీసిన వస్తువులు

బాలుడి కడుపులో 43 లోహపు వస్తువులు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడులోని తిరువణ్ణామలైలో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు 16 ఏళ్ల బాలుడి కడుపు నుంచి 43 లోహపు వస్తువులు బయటకు తీశారు. తిరువణ్ణామలై సమీపంలోని అయ్యంపాళెయం గ్రామానికి చెందిన ఆ బాలుడు తరచుగా కడుపునొప్పి, వాంతులతో బాధపడుతున్నాడు. దీంతో ఈ నెల 28న తల్లి ఆసుపత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు బాలుడి కడుపులో పదునైన, లోహపు వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే శస్త్రచికిత్స చేసి 23 నాణేలు, మూడు మేకులు, రెండు గొలుసులు, నెయిల్ కట్టర్, కొన్ని గింజలను సురక్షితంగా వెలికితీశారు. తమ కుమారుడు మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని, కొన్ని రోజులుగా ఇంట్లో నుంచి నెయిల్ కట్టర్, గొలుసులు వంటి వస్తువులు అదృశ్యమవుతున్నాయని తల్లి తెలిపింది.

దివ్యాంగులకు ఇచ్చిన ఒక్క హామీనీ భారాస నెరవేర్చలేదు: మంత్రి అడ్లూరి

- హరీశ్‌రావు వ్యాఖ్యలు పచ్చి అబద్ధాలని మండిపాటు



ఈనాడు, హైదరాబాద్: తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో దివ్యాంగులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా భారాస నెరవేర్చలేదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ధ్వజమెత్తారు. పదేళ్ల పాటు 'మేమే రాజులం.. మేమే మంత్రులం' అన్నట్లుగా భారాస నేతలు వ్యవహరించారని మండిపడ్డారు. ఆదివారం కాంగ్రెస్ శాసనసభాపక్ష కార్యాలయంలో మంత్రి మాట్లాడారు. "కేజీ టు పీజీ ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చి భారాస మోసం చేసింది. కొత్త యూనివర్సిటీలు నిర్మిస్తామని చెప్పి.. కనీసం ఉస్మానియా యూనివర్సిటీకి నిధులు ఇవ్వలేదు. దివ్యాంగుల సమావేశంలో హరీశ్‌రావు.. పచ్చి అబద్ధాలు చెప్పారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. దివ్యాంగులకు మేం రూ.50 కోట్లతో వాహనాలు, ఇతర పరికరాలు అందించాం. వచ్చే ఏడాదిలో మరో రూ.50 కోట్లతో వాహనాలను ఇస్తాం. ఆర్టీసీలో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే అంశంపై ముఖ్యమంత్రితో మాట్లాడుతున్నాం. దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పింఛన్ హామీ అమలుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆర్థిక సమస్యల కారణంగా పింఛన్ల పెంపు ఆలస్యం అవుతోంది. మా వెయ్యి రోజుల పాలనపై కేటీఆర్ పోరాటం చేస్తామని అంటున్నారు. మా పాలనపై చర్చకు మేం సిద్ధం. అసెంబ్లీకి వచ్చి చర్చించాలి' అని పేర్కొన్నారు.

హైదరాబాద్‌ను లూటీ చేస్తున్న రేవంత్ సర్కారు: రామచందర్‌రావు


పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రామచందర్‌రావు. చిత్రంలో ఈటల రాజేందర్, గిరివర్ధన్‌రెడ్డి తదితరులు

జీడిమెట్ల, న్యూస్‌టుడే: హైదరాబాద్ మహానగరాన్ని రేవంత్ సర్కారు లూటీ చేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. ఆదివారం జీడిమెట్ల పారిశ్రామిక వాడలో భాజపా మేడ్చల్ అర్బన్ జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం, అధ్యక్షుడిగా నియమితులైన గిరివర్ధన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న 'కోర్ అర్బన్ రీజియన్' (క్యూర్) చట్టాన్ని అమలు చేస్తే కార్పొరేషన్‌ల మేయర్‌లు, కార్పొరేటర్ల వ్యవస్థకు విలువలేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రజలపై పన్నుల భారం మరింత పడుతుందన్నారు. ప్రభుత్వం ప్రజల కోసం పనిచేయాలి కానీ, ఇళ్లను కూల్చుతూ, భూములను వేలం వేస్తూ ప్రజలను భయపెడుతోందని మండిపడ్డారు. గత భారాస ప్రభుత్వం బిల్డర్‌ల వద్ద నుంచి 15 శాతం కమీషన్లు తీసుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా 30 శాతానికి పెంచిందని ఆరోపించారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు జయశ్రీ, జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ మల్లారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


2న జనసేన యువజన విభాగం ఏర్పాటు

ఈనాడు, అమరావతి: జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా సెప్టెంబరు 2న జనసేన యువజన విభాగాన్ని ప్రకటించనున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో ఉదయం 11 గంటలకు జనసైనికులు, వీర మహిళలు, నాయకుల సమక్షంలో జరిగే కార్యక్రమంలో యువజన విభాగం లోగో, గీతాన్ని ఆవిష్కరించనున్నట్లు వెల్లడించింది.

EENADU Vol: 53, Issue: 22 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. 95 & 96, Survey No. 150, Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Hyderabad, Medchal District - 500 037, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist - 501 512, Telangana State. Editor: M Nageswara Rao. Phone: 040-22232223, RNI No. 27656/1975, Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా

వెంకీ కోసం రీమిక్స్ గీతం?


వెంకటేశ్

కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47'ని ముగించే పనిలో ఉన్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. శ్రీనిధి శెట్టి కథానాయిక. ప్రస్తుతం తుది దశ చిత్రీకరణలో ఉన్న ఈ చిత్రం అక్టోబరు 2న థియేటర్లలోకి రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇప్పుడీ సినిమాకి సంబంధించి నెట్టింట ఆసక్తిర చర్చ మొదలైంది. వింటేజ్ వెంకటేశ్ జ్ఞాపకాల్ని గుర్తు చేసేలా.. ఆయన హిట్ సినిమా 'కూలీ నెం.1'లోని "దండాలయ్యా ఉండ్రాలయ్యా" పాటని తమన్ దీంట్లో రీమిక్స్ చేస్తున్నారని తెలిసింది. త్వరలోనే దీనిపై చిత్ర వర్గాల నుంచి స్పష్టత వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. క్రైమ్ అంశాలతో ముడిపడిన ఈ యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో చిట్టిబాబు పాత్రలో వెంకీ అలరించనున్నారు. ఈ సినిమాకి తమన్ సంగీతమందిస్తుండగా.. రవి కె.చంద్రన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

భక్తి ప్రధాన సినిమాతో అల్లరి నరేశ్



కథానాయకుడు అల్లరి నరేశ్ ఓ భక్తి ప్రధాన చిత్రంతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'కనక దుర్గ' పేరుతో రూపొందుతున్న ఈ సినిమాని ప్రదీప్ మద్దాలి తెరకెక్కిస్తున్నారు. బిర్లా స్టూడియోస్, టెంపుల్ టౌన్ పిక్చర్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. కాజల్ చౌదరి కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాని త్వరలో థియేటర్లలో విడుదల చేసి.. ఆ తర్వాత జీ5లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు ఆదివారం ప్రకటించారు. "భక్తి, యాక్షన్, భావోద్వేగాల మేళవింపుగా రూపొందుతున్న చిత్రమిది. కనకదుర్గ అమ్మవారి దివ్యశక్తిని, ఆమె పట్ల ఉన్న భక్తిభావాన్ని ఆవిష్కరిస్తూనే.. ఈతరం ప్రేక్షకులకు ఓ మంచి సినిమాటిక్ అనుభూతిని అందించేలా దీన్ని రూపొందిస్తున్నాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి బీవీఎస్ రవి కథ అందించగా.. తమన్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

కి అండ్ కా సీక్వెల్‌లో కియారా?


కియారా అద్వాణీ

'టాక్సిక్'తో నదియాగా ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించింది బాలీవుడ్ నాయిక కియారా అద్వాణీ. ఓ వైపు ఈ సినిమాతో థియేటర్లలో సందడి చేస్తూనే.. తన రాబోయే ప్రాజెక్ట్ కోసం సన్నాహాలు మొదలు పెట్టిందామె. ఒక అసాధారణమైన వివాహ బంధం చుట్టూ తిరిగే కథనంతో రూపొందిన చిత్రం 'కి అండ్ కా'. కరీనా కపూర్, అర్జున్ కపూర్ జంటగా నటించిన ఈ సినిమా 2016లో విడుదలై ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు దీనికి సీక్వెల్ రాబోతున్నట్లు తెలుస్తోంది. ఇందులో నాయికగా కియారాను ఎంపిక చేసిందట చిత్ర బృందం. "ప్రస్తుతం 'కి అండ్ కా 2'కు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మొదటి భాగానికి మించి వినోదాన్ని పంచేలా ఈ కొనసాగింపును తీర్చిదిద్దనున్నారు. మరోవైపు కథానాయకుడి పాత్ర కోసం పలువురు హీరోలను పరిశీలిస్తుంది చిత్ర బృందం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాల్ని అధికారికంగా ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నార"ని కియారా సన్నిహిత వర్గాలు తెలిపాయి.

'తెల్ల కాగితం' ఆ రోజే


హర్ష్ రోషన్, నక్షత్ర

హర్ష్ రోషన్ హీరోగా రమేశ్ బండ్రెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రం 'తెల్ల కాగితం'. కృష్ణ కొమ్మాలపాటి నిర్మిస్తున్నారు. నక్షత్ర కథానాయిక. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమాని అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను నెట్టింట పంచుకున్నారు. అందులో హర్ష్, నక్షత్ర క్యూట్ లుక్స్‌లో ఆకట్టుకునేలా కనిపించారు. ఇదొక యూత్‌ఫుల్ ఎమోషనల్ లవ్ ఎంటర్‌టైనర్. 'సామజవరగమన', 'నారీ నారీ నడుమ మురారి' లాంటి విజయవంతమైన చిత్రాలకు సహ రచయితగా పని చేసిన నందు సవిరిగాన దీనికి కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించారు. విజయ్ బుల్గానిన్ సంగీతమందిస్తుండగా.. కేవీ గుహన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

విలువలకు వారసురాలు..
మా సీతారామయ్య గారి మనవరాలు

బుల్లితెరపై భావోద్వేగభరిత దృశ్యకావ్యం.. అందమైన అనుబంధాలకు అపురూప ఆవిష్కరణ.. ఆస్తులకు కాదు. ఆశయాలకు వారసత్వం ఉండాలంటూ సగర్వంగా చాటే ఓ విలక్షణ ధారావాహిక 'సీతారామయ్య గారి మనవరాలు'. బలమైన కథ, ఉత్కంఠభరిత కథనం, కళ్లు చెదిరే సన్నివేశాలు, తుటాల్లా పేలే మాటలు, అత్యుత్తమ సాంకేతిక నైపుణ్యాలు మేళవించిన ఈ మెగా డైలీ సీరియల్ వీక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయేలా రూపుదిద్దుకుంది.




మలినేని రాధాకృష్ణ

చెక్కుచెదరని ఆదర్శాలతో నిర్మించిన కోట.. ఆ కోటను కూల్చేయాలని సొంతవారి కుట్ర! ఈ రెండింటి నడుమ నలిగే ఆ మహా సామ్రాజ్యానికి దిక్కెవరు? రచ్చగెలిచి ఇంట గెలవలేకపోయిన పెద్దాయన్ని మనవరాలు ఎలా కాపాడుకుంది? దిగ్భ్రాంతికి గురైతే వెళ్లాల్సిన దారినే మర్చిపోయే బలహీనతను ఆమె ఎలా జయించింది? ఇలా ఆసక్తిరేపే ప్రశ్నలతో తొలి ఎపిసోడ్ నుంచే ప్రేక్షకులను టీవీ స్క్రీన్‌కు కట్టిపడేసేలా ఉంటుందీ సీరియల్. మనవైన బంధాలు, భావోద్వేగాలు, విలువల్ని ఆవిష్కరిస్తూనే... ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని పంచే కథనంతో ఈ ధారావాహిక తెరకెక్కింది అన్నారు మలినేని రాధాకృష్ణ. 'స్వాతి చినుకులు', 'పుత్తడి బొమ్మ', 'మనసంతానువ్వే' తదితర ధారావాహికలతో ప్రేక్షకుల్ని మెప్పించిన ఈయన రూపొందించిన సీరియల్ 'సీతారామయ్య గారి మనవరాలు'. **ఈ ధారావాహిక సోమ–శని వరకూ రాత్రి 8:30కు ఈటీవీలో ప్రసారం కానుంది.** ఈ నేపథ్యంలో ఈ సీరియల్ గురించి రాధాకృష్ణ చెప్పిన విషయాలివీ...

- "కుటుంబాల మధ్య గొడవలు, భిన్న భావోద్వేగాలు ప్రతి ధారావాహికలోనూ సాధారణమే. వాటిని దాటి చెబుతున్న ఓ మంచి కథే... 'సీతారామయ్యగారి మనవరాలు'. ప్రతి ఇంట్లో తాతయ్యకి మనవరాలు మనవరాలుగా మాత్రమే ఉండొద్దు, మన 'వరాలు' అని గర్వపడేలా చేయాలన్న ఓ సరికొత్త కథాంశం, మనవైన విలువలు ఇందులో ఉంటాయి".
- "సీతారామయ్య, ఆయన మనవరాలు చిన్నారి, వసుధ అనే మూడు పాత్రల చుట్టూ తిరిగే కథ ఇది. ఆయా పాత్రల్ని ప్రశాంత్, పరమేశ్వరి, రచిత మహాలక్ష్మి అద్భుతంగా పోషించారు. తల్లిదండ్రులు, జీవిత భాగస్వాముల నుంచి సరైన ప్రోత్సాహం లభించక చాలా మంది మహిళలు ఒక రకమైన నిర్వేదంతో బతుకును కొనసాగిస్తుంటారు. అలాంటి మహిళలతోపాటు, అమ్మాయిలు అవసరం లేదని, తమ గౌరవానికి అడ్డు అని విసిరేసిన ఉదంతాలు ఈ కథకు స్ఫూర్తి".

ప్రేక్షకులకు ఇదొక కొత్త అనుభవం



"నటిగా పలు భాషల్లో ధారావాహికలు, సినిమాలు, సిరీస్‌లు చేశా. ఇదివరకు ఏదీ ఇవ్వని ఓ ప్రత్యేకమైన అనుభవం 'సీతారామయ్య గారి మనవరాలు' ఇచ్చింది. కథ, కథనం, పాత్రలు సాగే విధానం, వాటిని తెరపైకి తీసుకొచ్చిన తీరు ఎంతో ప్రత్యేకం. నేను వసుధ అనే పాత్రలో కనిపిస్తా. ఆ పాత్ర ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తుంది".
– రచిత మహాలక్ష్మి


ప్రణయ్, వేణుగోపాల్, సందీప్, విజయ్, సుమంత్ ప్రభాస్, అనంతిక

'అర్జున్‌రెడ్డి' కోసం మేం ఒక యుద్ధమే చేశాం!
- విజయ్ దేవరకొండ

"సందీప్‌రెడ్డిపై నమ్మకంతో వాళ్ల కుటుంబం పొలాన్ని పెట్టి 'అర్జున్‌రెడ్డి' చేసింది. అంతే నమ్మకం నాపైన పెట్టి ఆ సినిమాని నాతో చేశాడు తను. ఆ నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్ అంటే నాకెంతో ప్రత్యేకం. ఆ సంస్థ నుంచి వస్తున్న 'రోమాంచకం' పెద్ద విజయం సాధించాలి" అన్నారు ప్రముఖ కథానాయకుడు విజయ్ దేవరకొండ. ఆయన ముఖ్య అతిథిగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో 'రోమాంచకం' విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్‌కుమార్ జంటగా నటించిన చిత్రమిది. వేణుగోపాల్ రెడ్డి దర్శకుడు. భద్రకాళి పిక్చర్స్ పతాకంపై ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మించారు. సందీప్ రెడ్డి వంగా సమర్పకులు. ఈ చిత్రం సెప్టెంబర్ 3న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకకు విజయ్‌తోపాటు సినీ ప్రముఖులు మెహర్ రమేశ్, శౌర్యువ్, సునీల్ నారంగ్ హాజరయ్యారు. వేడుకని ఉద్దేశించి సందీప్‌రెడ్డి వంగా మాట్లాడుతూ "నాకూ, విజయ్‌కీ ఆగస్టు 24న 'అర్జున్‌రెడ్డి' సినిమాతో కలిగిన అనుభూతి దర్శకుడు వేణుకీ, ఈ చిత్రబృందానికీ కలగాలి. పేరుకే నేను సమర్పకుడిని కానీ, ఈ సినిమా కోసం మా అన్న ప్రణయ్, ఇతర బృందం ఎంతో శ్రమించింది. ఈ సినిమాని చూసి ప్రతి ఒక్కరూ నవ్వుకుంటూ థియేటర్ నుంచి బయటికొస్తారు. వేడుకకు వచ్చిన విజయ్ దేవరకొండకూ, ఇతర అతిథులకూ నా కృతజ్ఞతలు" అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "సందీప్‌పై నాకున్న ప్రేమ మాటల్లో చెప్పలేను. మాది ఒక ప్రత్యేకమైన బంధం. మేం 'అర్జున్‌రెడ్డి' కోసం ఒక యుద్ధం చేశాం. అది ఆడకపోతే పిచ్చోళ్లు అయిపోయేవాళ్లం. అప్పటికి 'పెళ్లిచూపులు' కూడా విడుదల కాలేదు. నాకు ఇంత మంది అండ కూడా లేదు. ఆ సమయంలోనే సందీప్ నా కోసం ఎంతవరకైనా వెళ్లడానికి సిద్ధమయ్యేవాడు. నేనూ తన కోసం అంతే. ఈ వేడుకకి వచ్చినందుకు తను నాకు కృతజ్ఞతలు చెబుతున్నాడు. సందీప్ పిలిచినప్పుడు రాకపోతే నేను బతికి వృథా కదా! సుమంత్‌కి ఊహించని విజయం దక్కుతుంది" అన్నారు. సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ "విజయ్ దేవరకొండ ఆయన మళ్లీ ఈ వేడుకకి రావడం చాలా ఆనందంగా ఉంది. భారతదేశం మొత్తం మన పరిశ్రమ గురించి మాట్లాడుకునేలా చేసిన సందీప్‌రెడ్డి నిర్మాణంలో సినిమా చేస్తుంటే నేనూ పెద్ద హీరో అయిపోయాననే అనుభూతి కలుగుతోంది. అందుకు ఈ సినిమా ఓ మైలురాయిగా నిలుస్తుంది. ఈ సినిమాలోని అందమైన పాత్రలు, వాటి అమాయకత్వం అందరికీ నచ్చేస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

'బట్వారా 1947' తర్వాత మళ్లీ కలిసి!


సన్నీ దేఒల్

బాలీవుడ్ కథానాయకుడు సన్నీ దేఒల్ ప్రధాన పాత్రలో రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బట్వారా 1947'. 30 ఏళ్ల తర్వాత వీరిద్దరూ కలిసి తీసిన ఈ సినిమా ఇటీవలే విడుదలై ప్రేక్షకుల్ని అలరించింది. మరోసారి వీరిద్దరి కలయికలో ఓ చిత్రం రానున్నట్లు దర్శకుడు రాజ్‌కుమార్ తెలిపారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దర్శకుడు మాట్లాడుతూ.. "నేను, సన్నీ కలిసి కొత్త కథలపై పనిచేస్తున్నాం. రాబోయే ప్రాజెక్టుల గురించి త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తాం. ఈ చిత్రంలో యాక్షన్, శక్తిమంతమైన సంభాషణలు, భావోద్వేగభరితమైన అంశాలు పూర్తిస్థాయిలో ఉంటాయి. ఈ సినిమాకి 'ఘటక్ ఘుస్ కే మారేగా' అనే టైటిల్‌ను ఖరారు చేశాం. ఇది సీక్వెల్ కాదు. కానీ 1996 నాటి కల్ట్ యాక్షన్ సినిమా 'ఘటక్'లోని పాత్రను సన్నీ తిరిగి పోషించనున్నార"ని అన్నారు. దర్శకుడు రాజ్‌కుమార్, సన్నీ దేఒల్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ఘాయల్', 'దామిని', 'ఘటక్' లాంటి చిత్రాలతో సినీప్రియుల్ని అలరించారు. ప్రస్తుతం సన్నీ దేఒల్ 'రామాయణ' చిత్రాలతో బిజీగా ఉన్నాడు.

మీ పాత ప్రేమకథని గుర్తు చేసేలా


కృష్ణప్రియ, వర్ధన్


"అందరికీ తమ ప్రేమకథల్ని గుర్తు చేసే సినిమా 'కాగితం పడవలు'" అన్నారు దర్శకుడు ఎంజీఆర్ తుకారాం. ఆయన తెరకెక్కించిన ఈ చిత్రంలో వర్ధన్, కృష్ణప్రియ జంటగా నటించారు. కీర్తన నరేశ్, టీఆర్ ప్రసాద్ రెడ్డి వెంకట్రాజుల, గాయత్రమ్మ అంజనప్ప నిర్మించారు. ఈ సినిమా ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా సెప్టెంబరు 18న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు తుకారాం మాట్లాడుతూ.. "థియేటర్లో చూసి ఆస్వాదించాల్సిన చిత్రమిది. ప్రతిఒక్కరి జీవితంలో ఓ ప్రేమకథ ఉంటుంది. ఈ సినిమా చూస్తే ఆ ప్రేమకథ మళ్లీ గుర్తొస్తుంది" అన్నారు. "మేము ఓ కాలువలో ప్రయాణం చేయలనుకున్నాం. కానీ తెలియకుండానే ఓ సముద్రంలోకి వచ్చేశాం. ఈ ప్రయాణంలో మాకెంతో అండగా నిలిచిన నిర్మాతలకు థ్యాంక్స్" అన్నారు హీరో వర్ధన్. ఈ కార్యక్రమంలో కృష్ణప్రియ, అంజనప్ప, రుద్ర సాయి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది 'లైకీ లైకా'?


రషా థడానీ


'శ్రీనివాస మంగాపురం' చిత్రంతో తనదైన నటనతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించింది బాలీవుడ్ కథానాయిక రషా థడానీ. ఇప్పుడామె మరో ప్రేమకథతో కుర్రకారుని ఆకట్టుకోవడానికి సిద్ధమవుతుంది. రషా, అభయ్ వర్మ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'లైకీ లైకా'. సౌరభ్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రొమాంటిక్ డ్రామాని ఈ ఏడాది థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. ఇప్పుడీ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేమికుల రోజున విడుదల చేయాలని నిర్ణయించారట. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్-ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు రషాతో ఈ చిత్రంలో ఒక ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించనున్నట్లు సమాచారం.

నటనను అదృష్టంగా భావిస్తా!


రాశీఖన్నా

ఎదురొచ్చిన అవకాశాన్ని అందుకుంటూ తనేంటో నిరూపించుకుంది అందాల తార రాశీఖన్నా. ప్రేమకథలు, యాక్షన్ ఎంటర్‌టైనర్‌లతో ఇటు దక్షిణాదితో పాటు.. బాలీవుడ్‌లోనూ మంచి క్రేజ్ సంపాదించుకుందీ భామ. 2013లో 'మద్రాస్ కేఫ్'తో నాయికగా సినీప్రయాణం మొదలెట్టిన ఈమె.. ఈ మధ్యే చిత్రపరిశ్రమలోకి వచ్చి 13ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే రాశి తన కెరీర్‌ను గుర్తు చేసుకుంటూ ఆనందం వ్యక్తం చేసింది. "13ఏళ్లు అనేది సుదీర్ఘ సమయం. కానీ నటనను ఎప్పుడూ ఒక అదృష్టంగానే భావించాను. అందుకే సమయం తెలియకుండానే వేగంగా గడిచిపోయింది. 'మద్రాస్ కేఫ్' రోజుల్ని గుర్తుచేసుకుంటే నా ప్రయాణం ఎందుకు మొదలైందో తెలుస్తుంది. నాకు ముఖ్యమైన కథలను చెప్పే అవకాశాన్ని అది నాకు ఇచ్చింది. ఈ ప్రయాణంలో ఎన్నో అనుభవాలు, జ్ఞాపకాలను పోగుచేసుకున్నా. నన్ను ఆదరించి నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని చెప్పుకొచ్చింది రాశి. ప్రస్తుతం ఆమె 'ఫర్జీ 2', 'ధర్మన్' లాంటి సినిమాల షూటింగ్‌లతో బిజీగా గడుపుతోంది.

విన్నావా ప్రేమా...


రామ్ కార్తీక్, దిల్‌రాజు

రామ్ కార్తీక్, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'మిస్సింగ్ మేఘన'. వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. పంచుమర్తి నరేశ్‌బాబు నిర్మాత. 'విన్నావా విన్నావా ప్రేమా...' అంటూ సాగే ఈ చిత్రంలోని పాటని ఇటీవల ప్రముఖ నిర్మాత దిల్‌రాజు విడుదల చేశారు. 'మరి మరి నిన్నే నే తలచేలా చేశావే చెలియా... అలజడి పెంచేలా ఎదసడిలో చేరావే సఖియా... నీ పరిచయమే సరికొత్త జన్మ... ఈ పరవశమే నను వీడదమ్మా...' అంటూ మొదలయ్యే ఈ పాటని దీపు ఆలపించారు. ఆర్.ఆర్.ధ్రువన్ స్వరాలు సమకూర్చడంతోపాటు రచించారు. దర్శకుడు మాట్లాడుతూ "ఎంతోమంది కొత్త వాళ్లకు అవకాశాలిచ్చిన నిర్మాత దిల్‌రాజు చేతులమీదుగా మా సినిమాలోని రెండో పాట విడుదల కావడం ఆనందంగా ఉంది. ఇప్పటివరకూ విడుదలైన పాటలకు, టీజర్‌కూ మంచి స్పందన లభిస్తోంది. ప్రేమ, భావోద్వేగాల మేళవింపుతో కూడిన థ్రిల్లర్ చిత్రమిది. అందరికీ నచ్చేలా ఉంటుంద"న్నారు. నిర్మాత దిల్‌రాజు మా పాట విని మెచ్చుకుంటూ, విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు ఆర్.ఆర్.ధ్రువన్. గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత తదితరులు నటించారు.

రాజ్‌తరుణ్ చిత్రం... 'టార్టాయిస్'


రాజ్‌తరుణ్

రాజ్‌తరుణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న సినిమాకి 'టార్టాయిస్' అనే పేరుని ఖరారు చేశారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని ఆదివారం విడుదల చేసింది చిత్రబృందం. రిత్విక్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మాతలు. అమృతచౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సస్పెన్స్, డ్రామా మేళవించిన యాక్షన్ థ్రిల్లర్ కథతో ఈ చిత్రం రూపొందుతోందని, రాజ్‌తరుణ్ తన కెరీర్‌లో ఇప్పటి వరకూ చేయని ఓ కొత్త తరహా పాత్రని ఇందులో చేశారని సినీ వర్గాలు తెలిపాయి.



సముద్ర మంథన్‌పై ఓఎన్‌జీసీ దృష్టి

డ్రిల్‌షిప్ కొనుగోలు లేదా జేవీ యోచనలో కంపెనీ

దిల్లీ: దేశీయంగా చమురు, గ్యాస్ అన్వేషణను వేగవంతం చేసేందుకు ప్రభుత్వ రంగ దిగ్గజ సంస్థ ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్) అడుగులు వేస్తోంది. మిషన్ సముద్ర మంథన్‌లో భాగంగా లోతైన సముద్రంలో (డీప్ వాటర్) డ్రిల్లింగ్ సామర్థ్యాన్ని సాధించేందుకు ప్రత్యేక డ్రిల్‌షిప్‌లను నేరుగా కొనుగోలు చేయడం లేదా సంయుక్త సంస్థ (జేవీ) ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టింది. ఇందుకు అనువుగా అంతర్జాతీయ మార్కెట్‌లో సరైన డ్రిల్‌షిప్ యాజమానులను గుర్తించడం, ఆస్తుల విలువను లెక్కించడం, ఒప్పంద చర్చల్లో మద్దతు ఇవ్వడం కోసం నిపుణులైన గ్లోబల్ రిగ్- బ్రోకింగ్ కన్సల్టెంట్‌ను నియమించేందుకు ఓఎన్‌జీసీ ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) జారీ చేసింది.

రెండు దశల్లో ప్రక్రియ..

తొలి దశలో భాగస్వాములుగా అర్హత లున్న సంస్థలను గుర్తించి, షార్ట్‌లిస్ట్ చేయడం ద్వారా ప్రాథమిక వాణిజ్య నిబంధనలను ఖరారు చేస్తారు. ఇందుకు కాలవ్యవధి 3 నెలలు. రెండో దశ (6 నెలలు)లో యాజమాన్యం లేదా జేవీ ఒప్పందం చర్చలు, డాక్యుమెంటేషన్, ఫైనాన్సింగ్ పూర్తి చేసి రిగ్‌ను మన దేశానికి తీసుకువస్తారు. 1500 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ లోతులో పనిచేయగల డీప్‌వాటర్ ఫ్లోటర్ అనుభవం ఉన్న సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

సముద్ర మంథన్ ప్రాజెక్ట్ లక్ష్యాలివే..

దేశీయంగా చమురు ఉత్పత్తి పెంచి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు రూ. 84,084 కోట్ల వ్యయంతో నేషనల్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ స్కీమ్- సముద్ర మంథన్ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన సంగతి విదితమే. ఇది 2030-31 వరకు అమల్లో ఉంటుంది. ఈ పథకం కింద 60 లోతైన ప్రాంతాల్లో చమురు అన్వేషణ బావులు తవ్వనున్నారు. ఒక్కో బావి నిర్మాణ వ్యయంలో 50% వరకు (గరిష్ఠంగా రూ.675 కోట్లు) ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది.

సొంత సామర్థ్యాల దిశగా అడుగులు

ప్రస్తుతం మనదేశంలో డీప్‌వాటర్ డ్రిల్‌షిప్‌లను తయారు చేసే సదుపాయం లేకపోవడంతో, విదేశీ రిగ్‌లపై చార్టర్ విధానంలో ఆధారపడాల్సి వస్తోంది. ప్రైవేట్ లేదా థర్డ్-పార్టీ లభ్యతపై ఆధారపడకుండా శాశ్వత నియంత్రణ సాధించడమే లక్ష్యంగా ఓఎన్‌జీసీ తాజా చర్యలు చేపట్టింది. ఈ లావాదేవీల నిర్వహణ కోసం గిఫ్ట్‌సిటీలో స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ఏర్పాటు చేయడం, ఈసీబీ వంటి విదేశీ వాణిజ్య రుణాల ద్వారా నిధులు సమీకరించే మార్గాలను పరిశీలిస్తోంది.



టాటా ఈవీ బుకింగులు మూడింతలు

- టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ సీసీఓ వివేక్ శ్రీవత్స



దిల్లీ: విద్యుత్ వాహన (ఈవీ) విభాగంలో మార్కెట్ వాటాను టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్ (టీఎంపీవీ) పెంచుకుంటోంది. గత 6 నెలల్లో ఈవీ బుకింగుల్లో మూడు రెట్ల పెరుగుదల నమోదైందని సంస్థ తెలిపింది. అయితే ఉత్పత్తి సామర్థ్యం పరిమితంగా ఉండటంతో, ఆర్డర్లను వెంటనే ఇవ్వలేకపోతున్నట్లు తెలిపింది. 'గత 2-3 నెలలను గమనిస్తే మేము ప్రతి నెలా మార్కెట్ వాటా పెంచుకుంటున్నాం. గత 6 నెలల్లో మాకు, మార్కెట్‌లో రెండో స్థానంలో ఉన్న సంస్థకు మధ్య వ్యత్యాసం మరింత పెరిగింది. ఈవీల బుకింగుల్లో మేము 3 రెట్ల వృద్ధి సాధించాం. మాకు ఉన్న ఏకైక పరిమితి మా ఉత్పత్తి సామర్థ్యమే' అని టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ ముఖ్య వాణిజ్య అధికారి (సీసీఓ) వివేక్ శ్రీవత్స వెల్లడించారు. టీఎంపీవీలో టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ భాగంగా ఉంది.

విద్యుత్ వాణిజ్య వాహనాలకూ బలమైన గిరాకీ: తమ విద్యుత్ వాణిజ్య వాహనాల (సీవీల)కూ గిరాకీ బలంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు టాటా మోటార్స్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ గిరీష్ వాఘ్ తెలిపారు. చైనా నుంచి రావాల్సిన బ్యాటరీ సెల్స్ సరఫరాలో ఆటంకాల వల్ల తమ ఇంట్రా ఈవీపై ప్రభావం పడిందని.. సెప్టెంబరు చివరికి ఈ సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో కనిపించిన ఊపును కొనసాగిస్తూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 3,400కు పైగా విద్యుత్ వాణిజ్య వాహనాలకు ఆర్డర్లు లభించినట్లు వెల్లడించారు. 'పీఎం-ఇబస్ సేవా'లో కొత్త టెండర్లు రాబోతున్నాయని, వాటిపైనా ఆశాభావంతో ఉన్నామని వాఘ్ వెల్లడించారు.

ఈ వారమూ 7 ఐపీఓలు



దేశీయ ప్రాథమిక మార్కెట్‌లో ఈ వారమూ ఐపీఓల సందడి కొనసాగనుంది. ప్రధాన విభాగం (మెయిన్‌బోర్డు-3), ఎస్ఎంఈ విభాగాల్లో కలిపి మొత్తం 7 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకు రానున్నాయి. 8 మెయిన్‌బోర్డు కంపెనీలు, 6 ఎస్ఎంఈ సంస్థల షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఈ వారమే నమోదు కానున్నాయి.

- పర్పుల్ స్టైల్ ల్యాబ్స్ ఐపీఓ ఆగస్టు 31-సెప్టెంబరు 2 మధ్య ఉండనుంది. పూర్తిగా తాజా షేర్ల జారీ ద్వారా కంపెనీ రూ.680 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.546-575.
- రేస్ ఆఫ్ బిలీఫ్ రూ.125 కోట్ల ఐపీఓ సెప్టెంబరు 1-3 తేదీల్లో రాబోతోంది. ధరల శ్రేణి రూ.227-239.
- దీపా జువెలర్స్ రూ.459.72 కోట్ల ఐపీఓ సెప్టెంబరు 1-3 తేదీల్లో వస్తోంది. ధరల శ్రేణి రూ.168-177.

ఎస్ఎంఈ విభాగంలో..: ఐపీఓల ద్వారా అశుతోష్ ఫైబర్ రూ.56.35 కోట్లు, శాంతి ఇనార్గానిక్స్ రూ.47.24 కోట్లు, ఫైకెమ్ టెక్నాలజీస్ రూ.14.58 కోట్లు సమీకరించనున్నాయి. ఇవన్నీ ఆగస్టు 31-సెప్టెంబరు 2 మధ్య రాబోతున్నాయి. ఫార్మ్‌పీస్ ఐపీఓ సెప్టెంబరు 1-3 తేదీల్లో ఉండనుంది.

లిస్టింగ్ కంపెనీలు ఇవే..: మెయిన్‌బోర్డు విభాగంలో అగ్‌మాంట్ ఎంటర్‌ప్రైజెస్, హైటెక్ ఇంజినీర్స్ లిమిటెడ్, స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్, సింబయోటెక్ ఫార్మాల్యాబ్, అన్ను ప్రాజెక్ట్స్, లుమినో ఇండస్ట్రీస్, ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ప్రయారిటీ జువెల్స్ కంపెనీల షేర్లు ఈ వారం స్టాక్ మార్కెట్‌లో నమోదు కాబోతున్నాయి.

అంతరిక్ష రంగం తరహాలో అణు విద్యుదుత్పత్తి!


- టీసీఈ ఎండీ, సీఈఓ అమిత్ శర్మ

ముంబయి: అంతరిక్షరంగంలో ప్రైవేటు సంస్థలకు అవకాశం కల్పించాక, ఎంతటి విజయాలు లభిస్తున్నాయో చూస్తున్నామని.. అదే తరహాలో అణు ఇంధన రంగంలోనూ వాణిజ్య ఉత్పత్తికి ప్రైవేటు సంస్థలకు అవకాశం కల్పించాలని దేశ అణు కార్యక్రమంతో 5 దశాబ్దాలకు పైగా అనుబంధం ఉన్న టాటా కన్సల్టింగ్ ఇంజినీర్స్ (టీసీఈ) కోరింది. అణు ఇంధన విభాగం (డీఏఈ) జాతీయ వ్యూహాత్మక లక్ష్యాలపై ప్రధానంగా దృష్టి కొనసాగిస్తూనే, వాణిజ్య విద్యుత్ ఉత్పత్తి బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేసింది. అంతరిక్ష రంగం వృద్ధి వేగాన్ని పెంచడంలో తోడ్పడిన ప్రభుత్వ రంగ అంతరిక్ష సంస్థ ఇస్రో నుంచి ఈ విషయంలో డీఏఈ స్ఫూర్తిని పొందాలని టీసీఈ ఎండీ, సీఈఓ అమిత్ శర్మ సూచించారు. ప్రైవేటు రంగ సంస్థలు తమ నమూనాలను పరీక్షించుకునేందుకు, ముంబయిలోని బాబా అటామిక్ రీసెర్చ్ కేంద్రం (బార్క్) వంటి సంస్థల్లోని ప్రయోగశాలలను అందుబాటులో ఉంచాలని అమిత్ సూచించారు. ప్రైవేటు రంగం వాటా పెరిగే కొద్దీ 2030 ఆర్థిక సంవత్సరం చివరికి తమ మొత్తం రూ. 3000 కోట్ల ఆదాయంలో, అణు విద్యుత్ రంగ వాటా ప్రస్తుత 2% నుంచి 5-6 శాతానికి పెరుగుతుందని టీసీఈ అంచనా వేస్తోంది.



కుటుంబ సంస్థల ఓట్లతోనే దివాలా ప్రణాళికకు ఆమోదం

సుభాష్ చంద్రపై రుణదాతల ఆరోపణ



దిల్లీ: ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రణాళిక ఆమోదం పొందడంపై, అసమ్మతి రుణదాతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దాదాపు రూ. 22,006.57 కోట్ల క్లెయిమ్‌లకు బదులుగా కేవలం రూ.6.5 ఓట్లే చెల్లించేలా ఉన్న ప్రణాళికకు.. ఆయన కుటుంబంతో సంబంధం ఉన్న 5 ఆర్థిక సంస్థల ఓట్లతోనే మెజారిటీ లభించిందని ఆరోపించారు. ఈ ప్రణాళికకు రుణదాతల కమిటీ (సీఓసీ)లో మొత్తం 80.814% ఓట్ల మద్దతు లభించింది. ఇందులో చంద్ర కుటుంబంతో సంబంధం ఉన్న 5 సంస్థలే 61.78% ఓటింగ్ వాటాను నియంత్రించాయని రుణదాతలు ఆరోపిస్తున్నారు. ఇందులో ప్రధానంగా వీణా ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (సుభాష్ చంద్ర సోదరుడు జవహర్ గోయల్ భార్య సుశీలా దేవి గోయల్ ఆధ్వర్యంలో ఉన్నట్లు ఆరోపణ), డైరెక్ట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, వరల్డ్ క్రెస్ట్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌పీ, లెమనేడ్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌పీ, కార్ప్‌కాల్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌పీ ఉన్నాయి. ఈ సంస్థలు ఐబీసీ చట్టం ప్రకారం అసోసియేట్లు లేదా రిలేటెడ్ పార్టీలు పరిధిలోకి వస్తాయని, వీటికి ఓటు హక్కు ఉండకూడదని బ్యాంకర్లు వాదిస్తున్నారు.

ఎన్‌సీఎల్‌టీ బెంచ్‌లో భిన్నాభిప్రాయాలు

ఈ కేసులో ఎన్‌సీఎల్‌టీ డివిజన్ బెంచ్‌లోని జ్యుడీషియల్ సభ్యుడు అశోక్ కుమార్ భరద్వాజ్, సాంకేతిక సభ్యుడు రీనా సిన్హా పురి మధ్య భిన్నాభిప్రాయం (స్ప్లిట్ తీర్పు) వచ్చింది. రిజొల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పీ) ఐబీసీ సెక్షన్ 106(4) సహా పలు నిబంధనలను ఉల్లంఘించారని, తీవ్రమైన ప్రక్రియా లోపాలున్నాయని సిన్హా పేర్కొన్నారు. ఈ అంశాన్ని మూడో సభ్యుడైన నీలేష్ శర్మ (జ్యుడీషియల్ సభ్యుడు) వద్దకు పంపగా.. ఆయన రుణదాతల (బ్యాంకుల) అభ్యంతరాలను తోసిపుచ్చుతూ రుణ చెల్లింపు ప్రణాళికకు అనుకూలంగా తీర్పునిచ్చారు. రుణగ్రహీతకు సదరు సంస్థల్లో 51% లేదా అంతకంటే ఎక్కువ వాటా ఉన్నప్పుడు మాత్రమే అది 'అసోసియేట్'గా పరిగణించవచ్చని తెలిపారు.

- ఎన్‌సీఎల్‌టీ తీర్పును వ్యతిరేకిస్తూ ఎన్‌సీఎల్ఏటీ (అప్పిలేట్ ట్రైబ్యునల్)లో అప్పీల్ చేయనున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కెనరా బ్యాంక్ ప్రకటించాయి. కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కూడా రూ. 6.50 కోట్ల చెల్లింపు ప్రణాళికకు వ్యతిరేకంగా ఓటేశాయి. క్లెయిమ్‌ల కేటాయింపులు, ప్రణాళిక సమగ్రతపై ఇండస్ఇండ్ బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, ఐడీబీఐ ట్రస్టీషిప్ (ఎడెల్‌వీజ్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఫండ్స్ తరపున) ప్రశ్నలు లేవనెత్తాయి.
- ఇదిలా ఉంటే తనపై ఉన్న అసలు క్లెయిమ్ రూ.3,992 కోట్లు మాత్రమేనని, తాను కేవలం వ్యక్తిగత హామీదారుగా మాత్రమే ఉన్నానని, అసలు రుణగ్రహీతను కాదని సుభాష్ చంద్ర చెబుతున్నారు. రూ.22,000 కోట్ల క్లెయిమ్‌లను ఆయన తోసిపుచ్చారు.

ఇండియన్ బ్యాంక్ 100 కొత్త శాఖలు

చెన్నై: ప్రభుత్వ రంగంలోని ఏడో అతి పెద్ద బ్యాంక్ అయిన ఇండియన్ బ్యాంక్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో తమ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించేందుకు సన్నాహాలు చేస్తోంది. దేశవ్యాప్తంగా దాదాపు 100 కొత్త శాఖలు ప్రారంభించడంతో పాటు 2500 మంది సిబ్బందిని (స్పెషలిస్ట్ ఆఫీసర్లతో సహా) నియమించుకోనున్నట్లు బ్యాంక్ ఎండీ, సీఈఓ వినోద్ కుమార్ తెలిపారు. పెరుగుతున్న వ్యాపార అవసరాలు, పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగుల స్థానాలను భర్తీ చేసేందుకు నూతన నియామకాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గతేడాది 100 శాఖలు ప్రారంభించిన ఇండియన్ బ్యాంక్, ఈ ఏడాది కూడా అదే స్థాయిలో కొత్త శాఖలు ప్రారంభించనుంది. ఇందులో భాగంగానే ఆగస్టు 15న వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 15 శాఖలు ప్రారంభించింది. 2026 జూన్‌కు బ్యాంక్‌కు 6003 దేశీయ, 3 విదేశీ శాఖలు, గాంధీనగర్‌లో ఐఎఫ్ఎస్‌సీ బ్యాంకింగ్ యూనిట్ ఉన్నాయి. బ్యాంకులో మొత్తం 41875 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. బ్యాంక్ పసిడి రుణాల పోర్ట్‌ఫోలియో ప్రస్తుతం రూ.1.25 లక్షల కోట్లుగా ఉండగా, 2026-27 ముగిసేసరికి 20% వృద్ధితో రూ.1.5 లక్షల కోట్లకు చేరొచ్చని ఎండీ అంచనా వేస్తున్నారు. స్థూల నిరర్థక ఆస్తులను 1.5- 1.6 శాతానికి, నికర ఎన్‌పీఏలను 0.15- 0.2 శాతానికి తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొండి బకాయిల పరిష్కారంలో భాగంగా ఈ ఏడాది అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఏఆర్‌సీ)కి రూ.200 కోట్ల విలువైన మొండి రుణాలను విక్రయించనుంది.

కోడి గుడ్లు

31న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	530	తూ/ప గోదావరి	555
వరంగల్	532	విశాఖపట్నం	555
విజయవాడ	575	చిత్తూరు	573

ఎన్ఎస్ఈలో 1% వాటా విక్రయించనున్న ఎస్‌బీఐ గ్రూప్



దిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) రూ.30,000 కోట్ల ఐపీఓ సందర్భంగా, ఆ సంస్థలో తమకున్న వాటాలో 1 శాతాన్ని విక్రయించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), దాని అనుబంధ సంస్థ ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ యోచిస్తున్నాయి. ఈ విషయాన్ని ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ధ్రువీకరించారు.

- ఎస్‌బీఐ 15.90 లక్షల షేర్లను విక్రయించడం ద్వారా ఎన్ఎస్ఈలో వాటాను 0.65% మేర తగ్గించుకోనుంది. ప్రస్తుతం ఎస్‌బీఐకి ఎన్ఎస్ఈలో 3.23% వాటా ఉంది.
- ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ 8.78 లక్షల షేర్లను విక్రయించడం ద్వారా, 0.35% వాటా తగ్గించుకోనుంది. ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్‌కు ప్రస్తుతం ఎన్ఎస్ఈలో 4.33% వాటా ఉంది.
- అంటే ఎస్‌బీఐ గ్రూప్ మొత్తం కలిపి ఎన్ఎస్ఈ ఐపీఓలో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద సుమారు 24.7 లక్షల షేర్లను విక్రయించనున్నాయి.

జులైలో ఎస్‌బీఐ ఎంఎఫ్‌లో 10% వాటా విక్రయం: గత నెలలో ఎస్‌బీఐ తన విదేశీ భాగస్వామి అమండీతో కలిసి ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్‌లో సుమారు 10% వాటా విక్రయించింది. దేశంలోనే అతి పెద్ద ఫండ్ సంస్థ అయిన ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ నిర్వహించిన రూ.9,800 కోట్ల ఐపీఓ భారీ విజయాన్ని సాధించింది. ఈ ఇష్యూకు 42 రెట్లు అధిక స్పందన లభించింది. లిస్టింగ్ తర్వాత ఎస్‌బీఐ వాటా 61.76% నుంచి 55.46 శాతానికి తగ్గగా, అమండీ వాటా 3.7% తగ్గి 32.56 శాతానికి చేరింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఈఓ రేసులో కైజాద్ భరూచా



దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, తమ తదుపరి మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) - ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) ఎంపిక ప్రక్రియను ముమ్మరం చేసింది. ప్రస్తుత సీఈఓ శశిధర్ జగదీశన్ పదవీకాలం అక్టోబరులో ముగియనుంది. బ్యాంక్ డిప్యూటీ ఎండీ కైజాద్ భరూచాతో పాటు మరో బయటి వ్యక్తి పేరును రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆమోదం కోసం పంపే యోచనలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం బ్యాంకులు సీఈఓ పదవికి ఒకటి కంటే ఎక్కువ పేర్లను సిఫారసు చేయాలి. ప్రస్తుతం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రిటెయిల్, హోల్‌సేల్ విభాగాలను భరూచా పర్యవేక్షిస్తున్నారు. పూర్తిస్థాయి డైరెక్టర్‌గా 15 ఏళ్ల పరిమితి 2029 వరకు ఉండటంతో, ఆయన సీఈఓ పదవికి అర్హత కలిగి ఉన్నారు.

రాగి సానుకూలం!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి అక్టోబరు కాంట్రాక్టు ఈవారం సానుకూలంగా కదలాడితే రూ.1,62,087 వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది. దీన్ని అధిగమిస్తే రూ.1,67,744; రూ.1,70,755 వరకు రాణించొచ్చు. ఒకవేళ ప్రతికూల ధోరణిలో చలిస్తే రూ.1,53,399 వద్ద తక్షణ మద్దతు లభిస్తుంది. ఈ స్థాయిని కోల్పోతే రూ.1,50,398; రూ.1,44,711 వరకు దిగిరావచ్చు.

వెండి



వెండి డిసెంబరు కాంట్రాక్టుకు ప్రతికూల ధోరణి కొనసాగినా, రూ. 2,37,301 వద్ద మద్దతు లభించొచ్చు. దీన్ని కోల్పోతే రూ.2,32,158; రూ.2,23,079 వరకు దిగి రావచ్చు. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.2,51,523 వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది. దీన్ని అధిగమిస్తే రూ. 2,60,602; రూ.2,65,745 వరకు పెరగొచ్చు.

ప్రాథమిక లోహాలు



- రాగి సెప్టెంబరు కాంట్రాక్టు రూ.1,383 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే, స్టాప్‌లాస్‌ను పరిగణిస్తూ రూ.1,404 వరకు లాంగ్ పొజిషన్లను కొనసాగించడం మంచిదే.
- సీసం సెప్టెంబరు కాంట్రాక్టు రూ.196 కంటే దిగువన కదలాడితే రూ.195.05; రూ.194.10 వరకు దిద్దుబాటు కావచ్చు. రూ.194 స్థాయికి దిగివచ్చాక తిరిగి లాంగ్ పొజిషన్ల వైపు మొగ్గు చూపొచ్చు.
- జింక్ సెప్టెంబరు కాంట్రాక్టు సానుకూలంగా కదలాడితే రూ. 423.20 నిరోధం కనిపిస్తోంది. దీన్ని అధిగమిస్తే రూ.432.15; రూ.444.50 వరకు పెరగొచ్చు.
- అల్యూమినియం సెప్టెంబరు కాంట్రాక్టుకు రూ.342.60 వద్ద తక్షణ మద్దతు ఉంది. ఇది కోల్పోతే రూ.339.15; రూ.336.30 వరకు దిగిరావచ్చు. పైకి వెళ్తే రూ.348.90 వద్ద నిరోధం రావచ్చు. దీన్ని అధిగమిస్తే రూ.351.75; రూ.355.20 వరకు వెళ్లొచ్చు.

ఇంధన రంగం



- ముడి చమురు సెప్టెంబరు కాంట్రాక్టు ప్రతికూల ధోరణిలో కొనసాగితే రూ. 7,641 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.7,295; రూ.6,988 వరకు దిగిరావచ్చు. ఒకవేళ సానుకూలంగా చలిస్తే రూ.8,294 వద్ద నిరోధం నిరోధం ఉంది. దీన్ని అధిగమిస్తే రూ.8,601 - 8,947 వరకు పెరగొచ్చు.
- సహజవాయువు సెప్టెంబరు కాంట్రాక్టుకు రూ.260.60 వద్ద మద్దతు కనిపిస్తోంది. ఇది కోల్పోతే రూ.245.40 వరకు రావచ్చు. ఒకవేళ పైకి వెళితే రూ.288.50 వద్ద తక్షణ నిరోధం కనిపిస్తోంది. దీన్ని అధిగమిస్తే రూ.301.20 - 316.40 వరకు వెళ్లొచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



- పసుపు అక్టోబరు కాంట్రాక్టుకు ప్రతికూల ధోరణి కొనసాగితే రూ.19,171 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ. 17,681; రూ.16,202 వరకు దిగిరావచ్చు.
- జీలకర్ర కాంట్రాక్టు రూ.21,188 స్థాయిని అధిగమిస్తే మరిన్ని లాంగ్ పొజిషన్లు జతచేసుకోవచ్చు. ఒకవేళ అధిగమించకుంటే రూ. 20,643, రూ.20,396కు దిగిరావచ్చు.

– అర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్


గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/క్షీణత
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (అక్టోబరు)	1,62,052	1,56,400	-3.49
వెండి (డిసెంబరు)	2,53,250	2,42,444	-4.27
రాగి (సెప్టెంబరు)	1,391.55	1,391.35	-0.01
సీసం (సెప్టెంబరు)	197.75	197.75	0.00
జింక్ (సెప్టెంబరు)	400.50	414.25	3.43
అల్యూమినియం (సెప్టెంబరు)	347.15	346.05	-0.32
ముడి చమురు (సెప్టెంబరు)	8,210	7,987	-2.72
సహజ వాయువు (సెప్టెంబరు)	261.70	275.80	5.39
పసుపు (అక్టోబరు)	21,910	20,660	-5.71
జీలకర్ర (సెప్టెంబరు)	20,780	20,890	0.53

చమురుపై స్పష్టత వస్తేనే..

స్టాక్ మార్కెట్ ఈ వారం

- అంతవరకు పరిమిత శ్రేణిలోనే సూచీలు
- నిఫ్టీ-50కి 24,050 వద్ద బలమైన మద్దతు
- విశ్లేషకుల అంచనాలు



ముడి చమురు ధరలపై స్పష్టత వచ్చేంత వరకు ప్రామాణిక సూచీలు పరిమిత శ్రేణిలోనే కదలాడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక వృద్ధిరేటు గణాంకాలు ఈనెల 31న అధికారికంగా విడుదల కానున్నాయి. తయారీ, సేవల పీఎంఐ, జీఎస్‌టీ గణాంకాలనూ పరిశీలించాలి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ కీలక రేట్ల పెంపు దిశగా సంకేతాలిచ్చిన నేపథ్యంలో, మన సూచీలపై ఆ ప్రభావం పడొచ్చు. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకునే యోచనేదీ లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చూచాయగా చెప్పాకే, చమురు ధరలు పెరగడం ప్రారంభించాయి. ఆగస్టులో ఇప్పటివరకు విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు రూ.30,919 కోట్ల పెట్టుబడులు పెట్టారు. నిఫ్టీ-50కి 24,050 వద్ద మద్దతు కనిపిస్తోందని, నిరోధం 24,200-24,350 వద్ద ఎదురు కావొచ్చని సాంకేతిక నిపుణులంటున్నారు. వివిధ రంగాలపై ఈవారం మార్కెట్ నిపుణుల విశ్లేషణలు ఇవీ..

- ఇటీవల ఉక్కు ధరలు పుంజుకున్నందున ఫెర్రస్ **లోహ** కంపెనీల షేర్లు రాణించొచ్చు. అల్యూమినియం ధరలు పెరిగే వరకు ఆయా కంపెనీల షేర్లు ఒత్తిడిలో పడొచ్చు. నిఫ్టీ మెటల్ సూచీకి తొలుత 13,220 వద్ద, ఆ తర్వాత 12,700 వద్ద మద్దతు లభించొచ్చు.
- **యంత్రపరికరాల** షేర్లు ఒక శ్రేణిలో కదలాడొచ్చు. ముడిపదార్థాల అధిక వ్యయం కారణంగా ఈ రంగ కంపెనీల మార్జిన్లపై ఒత్తిడి ఉంటుందన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. అధిక షేర్ల విలువలు లాభాలను పరిమితం చేయొచ్చు.
- **వాహన** సూచీ ఇంకా 20 రోజుల చలన సగటు కంటే దిగువనే చలిస్తుండడంతో స్థిరీకరణ దిశలో కొనసాగొచ్చు. ఆగస్టు విక్రయాల్లో టీఎంపీవీ, టాటా మోటార్స్, టీవీఎస్, ఎస్కార్ట్స్ రాణించొచ్చు.
- **ఐటీ** షేర్లపై ఫెడ్ ఛైర్ వ్యాఖ్యల ప్రభావం ఉంటుంది. ఏఐ ఆదాయాల డిఫ్లేషన్ విషయంలో దేశీయ ఐటీ కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. అయితే వీటికే ప్రయోజనం చేకూరొచ్చని విశ్లేషకులు అంటున్నారు.
- **ఔషధ** కంపెనీల షేర్లు ఒక శ్రేణిలో కదలాడొచ్చు. బలమైన మూలాలకు తోడు, రక్షణాత్మక కొనుగోళ్ల మద్దతున్నా, లాభాల స్వీకరణ, బలహీన మార్కెట్ పరిస్థితులు ఇందుకు కారణం. ఫార్మా సూచీకి 24,400 వద్ద నిరోధం, 23,800 వద్ద మద్దతుతో దిద్దుబాటు కొనసాగొచ్చు.
- **టెలికాం** షేర్లు మిశ్రమంగా, ఎంపిక చేసిన షేర్ల ఆధారంగా కదలాడొచ్చు. ఈ వారం బీఎస్ఈ టెలికాం సూచీకి 3,640 వద్ద మద్దతు, 3,790 వద్ద నిరోధం కనిపించొచ్చు. ఈ స్థాయిలకు వెలుపల 3,550 వద్ద మద్దతు, 3,880 వద్ద నిరోధం ఉండొచ్చు.
- అధిక వ్యయాల కారణంగా మార్జిన్లపై ఒత్తిడి పడే అవకాశం ఉన్నందున **సిమెంటు** కంపెనీల షేర్లు పరిమిత శ్రేణిలోనే ట్రేడవవచ్చు. సమీపకాలంలో సిమెంటుకు గిరాకీ స్థిరంగా ఉంటుందన్న అంచనాల వల్ల నష్టాలు పరిమితం కావచ్చు.
- ముడి చమురు అధిక ధరలు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో **ఎఫ్ఎంసీజీ** విక్రయాల వృద్ధి, లాభదాయకతకు కళ్లెం పడొచ్చు. బలహీన వర్షాలు కూడా ఈ ఉత్పత్తుల గిరాకీపై ప్రభావం చూపొచ్చు. ఇప్పటికే నిల్వల వ్యయాలు పెరగ్గా, ఇటీవలి ధరల పెంపుతో గిరాకీ తగ్గడంతో బేరిష్ సెంటిమెంటు కనిపిస్తోంది.
- **చమురు** ధరలు పెరుగుతుండడంతో నిఫ్టీ చమురు-గ్యాస్ సూచీ ఒక శ్రేణిలోనే చలించొచ్చు. ముడిచమురు బ్యారెల్ ధర 90 డాలర్లకు చేరిన విషయం తెలిసిందే.
- ప్రభావం చూపే వార్తలు లేనందున నిఫ్టీ బ్యాంక్ సూచీ చాలా తక్కువ శ్రేణిలో చలించొచ్చు. తన పోటీదార్లతో పోలిస్తే కోటక్ మహీంద్రా బ్యాంక్ రాణించొచ్చు. నిఫ్టీ బ్యాంక్ 57,000 - 58,000 శ్రేణిలో కదలాడొచ్చు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	175.77	179.60	172.90
బజాజ్ ఆటో	11,910.00	12,089.30	11,679.30
ఐషర్ మోటార్స్	8,059.00	8,204.30	7,930.30
హీరో మోటోకార్ప్	5,600.00	5,719.30	5,469.30
ఎం అండ్ ఎం	3,334.00	3,378.90	3,279.50
మారుతీ	13,376.00	13,613.30	13,199.30
టీఎంపీవీ	319.40	323.50	311.30
టీవీఎస్ మోటార్	4,304.20	4,560.40	4,033.40

ఎఫ్ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5,308.50	5,391.80	5,234.80
కోల్గేట్ పామోలివ్	1,826.90	1,861.50	1,807.70
డాబర్ ఇండియా	386.00	390.20	381.00
ఇమామీ	379.40	392.30	371.80
హిందుస్థాన్ యునిలీవర్	2,010.40	2,029.10	1,988.10
ఐటీసీ	266.00	270.80	262.40
మారికో	829.65	846.50	818.00

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	430.85	441.20	421.90
సీజీ పవర్	889.00	906.10	869.60
ఎల్ అండ్ టీ	4,045.80	4,081.10	4,003.70
సీమెన్స్	4,089.00	4,140.30	4,034.30
థెర్మాక్స్	3,944.20	4,023.70	3,894.70

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	720.30	729.20	702.60
ఐసీఐసీఐ బ్యాంక్	1,422.80	1,448.10	1,406.30
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	83.12	84.70	82.20
ఇండస్ఇండ్ బ్యాంక్	994.00	7.30	980.70
కోటక్‌మహీంద్రా బ్యాంక్	423.70	428.80	418.40
పీఎన్‌బీ	115.40	116.50	113.90
ఎస్‌బీఐ	1,047.50	1,057.10	1,035.70

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1,645.30	1,676.60	1,604.40
బయోకాన్	411.10	421.90	404.60
సిప్లా	1,423.50	1,433.60	1,404.00
డాక్టర్ రెడ్డీస్	1,178.00	1,193.10	1,164.90
గ్లెన్‌మార్క్ ఫార్మా	2,515.00	2,600.70	2,388.90
నాట్కో ఫార్మా	853.80	869.40	837.10

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	1,037	1,045	1,022
హిందుస్థాన్ జింక్	622.00	634.60	601.50
ఎన్ఎండీసీ	86.76	88.40	85.20
సెయిల్	200.00	206.20	189.40
టాటా స్టీల్	186.50	191.20	181.70
వేదాంతా	287.95	293.70	279.50

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1,287.00	1,298.10	1,274.50
బీపీసీఎల్	319.25	322.30	314.50
హెచ్‌పీసీఎల్	364.00	373.30	359.20
ఐఓసీఎల్	137.10	138.30	135.60
ఓఎన్‌జీసీ	232.25	234.40	230.20
ఆయిల్ ఇండియా	482.85	492.70	466.80

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1,316.10	1,357.60	1,269.20
ఇన్ఫోసిస్	1,144.00	1,159.10	1,115.70
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5,875.00	6,053.70	5,587.70
టీసీఎస్	2,342.00	2,403.10	2,232.70
టెక్ మహీంద్రా	1,640.90	1,671.00	1,583.00
విప్రో	180.95	184.00	176.80

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1,306.40	1,318.80	1,296.80
అంబుజా సిమెంట్స్	412.05	415.40	408.40
ఇండియా సిమెంట్స్	369.75	377.10	359.50
శ్రీ సిమెంట్	24,000.00	24,713.30	23,543.30
అల్ట్రాటెక్ సిమెంట్	11,589.00	11,842.30	11,396.30

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,882.40	1,908.10	1,854.70
ఎమ్‌టీఎన్ఎల్	27.25	29.10	25.50
టాటా కమ్యూనికేషన్స్	1,694.70	1,718.20	1,666.40
వొడాఫోన్ ఐడియా	14.68	15.30	14.30

ఐఐటీలతో పాటు దేశంలోని మేటి విద్యా సంస్థల్లో ఉన్నత విద్యకూ, పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ (పీఎస్‌యూ)ల్లో అత్యున్నత కొలువులకూ దారి చూపుతుంది గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్). మేటి అవకాశాలకు బాటలు వేసే ఈ ప్రకటన ఇటీవలే వెలువడింది. బీటెక్‌తో పాటు ఇతర డిగ్రీల వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. సరైన ప్రణాళికకు నిబద్ధతను జోడిస్తే సాధారణ విద్యార్థులూ ఇందులో రాణించవచ్చు.

విస్తృత అవకాశాలకు గేట్ వే



ప్రశ్నలు ఇలా

ఈ ఆన్‌లైన్ పరీక్షలో ప్రశ్నాపత్రం పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. ఇందులో మూడు రకాల ప్రశ్నలు అడుగుతారు.

1. బహుళైచ్ఛిక ప్రశ్నలు: నాలుగు ఆప్షన్లు ఇస్తారు. అందులో ఒకటే సరైనది. దాన్నే గుర్తించాలి.

2. బహుళ ఎంపిక ప్రశ్నలు: ఇవి కూడా బహుళైచ్ఛిక ప్రశ్నలుగానే ఉంటాయి. కానీ ఇందులో ఒకటి కంటే ఎక్కువ సరైన ఆప్షన్లు ఉంటాయి. ఇచ్చిన నాలుగు ఆప్షన్లలో మూడు సరైనవైతే ఆ సరైన మూడు ఆప్షన్లూ గుర్తించాలి. ఒకవేళ ఒకటి లేదా రెండు సరైన ఆప్షన్లు గుర్తిస్తే ఎలాంటి మార్కులూ ఇవ్వరు.

3. సంఖ్యా సమాధాన ప్రశ్నలు (న్యూమరికల్): ఎలాంటి ఆప్షన్లూ ఉండవు. సమాధానాలు వర్చువల్ కీబోర్డును ఉపయోగించి రాయాలి.

✦ గేట్‌లో తప్పు సమాధానానికి ఆ ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో మూడో వంతు తగ్గిస్తారు. అంటే ఒక మార్కు ప్రశ్నకు 1/3, రెండు మార్కులదైతే 2/3చొప్పున మైనస్ మార్కులుంటాయి. న్యూమరికల్ ప్రశ్నలకూ, బహుళ ఎంపిక ప్రశ్నలకూ రుణాత్మక మార్కులుండవు.

ఐఐఎస్సీ, ఐఐటీలతో పాటు అత్యున్నత సంస్థల్లో ఎంటెక్, పీహెచ్‌డీల్లో ప్రవేశానికీ, పబ్లిక్ సెక్టార్ సంస్థలైన మహారత్న, నవరత్న, మినీరత్నల్లో ఉన్నత ఉద్యోగాలకూ రెండింటికీ గేట్ దారి చూపుతుంది. ప్రైవేటు సంస్థలూ ఈ స్కోరుతో విద్య, ఉన్నత ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తున్నాయి. జాతీయ స్థాయిలో నిర్వహించే ఎంతో ప్రతిష్ఠాత్మకమైన పరీక్ష ఇది. అందుకే గేట్ ప్రాధాన్యం ఏటా పెరుగుతోంది. బీటెక్ సిలబస్‌లో అరవై శాతంపై దృష్టి సారిస్తే ఇందులో విజయం సాధించవచ్చు. గేట్ స్కోరు పీజీ ప్రవేశాలకు మూడేళ్లు, పీఎస్‌యూల్లో నియామకానికి ఒకటి లేదా రెండేళ్లు చెల్లుతుంది.

స్టైపెండ్

గేట్-2027ను ఐఐటీ మద్రాస్ నిర్వహించనుంది. ఈ స్కోరుతో ఇంజినీరింగ్/ టెక్నాలజీ/ సైన్స్/ ఫార్మసీ/ ఆర్కిటెక్చర్/ హ్యూమానిటీస్ సంబంధిత విభాగాల్లో/ శాఖల్లో మాస్టర్ ప్రోగ్రామ్స్, డాక్టోరల్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం లభిస్తుంది. గేట్‌తో ఎంటెక్‌లో చేరినవారు ప్రతి నెలా రూ.12,400 స్టైపెండ్ అందుకోవచ్చు. ఇదే స్కోరుతో నేరుగా పీహెచ్‌డీలోనూ చేరిపోవచ్చు. వీరికి మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000, మూడో ఏట నుంచి ఐదో సంవత్సరం వరకూ నెలకు రూ.42,000 స్టైపెండ్ అందుతుంది.

ప్యాకేజీ

మహారత్న, నవరత్న, మినీరత్న హోదా పొందిన ప్రభుత్వరంగ సంస్థలు గేట్ స్కోరుతో సుమారు రూ.6 లక్షల నుంచి రూ.22 లక్షల వరకూ వార్షిక వేతనం అందిస్తున్నాయి. ఓఎన్‌జీసీ, ఐఓసీఎల్, ఎన్‌టీపీసీ, గెయిల్, బార్క్, హెచ్‌పీసీఎల్.. ఇలా 70కి పైగా సంస్థల్లో అవకాశం ఉంటుంది. వీటిలో ఏటా కనీసం 30-40 సంస్థలు నియామకాలు చేపడుతున్నాయి. అవకాశాలు సంబంధిత ఇంజినీరింగ్ బ్రాంచీల వారీ ఉంటాయి.

✦ గేట్ స్కోరుతోనే సాఫ్ట్‌వేర్, ఐటీ సంస్థలూ, ఇతర బహుళజాతి సంస్థలూ ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం, పరీక్ష లేకుండా నేరుగా ఇంటర్వ్యూ ద్వారా అవకాశం కల్పించడం చేస్తున్నాయి.

సన్నద్ధత

✦ పరీక్ష విధానాన్ని అర్థం చేసుకోవడంతో పాటు మీరు రాయాలనుకున్న పేపర్‌కు సంబంధించి సిలబస్‌లో మార్పులు గమనించాలి.

✦ అధ్యయనంలో పాత ప్రశ్నాపత్రాలే దిక్సూచి. వీటిని బాగా పరిశీలిస్తే ఏ అంశాలు, ఏ కాన్సెప్టులకు ఎలాంటి ప్రాధాన్యం లభిస్తోందో తెలుసుకోవచ్చు. వేటిపై అధిక దృష్టి సారించాలో అర్థం చేసుకుని, ప్రణాళిక రూపొందించుకోవచ్చు.

✦ గేట్ ఫిబ్రవరిలో ఉంటుంది. అంటే ఇప్పటి నుంచీ 5 నెలల కంటే ఎక్కువ సమయమే అందుబాటులో ఉంది. ఈ వ్యవధిలో సన్నద్ధత పూర్తిచేసే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి.

✦ ప్రతి సబ్జెక్టులోనూ ఒకటి లేదా రెండే ప్రామాణిక పుస్తకాలు తీసుకుని, వాటినే బాగా చదవాలి. ఇలా చదివేటప్పుడే షార్ట్ నోట్సు తయారు చేసుకోవాలి. ముఖ్యమైన సూత్రాలు, కాన్సెప్టులు లాంటివి టేబుల్/ చార్టులా రూపొందించుకోవాలి. రివిజన్ సమయంలో ఈ నోట్సు బాగా ఉపయోగపడుతుంది.

✦ ఎన్‌టీపీఈఎల్ పాఠాలు ప్రాథమిక అంశాలను అవగాహన చేసుకోవడానికి తోడ్పడతాయి. అలాగే విశ్లేషణాత్మక ప్రశ్నలకు సమాధానాలు రాయడానికీ ఉపయోగపడతాయి. అందువల్ల వాటినీ శ్రద్ధగా వినాలి.

✦ ఏదైనా అంశం చదవడం పూర్తయిన తర్వాత అందులో అధిక సంఖ్యలో మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. ఆ తర్వాత మాక్ టెస్టు రాసి, సన్నద్ధత ఎలా ఉందో తెలుసుకోవాలి.

✦ సిలబస్ మొత్తం చదవడం పూర్తయిన తర్వాత అసలైన గేట్‌ను పోలి ఉండే మాక్ టెస్టులు విస్తృతంగా రాయాలి. ఇవి రాస్తున్నప్పుడు చేస్తోన్న తప్పులపై ప్రత్యేక దృష్టి సారించాలి. అవి తర్వాతి పరీక్షల్లో రాకుండా చూసుకోవాలి.

✦ పలు పీఎస్‌యూలు నిర్వహిస్తోన్న పరీక్షల ప్రశ్నాపత్రాలూ గేట్ అధ్యయనంలో ఉపయోగపడతాయి. ఇవన్నీ గమనించడం వల్ల ఒక అంశాన్ని ఎన్ని రకాలుగా పరీక్షలో అడగవచ్చో తెలుసుకోవచ్చు.

> "గేట్‌లో విజయానికి బీటెక్ మొత్తం సిలబస్ చదవాల్సిన అవసరం లేదని గుర్తుంచుకోవాలి. నాలుగేళ్ల ఇంజినీరింగ్ సిలబస్‌లో దాదాపు 60 శాతమే పరీక్షలో భాగంగా ఉంటుంది. ఇంజినీరింగ్ బ్రాంచీ మూలాలు, నూతన పోకడలకే అధిక ప్రాధాన్యం. ఇప్పటి నుంచీ రోజుకు 8 గంటలు కేటాయిస్తే సిలబస్ మొత్తం క్షుణ్నంగా చదివేయొచ్చు. కాన్సెప్టుల వారీ అర్థంచేసుకుని, అధ్యయనం కొనసాగించాలి"

పరీక్ష

ఈ సారి 30 పేపర్లలో గేట్ నిర్వహిస్తున్నారు. రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ పేపర్‌ను కొత్తగా చేర్చారు. సిలబస్‌తో పాటు కొన్ని పేపర్ కోడ్‌లూ మారాయి. అభ్యర్థులు అవకాశాన్ని బట్టి రెండు పేపర్లలో పరీక్ష రాసుకోవచ్చు. దేశవ్యాప్తంగా 300కు పైగా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఇంజినీరింగ్ విభాగాల పరీక్షలో 100 మార్కులకు 65 ప్రశ్నలు ఉంటాయి. వ్యవధి మూడు గంటలు. ప్రశ్నాపత్రంలో రెండు విభాగాలుంటాయి.

విభాగం-1 (జనరల్ ఆప్టిట్యూడ్): ఇందులో పది ప్రశ్నలుంటాయి. ఒక మార్కు ప్రశ్నలు 5, రెండు మార్కుల ప్రశ్నలు 5 వస్తాయి. ఈ విభాగంలోని నాలుగు నుంచి ఐదు ప్రశ్నలు ఇంగ్లిష్ (వెర్బల్ ఎబిలిటీ) నుంచి, మిగతా ప్రశ్నలు క్వాంటిటేటివ్‌కు సంబంధించినవై ఉంటాయి.

విభాగం-2 (సంబంధిత ఇంజినీరింగ్ సబ్జెక్టులు) మొత్తం 55 ప్రశ్నలుంటాయి. ఇందులో ఒక మార్కు ప్రశ్నలు 25, రెండు మార్కుల ప్రశ్నలు 30 ఉంటాయి.

✦ ఇంజినీరింగ్ విభాగాలైతే.. జనరల్ ఆప్టిట్యూడ్ 15 మార్కులకు, ఇంజినీరింగ్ మ్యాథమెటిక్స్ 13 మార్కులకు, కోర్ సబ్జెక్టు ప్రశ్నలు 72 మార్కులకు ఉంటాయి. ఎక్కువ ప్రశ్నలు సంబంధిత రంగాల్లోని నూతన ఆవిష్కరణలపై వస్తాయి. అభ్యర్థులు ఎంచుకున్న పేపర్ ప్రకారం ప్రశ్నల సంఖ్యలో మార్పులు ఉంటాయి.

వివరాలు

అర్హతలు: ఇంజినీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, కామర్స్, సైన్స్, ఆర్ట్స్, హ్యూమానిటీస్‌లో బ్యాచిలర్ డిగ్రీ. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: గరిష్ఠ పరిమితి లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: సెప్టెంబరు 27.

దరఖాస్తు ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1000. మిగిలిన అందరికీ రూ.2000.

పరీక్ష తేదీలు: ఫిబ్రవరి 6, 7, 13, 14, 20, 21.

వెబ్‌సైట్: https://gate2027.iitm.ac.in

ఎన్ఎఫ్‌సీలో అప్రెంటిస్‌లు

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ), హైదరాబాద్.. ఏడాది అప్రెంటిస్‌షిప్ కోసం వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- ఐటీఐ ట్రేడ్ : 432 ఖాళీలు
- డిప్లొమా ఇంజినీరింగ్: 79 ఖాళీలు
- గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్: 27 ఖాళీలు

విభాగాలు/ ట్రేడులు: మెకానికల్ ఇంజినీరింగ్, కెమికల్, మెటలర్జికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్ తదితరాలు.

అర్హత: సంబంధిత విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ అవసరం. **వయసు:** 18 ఏళ్లు నిండాలి.

స్టైపెండ్: నెలకు ఐటీఐ అప్రెంటిస్‌లకు రూ.11,040; సీఓపీఏ, డీజిల్ మెకానిక్, కార్పెంటర్, ప్లంబర్, వెల్డర్‌లకు రూ.10,560; డిప్లొమా అప్రెంటిస్‌లకు రూ.10,900; గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.12,300.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

దరఖాస్తు: ఎన్ఏపీఎస్, ఎన్ఏటీఎస్ పోర్టల్ ద్వారా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 16.

వెబ్‌సైట్: https://www.nfc.gov.in/

సివిల్స్ కోసం ఏ కోర్సు బాగు?

ఇంటర్మీడియట్ ఎంపీసీ చదువుతున్నాను. నా లక్ష్యం యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్. ఇందుకు అనుగుణంగా యూజీలో ఏ కోర్సులో చేరితే బాగుంటుంది? - వినోద్

■ ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ చదువుతున్నప్పుడే సివిల్ సర్వీసెస్ ఆశయంగా పెట్టుకోవడం అభినందనీయం. సివిల్ సర్వీసెస్ పరీక్షలో విజయానికి డిగ్రీ కోర్సును జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలి. సివిల్స్ రాయడానికి ఏదైనా గుర్తింపు పొందిన డిగ్రీ సరిపోతుంది. అయితే, ఎంచుకునే కోర్సు సివిల్స్ సన్నద్ధతకు ఎంతవరకు ఉపయోగపడుతుంది? విద్యార్థి ఆసక్తి, సామర్థ్యాలకు సరిపోతుందా? ఒకవేళ సివిల్స్‌లో ఆశించిన ఫలితం రాకపోతే ప్రత్యామ్నాయ కెరియర్‌కు ఉపయోగపడుతుందా? అనే అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలి.



◗ సామాజిక, రాజకీయ, చరిత్ర, ఆర్థిక అంశాలపై ఆసక్తి ఉండి, సివిల్సే ప్రధాన లక్ష్యమైతే బీఏలో పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్ లాంటి సబ్జెక్టులను ఎంచుకోవడం మంచి నిర్ణయం. భారత రాజ్యాంగం, పరిపాలన, భారతదేశ చరిత్ర, ప్రపంచ చరిత్ర, ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ సంబంధాలు లాంటి అంశాలు సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ జనరల్ స్టడీస్‌లో ముఖ్యమైనవి. డిగ్రీలోనే వీటిని చదవడం వల్ల సివిల్స్ ప్రిపరేషన్ కొంత సులభమవుతుంది. వ్యాసరచన, విశ్లేషణాత్మక సమాధానాలు రాయడంలోనూ ప్రయోజనం ఉంటుంది. అలాగే పొలిటికల్ సైన్స్, హిస్టరీ లాంటి సబ్జెక్టులను మెయిన్స్‌లో ఆప్షనల్‌గా ఎంచుకునే అవకాశమూ ఉంటుంది.

◗ ఎంపీసీ విద్యార్థులకు మ్యాథ్స్, లాజికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ లాంటి అంశాల్లో సహజంగా కొంత అవగాహన ఉంటుంది. దాన్ని కొనసాగించాలని భావిస్తే బీఎస్సీ మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ లేదా డేటా సైన్స్ మంచి ఎంపికలు. ఇవి సివిల్స్‌లోని సీశాట్‌లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్‌కు ఉపయోగపడతాయి. ఒకవేళ సివిల్స్‌లో రాణించలేకపోతే స్టాటిస్టిక్స్, డేటా అనలిటిక్స్, ఐటీ, బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్, ఫైనాన్స్, మార్కెట్ రిసెర్చ్ లాంటి రంగాల్లో ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశాలూ ఉంటాయి.

◗ సివిల్స్ రాయడానికి బీటెక్ కూడా మరో ప్రత్యామ్నాయం. ఇంజినీరింగ్ ద్వారా టెక్నికల్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు అభివృద్ధి చెందడంతో పాటు ప్రైవేట్ రంగం, ప్రభుత్వ సాంకేతిక ఉద్యోగాలు, ఉన్నత విద్య లాంటి అవకాశాలు ఉంటాయి. అయితే బీటెక్‌లో తరగతులు, ల్యాబ్‌లు, ప్రాజెక్టుల భారం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున సివిల్స్ ప్రిపరేషన్‌కు ప్రత్యేకంగా సమయం కేటాయించాలి.

◗ సివిల్స్‌లో విజయం సాధించలేకపోయినా అక్కడితో అవకాశాలు ముగియవు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-1, గ్రూప్-2, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్, రైల్వే తదితర పోటీ పరీక్షలకు సివిల్స్ ప్రిపరేషన్ ఎంతో ఉపయోగపడుతుంది. బీఏ విద్యార్థులు పీజీ తర్వాత బోధన, పరిశోధన, పబ్లిక్ పాలసీ, జర్నలిజం లాంటి రంగాల్లోకి వెళ్లవచ్చు. బీఎస్సీ, బీటెక్ విద్యార్థులకు సాంకేతిక, డేటా, కార్పొరేట్ రంగాల్లో మరిన్ని అవకాశాలు ఉంటాయి.

సివిల్సే ప్రధాన లక్ష్యంగా సామాజిక శాస్త్రాలపై ఆసక్తి ఉంటే బీఏ పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్ అనుకూలం. సివిల్స్‌తో పాటు బలమైన ప్రత్యామ్నాయ కెరియర్ కూడా కావాలంటే బీఎస్సీ స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ లేదా బీటెక్‌నూ పరిశీలించవచ్చు. ఏ డిగ్రీ ఎంచుకున్నా మొదటి సంవత్సరం నుంచే ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, కరెంట్ అఫైర్స్, వార్తాపత్రిక పఠనం, వ్యాసరచన, ఆన్సర్ రైటింగ్‌ను క్రమంగా కొనసాగించడం ఉత్తమ వ్యూహం.



- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

రైల్వేలో

వెస్టర్న్ రైల్వే, ముంబయి.. 2026-27 సంవత్సరానికి వివిధ డివిజన్లు, యూనిట్లలో ఖాళీగా ఉన్న స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- సెవెన్త్ పే లెవెల్-5/4: 05 పోస్టులు

క్రీడా విభాగాలు: అథ్లెటిక్స్(పు), జిమ్నాస్టిక్స్(పు), హాకీ(మ), వెయిట్‌లిఫ్టింగ్(పు), రెజ్లింగ్(పు- ఫ్రీస్టైల్)

- సెవెన్త్ పే లెవెల్-3/2: 16 పోస్టులు

క్రీడా విభాగాలు: అథ్లెటిక్స్ (పు/మ), క్రికెట్ (పు/మ), డైవింగ్ (పు/మ), ఫుట్‌బాల్ (పు), జిమ్నాస్టిక్స్ (పు), హాకీ (మ), పవర్‌లిఫ్టింగ్ (మ), స్విమ్మింగ్ (పు), వెయిట్‌లిఫ్టింగ్ (పు), రెజ్లింగ్ (పు - ఫ్రీస్టైల్).

- సెవెన్త్ పే లెవెల్-1: 43 పోస్టులు

క్రీడా విభాగాలు: అథ్లెటిక్స్ (పు/మ), బాల్ బ్యాడ్మింటన్ (పు), బాస్కెట్‌బాల్ (పు/మ), బాక్సింగ్ (పు/మ), బాడీ బిల్డింగ్ (పు), సైక్లింగ్ (పు), హాకీ (పు), హ్యాండ్‌బాల్ (పు/మ), ఖో-ఖో (పు/మ), పవర్‌లిఫ్టింగ్ (పు), స్విమ్మింగ్ (పు), వాలీబాల్ (మ), వాటర్ పోలో (పు), వెయిట్‌లిఫ్టింగ్ (మ).

విద్యార్హత: పోస్టుల ప్రకారం టెన్త్/ ఇంటర్/ డిగ్రీతో పాటు ఒలింపిక్ గేమ్స్ (సీనియర్)లో దేశానికి ప్రాతినిధ్యం వహించి ఉండాలి. లేదా వరల్డ్ కప్/ వరల్డ్ ఛాంపియన్‌షిప్/ ఆసియా గేమ్స్/ కామన్వెల్త్ గేమ్స్/ యూత్ ఒలింపిక్స్/ ఛాంపియన్స్ ట్రోఫీల్లో కనీసం తృతీయ స్థానంలో నిలిచి ఉండాలి.

వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: క్రీడా ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్‌లతో.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, దివ్యాంగులు, మహిళలకు రూ.250. మిగతావారికి రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభ తేదీ: సెప్టెంబరు 01.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 30.

వెబ్‌సైట్: https://www.rrc-wr.com/

ఏపీ స్పెషల్ టెట్-2026

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ.. ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్-ఇన్-సర్వీస్ టీచర్స్-2026) నోటిఫికేషన్ వెలువరించింది.

అర్హత: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఏపీఆర్ఈఐఎస్/ ప్రభుత్వ సంక్షేమ గురుకులాలు, మోడల్ స్కూల్స్, ఎయిడెడ్/ ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులై ఉండాలి. **దరఖాస్తు ఫీజు:** పేపర్‌కు రూ.1,000.

పరీక్ష: ఆన్‌లైన్‌లో 150 మార్కులకు నిర్వహిస్తారు.

అర్హత కోసం: జనరల్, ఈడబ్ల్యూఎస్‌లు 60 శాతం, బీసీలు 50శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 40 శాతం మార్కులు సాధించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 24.

పరీక్ష తేదీలు: అక్టోబరు 11 నుంచి 21 వరకు. **వెబ్‌సైట్:** https://tet2dsc.apcfss.in/

రైట్స్

రైట్స్ లిమిటెడ్, గురుగ్రామ్.. తాత్కాలిక ప్రాతిపదికన 08 ఇంజినీర్-యూటీ టెస్టింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

అర్హత: సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్ డిప్లొమా/ డిగ్రీతో పాటు కనీసం ఐదేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: దరఖాస్తు చివరి తేదీ నాటికి 40 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు రూ.42,478.

ఎంపిక: ధ్రువపత్రాల పరిశీలన, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూలతో.

ఇంటర్వ్యూ తేదీలు: సెప్టెంబరు 17, 18.

వేదిక: బెంగళూరు, చెన్నై.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 14.

వెబ్‌సైట్: https://www.rites.com/?Lang=En

ఆఫీసర్ పోస్టులు

భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్).. ఒప్పంద ప్రాతిపదికన ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఆఫీసర్ (గ్రేడ్-2) సేఫ్టీ: 05 పోస్టులు

అర్హత: ఇంజినీరింగ్ డిప్లొమా ఫస్ట్ క్లాస్/ డిగ్రీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: 29 ఏళ్లు మించకూడదు.

వేతన శ్రేణి: నెలకు రూ.40,000 - 1,40,000.

ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, మెడికల్ టెస్టు తదితరాలతో.

దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు ఉండదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 02.

వెబ్‌సైట్: https://www.bemlindia.in/

ఎన్ఐసీలో సైంటిఫిక్ అసిస్టెంట్లు

నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ), దిల్లీ.. 376 సైంటిఫిక్/ టెక్నికల్ అసిస్టెంట్-ఏ గ్రూప్-బీ, ఎస్ అండ్ టీ (నాన్-గెజిటెడ్) పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన భర్తీచేయనుంది. వీటికి బీటెక్/ ఎమ్మెస్సీ/ ఎమ్మెస్/ ఎంసీఏతో దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్-2024/ 2025/ 2026 స్కోరుతో నియామకాలుంటాయి.



మొత్తం ఉద్యోగాల్లో కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో 300, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో 26, డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో 50 పోస్టులు ఉన్నాయి.

ఎంపిక: విద్యార్హతలు, గేట్ స్కోరు, ధ్రువపత్రాల పరిశీలనతో విభాగాలు, కేటగిరీలవారీగా ఎంపిక చేస్తారు. ధ్రువపత్రాల పరిశీలన తేదీని అభ్యర్థుల ఈమెయిల్ ఐడీకి తెలియజేస్తారు. దీన్ని దిల్లీ లేదా ఇతర ప్రాంతాల్లో నిర్వహిస్తారు. ఎంపికైనవారు దేశంలో ఏ ప్రాంతం నుంచైనా సేవలందించాలి.

వివరాలు

అర్హత: కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్/ డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో బీఈ/ బీటెక్/ ఎమ్మెస్సీ/ ఎమ్మెస్/ ఎంసీఏ. సీఎస్/ సీఈ/ డీఏలో గేట్-2024/ 2025/ 2026 స్కోరు ఉండాలి. ఉద్యోగానుభవం అవసరం లేదు.

వయసు: దరఖాస్తు గడువు తేదీ నాటికి జనరల్, ఈడబ్ల్యూఎస్‌లకు 30 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్ల సడలింపులు వర్తిస్తాయి.

దరఖాస్తు ఫీజు: అన్‌రిజర్వ్‌డ్, ఓబీసీ-ఎన్‌సీఎల్, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.800. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ఫీజు ఉండదు.

వేతన శ్రేణి: లెవెల్ 6 ప్రకారం ప్రారంభ మూలవేతనం నెలకు రూ.35,400. అన్ని అలవెన్సులతోనూ కలిపి వీరు సుమారు రూ.60,000 కంటే ఎక్కువే పొందవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తులు: 01.09.2026 నుంచి 30.09.2026 వరకూ స్వీకరిస్తారు.

వెబ్‌సైట్: https://recruitment.nic.in/

అసోసియేట్ ఇంజినీర్లు

ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్), దిల్లీ.. నిర్ణీత కాల ప్రాతిపదికన రెండేళ్లకు 12 అసోసియేట్ ఇంజినీర్ పోస్టులను భర్తీచేయనుంది. వీటికి బీటెక్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు. ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ, వైద్యపరీక్షలతో నియామకాలుంటాయి.

పోస్టు: అసోసియేట్ ఇంజినీర్ (ఏఈ)-గ్రేడ్-1 (పైప్‌లైన్/ పైపింగ్ ఇంజినీర్)

ఖాళీలు: 06

అర్హత: మెకానికల్‌తో బీఈ/ బీటెక్. రిఫైనరీ/ పెట్రోకెమికల్/ గ్యాస్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో ఉద్యోగానుభవం ఉండాలి. విద్యార్హతల డిగ్రీలను 60 శాతం మార్కులతో పూర్తిచేయాలి.

పోస్టు: అసోసియేట్ ఇంజినీర్- గ్రేడ్-1 (ఆఫ్‌షోర్ స్ట్రక్చరల్ ఇంజినీర్)

ఖాళీలు: 04

అర్హత: సివిల్/ ఓషన్/ మెరైన్/ నావల్ ఆర్కిటెక్చర్‌తో బీఈ/ బీటెక్. సివిల్, స్ట్రక్చరల్ డిజైన్స్‌లో ఉద్యోగానుభవం ఉండాలి.

పోస్టు: అసోసియేట్ ఇంజినీర్- గ్రేడ్-1 (ప్రాజెక్ట్ ఇంజినీర్)

ఖాళీలు: 02

అర్హత: మెకానికల్/ సివిల్/ ఓషన్/ మెరైన్/ నావెల్ ఆర్కిటెక్చర్‌తో బీఈ/ బీటెక్. ఫెర్టిలైజర్, కెమికల్ ప్లాంట్స్, రిఫైనరీ, గ్యాస్ ప్రాసెసింగ్ యూనిట్లలో ఉద్యోగానుభవం ఉండాలి. విద్యార్హతల డిగ్రీలను 60 శాతం మార్కులతో పూర్తిచేయాలి.



ఎంపిక: విద్యార్హతలు, ఉద్యోగానుభవంతో దరఖాస్తులను స్క్రీనింగ్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూను గురుగ్రామ్, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, ముంబయి, వడోదరల్లో నిర్వహిస్తారు. ఇంటర్వ్యూ తేదీ, సమయం, వేదికల వివరాలను అభ్యర్థులకు తెలియజేస్తారు. ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి తుది ఎంపిక చేస్తారు. మొదట్లో రెండేళ్లకు నియమించినప్పటికీ మరో మూడేళ్లు పొడిగించే అవకాశం ఉంటుంది.

వయసు: 32 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌లకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపులు వర్తిస్తాయి.

వేతనం: ఎక్స్ కేటగిరీ నగరాల్లో నెలకు రూ.64,000. వై కేటగిరీ నగరాల్లో రూ.60,800. జెడ్ కేటగిరీ నగరాల్లో రూ.57,600. అదనంగా పలు సదుపాయాలు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08.09.2026

వెబ్‌సైట్: www.engineersindia.com/

మేనేజర్లు

కెనరా బ్యాంకు సెక్యూరిటీస్ లిమిటెడ్ (సీబీఎస్ఎల్).. కాంట్రాక్టు ప్రాతిపదికన సాధారణ రిక్రూట్‌మెంట్‌తో పాటు బ్యాక్‌లాగ్ ఖాళీల (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ) భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్: 01
- అసిస్టెంట్ మేనేజర్/ ఆఫీసర్/ జూనియర్ ఆఫీసర్: 09

అర్హత: డిగ్రీ/ పీజీతో పాటు ఉద్యోగానుభవం.

వయసు: 20-30 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15. **వెబ్‌సైట్:** https://www.canmoney.in/careers

కరెంట్ అఫైర్స్



◆ లుసానె డైమండ్ లీగ్‌లో నీరజ్ చోప్రా ఎన్నో స్థానంలో నిలిచాడు? **జ:** 2వ (రజతం) (శ్రీలంక అథ్లెట్ రుమేశ్ పతి రాగే 88.14 మీ. ఈటెను విసిరి స్వర్ణం నెగ్గాడు. నీరజ్‌చోప్రా 88.05 మీ. విసిరాడు. 3వ స్థానంలో పీటర్స్ అండర్సన్ (86.61 మీ., గ్రెనేడా) నిలిచాడు. రుమేశ్ పతి రాగే గత పది టోర్నీల్లో తొమ్మిదోసారి నంబర్‌వన్‌గా నిలిచాడు.)

మాదిరి ప్రశ్నలు

◆ 2026, ఆగస్టు 25కు భారత్‌లో యూపీఐ చెల్లింపుల వ్యవస్థ ప్రారంభమై ఎన్నేళ్లు పూర్తయింది?
జ: పదేళ్లు (2016, ఆగస్టు 25న భారత్‌లో యూపీఐ చెల్లింపుల వ్యవస్థ ప్రారంభమైంది. ప్రస్తుతం భారత యూపీఐ సేవలు 11 దేశాల్లో అందుబాటులో ఉన్నాయి. 2016-17లో రూ.0.07 లక్షల కోట్లుగా ఉన్న లావాదేవీల విలువ 2025-26 నాటికి సుమారు రూ.314 లక్షల కోట్లకు చేరింది.)

◆ ఇటీవల ఏ పురుగుమందుపై సంపూర్ణ నిషేధం విధించాలని కేంద్ర వ్యవసాయ శాఖ నిర్ణయించింది?
జ: కార్బోసల్ఫాన్ (ఇది వేగంగా అత్యంత విషపూరిత కార్బోఫ్యూరాన్‌గా మారుతుంది. తద్వారా పక్షులు, పరాగ సంపర్కజీవులు, జలచరాల మనుగడకు ముప్పు ఏర్పడుతుంది.)


మరింత సమాచారం

◆ రైతుల పంట దిగుబడిని ముందే అంచనా వేసి వాతావరణ మార్పులకు అనుగుణంగా రియల్-టైమ్ సూచనలు ఇచ్చేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రారంభించిన జాతీయ పోర్టల్?
జ: కృషి-మిత్ర (ఏఐ, ఇస్రో శాటిలైట్ డేటాతో ఈ పోర్టల్ పనిచేస్తుంది.)

పరమాణు నిర్మాణం

TARGET-2027 10th Class SPECIAL భౌతిక రసాయన శాస్త్రం

బహుళైచ్ఛిక ప్రశ్నలు



1. కింది వాటిలో తటస్థ విద్యుదావేశ కణం?
   ఎ) ఎలక్ట్రాన్ బి) ప్రోటాన్
   సి) న్యూట్రాన్ డి) పాజిట్రాన్
2. హైడ్రోజన్ పరమాణు వర్ణపటం ఆధారంగా పరమాణు నమూనాను ప్రతిపాదించిన శాస్త్రవేత్త ఎవరు?
   ఎ) జె.జె.థామ్సన్ బి) ఎర్నెస్ట్ రూథర్‌ఫర్డ్
   సి) నీల్స్ బోర్ డి) మాక్స్ ప్లాంక్
3. విద్యుదయస్కాంత తరంగంలో విద్యుత్తు, అయస్కాంత తరంగాలు పరస్పరం ఎలా ఉంటాయి?
   ఎ) సమాంతరంగా బి) లంబంగా
   సి) ఒకేదిశలో డి) 45° కోణంలో
4. శూన్యంలో కాంతి వేగం సుమారుగా ఎంత?
   ఎ) 3×10^6 మీ./సె. బి) 3×10^7 మీ./సె.
   సి) 3×10^8 మీ./సె. డి) 3×10^9 మీ./సె.
5. $l = 3$ అయితే అన్ని ఆర్బిటాళ్లలో ఉండగలిగే గరిష్ఠ ఎలక్ట్రాన్‌ల సంఖ్య?
   ఎ) 6 బి) 10 సి) 14 డి) 18
6. కింది వాటిలో అత్యధిక తరంగదైర్ఘ్యం ఉండేవి?
   ఎ) గామా కిరణాలు బి) X - కిరణాలు
   సి) అతినీలలోహిత కిరణాలు
   డి) రేడియో తరంగాలు

మౌలికాంశాలు, మరింత సమాచారం

7. 'ఒకే పరమాణువులోని ఏ రెండు ఎలక్ట్రాన్లకు నాలుగు క్వాంటం సంఖ్యలు సమానంగా ఉండవు.' అని తెలిపే నియమం-
   ఎ) పౌలీవర్జన నియమం బి) ఆఫ్ బౌ నియమం
   సి) హుండ్ నియమం డి) ఫ్లెమింగ్ నియమం
8. ప్రధాన క్వాంటం సంఖ్య n = 3 దేనిని సూచిస్తుంది?
   ఎ) M - ప్రధాన కర్పరం బి) f - ఉప కర్పరం
   సి) N - ప్రధాన కర్పరం డి) d - ఉపకర్పరం
9. ఒక ప్రధాన కక్ష్య(n)లో ఉండగలిగే గరిష్ఠ ఎలక్ట్రాన్ల సంఖ్య?
   ఎ) 2n బి) $2n^2$ సి) n^2 డి) n
10. కింది వాటిలో జడవాయువు ఎలక్ట్రాన్ విన్యాసం?
   ఎ) $1s^2 2s^2 2p^5$ బి) $1s^2 2s^2 2p^3$
   సి) $1s^2 2s^2 2p^6$ డి) $1s^2 2s^2 2p^4$
11. 3s, 3p, 4s, 3d ఆర్బిటాళ్లలో అత్యధిక శక్తిస్థాయి ఉన్న ఆర్బిటాల్?
   ఎ) 3s బి) 4s సి) 3p డి) 3d

సమాధానాలు: 1-సి; 2-సి; 3-బి; 4-సి; 5-సి; 6-డి; 7-ఎ; 8-ఎ; 9-బి; 10-సి; 11-డి.



రచయిత: కె.లక్ష్మణ మూర్తి

బీఎస్పీ, ఎన్‌పీపీ
(జాతీయ రాజకీయ పార్టీలు)

ఉత్తరంలో దళిత గళం.. ఈశాన్యంలో గిరిజన కిరణం!

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో సామాజిక సమానత్వం, ప్రాతినిధ్యం ప్రాతిపదికగా అవతరించిన విశిష్ట జాతీయ పార్టీలు బహుజన సమాజ్ పార్టీ, నేషనల్ పీపుల్స్ పార్టీ. ఉత్తర భారతంలో శతాబ్దాల వివక్షను అధిగమించి దళిత, బహుజనుల ఆత్మగౌరవానికి, రాజకీయాధికారానికి కాన్షీరాం ప్రాణం పోస్తే, ఈశాన్య భారత గిరిజనుల విలక్షణ స్వరానికి, హక్కుల పోరాటానికి పి.ఎ. సంగ్మా జాతీయ వేదికను కల్పించారు. ప్రధాన స్రవంతి రాజకీయాల్లో అంచులకే పరిమితమైన వర్గాలను నిర్ణయాత్మక శక్తిగా మలచడంలో ఈ రెండు పార్టీల ప్రయాణం ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. కాలక్రమంలో మాయావతి, కాన్రాడ్ సంగ్మా లాంటి నేతల నేతృత్వంలో ఈ పార్టీలు సాధించిన ప్రగతి భారత ప్రజాస్వామ్య వైవిధ్యానికి ప్రత్యక్ష నిదర్శనం. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు జాతీయ పార్టీల నిర్మాణాన్ని, వాటి ప్రభావశీలతను అర్థం చేసుకోవాలి. పార్టీల సిద్ధాంతాలు, చారిత్రక పరిణామాలు, కీలక ఎన్నికల పురోగతి, జాతీయ స్థాయి గుర్తింపునకు సంబంధించిన అన్ని వివరాలను సమగ్రంగా తెలుసుకోవాలి.

బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)

భారత ఎన్నికల సంఘం గుర్తించిన జాతీయ రాజకీయ పార్టీల్లో 'బహుజన సమాజ్ పార్టీ' ఒకటి. 'బహుజనులు' అంటే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన కులాలు, మతపరమైన మైనార్టీలు. వీరు భారతదేశ జనాభాలో 85% మంది ఉన్నప్పటికీ తగిన రాజకీయ అధికారం/అభివృద్ధి ఫలాలు అందలేదనే భావనతో 1984, ఏప్రిల్, 14న కాన్షీరాం ఈ పార్టీని స్థాపించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, జ్యోతిబాపులే, నారాయణ గురు, ఇ.వి.రామస్వామి నాయకర్ మొదలైన సామాజిక ఉద్యమకర్తల నుంచి కాన్షీరాం స్ఫూర్తి పొందారు. రాజకీయాధికారం ద్వారానే బహుజనుల సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో 'బహుజన సమాజ్ పార్టీ'ని స్థాపించారు.

పార్టీ సిద్ధాంతాలు: ◆ రాజకీయ సామాజికీకరణలో మార్పును తీసుకురావడం. ◆ ప్రతి ఒక్కరికీ సామాజిక న్యాయం చేకూర్చడం, మానవ హక్కులకు ప్రాధాన్యం ఇవ్వడం. ◆ బహుజనుల ఆర్థిక స్వావలంబనకు కృషి చేయడం, వారి ఆత్మగౌరవాన్ని కాపాడటం. ◆ ఉన్నత కులాల ప్రాబల్యాన్ని, సమర్థిస్తున్న 'మను' సిద్ధాంతాన్ని వ్యతిరేకించడం. ◆ ఛత్రంజాతవ్, బద్రి నారాయణ తివారి మొదలైన దళిత సామాజిక శాస్త్రవేత్తల ప్రాముఖ్యతను దళితులకు తెలియజేయడం. ◆ భారతదేశ నిర్మాణంలో దళితులు అందించిన సేవలను వెలుగులోకి తీసుకురావడం.

పార్టీ బలోపేతం: ▲ ఉన్నత విద్యావంతురాలైన మాయావతి నాయకత్వంలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) తన ప్రాబల్యాన్ని మరింత పెంచుకుంది. సంప్రదాయ రాజకీయాలను, ఓటు బ్యాంకు రాజకీయాలను ఎదుర్కోవడానికి రాజకీయ సామాజికీకరణలో గణనీయ మార్పులకు శ్రీకారం చుట్టింది. ▲ 1993లో ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఈ పార్టీ 28.52 శాతం ఓట్లతో 67 ఎమ్మెల్యే స్థానాలను సాధించింది. రాజకీయ పరిణామాల నేపథ్యంలో 1995లో ఈ పార్టీ తరఫున మాయావతి తొలిసారిగా ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. దేశంలో మొదటి దళిత మహిళా సీఎంగా ఈమె చరిత్రలో నిలిచారు. ▲ 1997లో మాయావతి రెండోసారి ఉత్తర్‌ప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అయ్యారు. ▲ 2002లో ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో 23% ఓట్లతో 98 స్థానాలను గెలుపొంది మూడోసారి ఆమె ఉత్తర్‌ప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ▲ 2007లో ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో 'సర్వసమాజ్' అనే పిలుపుతో బ్రాహ్మణుల ఓట్లను కూడా పొంది 30.43 శాతం ఓట్లను సాధించి, 206 స్థానాలను గెలుపొందారు. ఆ విధంగా నాలుగోసారి కూడా ఆమె యూపీ సీఎం సీటును సొంతం చేసుకున్నారు. ▲ 2012 తర్వాత ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో బీఎస్పీ తన ప్రాభవాన్ని కోల్పోయింది.



న్యూదిల్లీలోని బీఎస్పీ ప్రధాన కార్యాలయం



లోక్‌సభ ఎన్నికలు–బీఎస్పీ: ◆ 1989లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో 4.53 శాతం ఓట్లతో 4 లోక్‌సభ స్థానాలను బీఎస్పీ గెలుపొందింది. ఈ ఎన్నికల్లోనే మొదటిసారిగా లోక్‌సభకు మాయావతి ఎన్నికయ్యారు. ◆ 1991లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో 3.64 శాతం ఓట్లతో 2 లోక్‌సభ స్థానాలను ఈ పార్టీ గెలుపొందింది. ◆ 1998లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో 9.8% ఓట్లతో 5 లోక్‌సభ స్థానాలను సొంతం చేసుకుంది. ◆ 1999లో లోక్‌సభ ఎన్నికల్లో 9.97% ఓట్లతో 14 లోక్‌సభ స్థానాలను, 2004లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో 6.66% ఓట్లతో 19 లోక్‌సభ స్థానాలను, 2009లో లోక్‌సభ ఎన్నికల్లో 6.56 శాతం ఓట్లతో 21 స్థానాలను గెలుపొందింది. ◆ 2014లో లోక్‌సభ ఎన్నికల్లో 4.2% ఓట్లతో లోక్‌సభలో మూడో అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించినప్పటికీ ఒక్క లోక్‌సభ స్థానాన్ని కూడా గెలవలేకపోయింది. ◆ 2019లో లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీ 10 లోక్‌సభ స్థానాలను గెలుపొందింది. 3.6 శాతం ఓట్లను సాధించింది. ◆ 2024లో లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 488 స్థానాల్లో బీఎస్పీ పోటీ చేసినప్పటికీ ఒక్క స్థానాన్ని కూడా గెలవలేకపోయింది.



కాన్షీరాం



మాయావతి

బీఎస్పీ కీలకాంశాలు: ◆ ఎన్నికల సంఘం గుర్తింపు - జాతీయ రాజకీయ పార్టీ హోదా ◆ రాజకీయ స్థానం - సెంటర్ లెఫ్ట్ ◆ ఎన్నికల గుర్తు - ఏనుగు ◆ ప్రధాన కార్యాలయం - న్యూదిల్లీ ◆ రంగు - నీలం

నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ)

ఈశాన్య భారతదేశంలో గిరిజనుల హక్కులపరిరక్షణ, సామాజిక న్యాయం, స్వయంప్రతిపత్తి, అభివృద్ధిఫలాలు అందరికీ అందించాలనే ఉద్దేశంతో 'నేషనల్ పీపుల్స్ పార్టీ'నిస్థాపించారు.

నేపథ్యం: రాజకీయ సిద్ధాంతాల్లో విభేదాల కారణంగా నేషనల్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) నుంచి బహిష్కరణకు గురైన తర్వాత పి.ఎ. సంగ్మా 2013లో నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ)ని ప్రారంభించారు. అక్షరాస్యత, విద్య మాత్రమే బలహీన వర్గాలను బలోపేతం చేయగలవని ఈ పార్టీ నమ్మకం. దీనికి 2019, జూన్ 7న కేంద్ర ఎన్నికల సంఘం జాతీయ పార్టీ హోదాను కల్పించింది. ఈశాన్య భారతదేశం నుంచి జాతీయ రాజకీయ పార్టీ హోదాను పొందిన మొదటి రాజకీయ పార్టీ ఎన్‌పీపీ.



పి.ఎ.సంగ్మా

పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు: ★ ఈశాన్య ప్రాంత ప్రజల వాదనను జాతీయ స్థాయిలో వినిపిస్తూ, దేశ సమగ్రత, పురోభివృద్ధికి కృషి చేయడం. ★ ఈశాన్య భారతదేశంలోని స్థానిక గిరిజన జాతులు, ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులను పరిరక్షించడం. ★ విద్య, వైద్యం, మౌలిక వసతులు, ఉపాధి కల్పనకు కృషి. పర్యావరణహితమైన సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం. ★ కుల, మత, లింగ బేధాలు లేకుండా సమాజంలోని అన్ని వర్గాలకు సమ న్యాయాన్ని అందించడం, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పాటుపడటం. ★ ఈశాన్య భారతంలోని సమస్యలపై స్థానిక ప్రజల ఆకాంక్షలకు తగినట్లుగా స్వయం ప్రతిపత్తి కల్పించడం.

ఎన్నికల్లో హవా: ★ నేషనల్ పీపుల్స్ పార్టీ తన ప్రాబల్యాన్ని మేఘాలయ, మణిపుర్, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో కొనసాగిస్తోంది. ★ 2016లో పార్టీ వ్యవస్థాపకుడు పి.ఎ.సంగ్మా మరణించడంతో అతడి కుమారుడైన కాన్రాడ్ సంగ్మా నేషనల్ పీపుల్స్ పార్టీకి నాయకత్వం వహిస్తున్నారు.



కాన్రాడ్ సంగ్మా

★ 2018లో మేఘాలయ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో నేషనల్ పీపుల్స్ పార్టీ విజయం సాధించి కాన్రాడ్ సంగ్మా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ★ కాన్రాడ్ సంగ్మా మేఘాలయలో సమర్థ పరిపాలనను అందించడంతో 2023లో మేఘాలయ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి రెండోసారి ముఖ్యమంత్రి (2023) అయ్యారు. ప్రస్తుతం పదవిలో కొనసాగుతున్నారు.


ఎన్‌పీపీ కీలకాంశాలు: ★ పార్టీ ఎన్నికల గుర్తు - పుస్తకం
★ ప్రధాన కార్యాలయం - షిల్లాంగ్, మేఘాలయ
★ విద్యార్థి విభాగం: నేషనల్ పీపుల్స్ స్టూడెంట్స్ యూనియన్ (NPSU)
★ వ్యవస్థాపకుడు - పి.ఎ.సంగ్మా
★ యూత్ విభాగం - నేషనల్ పీపుల్స్ యూత్ ఫ్రంట్
★ మహిళా విభాగం - నేషనల్ పీపుల్స్ మహిళా కమిటీ
★ రాజకీయ స్థానం - సెంటర్ రైట్



రచయిత: బంగారు సత్యనారాయణ

శక్తి వనరులు - సౌరశక్తి

విశ్వవేదికపై భారత సౌర శంఖారావం!



చీకటి నుంచి వెలుగు వైపు సాగే మానవ వికాస ప్రయాణంలో శక్తి వనరులే చోదక శక్తులు. ఒకప్పుడు బొగ్గు, పెట్రోలియం లాంటి శిలాజ ఇంధనాలు పారిశ్రామిక విప్లవానికి ఊపిరులు ఊదినప్పటికీ నేడు అవి భూగోళాన్ని కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ అనే తీవ్ర సంక్షోభాల్లోకి నెట్టివేశాయి. ఈ పరిస్థితుల్లో మానవాళికి ప్రకృతి ప్రసాదించిన అక్షయపాత్ర సౌరశక్తి. వన్ సన్, వన్ వరల్డ్, వన్ గ్రిడ్ నినాదంతో భారత్ ప్రపంచానికి హరితశక్తి మార్గాన్ని చూపుతోంది. పోటీ పరీక్షల దృష్ట్యా పరిమితమైన సంప్రదాయ ఇంధనాలు, అనంతమైన పునరుత్పాదక శక్తి వనరులు, అణుశక్తి సాంకేతికతలు, ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ తదితర అంతర్జాతీయ లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనను అభ్యర్థులు పెంచుకోవాలి. సంప్రదాయ, పునరుత్పాదక ఇంధన వనరులకు సంబంధించిన ప్రధాన కేంద్రాలను భారత పటంలో మ్యాపింగ్ చేస్తూ చదవడం వల్ల సమాచారం సులభంగా గుర్తుంటుంది. శక్తి రంగానికి సంబంధించి దేశం నిర్దేశించుకున్న లక్ష్యాలు, ప్రతిష్ఠాత్మకమైన పథకాలపై ఎప్పటికప్పుడు నోట్స్ తయారుచేసుకుని అధ్యయనం చేయాలి.

'తమసోమా జ్యోతిర్గమయ' అంటారు పెద్దలు. అంటే చీకటి నుంచి వెలుగు వైపునకు ప్రయాణించడమని అర్థం. నేడు మానవాళి కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ అనే చీకట్లో మగ్గిపోతుంది. ఈ సంక్షోభం నుంచి కాపాడి, వెలుగుల వైపునకు నడిపించగల ఏకైక అక్షయ పాత్ర సూర్య భగవానుడు ప్రసాదించే సౌరశక్తి. భారతదేశం ప్రపంచ వేదికపై 'వన్ సన్, వన్ వరల్డ్, వన్ గ్రిడ్' నినాదాన్ని ప్రతిపాదించింది. ఇప్పటి వరకు దేశం విద్యుత్తు కోసం బొగ్గు, పెట్రోలియం లాంటి ఇంధనాలపై ఆధారపడింది. కానీ అవి శాశ్వతంకావు పైగా భూమిని కలుషితం చేస్తున్నాయి. ఈ తరుణంలో ప్రకృతి ఇచ్చిన అద్భుతమైన వరం సూర్యుడు. సూర్యరశ్మి ఉచితం, అనంతం, ఎప్పటికీ తరిగిపోనిది. అందుకే ప్రపంచమంతా ఇప్పుడు పునరుత్పాదక ఇంధనం వైపు అడుగులు వేస్తోంది. తరిగిపోయే శక్తి వనరులు.. పెట్రోలియం, బొగ్గు, సహజవాయువులు. ఇవి ఒకసారి వాడితే మళ్లీ ఉత్పత్తి కావు. తరగని శక్తి వనరులు.. సౌర శక్తి, పవనశక్తి, జలశక్తి, జీవ ఇంధనాలు మొదలైనవి. ఇవి ఎలాంటి కాలుష్యాన్ని విడుదల చేయవు.

1. ప్రవచనం–(ఎ): డిసెంబరు 14ను 'జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం'గా జరుపుతారు. శక్తి మంత్రిత్వశాఖ కింద పనిచేసే 'బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ' ఏటా దీన్ని నిర్వహిస్తుంది.
   ప్రవచనం–(బి): కాప్–26లో భాగంగా 2030 నాటికి 500 గిగావాట్స్ పునరుత్పాతక శక్తిని ఉత్పత్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం.
   1) ఎ, బి సరికావు.
   2) ఎ, బి సరైనవి.
   3) ఎ సరికాదు; బి సరైంది.
   4) ఎ సరైంది; బి సరికాదు.



2. సంప్రదాయ ఇంధన వనరుల గురించి సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) పునరుత్పాదకం కాని లేదా తరిగిపోయే ఇంధన వనరులు.
   బి) శిలాజ ఇంధనాలు
   సి) ప్రపంచంలో అత్యధిక కాలుష్యానికి కారణం.
   డి) ఈ వనరులను నిల్వచేయలేం, రవాణా చేయలేం.
   1) ఎ, బి 2) ఎ, బి, సి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి
3. కింది వాటిలో సరికానిది?
   1) NHPC - నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్
   2) NTPC - నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్
   3) NEEPCO - నార్త్ ఈస్టర్న్ ఎలక్ట్రిక్ కార్పొరేషన్ లిమిటెడ్
   4) IREDA - ఇండియన్ రెన్యువబుల్ ఎలక్ట్రిక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ
4. కింది వాటిని జతపరచండి.

ఎ) బొగ్గు	1) కోలిఫికేషన్ ప్రక్రియ ద్వారా
బి) పెట్రోల్	2) హైడ్రోకార్బన్‌ల సమ్మేళనం (మీథేన్, ఆల్కేన్స్, CO_2, NO_2)
సి) సహజవాయువు	3) ఫ్రాకింగ్/హైడ్రాలిక్ ఫ్రాక్చరింగ్
డి) కోల్‌బెడ్ మీథేన్	4) నల్ల బంగారం, విద్యుత్తు శక్తి గిడ్డంగి
	5) రాక్ ఆయిల్ (నలుపు ద్రవం)

   1) ఎ-4, బి-5, సి-2, డి-1 2) ఎ-4, బి-5, సి-2, డి-3
   3) ఎ-4, బి-5, సి-1, డి-2 3) ఎ-4, బి-5, సి-1, డి-3
5. ప్రవచనం–(ఆర్): ఆన్‌షోర్ అంటే భూభాగంపై ఉండే చమురు క్షేత్రాలు, ఆఫ్‌షోర్ అంటే సముద్ర గర్భంలో ఉండే చమురు క్షేత్రాలు.
   ప్రవచనం–(ఎస్): భారతదేశంలో చమురు అన్వేషణ, ఉత్పత్తిని ప్రధానంగా ప్రభుత్వ సంస్థలైన ONGC (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్), OIL (ఆయిల్ ఇండియా లిమిటెడ్) లు నిర్వహిస్తున్నాయి.
   1) ఆర్, ఎస్ సరికావు.
   2) ఆర్, ఎస్ సరైనవి.
   3) ఆర్ సరైంది, ఎస్ సరికాదు.
   4) ఆర్ సరికాదు, ఎస్ సరైంది.
6. కింది వాటిలో సరికాని జత?

చమురు కేంద్రం	రాష్ట్రం
1) దిగ్బోయ్ కేంద్రం	- అస్సాం
2) అంకలేశ్వర్	- గుజరాత్
3) మంగళా, భాగ్యం, ఐశ్వర్య	- రాజస్థాన్
4) కలోల్, నవగామ్ సనంద్	- మహారాష్ట్ర

7. ప్రవచనం–(ఎ): గోండ్వానా బొగ్గు క్షేత్రాలు దేశంలోని మొత్తం బొగ్గు నిల్వల్లో 98% ఇవే. ఇవి నాణ్యమైన బిట్యుమినస్ రకానికి చెందినవి.
   ప్రవచనం–(బి): టెర్షియరీ బొగ్గు క్షేత్రాల వయసు తక్కువ. అలాగే నాణ్యత కూడా తక్కువ (లిగ్నైట్ రకం) ఉండే బొగ్గు నిల్వలు.
   1) ఎ, బి సరైనవి. 2) ఎ, బి సరికావు.
   3) ఎ సరైంది; బి సరికాదు.
   4) ఎ సరికాదు; బి సరైంది.
8. కింది వాటిని జతపరచండి.

బొగ్గు కేంద్రాలు	రాష్ట్రాలు
ఎ) బొకారో, ఝరియా	1) పశ్చిమ బెంగాల్
బి) తాల్చేర్	2) మధ్యప్రదేశ్
సి) కోర్బా, రామ్‌కోలా	3) ఒడిశా
డి) రాణిగంజ్	4) ఝార్ఖండ్
	5) ఛత్తీస్‌గఢ్

జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ



ఝరియా బొగ్గు కేంద్రం (ఝార్ఖండ్)

   1) ఎ-4, బి-3, సి-5, డి-1 2) ఎ-4, బి-3, సి-2, డి-5
   3) ఎ-4, బి-3, సి-5, డి-2 3) ఎ-4, బి-3, సి-2, డి-1
9. ప్రవచనం–(ఎ): భారతదేశంలోనే అత్యంత పురాతనమైన చమురు బావి (1889) దిగ్బోయ్. దీనికి సమీపంలో ఉన్న మరొక ప్రముఖ పాత చమురు కేంద్రం నహర్ కటియా.
   ప్రవచనం–(బి): భారతదేశంలోనే అత్యధికంగా పెట్రోలియం ఉత్పత్తి చేసే కేంద్రం ముంబయి హై (అరేబియా తీరంలో) ఇక్కడ 'సాగర్ సామ్రాట్' అనే డ్రిల్లింగ్ ప్లాట్‌ఫాం ఉంది.
   1) ఎ సరికాదు; బి సరైంది.
   2) ఎ సరైంది; బి సరికాదు.
   3) ఎ, బి సరైనవి. 4) ఎ, బి సరికావు.
10. ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లలో అణు విచ్ఛిత్తిని కొనసాగించడానికి, శీతలీకరణిగా, ఇంధనంగా సాధారణంగా ఉపయోగించేవి?
   1) సాధారణ నీరు, యురేనియం-235
   2) గ్రాఫైట్, థోరియం-232
   3) ద్రవ సోడియం, ప్లూటోనియం-239
   4) భార జలం, సహజ యురేనియం
11. బయోమాస్ గ్యాసిఫికేషన్ ప్రక్రియలో, బయోమాస్ పాక్షిక ఆక్సిజన్ సమక్షంలో దహనానికి గురికావడం వల్ల ఏ ప్రధాన ఇంధన వాయువుల మిశ్రమం ఉత్పత్తి అవుతుంది?
   1) మీథేన్, ఆక్సిజన్
   2) ప్రొడ్యూసర్ గ్యాస్ (కార్బన్‌మోనాక్సైడ్, హైడ్రోజన్, నైట్రోజన్)
   3) కార్బన్ డయాక్సైడ్, ఓజోన్
   4) ఇథనాల్, మీథేన్
12. ప్రవచనం–(ఎ): పునరుత్పాదక ఇంధన దినోత్సవం లేదా 'అక్షయ్ ఉర్జా దివస్'ను రాజీవ్‌గాంధీ జన్మదినమైన ఆగస్టు 20న నిర్వహిస్తారు.
   ప్రవచనం–(బి): 1998లో చెన్నైలో ఏర్పడిన పరిశోధనా, అభివృద్ధి సంస్థ NIWE (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ). దీని పూర్వనామం C-WET (సెంటర్ ఫర్ విండ్ ఎనర్జీ టెక్నాలజీ).
   1) ఎ, బి సరికావు. 2) ఎ, బి సరైనవి.
   3) ఎ సరైంది; బి సరికాదు.
   4) ఎ సరికాదు; బి సరైంది.
13. ప్రవచనం–(ఎ): ప్రపంచంలో మొత్తం పునరుత్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యంలో భారత్ 3వ స్థానంలో ఉంది (చైనా, అమెరికా తర్వాత).
   ప్రవచనం–(బి): సౌరశక్తి స్థాపిత సామర్థ్యంలో భారతదేశం ప్రపంచంలో 3వ స్థానంలో ఉంది.
   ప్రవచనం–(సి): వాయుశక్తి స్థాపిత సామర్థ్యంలో భారతదేశం ప్రపంచంలో 4వ స్థానంలో ఉంది.
   1) ఎ, బి సరైనవి; సి సరికాదు.
   2) ఎ, సి సరైనవి; బి సరికాదు.
   3) ఎ, బి, సి సరైనవి.
   4) ఎ సరైంది; బి, సి సరికావు.
14. కింది వాటిని జతపరచండి.

ఎ) ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్	1) మధ్యప్రదేశ్
బి) సోలార్ సిటీ కార్యక్రమం	2) 2010, జనవరి 11
సి) జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ సోలార్ మిషన్	3) 2015
డి) ఓంకారేశ్వర్ ఫ్లోటింగ్ సోలార్ పార్క్	4) సుస్థిరత ఉన్న పట్టణాల స్థాపన

   1) ఎ-3, బి-4, సి-2, డి-1
   2) ఎ-3, బి-2, సి-4, డి-1
   3) ఎ-3, బి-4, సి-1, డి-2
   4) ఎ-3, బి-2, సి-1, డి-4



15. ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ (ఐఎస్ఏ) లక్ష్యాల్లో తప్పుగా ఉన్నదేది?
   1) సౌర సాంకేతికతలో ప్రామాణీకరణ ప్రవేశపెట్టడం.
   2) R & D ని వేగవంతం చేయడం.
   3) శక్తి వనరుల ధరలను పెంచడం.
   4) 2030 నాటికి 1000 గిగావాట్ల శక్తి ఉత్పత్తి చేయడం.
16. ప్రవచనం–(ఎ): ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక సోలార్ సామర్థ్యం ఉన్న నంబర్‌వన్ సోలార్ ప్లాంట్ – షిన్‌జియాంగ్ సోలార్ ఫార్మ్ (చైనా)
   ప్రవచనం–(బి): భారతదేశంలో పూర్తిగా అందుబాటులోకి వచ్చిన అత్యంత పెద్ద సౌర విద్యుత్తు కేంద్రం 'భడ్లా సోలార్ పార్కు' (రాజస్థాన్)



   1) ఎ, బి సరైనవి. 2) ఎ, బి సరికావు.
   3) ఎ సరైంది; బి సరికాదు.
   4) ఎ సరికాదు; బి సరైంది.
17. ప్రవచనం–(ఎ): 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' పథకం కింద సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం భారీగా రాయితీ ఇస్తుంది. (నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు లభిస్తుంది.)
   ప్రవచనం–(బి): రైతుల కోసం పొలాల్లో సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేయడానికి పీఎం కుసుమ్ పథకాన్ని ప్రారంభించారు.
   1) ఎ, బి సరికావు.
   2) ఎ సరైంది; బి సరికాదు.
   3) ఎ సరికాదు; బి సరైంది. 4) ఎ, బి సరైనవి.
18. ప్రపంచంలో సౌరశక్తి ఎక్కువగా ఉన్న మొదటి దేశాలు–
   1) చైనా, అమెరికా, భారతదేశం
   2) చైనా, జర్మనీ, అమెరికా
   3) చైనా, జర్మనీ, భారతదేశం
   4) అమెరికా, చైనా, భారతదేశం
19. ప్రవచనం–(ఎ): భారతదేశంలో మధ్యాహ్నం 11:00 నుంచి 2:00 గంటల మధ్య సౌరశక్తి ఉత్పత్తి అత్యధికంగా ఉంటుంది. ఎందుకంటే ఈ సమయంలో సూర్యకిరణాలు నేరుగా ప్యానెల్స్‌పై పడతాయి.
   ప్రవచనం–(బి): దేశంలోని జలాశయాలు, చెరువులపై 'ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్' (నీటిపై తేలియాడే సోలార్ ప్యానెల్స్) ఏర్పాటు చేయడమే 'పీఎం సత్య సరోవర్ యోజన' ఉద్దేశం.
   1) ఎ, బి సరైనవి. 2) ఎ, బి సరికావు.
   3) ఎ సరైంది, బి సరికాదు.
   4) ఎ సరికాదు, బి సరైంది.

సమాధానాలు

1-2, 2-2, 3-4, 4-1, 5-2, 6-4, 7-1, 8-1, 9-3, 10-3, 11-2, 12-2, 13-3, 14-1, 15-3, 16-1, 17-4, 18-1, 19-1.

సమాచార సేకరణ.. విశ్లేషణ తెలికయ్యే ప్రణాళిక రూపకల్పన




పోటీపరీక్షల్లో దత్తాంశ విశ్లేషణ అనే అంశంపై ప్రశ్నలు అడుగుతుంటారు. ప్రస్తుతం గణాంకాల ప్రాముఖ్యత నానాటికీ పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్, వ్యక్తిగత కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడానికి దత్తాంశ సేకరణ, విశ్లేషణ ఉపయోగపడతాయి. సమాచారాన్ని సంక్షిప్తం చేసి, దాన్ని నిష్పత్తులు, సగటుల ద్వారా పరిశీలించి, వచ్చిన ఫలితాలను విపులీకరించడమే దత్తాంశ విశ్లేషణ. అసంపూర్ణ సమాచారాన్ని క్రమబద్ధీకరించి పట్టికలు, గ్రాఫ్‌ల రూపంలోకి మార్చినప్పుడు కావాల్సిన ఫలితం పొందొచ్చు.

దత్తాంశ విశ్లేషణ - సోపాన చిత్రాలు

పోలీస్ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

I. సూచన (ప్ర.1–4): కింది సోపాన చిత్రాన్ని జాగ్రత్తగా పరిశీలించి, ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

ఈ సోపాన చిత్రం ఒక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య, వారి బరువును సూచిస్తుంది.



1. 45 కి.గ్రా. కంటే తక్కువ బరువున్న విద్యార్థుల సంఖ్య, 50 కిలోగ్రామ్‌లు లేదా అంతకంటే ఎక్కువ బరువున్న విద్యార్థుల సంఖ్య కంటే ఎంత శాతం తక్కువ?

1) $62\frac{1}{27}\%$ 2) $62\frac{2}{29}\%$
3) $62\frac{2}{27}\%$ 4) $62\frac{1}{29}\%$

సాధన: 45 కిలోగ్రామ్‌ల కంటే తక్కువ బరువున్న విద్యార్థుల సంఖ్య = 25 + 30 = 55

50 కిలోగ్రామ్‌లు లేదా అంతకంటే ఎక్కువ బరువున్న విద్యార్థుల సంఖ్య
= 50 + 45 + 35 + 15 = 145

లెక్కలో కోరిన శాతం $= \frac{145 - 55}{145} \times 100$

$= \frac{9000}{145} = \frac{1800}{29} = 62\frac{2}{29}\%$

సమాధానం: 2

2. 55 కిలోగ్రామ్‌లు లేదా అంతకంటే ఎక్కువ బరువున్న విద్యార్థుల సంఖ్య మొత్తం విద్యార్థుల సంఖ్యలో ఎంత శాతం?

1) $43\frac{5}{11}\%$ 2) $43\frac{1}{11}\%$
3) $43\frac{10}{11}\%$ 4) $43\frac{2}{11}\%$

సాధన: 55 కిలోగ్రామ్‌లు అంతకంటే ఎక్కువ బరువున్న విద్యార్థుల సంఖ్య
= 45 + 35 + 15 = 95

మొత్తం విద్యార్థుల సంఖ్య = 220

∴ లెక్కలో కోరిన శాతం $= \frac{95}{220} \times 100$

$= \frac{475}{11}\% \Rightarrow 43\frac{2}{11}\%$

సమాధానం: 4

3. 55 కిలోల కంటే తక్కువ బరువున్న విద్యార్థుల సంఖ్యకు, 60 కిలోలు లేదా అంతకంటే ఎక్కువ బరువున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య నిష్పత్తి ఎంత?

1) 5 : 2 2) 2 : 5
3) 5 : 3 4) 5 : 4

సాధన: 55 కిలోల తక్కువ బరువున్న విద్యార్థుల సంఖ్య
= 25 + 30 + 20 + 50 = 125

60 కిలోలు లేదా అంతకంటే ఎక్కువ బరువున్న విద్యార్థుల సంఖ్య = 35 + 15
= 50

లెక్కలో కోరిన నిష్పత్తి = 125 : 50 = 5 : 2

సమాధానం: 1

4. దత్తాంశాన్ని వృత్త రేఖా చిత్రంలో సూచిస్తే 45 - 60 కిలోల మధ్య బరువు ఉన్న విద్యార్థుల విభాగానికి వచ్చే కేంద్ర కోణం సుమారు ఎంత?

1) 188.81° 2) 188.11°
3) 188.18° 4) 188.33°

సాధన: మొత్తం విద్యార్థుల సంఖ్య = 220


45 - 60 కిలోగ్రామ్‌ల విద్యార్థుల సంఖ్య
= 20 + 50 + 45 = 115

లెక్కలో కోరిన కేంద్ర కోణం

$= \frac{115}{220} \times 360^\circ = \frac{2070}{11} \approx 188.18^\circ$

సమాధానం: 3

II. సూచన (ప్ర.5–8): కింది సోపాన చిత్రం రోజువారీ వేతనాలు పొందుతున్న కార్మికుల సంఖ్య, వారి వేతనాన్ని సూచిస్తుంది. చిత్రాన్ని జాగ్రత్తగా పరిశీలించి, దిగువ ఇచ్చిన ప్రశ్నలకు సరైన సమాధానాలను గుర్తించండి.



5. మొత్తం కార్మికుల నుంచి యాదృచ్ఛికంగా ఒకరిని ఎంచుకున్నప్పుడు ఆ వ్యక్తి వేతనం రూ.450 లేదా అంతకంటే ఎక్కువ ఉన్నట్లు తెలిస్తే, అతని వేతనం రూ.600ల కంటే తక్కువ ఉండే సంభావ్యత ఎంత?

1) $\frac{29}{38}$ 2) $\frac{28}{37}$ 3) $\frac{29}{37}$ 4) $\frac{27}{38}$

సాధన: రూ.450 లేదా అంతకంటే ఎక్కువ వేతనం పొందుతున్న కార్మికుల సంఖ్య = మొత్తం ఫలితాల సంఖ్య = 35 + 60 + 50 + 30 + 10
= 185

రూ.450 లేదా అంతకంటే ఎక్కువ, రూ.600 కంటే తక్కువ వేతనం పొందే కార్మికుల సంఖ్య = అనుకూల ఫలితాల సంఖ్య
= 35 + 60 + 50
= 145

లెక్కలో కోరిన సంభావ్యత $= \frac{145}{185} = \frac{29}{37}$

సమాధానం: 3

6. రోజువారీ వేతనం రూ.550 కంటే తక్కువ తీసుకుంటున్న కార్మికుల సంఖ్యకు, రూ.500 లేదా అంతకంటే ఎక్కువ తీసుకుంటున్న కార్మికుల సంఖ్యకు మధ్య నిష్పత్తి ఎంత?

1) 16 : 15 2) 3 : 2
3) 15 : 16 4) 2 : 3

సాధన: రూ.550 కంటే తక్కువ తీసుకుంటున్న కార్మికుల సంఖ్య = 25 + 40 + 35 + 60 = 160

రూ.500 లేదా అంతకంటే ఎక్కువ తీసుకుంటున్న కార్మికుల సంఖ్య
= 60 + 50 + 30 + 10 = 150

లెక్కలో కోరిన నిష్పత్తి = 160 : 150
= 16 : 15

సమాధానం: 1

7. రూ.500 - రూ.600 వరకు రోజువారీ వేతనం పొందుతున్న కార్మికుల శాతానికి, రూ.500 కంటే తక్కువ రోజువారీ వేతనం పొందుతున్న కార్మికుల శాతానికి మధ్య వ్యత్యాసం ఎంత?

1) 5% 2) 3.33% 3) 7% 4) 4%

సాధన: మొత్తం కార్మికుల సంఖ్య 250

రూ.500 - రూ.600 వరకు వేతనం పొందే కార్మికుల శాతం

$= \left(\frac{60 + 50}{250}\right) \times 100 = 44\%$

రూ.500 కంటే తక్కువ వేతనం పొందే కార్మికుల శాతం

$= \frac{(25 + 40 + 35)}{250} \times 100 = 40\%$

లెక్కలో కోరిన వ్యత్యాసం = 44% – 40%
= 4%

సమాధానం: 4

8. రూ.550 కంటే తక్కువ వేతనం పొందే కార్మికుల సంఖ్యలో రూ.400 కంటే ఎక్కువ వేతనం పొందేవారి శాతం ఎంత?

1) 84.33% 2) $84\frac{3}{8}\%$
3) $85\frac{3}{8}\%$ 4) $84\frac{7}{8}\%$

సాధన: రూ.550 కంటే తక్కువ వేతనం పొందే కార్మికుల సంఖ్య
= 25 + 40 + 35 + 60
= 160

ఇందులో రూ.400 కంటే ఎక్కువ వేతనం పొందే కార్మికుల సంఖ్య (400 - 550 వరకు)
= 40 + 35 + 60 = 135

లెక్కలో కోరిన శాతం $= \frac{135}{160} \times 100$

$= \frac{675}{8}\% = 84\frac{3}{8}\%$

సమాధానం: 2

రచయిత
డా. వంగల శ్రీనివాస్
విషయ నిపుణులు



1119 Word of the Day

Offensive

Telugu meaning: అభ్యంతరకరమైన, దూకుడు

English meaning: The word offensive (అఫెన్సివ్) is an adjective that describes something insulting, unpleasant, or likely to cause anger or hurt; as a noun, it can refer to an organized attack or campaign.

Synonyms: Insulting, Disrespectful;

Antonyms: Respectful, Polite

Usage: **1.** (As an Adjective): The manager apologized after realizing that his offensive remarks had deeply upset several employees.

2. (As a Noun): The army launched a major offensive to regain control of the territory occupied by enemy forces

Latest Updates

Jobs at ISRO LPSC

The Liquid Propulsion Systems Centre (LPSC) of the Indian Space Research Organisation (ISRO) in Thiruvananthapuram is inviting applications to fill Technical Assistant, Technician, and other posts. The total number of posts is 19. Eligible candidates can apply online before 4 September 2026.

Act-Apprentice posts

The Rail Coach Factory (RCF), Kapurthala - part of Indian Railways - has released a notification to fill Act-Apprentice posts at its Technical Training Centre under the Apprentices Act, 1961. The total number of posts is 734. The application fee is Rs.100. Eligible candidates can apply online before 5 September 2026.

Specialist Officer posts

Nainital Bank Limited, a private sector scheduled commercial bank is inviting online applications for Specialist Officer (SO) posts across Grades/Scales 1, 2, and 3. The total number of posts is 41. The last date for online applications is 7 September 2026.

Did You Apply..?

Today (August 31) is the last date for the following Jobs

☛ 9,766 Junior Associate Jobs in State Bank of India (SBI). ***Eligibility:*** Degree.

☛ 34 Manager Posts in NTPC Green Energy Limited. ***Qualification:*** Graduate degree, CA, CMA, PG.

☛ 22 Associate Modeller posts at Engineers India Limited. ***Qualification:*** BE/B.Tech/B.Sc.

☛ 114 Assistant Engineer Posts in NTPC. ***Qualification:*** Diploma in Engineering, BE, or B.Tech.

For more information and other notifications - scan QR code

భారతదేశంలోని సాంస్కృతిక సంస్థలు (పార్ట్ - I)

ఒక దేశ సంస్కృతి లేదా సమాజానికి చెందిన సంప్రదాయాలు, వారసత్వం, విలువలను రక్షించడానికి, ప్రోత్సహించడానికి లేదా ప్రదర్శించడానికి అంకితమైన వ్యవస్థ అవసరం. మన దేశ సుసంపన్న సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడి, ప్రోత్సహించడంలో అనేక ప్రభుత్వ, స్వతంత్ర సంస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈ అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, వారి వారసత్వాన్ని చుట్టూ ఉన్న ప్రపంచానికి అనుసంధానం చేయడంలో ఇవి సాయం చేస్తాయి. పోటీపరీక్షల కోణంలో మన దేశంలోని ముఖ్యమైన సాంస్కృతిక సంస్థల (Cultural Institutions in India) గురించి తెలుసుకుందాం..!

భారత పురావస్తు సర్వే సంస్థ

భారత పురావస్తు సర్వే సంస్థ (Archaeological Survey of India - ASI)ను 1861లో సర్

జనరల్ నాలెడ్జ్ స్టడీ జోన్

అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్ స్థాపించారు. ఈయనే దీనికి మొదటి డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరించారు. కన్నింగ్‌హామ్‌ను 'భారత పురావస్తుశాస్త్ర పితామహుడి'గా (Father of Indian Archaeology) పరిగణిస్తారు. ప్రధాన కార్యాలయం న్యూదిల్లీలో ఉంది. 24 తిలక్ మార్గ్‌లో ఉన్న ఆధునిక ధరోహర్ భవన్‌లో కార్యకలాపాలు సాగిస్తోంది.




లలిత కళా అకాడమీ

దీన్నే జాతీయ కళా అకాడమీ (National academy of art) అంటారు. 1954, ఆగస్టు 5న అప్పటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ దీన్ని ఏర్పాటు చేశారు. మన దేశ దృశ్య కళల రంగంలో ఇది ప్రభుత్వ అత్యున్నత సాంస్కృతిక సంస్థగా పనిచేస్తుంది. ప్రధాన కార్యాలయం న్యూదిల్లీలో ఉంది. ప్రస్తుతం ఇది కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ అధీనంలో ఉంది.

భారతదేశంలో ముఖ్యమైన పురావస్తు ప్రదేశాల జాబితా, ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్, ఆయా సంస్థల ఇతర విశేషాలతోపాటు గతంలో యూజీసీ నెట్, ఆర్ఆర్‌బీ టెక్నీషియన్ గ్రేడ్-3, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ గ్రూప్-డి, ఆర్ఆర్‌బీ ఎన్‌టీపీసీ తదితర పోటీపరీక్షల్లో అడిగిన 140కి పైగా ప్రశ్నలు - జవాబులతో రూపొందించిన ఈబుక్ కోసం 'ఈనాడు ఈప్రతిభ జనరల్ నాలెడ్జ్ & కరెంట్ అఫైర్స్ కోర్సు-II'కి సబ్‌స్క్రైబ్ చేసుకోండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

లింగ సమానత్వం



స్త్రీలు, పురుషులు సమాజంలో భాగమైనప్పటికీ అనేక విషయాల్లో అసమానతలు కనిపిస్తాయి.

◆ ప్రధానంగా సామాజిక, ఆర్థిక, ఆరోగ్య విషయాల్లో లింగ అసమానతలు ఎదుర్కొంటున్నారు. మహిళలు సమానత్వం, సాధికారత పూర్తిస్థాయిలో పొందలేకపోతున్నారు.

◆ భారతీయ సమాజంలో ఎక్కువగా పితృస్వామ్య కుటుంబాలు ఉండటంతో పురుషులకే ఎక్కువ అవకాశాలు, స్వేచ్ఛ, హక్కులు వంటివి దక్కాయి. అప్పటినుంచి లింగ అసమానత మొదలైంది.

అంతర్జాతీయ స్థాయిలో లింగ సమానత్వ సూచికలు

☛ లింగ అసమానత సూచిక ☛ లింగ వికాస సూచీ
☛ ప్రపంచ లింగపర వెనుకబాటు నివేదిక
☛ Gender Social Norms Index (GSNI)

మహిళలకు సంబంధించిన దినోత్సవాలు, సంవత్సరాలు, దశాబ్దాలు; ఎథ్నిసిటీ - భావన, లక్షణాలు, భారతదేశంలో ఎథ్నిక్ సంబంధాలు, ముఖ్యమైన పదజాలం మొదలైన అంశాలతో పాటు, మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

కరెంట్ అఫైర్స్



భారత సైన్యం శక్తి సామర్థ్యాలను పెంచే చర్యల్లో భాగంగా 'జావెలిన్' అనే ట్యాంకు విధ్వంసక గైడెడ్ క్షిపణి వ్యవస్థను అమెరికా నుంచి కొనుగోలు చేసేందుకు భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు 'లెటర్ ఆఫ్ ఆఫర్ అండ్ యాక్సెప్టెన్స్'పై భారత సైన్యం సంతకం చేసింది. జావెలిన్ క్షిపణిని భుజంపై నుంచి శత్రు ట్యాంకుల పైకి గురిపెట్టి ప్రయోగించవచ్చు. ఇందులో 3.7 అడుగుల క్షిపణి, డిస్పోజబుల్ లాంచ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. ఈ ఒప్పందంతో భారత సైన్యం అమ్ములపొదిలోకి మరో అత్యంత శక్తిమంతమైన అస్త్రం చేరనుంది.



అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న కశ్మీరీ రెడ్‌డీర్ (హంగూల్) సంతానోత్పత్తి క్యాలెండర్‌ను హైదరాబాద్‌లోని సీసీఎంబీ-లాకోన్స్ శాస్త్రవేత్తలు మొదటిసారిగా రూపొందించారు. ప్రస్తుతం వీటి జనాభా 400 మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలోనే వైల్డ్‌లైఫ్ ట్రస్ట్ ఇండియా భాగస్వామ్యంతో లాకోన్స్ శాస్త్రవేత్తలు హంగూల్ జింకల మనుగడపై అధ్యయనం చేశారు.



నార్వే రాజు అయిదో హరాల్డ్ (89) 28 ఆగస్టు 2026న మరణించారు. ఈయన మరణంతో పట్టపు రాకుమారుడైన 53 ఏళ్ల హాకోన్‌ను రాజుగా ప్రకటించారు. ఆయన ఎనిమిదో హాకోన్ రాజుగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. హాకోన్ పెద్ద కుమార్తె ఇన్‌గ్రిడ్ అలెగ్జాండ్రా నార్వేకు పట్టపు రాకుమారి అవుతారు. ఈ దేశంలో రాజు కేవలం లాంఛనప్రాయమైన అధికారం కలిగి వుంటారు. అసలు అధికారం ప్రజలెన్నుకున్న పార్లమెంటు చేతుల్లో ఉంటుంది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

SSC Exams

English

Error Detection

Directions (Qs.1-22): *In the following question, a sentence is divided into three parts and one of those fragments may have errors. Find out which part of the sentence has an error and select the appropriate option. If a sentence is free from error, select 'No Error' as your answer.*

1. The committee postponed the meeting (A)/ because several members were unable to attend (B)/ despite the agenda had already been circulated. (C)/ No Error (D)

2. The candidate not only answered all the questions (A)/ but explained the reasoning behind each answer also (B)/ in a remarkably clear manner. (C)/ No Error (D)

3. The officer will approve the request (A)/ unless the applicant does not provide (B)/ the documents specified in the official notification. (C)/ No Error (D)

4. The company continued its expansion (A)/ even though the domestic market had weakened (B)/ but consumer demand was showing signs of decline. (C)/ No Error (D)

5. The researcher continued the experiment (A)/ although the initial results were inconclusive (B)/ because of she believed that further testing might yield useful evidence. (C)/ No Error (D)

6. The manager instructed the staff (A)/ that they should either submit the report today (B)/ nor request an extension before the deadline. (C)/ No Error (D)

7. Hardly had the train left the station (A)/ than the passengers realised (B)/ that one of their companions was missing. (C)/ No Error (D)

8. The proposal was rejected (A)/ not because it was financially impractical (B)/ but due to it failed to address the environmental concerns. (C)/ No Error (D)

9. The bank will revise the procedure (A)/ once the audit team has submitted its recommendations (B)/ so as future discrepancies can be avoided. (C)/ No Error (D)

10. The employees were instructed to remain inside (A)/ until the security team had completed the inspection (B)/ and the building was declared safe. (C)/ No Error (D)

11. Phew! The engineers finally managed (A)/ to restore the power supply after working throughout the night (B)/ despite of repeated technical failures. (C)/ No Error (D)

12. The witness was oblivious (A)/ of the fact that the documents had been removed (B)/ from the locked cabinet during his absence. (C)/ No Error (D)

13. The researcher divided the participants (A)/ into three groups according with their professional experience (B)/ before beginning the main experiment. (C)/ No Error (D)

14. The officer was under the impression (A)/ that the revised notification would come into effect (B)/ since the beginning of the next financial year. (C)/ No Error (D)

15. The manager is at odds (A)/ to the members of the committee (B)/ over the proposed changes to the recruitment procedure. (C)/ No Error (D)

16. The new policy is aimed at (A)/ reducing unnecessary expenditure on administration (B)/ and improving the efficiency of public institutions. (C)/ No Error (D)

17. The applicant insisted to submit the documents (A)/ before the deadline specified in the notification (B)/ even though the clerk advised him to wait. (C)/ No Error (D)

18. The manager congratulated the team (A)/ for completing the difficult assignment successfully (B)/ within the limited time available to them. (C)/ No Error (D)

19. The director is capable to handling (A)/ several complex projects simultaneously (B)/ without compromising the quality of the final output. (C)/ No Error (D)

20. The auditor was surprised (A)/ at finding several inconsistencies in the records (B)/ that had been maintained for more than five years. (C)/ No Error (D)

21. The employees were prevented (A)/ from entering into the restricted area (B)/ until the security inspection had been completed. (C)/ No Error (D)

22. The director took exception (A)/ against the remarks made by the journalist (B)/ during the televised discussion. (C)/ No Error (D)

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

సైప్రస్‌లో..270 మందితో వెళ్తున్న పడవ బోల్తా

- ఎనిమిది మంది మృతి


బోడ్రమ్ (తుర్కియే): ఉత్తర సైప్రస్‌లోని కైరేనియా నుంచి తుర్కియేకు ఆదివారం సుమారు 270 మంది ప్రయాణికులతో వెళ్తున్న పడవ బోల్తా పడి ఎనిమిది మంది మృతి చెందారు. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు.. దాదాపు 237 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగాయి. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు సైప్రస్ ప్రధాని ఉనాల్ ఉస్టెల్ తెలియజేశారు. ప్రయాణం ప్రారంభించిన 15 నిమిషాల్లోనే ప్రతికూల వాతావరణం వల్ల ఫెర్రీ మునిగిపోవడం మొదలైందని ఆయన తెలిపారు.

ఆ వీడియో పాతది... మార్పులు చేసింది!

- అవినీతి ప్రమాణం వీడియోపై యూపీ కౌన్సిలర్ల వివరణ

షాజహాన్‌పుర్: అవినీతి సొమ్మును తమలో తాము సమానంగా పంచుకుంటామని షాజహాన్‌పుర్ నగరపాలక సంస్థ భాజపా కౌన్సిలర్లు ప్రమాణం చేస్తున్నట్లుగా ఉన్న వైరల్ వీడియోపై ఆయా కౌన్సిలర్లు స్పందించారు. తమ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఒక పాత వీడియోను ఎడిట్ చేసి ఈ విధంగా షేర్ చేశారని వారు పేర్కొన్నారు. మంగళవారం వివిధ సామాజిక మాధ్యమాల్లో ఈ వీడియో చక్కర్లు కొట్టడంతో.. భాజపా నగర విభాగం దాదాపు 10 మంది కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేసింది. మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాల్సిందిగా కోరింది. శనివారం రాత్రిలోపు ఏడుగురు వివరణ తెలిపారని, ముగ్గురికి నోటీసులు అందలేదని షాజహాన్‌పుర్ భాజపా నగర విభాగం అధ్యక్షురాలు శిల్పీ గుప్తా తెలిపారు.

రాయలసీమ అభివృద్ధికి రెండేళ్లలో రూ.8,022 కోట్లు: పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: రాయలసీమ అభివృద్ధికి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ, జలజీవన్ మిషన్-అమరజీవి జలధార పథకాల కింద రెండేళ్లలో రూ.8,022 కోట్లకు పైగా పనులు చేపట్టామని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. జలసంరక్షణ, రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, రైతులకు ఉపాధి కల్పన, పాడి రైతులకు గోకులాల నిర్మాణం, పండ్ల తోటల రైతులకు మద్దతుగా ఉద్యాన సాగు తదితర పనులు పెద్దఎత్తున చేశామని ఆదివారం ఓ ప్రకటనలో ఆయన వివరించారు. 'ఒక్క నీటికుంటల నిర్మాణంతోనే రాయలసీమ వ్యాప్తంగా అదనంగా 50 వేలకుపైగా ఎకరాల భూమి సాగులోకి వచ్చి రైతులకు సుమారు రూ.55 కోట్ల అదనపు ఆదాయం సమకూరింది. 8 జిల్లాల్లో రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో 40,837 పంట కుంటలు నిర్మించాం. రూ.166.46 కోట్లు వెచ్చించి 41,614 వ్యవసాయ చెరువులు సైతం నిర్మించాం. రెండో దశలో 29,902 పంట కుంటలు మంజూరై పనులు పురోగతిలో ఉన్నాయి.

నాడు సందడి.. నేడు అలజడి!

నేపాల్, యూపీ సరిహద్దుల్లోని వంతెన పరిస్థితి ఇలా..



ఈటీవీ భారత్: నేపాల్-ఉత్తర్‌ప్రదేశ్ సరిహద్దుల్లో ఎప్పుడూ పర్యాటకులతో సందడిగా కనిపించే సుస్తా సస్పెన్షన్ బ్రిడ్జ్ వరద విలయం కారణంగా ఇప్పుడు భయానక వాతావరణంలో ఉంది. నీటిమట్టాలు తగ్గుతున్నప్పటికీ, నారాయణి నది దృశ్యం ఎంత భయానకంగా ఉందంటే, ప్రజలు దాని ఒడ్డుకు సమీపించడానికి కూడా భయపడుతున్నారు. నేపాల్‌లో మెరుపు వరదలతో నావల్ పరసీ జిల్లాలో పరిస్థితి దారుణంగా మారింది. నారాయణి-గండక్ నదిలో కొట్టుకొస్తున్న శిథిలాలు, మృతదేహాలు స్థానిక ప్రజల గుండెల్లో భయాన్ని నింపాయి. మహారాజ్‌గంజ్‌లోని పాతలహ్వా, మిశ్రౌలియా, బైత్వాలియా, డోమా వంటి సరిహద్దు గ్రామాల నివాసితులు భయంభయంగా బతుకుతున్నారు. యంత్రాంగం మాత్రం పూర్తి అప్రమత్తంగా ఉంది. నేపాల్ సైన్యం, సాయుధ పోలీసు దళం (ఏపీఎఫ్), స్థానిక అధికారులు నదీమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, సుస్తా కట్ట, వంతెన భద్రత విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉన్నారు.

జీవనోపాధిపై తీవ్ర ప్రభావం

వరదల కారణంగా సుస్తా ప్రాంతంలో పర్యాటకుల రాక పూర్తిగా తగ్గిపోయింది. వంతెన పరిసరాల్లో చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహించే వారిపై తీవ్ర ప్రభావం పడింది. టీ, స్నాక్స్, ఆహార పదార్థాలు విక్రయించే వ్యాపారులు ఆదాయం కోల్పోయారు. సాధారణ రోజుల్లో పర్యాటకులు, స్థానికులతో రద్దీగా ఉండే ప్రాంతం ప్రస్తుతం వెలవెలబోతోంది. సుస్తా సస్పెన్షన్ వంతెన స్థానికులకు కేవలం రాకపోకల మార్గం మాత్రమే కాదు. వారి రోజువారీ జీవనానికి, పిల్లల విద్యకు, వైద్య సేవలు పొందేందుకు కీలకమైన మార్గం. వంతెన నిర్మాణానికి ముందు సుస్తా ప్రజలు నేపాల్ ప్రధాన భూభాగానికి వెళ్లాలంటే భారత భూభాగం మీదుగా ప్రయాణించాల్సి వచ్చేది. లేదంటే ప్రమాదకరమైన పడవ ప్రయాణాన్ని ఆశ్రయించాల్సి వచ్చేది.

వెంటాడుతున్న భయం

నారాయణి నది ఉద్ధృతి దృష్ట్యా సుస్తా వంతెనపై రాకపోకలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. సుమారు 1,571 మీటర్ల పొడవున్న ఈ వంతెన సుస్తా ప్రాంతానికి కీలక అనుసంధానంగా ఉంది. వరదల ముప్పును ముందుగానే గుర్తించిన అధికారులు పలువురు గ్రామస్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నీటిమట్టం తగ్గడంతో కొందరు తిరిగి ఇళ్లకు చేరుకున్నప్పటికీ, మళ్లీ భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుందనే భయం వారిని వెంటాడుతోంది. నేపాల్ సైన్యం, ఏపీఎఫ్, స్థానిక అధికారులు నదీ ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సుస్తా కట్ట, వంతెన భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

కుల, మతాల్ని రాజకీయాలకు వాడుకుంటున్న వైకాపా

తెదేపా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

ఈనాడు, అమరావతి: కుల, మతాల్ని స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవడం వైకాపా నాయకులకు వెన్నతో పెట్టిన విద్యని తెదేపా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రంలో మత మార్పిళ్లు యథేచ్ఛగా జరిగాయని.. అప్పట్లో జగన్ తర్వాత నంబర్-2గా ఉన్న విజయసాయిరెడ్డే స్వయంగా ఈ విషయాన్ని చెప్పారని గుర్తుచేశారు. ఉమామహేశ్వరరావు ఆదివారం ఓ వీడియో విడుదల చేశారు. "తన మతం మార్చాలని జోగి రమేష్ కుటుంబం చూసిందని ఆయన కోడలు మేఘన ఇటీవల వివరించారు. ఇప్పుడు హిందూ దేవాలయాలు, సంప్రదాయాల గురించి మాట్లాడుతున్న వైకాపా నాయకుడు మల్లాది విష్ణు లాంటి వాళ్లు.. గత ప్రభుత్వంలో గుడుల మీద జరిగిన దాడుల గురించి కనీసం నోరెత్తలేదు" అని మండిపడ్డారు.

అస్సాంలో ఐదేళ్లలో రూ.3,253 కోట్ల డ్రగ్స్ పట్టివేత

గువాహటి: 2021 నుంచి అస్సాం వ్యాప్తంగా దాదాపు రూ.3,253 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారని.. 26,500 మందికి పైగా నేరస్థులను అరెస్ట్ చేశారని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆదివారం తెలిపారు. డ్రగ్స్ వ్యతిరేక అస్సాం అనే ఒక్క కార్యక్రమం ద్వారా ఇది సాధ్యమైందని, మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా రాష్ట్రం చేస్తున్న కృషికి ఈ సంఖ్యలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఇందుకు గానూ, అస్సాం పోలీసులు ఒంటరిగా కాకుండా.. మాదకద్రవ్యాల ముప్పును నిర్మూలించాలనే జాతీయ సంకల్పంలో భాగంగా పనిచేశారని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా సరఫరా చేసేందుకు.. మయన్మార్ నుంచి మణిపుర్, మిజోరం రాష్ట్రాల మీదుగా పెద్దమొత్తంలో అస్సాంలోకి మాదక ద్రవ్యాలు వస్తున్నాయని చెప్పారు.





గంగమ్మ ఉగ్రరూపం

ఎగువన కురుస్తున్న వర్షాలతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని గంగ, యమున నదుల్లో వరద ప్రవాహం పెరిగింది. వారణాసిలోని అస్సి ఘాట్‌ను గంగా నది ముంచెత్తింది. ప్రయాగ్‌రాజ్ లోని పవిత్ర సంగమం వద్ద నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రముఖ లేటే శ్రీరామ హనుమాన్ ఆలయంలోకి గంగా నీరు చేరి, ఆంజనేయుడి పాదాలను తాకడంతో భక్తులు విశేష పూజలు, భజనలు చేశారు. మరోవైపు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు

ఆంధ్రా కాఫీ హౌస్!

- సాగు.. ఎగుమతుల్లో పురోగతి
- అల్లూరి జిల్లాలో 1,375 ప్రాసెసింగ్ యూనిట్లు
- ప్రైవేటు ప్లాంట్ల ఆధ్వర్యంలో ఏటా 23వేల టన్నుల ఉత్పత్తి
- రాష్ట్రానికి వచ్చేందుకు మరో రెండు ప్రైవేటు సంస్థల ఆసక్తి
- త్వరలో ప్రభుత్వంతో ఒప్పందం

ఈనాడు, అమరావతి: కాఫీ సాగు, ఉత్పత్తుల ఎగుమతుల్లో రాష్ట్రం పురోగమిస్తోంది. అరకు కాఫీ మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా కాంటినెంటల్, ఇండస్ సంస్థలు కాఫీ ఉత్పత్తి చేస్తున్నాయి. విదేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల్ని అందిపుచ్చుకుంటూ.. మరో రెండు ప్రముఖ సంస్థలు కూడా రాష్ట్రంలో అడుగు పెట్టబోతున్నాయి. త్వరలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోబోతున్నాయి. జాతీయ, రాష్ట్ర రహదారులతోపాటు ప్రధాన నగరాలు, పట్టణాల్లోనూ కాఫీ కెఫెలకు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది.

- దేశీయ కాఫీ గింజల ఉత్పత్తి కర్ణాటకలో 70%, కేరళ 21%, తమిళనాడు 5%, ఆంధ్రప్రదేశ్ 3%, ఒడిశా 1% చొప్పున ఉన్నాయి. కర్ణాటకలో రోబస్టా కాఫీ ఉత్పత్తి అధికం. అరబికా రకం 79,145 టన్నులు, రోబస్టా 1.78లక్షల టన్నులు ఉంది. ఏపీలో అరబికా రకం మాత్రమే పండిస్తున్నారు. ఏడాదికి 15వేల టన్నులు ఉత్పత్తి అవుతోంది. కాఫీ అత్యధికంగా ఉత్పత్తి చేసే దేశాల్లో భారత్ ఏడో స్థానంలో ఉంది. దేశంలో ఉత్పత్తయ్యే కాఫీలో.. 70% వివిధ దేశాలకు ఎగుమతి అవుతోంది. దేశీయ మొత్తం కాఫీ వినియోగంలో 73% వాటా దక్షిణాది రాష్ట్రాలదే.

అరకు.. అరబికా.. ప్రత్యేక ఫ్లేవర్డ్ ప్రొఫైల్

- కాఫీలో రెండు రకాలు.. అరబికా, రోబస్టా. ప్రపంచ కాఫీ వినియోగంలో అరబికా వాటా 60%, రోబస్టా వాటా 40% ఉంది. అరబికా సున్నితమైన వాసన, రుచి కలిగి ఉంటుంది. రోబస్టా గాఢమైన రుచితో ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో పండించేది అరబికా రకమే. ఇది ప్రత్యేక ఫ్లేవర్డ్ ప్రొఫైల్ కలిగి ఉంటుంది.
- అంతర్జాతీయ గుర్తింపు సాధించిన అరకు కాఫీ ప్రీమియం బ్రాండ్‌గా ఎదుగుతోంది. రైతులు సహజ సిద్ధమైన సేంద్రియ సాగు విధానాలు అవలంబిస్తున్నారు. ఇది ప్రత్యేకమైన ఫ్లేవర్డ్ ప్రొఫైల్ కలిగి ఉంది.
- అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2.45లక్షల ఎకరాల్లో 1,50,000 మంది గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. కొత్తగా లక్ష ఎకరాల్లో కాఫీ తోటల్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

అల్లూరి జిల్లాలో 1,375 కాఫీ ప్రాసెసింగ్ యూనిట్లు

- పీఎంఎఫ్ఎంఈ (ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజ్ స్కీమ్) కింద కాఫీ క్లస్టర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.11.98 కోట్ల వ్యయంతో 1,375 ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు.

23వేల టన్నుల కాఫీ పొడి

రాష్ట్రంలో ఏటా 23వేల టన్నుల కాఫీ పొడి తయారవుతోంది. అందులో ఫ్రీజ్ డ్రైడ్ ఇన్‌స్టెంట్ కాఫీ ఉత్పత్తి అధికం. కాంటినెంటల్ కాఫీ సంస్థ 10వేల టన్నులు, ఇండస్ కాఫీ 8 వేల టన్నులు ఉత్పత్తి చేస్తోంది. వైహాన్ కాఫీ 3వేల టన్నులు, లావాజా 1,000 టన్నులు, ఇతరులు 1,000 టన్నులు తయారు చేస్తున్నారు. వివిధ దేశాల నుంచి అరబికా, రోబస్టా రకాల గింజల్ని దిగుమతి చేసుకుంటున్నాయి. త్వరలో మరో రెండు ప్రముఖ సంస్థలు కూడా రాష్ట్రానికి రాబోతున్నాయి. దీంతో ఏపీలో కాఫీ పొడి తయారీ మరింత పెరగనుంది.

వ్యవసాయ శాఖలో పదోన్నతుల వివాదం

- సీనియారిటీ నిబంధనల మార్పుపై అభ్యంతరాలు

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయ శాఖలో పదోన్నతుల నిబంధనల్లో మార్పులు వివాదంగా మారాయి. ఇప్పటివరకు ఉద్యోగులు, అధికారులకు సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతుల ప్రక్రియ కొనసాగగా.. ఇటీవల ఉన్నతాధికారులు కొత్త విధానం అమల్లోకి తేవడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతుల విధానం అమల్లో ఉంది. ఆ విధానంలో డిప్లొమా ఏఈవోలకు పదోన్నతులు దక్కేవి. దీనివల్ల తమకు అన్యాయం జరుగుతోందని గ్రాడ్యుయేట్ ఏఈవోలు విన్నవించిన నేపథ్యంలో. ప్రభుత్వం కమిటీ వేసింది. కమిటీ సిఫార్సుల మేరకు నిబంధనలను మార్చింది. డిప్లొమా, గ్రాడ్యుయేట్లకు నిష్పత్తిని కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై డిప్లొమా ఏఈవోలు అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఆందోళన చేస్తున్నారు. మరోవైపు డిప్లొమా ఏఈవోలకు ఇన్‌సర్వీసు బీఎస్సీ కోటాను రద్దు చేయడం వారి ఉన్నత విద్యావకాశాలను దెబ్బతీసింది.

40 పోస్టుల భర్తీకి కసరత్తుతో ఆజ్యం

తాజాగా వ్యవసాయాధికారుల(ఏవో) నుంచి సహాయ సంచాలకులు(ఏడీఏ)గా పదోన్నతి కల్పించడం ద్వారా 40 పోస్టుల భర్తీకి వ్యవసాయశాఖ సీనియారిటీ జాబితాను రూపొందించింది. డిప్లొమా ఏఈవోలుగా నియమితులై 2007లో ఏవోలుగా పదోన్నతి పొందినవారిని కాదని, 2009లో నియమితులైన వ్యవసాయాధికారులకు జాబితాలో ప్రాధాన్యం ఇవ్వడం వివాదంగా మారింది. దీనివల్ల తాము పదోన్నతులు కోల్పోతామంటూ 2007లో నియమితులైన వ్యవసాయాధికారులు తాజాగా ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. సీనియారిటీని పరిగణనలోనికి తీసుకునేందుకు అన్ని శాఖల్లో అమలవుతున్న, సాధారణ పరిపాలన శాఖ నిర్దేశించిన నిబంధనలను పరిగణనలోకి తీసుకోకుండా..వ్యవసాయశాఖ సొంత నిర్ణయాలు తీసుకుంటోందని వారు ఆరోపించారు.

రైతు వేదికలకు సౌరవిద్యుత్ రక్షణ

- ప్రభుత్వం అనుమతి.. హాకాకు బాధ్యతలు
- డిసెంబరు నాటికి పూర్తి



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా రైతువేదికల్లో సౌరవిద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. మొత్తం 2,604 రైతువేదికల్లో బిగించాలని రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ హైదరాబాద్ వ్యవసాయ సహకార సంఘం(హాకా)కు బాధ్యతలు అప్పగించింది. రైతువేదికలకు సొంత భవనాలున్నా వాటి నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడం ఇబ్బందిగా మారింది. స్థానిక వ్యవసాయ విస్తరణాధికారులు ఇతర విధుల వల్ల వాటిని పూర్తిస్థాయిలో పర్యవేక్షించడం లేదు. స్వీపర్లు, ఇతర సిబ్బంది లేరు. మరోవైపు గ్రామ శివార్లలో ఉండడం వల్ల వాటికి సరైన రక్షణ కూడా లేదు. వీడియో కాన్ఫరెన్స్ కోసం బిగించిన పరికరాలు చోరీకి గురవుతున్నాయి. నెలవారీ కరెంటు బిల్లులను సైతం చెల్లించకపోవడంతో భారీగా బకాయిలు పేరుకుపోయాయి. ఇటీవల ప్రభుత్వం ఈ వేదికల్లోనే విత్తనాలు, ఎరువులను నిల్వ చేస్తోంది. మండలస్థాయి ప్రజావాణిల నిర్వహణకు కొన్నింటిని ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో రైతువేదికల సమస్యల పరిష్కారం కోసం వాటిపై సౌరవిద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. దీని ద్వారా ప్రతి నెలా రూ.30 లక్షల చొప్పున విద్యుత్ బిల్లుల ఆదాతోపాటు వేదికల రక్షణ కోసం సౌరవిద్యుత్ కంచెలను ఏర్పాటు చేయవచ్చని వివరించింది. దీంతో ప్రభుత్వం అనుమతించింది. హాకా, రెడ్కో, విద్యుత్ సంస్థల సమన్వయంతో త్వరలోనే టెండర్లు నిర్వహించి కంపెనీలను ఎంపిక చేయనుంది. ఈ ఏడాది డిసెంబరు వరకు అన్ని వేదికల్లో సౌరవిద్యుత్ ప్యానళ్లను ఏర్పాటు చేసేలా హాకా కార్యాచరణ చేపట్టింది.

కడప జిల్లా రైతుకు ప్రధాని అభినందనలు

అవకాడో పండిస్తున్నారని మన్ కీ బాత్‌లో ప్రశంస



కర్ణ వరదారెడ్డి

ఈనాడు-దిల్లీ, న్యూస్‌టుడే-లింగాల: అవకాడోను పండించి, ఆదాయం పెంచుకున్న ఏపీ రైతు కర్ణ వరదారెడ్డి గురించి ప్రధాని మోదీ ఆదివారం తన మన్ కీ బాత్‌లో ప్రస్తావించారు. "అవకాడో గురించి ఇది వరకు ఎవరికీ పెద్దగా తెలియకపోవడంతో దేశంలో దాని డిమాండ్ తక్కువగా ఉండేది. కానీ ఈ రోజుల్లో ఇది డైనింగ్ టేబుల్‌పై బాగా కనిపిస్తోంది. దీంతో మార్కెట్‌లో డిమాండ్ బాగా పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కడప జిల్లా లింగాల మండలం వెలిదండ్ల గ్రామానికి చెందిన వరదారెడ్డి అనే రైతు అవకాడోలు పండిస్తున్నారు. చాలా ఏళ్ల నుంచి టమాటా, అరటి పండిస్తున్న ఆయన ఒకరోజు మిత్రుడి పొలంలో అవకాడో పంట చూశారు. తర్వాత యూట్యూబ్‌లో నేర్చుకుని, సాగు మొదలుపెట్టారు. ఇప్పటి వరకు 4 టన్నుల అవకాడోలు పండించి నేరుగా దుకాణాలకు సరఫరా చేశారు. కొత్త పంట, శాస్త్రవేత్తల సలహాలు, నేరుగా మార్కెట్‌కు అనుసంధానం కావడం లాంటి చర్యలతో ఆయన ఆదాయం పూర్తిగా మారిపోయింది" అని ప్రధాని పేర్కొన్నారు. నూతన ఆలోచనలు ఉన్న చిన్న రైతులు ఇలా కొత్త ఆదాయ మార్గాలను వెతుక్కుంటున్నారని వరదారెడ్డి విజయగాథను ఆయన ఉదహరించారు.

జేఎన్‌టీయూ పాలకమండలి సభ్యులతో వీసీ తేనీటి విందు!

ఈనాడు హైదరాబాద్: జేఎన్‌టీయూ కొత్త రిజిస్ట్రార్, రెక్టార్‌లను నియమించిన నేపథ్యంలో విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులకు వైస్ ఛాన్సలర్ శనివారం సాయంత్రం తేనీటి విందు ఇచ్చినట్లు సమాచారం. వీసీ బంగ్లాలో జరిగిన ఈ కార్యక్రమంలో సెప్టెంబరు 8న జరగనున్న పాలకమండలి సమావేశం గురించి చర్చించినట్లు తెలిసింది. రిజిస్ట్రార్, రెక్టార్‌లను మార్చవద్దని ప్రభుత్వం సంకేతాలు పంపించినా.. వైస్ ఛాన్సలర్ మాత్రం అకస్మాత్తుగా పాత వారిని మార్చి కొత్తవారికి చోటు కల్పించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 8న జరిగే పాలకమండలి సమావేశంలో ఈ రెండు పోస్టుల ర్యాటిఫికేషన్‌కు మద్దతు కూడగట్టడంలో భాగంగా ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. ఒకవేళ ఐఏఎస్ అధికారులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన పాలకమండలి సభ్యులు మద్దతు తెలపాలని వైస్ ఛాన్సలర్ కోరినట్లు సమాచారం.

నీట్-పీజీ 'ఏఐక్యూ' వాటా 15 శాతానికి తగ్గించాలి: వినోద్

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుతం రాష్ట్రంలో నీట్-పీజీ కళాశాలల్లో ఉన్న 50 శాతం ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ) సీట్లను 15 శాతానికి తగ్గించాలని, తద్వారా రాష్ట్ర విద్యార్థులకు న్యాయం జరుగుతుందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు లేఖ రాసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం వైద్య విద్య పీజీ సీట్లను గణనీయంగా పెంచింది. ఈ సీట్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రజల నిధులు, ప్రభుత్వ వనరులు వినియోగించినందున వాటిలో అధిక భాగం రాష్ట్ర వైద్య విద్యార్థులకు వచ్చేలా చూడాలి. నీట్ యూజీలో 15 శాతం అఖిల భారత కోటా అమలులో ఉండగా, నీట్ పీజీలో 50 శాతం ఏఐక్యూ ఉండటం సమతౌల్యంగా లేదు. దీన్ని కూడా 15 శాతానికి తగ్గించాలి' అని కోరారు.

పంజా విసిరిన 20 ఏళ్ల పగ

- గుంటూరులో దారుణ హత్య
- వెంటాడి వేటకొడవళ్లతో నరికిన దుండగులు



మృతుడు చిన్నా

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పగతో రగిలిపోతున్న ప్రత్యర్థులు పలుమార్లు హతమార్చేందుకు యత్నించినా, వారినుంచి తప్పించుకున్న ఆ వ్యక్తి.. వేరే ఊరికి వెళ్లిపోయాడు. దాదాపు 20 ఏళ్ల తర్వాత తన చిన్నాన్న చనిపోవడంతో చివరిచూపు కోసం వచ్చిన అతన్ని.. ప్రత్యర్థులు పట్టపగలు వేటకొడవళ్లతో నరికి దారుణంగా హత్య చేసిన ఘటన గుంటూరులో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు కొండా వెంకటప్పయ్యకాలనీలో పెంద్ర చిన్నా (55) భార్యతో కలిసి నివాసం ఉండేవాడు. అదే ప్రాంతానికి చెందిన బుల్లయ్య తన భార్యతో చనువుగా ఉంటున్నాడని చిన్నాకు అనుమానం ఉండేది. ఈ క్రమంలో 2006లో బుల్లయ్య హత్యకు గురయ్యాడు. ఈ హత్యకు సంబంధించి చిన్నాపై అప్పట్లో పోలీసులు అభియోగాలు మోపుతూ.. కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి బుల్లయ్య కుటుంబసభ్యులు చిన్నాపై కక్ష పెంచుకున్నారు. అతన్ని హతమార్చాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన చిన్నా మంగళగిరికి మకాం మార్చాడు. అక్కడా పలుమార్లు హత్యాయత్నాలు జరగడంతో సూర్యాపేటకు వెళ్లిపోయాడు. సుమారు 20 ఏళ్లుగా సూర్యాపేటలో పాత ఇనుము దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.

బాబాయి చివరి చూపునకు వచ్చి..

గుంటూరు కేవీపీ కాలనీలో ఉంటున్న చిన్నా బాబాయి మత్తయ్య అనారోగ్యంతో ఈ నెల 29న చనిపోయారు. చివరిచూపు కోసం చిన్నా శనివారం గుంటూరు వచ్చాడు. ఈ సమాచారం ప్రత్యర్థులకు తెలిసింది. ఆదివారం ఉదయం చిన్నా కుటుంబంతో కలిసి బాబాయి మృతదేహాన్ని సందర్శించాడు. తరువాత అల్పాహారం తినడానికి బయటకు రాగా, దారిలో ద్విచక్ర వాహనాలపై దుండగులు వెంటపడ్డారు. కొంతమంది కర్రలతో చిన్నాను కొట్టగా కిందపడిపోయిన తర్వాత వేటకొడవళ్లతో నరికి, కత్తులతో పొడిచారు. రోడ్డుపై మెడ తెగి, రక్తపు మడుగులో మృతదేహం పడి ఉంది. బుల్లయ్య కుమారులతో పాటు వారి కుటుంబ సభ్యులు, అతని స్నేహితులు కలిసి ఈ హత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని సీఐ రాజేష్ తెలిపారు.


అమరావతిలో క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం

తిరుపతిలోని క్యాంపస్ తరలించం: నైలిట్ స్పష్టీకరణ

ఈనాడు-అమరావతి, తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: తిరుపతిలోని తమ క్యాంపస్‌ను తరలించడం లేదని.. భవిష్యత్తులో మరింత విస్తరిస్తామని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నైలిట్) స్పష్టం చేసింది. అమరావతిలో క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో తిరుపతి సెంటర్‌ను మూసివేయడమో, తరలించడమో చేయబోమని పేర్కొంది. తరలింపు ప్రచారాన్ని ఆదివారం ఓ ప్రకటనలో ఖండించింది. "దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో గరిష్ఠంగా మూడు కేంద్రాల ఏర్పాటుకు అవకాశముంది. ఇందులో భాగంగా అమరావతిలో రెండో క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నాం" అని పేర్కొంది.

లండన్‌లో మెరిసిన తెలుగు బాల మేధస్సు


- జీసీఎస్ఈ గణిత పరీక్షలో ఉత్తమ మార్కులు



అమ్మానాన్నలతో జీవ్యాన్ రెడ్డి ధ్రువ కట్టా


లండన్: తెలుగు సంతతికి చెందిన ఏడేళ్ల బాలుడు గణితంలో అపారమైన ప్రతిభాపాటవాలు చూపుతూ 16 ఏళ్ల విద్యార్థులు హాజరయ్యే గణిత పరీక్షలో గ్రేడ్ 8 ఏ సాధించి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. జీవ్యాన్‌రెడ్డి ధ్రువ కట్టా అనే ఈ బాలుడు బ్రిటన్‌లో నిర్వహించిన పియర్సన్ ఎడెక్సెల్ జనరల్ సర్టిఫికెట్ ఇన్ సెకండరీ ఎడ్యుకేషన్ (జీసీఎస్ఈ) హయ్యర్ మ్యాథమెటిక్స్ పరీక్షకు హాజరై మూడు పేపర్లలో మొత్తం 240 మార్కులకు 196 సాధించాడు. మే నెలలో జరిగిన ఈ పరీక్ష ఫలితాలు గత వారంలో వెలువడ్డాయి. "నాకు గణితమంటే మహా ఇష్టం. క్లిష్టమైన లెక్కల్ని పరిష్కరించడం, భిన్న పద్ధతుల్లో సమాధానాలు కనుగొనడంపై నాకెంతో ఆసక్తి. పరీక్షలో మరింత మెరుగైన గ్రేడ్ వస్తుందని ఆశించాను. అది రాకపోవడం నిరాశ కలిగించింది. అయినా గ్రేడ్ 8 ఏ సాధించడం ఆనందంగా ఉంది" అని జీవ్యాన్ ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. "తదుపరి నేను "ఏ" లెవెల్ గణితం అభ్యసించాలని అనుకుంటున్నాను. పెద్దయ్యాక ప్రజలకు పనికొచ్చే రోబోలు, తదితరాలు ఆవిష్కరించాలనుకుంటున్నాను" అని ఆ బాల గణిత మేధావి చెప్పాడు. బాలుడి తల్లిదండ్రులు కట్టా ధ్రువకుమార్‌రెడ్డి, ఐశ్వర్యరెడ్డిలు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు. ప్రస్తుతం పశ్చిమ లండన్‌లోని దక్షిణ రుయిస్లిప్‌లో నివసిస్తున్నారు.

తలనొప్పి, వాంతులతో గురుకులం విద్యార్థిని మృతి



జాహ్నవి

కూనవరం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో గురుకుల పాఠశాల విద్యార్థిని మృతిచెందిన ఘటన పోలవరం జిల్లా కూనవరం మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. కోతులగుట్ట గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న తెల్లం జాహ్నవి(13)కి శనివారం తీవ్రంగా తలనొప్పి వచ్చింది. అదేరోజు రాత్రి 9:30 గంటల సమయంలో వాంతులూ అవుతుండడంతో ఉపాధ్యాయులు సమీపంలోని సామాజిక వైద్యశాలకు తీసుకువెళ్లారు. ప్రాథమిక చికిత్స తరువాత పాఠశాలకు తీసుకువెళ్లారు. జాహ్నవికి ఆదివారం ఉదయం మరోసారి పెద్దగా వాంతులు రావడంతో కింద పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే విద్యార్థిని ప్రాణాలు విడిచింది. మృతదేహంతో బంధువులు పల్లూరు ప్రధాన రహదారిపై కొద్దిసేపు ఆందోళన చేశారు. చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడటంతో ఆందోళన విరమించారు.



మీ భయం ఎలా ఉండాలంటే..

భయం అనేది మీ లక్ష్యాన్ని రక్షించేలా ఉండాలే తప్ప, తుడిచిపెట్టేసేలా కాదు! ప్రమాదాన్ని ముందస్తుగా గుర్తించి మిమ్మల్ని అప్రమత్తం చేయడమే భయం పని అయ్యుండాలి. అంతేతప్ప, భవిష్యత్తును మొత్తం ఆందోళనకరంగా అది మార్చకూడదు. మీ భయానికి ఒక బాధ్యతనివ్వండి.

– టారస్ వి.డి, ఆంత్రప్రెన్యూర్

GH